# ఆనంద నిలయం

జూలకంటి బాలసుబ్రహ్మణ్యం



తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి

# ఆనంద నిలయం

జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
సబ్ ఎడిటర్,
సప్తగిరి, తి.తి. దేవస్థానములు.

Rs 20-00

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2007

# ANANDA NILAYAM

By
**JULAKANTI BALA SUBRAHMANYAM**

T.T.D. Religious Publications Series No:749

@ Copy Rights Reserved

First Edition : 2007

Copies : 5000

Published by:
**Sri K.V. Ramanachary**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501.

Printed at:
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

# ముందు మాట

వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి.

బ్రహ్మాండాలలో వేంకటాచలక్షేత్రానికి సమానమైన పుణ్యస్థలం లేనే లేదనీ, అలాగే ఆ దివ్యక్షేత్రంపై వెలసివున్న శ్రీ వేంకటేశ్వరస్వామికి సాటి రాగల దేవుడు ఇటు భూతకాలంలోను, అటు భవిష్యత్తులోను లేడు, ఉండబోడని చెప్పబడింది.

శ్రీనివాసుడు ఈ క్షేత్రంలో నిలిచివుండడానికి చాల పూర్వమే ఇది దివ్యక్షేత్రంగా భాసిల్లింది. పూర్వం శ్రీమన్నారాయణుడు శ్వేత వరాహరూపంతో అవతరించి క్రూరరాక్షసుడయిన హిరణ్యాక్షుణ్ణి సంహరించి తన కోరలతో భూమండలాన్ని ఉద్ధరించినాడు. తనను రక్షించినందువల్ల భూదేవి వరాహస్వామిని పతిగా వరించింది. అందుకే ఆమెతో కలిసి అక్కడే భూవరాహస్వామిగా స్థిరపడ్డాడు. ఆ నాటినుండి ఈ దివ్యస్థలం " ఆది వరాహక్షేత్రం" అనీ, "భూవరాహక్షేత్రం" అనీ ప్రసిద్ధమైన పేర్లతో పిలువబడుతున్నది.

ఆ తర్వాత కొంతకాలానికి శ్రీమహావిష్ణువు లోకకల్యాణం కోసం, భక్తులకోసం వైకుంఠాన్ని విడిచిపెట్టి ఈ క్షేత్రంలో 'వేంకటేశ్వరుడు' అనే పేరుతో నిలిచాడు.

వేంకటేశ్వరస్వామి తొండమాన్ చక్రవర్తి నిర్మించిన ఆనందనిలయంలో ప్రవేశించిననాటినుండి కలియుగాంతం వరకు ఈ స్వామి కోరినవరాలరాయడని, కలౌవేంకటనాయకః అని, పిలిస్తే పలికే ప్రత్యక్షదైవం అని, భక్తులపాలిటి కొంగుబంగారం అని ప్రసిద్ధిని పొందినాడు.

ఏమివలసిన ఇచ్చు నెప్పుడైనను
ఏమరక కొలిచిన ఇతడే దైవము

అని తాళ్లపాక అన్నమాచార్యులన్నట్లుగా భక్తవత్సలుడైన శ్రీ స్వామివారి సేవలో తొండమాన్ చక్రవర్తి, కుమ్మరనంబి వంటి భక్తులు ఎందరో తరించారు.

ఈ భక్తుల వృత్తాంతాలతో పాటు శ్రీనివాసుడు వేంకటాచలంలో నిలిచివుండడం, ఏడుకొండల గాథలు, ఆ క్షేత్రంలో భక్తులు పాటించవలసిన ఆచార వ్యవహారాలు మున్నగు అనేక విశేషాంశాలతో రచయిత శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు సరళశైలిలో రచించిన గ్రంథమే ఈ "ఆనందనిలయం".

తిరుమల తిరుపతి దేవస్థానం వారి లక్ష్యాలలో ప్రధానాంశం ధార్మిక గ్రంథప్రచురణ. భారతం, భాగవతం రామాయణం, భగవద్గీత వంటి గ్రంథాలతోపాటు తాళ్లపాక అన్నమాచార్యులు, తరిగొండవెంగమాంబ వంటి భక్తుల గాథలను కూడ దేవస్థానం విస్తృతంగా ప్రచురిస్తున్నది. ఇంకాఅనేకానేక ధార్మికగ్రంథాలను ప్రచురిస్తూ తద్వారా సనాతన ధర్మప్రచారానికి మరింత పట్టుదలతో దీక్షాకంకణ బద్ధులమవుతామనీ, ఆ ఏడుకొండలవాడి సేవలో తరిస్తామని తెలియజేస్తున్నాం.

సదా భక్తుల సేవలో

భూ. కరుణాకర రెడ్డి

(భూమన కరుణాకర రెడ్డి)

అధ్యక్షులు, ధర్మకర్తల మండలి

తిరుమల తిరుపతి దేవస్థానములు.

# ఒక మాట

తిరుమల ప్రపంచ ప్రసిద్ధి పొందిన దివ్యక్షేత్రం. పరమ పవిత్రమైన ఈ పుణ్య క్షేత్రంలో శ్రీమన్నారాయణుడు శ్రీ వేంకటేశ్వరుడు అనే పేరుతో అర్చింప బడుతున్నాడు. కలియుగం ప్రారంభం అయిన తొలి నాళ్లలో, అనగా సుమారు ఐదువేల ఏండ్ల క్రిందట, శ్రీ మహావిష్ణువు వక్షఃస్థల శ్రీ మహాలక్ష్మీసమేతుడై శ్రీ వైకుంఠంనుంచి దిగివచ్చి భూలోక వైకుంఠమైన తిరుమల క్షేత్రంలో స్వయం వ్యక్తమూర్తియై సాలగ్రామ శిలామూర్తిగా 'శ్రీనివాసుడు' అన్నపేరుతో అర్చన లందుకొంటున్నాడు.

ఆనాటి నుండి శ్రీవేంకటేశ్వరస్వామి "కలౌ వేంకటనాయకః" అన్న ప్రసిద్ధిని పొంది, ఈ కలియుగంలో భక్తులందరినీ అన్ని విధాలా ఆదుకొంటున్నాడు. అందుచేతే ఆ స్వామివారు ఆపదమొక్కులవాడనీ, అడుగడుగు దండాలవాడనీ, కోరిన వరాలరాయడనీ, భక్తులందరి చేతా కొనియాడబడుతూ ఉన్నాడు.

తిరుమలకొండల్లో శేషాద్రి, గరుడాద్రి, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి, అంజనాద్రి అనే ఏడుకొండలు ఉన్నందువల్ల శ్రీనివాసుడు ఏడుకొండలవాడనీ, శేషాచలపతి అనీ, వేంకటాచలపతి అనీ .... ఇలాగ అనేకమైన నామాలతో పిలువబడుతున్నాడు.

శ్రీ వైకుంఠాన్నయినా విడిచివుంటాను గాని, నా భక్తులను ఎంతమాత్రం విడిచి వుండలేనన్న దృఢమైన సంకల్పంతో, దీక్షతో కేవలం భక్తులకు మేలు చెయ్యడం కోసమే, లోక కల్యాణం కొరకు మాత్రమే భువికి దిగివచ్చి నిత్యమూ కల్యాణ పరంపరలు గుప్పిస్తున్న నిత్యకల్యాణ చక్రవర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి.

ఇంతటి జగత్ప్రసిద్ధిని కలిగి ఉండడమేగాక, ప్రపంచంలో ఏ దేవునికి లేనన్ని నామాలతో పిలువబడుతున్న శ్రీ వేంకటేశ్వరుడి దివ్యగాథను చాలమంది చాల ప్రక్రియల్లో రాశారు.

ప్రస్తుతం, తి.తి.దేవస్థానంలో ఉపసంపాదకుడిగా పనిచేస్తున్న శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారు "ఆనందనిలయం" పేరుతో శ్రీ వేంకటేశ్వరుని దివ్యగాథను సరళమైన వచనంలో అందించారు. దేవస్థానంవారి

ధార్మిక ప్రచురణగా వెలువడిన ఈ గ్రంథం అందరిమన్ననలందుకొంటుందని ఆశిస్తున్నాను.

తిరుమల తిరుపతి దేవస్థానం అనేక ధార్మిక గ్రంథాలను ప్రచురించడంతో పాటు, ఆ యా రచయితలకు తమ ధార్మిక రచనలను ముద్రించుకొనుటకు కూడా ఆర్థికసహాయం అందిస్తున్నది.

తి.తి.దేవస్థానం ప్రచురిస్తున్న, ప్రచురింపచేస్తున్న ధార్మిక గ్రంథాలను భక్తులు అందుకొని సద్వినియోగం చేసుకోగలరని మా ఆకాంక్ష !

సదా శ్రీవారి సేవలో

(కె.వి.రమణాచారి)
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు.
తిరుపతి.

# పీఠిక

## అదివో! అల్లదివో!

## ఆనందమయము!

తిరుమలేశునకు ఎన్నో........... ఎన్నెన్నో పేర్లు ఉన్నప్పటికీ 'ఆనంద నిలయుడు' అన్న పేరు ప్రత్యక్షరమూ సార్థకమై అలరారుతూ ఉంది. తిరుమల యాత్రకు బయలుదేరితే ఒక ఆనందం! ఏడు కొండలలో విహరిస్తే ఎనలేని ఆనందం! బ్రహ్మాండ నాయకుని బంగారుమేడ అయిన ఆనంద నిలయ విమానాన్ని కన్నులారా దర్శిస్తే ఒక దివ్యానందం! ఆ విమాన అంతర్భాగంలో నిలిచి ఉంటూ, ఎల్లప్పుడు భక్తులకోసమే ఎదురుచూస్తూ ఉన్న ఏడుకొండల వాడిని దర్శిస్తే ఒక పరమానందం! అవ్యక్తమైన ఈ ఆనంద పరంపరలు దర్శించిన ప్రతి భక్తునికీ కలుగుతాయి. దర్శించిన ప్రతిమారూ కలుగుతాయి. కేవలం యాత్రకు వచ్చే యాత్రికులకు మాత్రమేగాక, ఆలయ సిబ్బందికీ, దేవస్థానం ఉద్యోగులకూ, నిత్యమూ ఆలయాన్ని అంటిపెట్టుకొని స్వామివారికి అలంకారాలు, ఆరగింపులూ సమర్పించే అర్చక స్వాములుకు కూడ ఈ ఆనందానుభూతులు అనుభవంలో వున్న నిత్య సత్యాలు.

అందువల్లే అనంతమైన ఆనందామృతాన్ని ఎవరి శక్తి మేరకు వారు రెండు చేతులా జవురుకొని, నోరారా జుర్రుకొని, మనసారా తృప్తిగా ఆస్వాదించి అనుభవించడంకోసం నిరంతరం తిరుమల యాత్రకు వస్తూనే ఉంటారు. ఈ యాత్రలో ఎవరి అనుభవాలు వారివే! ఎవరి ఆరాధనలు వారివే! ఎవరి ఆనందం వారిదే! అయితే అందరి ఆలోచనలకూ, అనుభూతులకూ, ఆనందాలకూ మూలభూతుడైన వాడు మాత్రం ఒక్కడే ఒక్కడు! ఆ ఒక్కడు సాక్షాత్తు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారు మాత్రమే!

ఇలా ప్రతి భక్తుణ్ణి అడుగడుగునా, అణువణువునా ఆనందాబ్ధిలో ఓలలాడ జేస్తున్న వేంకటాద్రికి 'ఆనందాచలం' అనీ, స్వామివారి బంగారు గోపురానికి 'ఆనంద నిలయ విమానం' అనీ, అందు వెలసి ఉన్న స్వామి వారికి 'ఆనంద నిలయుడు' అనే ప్రసిద్ధమైన పేర్లు ఏర్పడినాయి.

ఆనంద జనకత్వాత్తం
ఆనంద నిలయం విదుః
వరపద్మాసనే సుస్థాం
విధాయ కమలాలయమ్.

పద్మాసని అయిన వక్షః స్థల శ్రీమహాలక్ష్మీసమేతంగా సాక్షాత్తు వైకుంఠవాసుడైన శ్రీ వేంకటేశ్వరుడు ప్రత్యక్షంగా దిగివచ్చి, వెలసివున్న భూలోక వైకుంఠమైన ఈ దివ్యస్థలం, దర్శించిన వెంటనే అవ్యక్తానందాన్ని ప్రసాదిస్తుంది. కనుకనే ఇది "ఆనంద నిలయం" అని ప్రసిద్ధి పొందింది. అంతేగాక--

విమానం సర్వపాపఘ్నం
విష్ణునాఽ ధిష్ఠితం సహ
పశ్యతాం సర్వభూతానాం
ఆహ్లాద జనకం శుభమ్.

ఈ బంగారు విమానంతో పాటుగా, ఆ విమానంమీద ఉన్న శ్రీనివాసుని దర్శించినట్లయితే సర్వజీవుల పాపాలు తొలగుతాయి. సర్వ శుభాలు కలిగి ఆనందం జనిస్తుంది.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడు, పదకవితా పితామహుడైన తాళ్లపాక అన్నమాచార్యులు ఆనందనిలయ విమాన దర్శన భాగ్యం వలన సిద్ధించే మహోన్నతమైన ఫలితాలను ఇలా కీర్తిస్తాడు.

ఇంచుకైన వేంకటేశుగిరి శిఖరము
కాంచుటే కలుగవలె గాకా
అంచితంబైన నిత్యానంద పదవులును
మించి తమ ఎదుట ప్రభవించినవె కావా!

అంతేగాక--

కోరిన వారికి కోరిన వరముల
నూరంత ప్రొదుల నొసగుచు

చేరువయై కృపచేసె నిదివో
కూరిమి నా నడిమి 'గోపురమేడ'.

తిరుమల శిఖరాల నట్టనడుమ ప్రకాశించే బంగారు ఆనంద నిలయమనే 'గోపుర మేడ' ను దర్శనం చేస్తే చాలు. కోరిన వరాలనన్నింటిని ప్రసాదిస్తుందని అన్నమయ్య ఎలుగెత్తి చాటినాడు.

అన్ని యుగాల్లోను అంత మందికి అన్ని విధాలుగా పరమాద్భుతమైన ఆనందాల్ని ప్రసాదిస్తూ కోరికల్ని తీరుస్తూ, నిరంతరం నిరంతరాయంగా భక్తులను ఆకర్షించే క్షేత్రం వేంకటాచలం.

"అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్య నివాస మఖిల మునులకు
నదె చూడుఁ డదె మ్రొక్కుఁ డానందమయము."

అన్నట్లుగా ప్రసిద్ధిని పొందిన ఆనందాచలంపైన, ఆనంద నిలయ విమానం అంతర్భాగం లోపల, ఆనందనిలయుడై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆనందమయ చరిత్ర, సరళ సుందరంగా వివరింపబడిన గ్రంథమే ఈ 'ఆనంద నిలయం',

అంతేగాక, ఇందులో............ ఓ శంఖణ మహారాజు, ఓ ఆత్మారాముడు, ఓ ధర్మగుప్తుడు, సుమతి అనే ఓ విప్రుడు, ఓ తొండమానుడు, ఓ కుమ్మర నంబి వంటి పరమ భక్తుల పవిత్ర గాథలతోపాటు, ఏడుకొండలకు సంబంధించిన కమ్మనైన కథలు, ఆ కొండలలో నెలకొన్న పుణ్యతీర్థాలు వాటి మహిమలు, తిరుమల క్షేత్రానికి భక్తులు యాత్రగా తరలివచ్చే సందర్భంలో విధిగా ఆచరించవలసిన క్షేత్ర విధులు, ఆ దివ్య స్థలంలో తప్పక చేయవలసిన దాన ధర్మాది సత్కార్యాలు, శ్రాద్ధాది క్రియలు.................... వంటివి ఎన్నో ఎన్నెన్నో అద్భుత విషయాలు వివరింపబడినాయి. ఇవన్నీ పఠితలకు, శ్రోతలకు, భక్తులకు ఆసక్తిని కలిగించి ఉన్నతమైన శాశ్వత ఆనందాలమయమైన సప్తగిరి శిఖరాలవైపు నడిపిస్తాయనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు.

ఎంచేతంటే!

ఆనందనిలయుడు తన భక్తులకోసం అందించిన దివ్యమైన భవ్యమైన అక్షర ప్రసాదమే ఈ "ఆనంద నిలయం"!

ఇంక ఆలస్యం ఎందుకు ?

అందరూ తమకు నచ్చిన రీతిలో తమకు ఇష్టమైన తీరులో ఈ 'ఆనంద నిలయం' గ్రంథాన్ని పఠించండి! పారాయణం చెయ్యండి!! ఇతరులతో చేయించండి!!!

ఆనందనిలయుని సంపూర్ణమైన అనుగ్రహాన్ని పొందుతూ, ఇబ్బడి ముబ్బడిగా ఇహపర సుఖాలను అనుభవిస్తూ మీమీ జీవితాలను ఆనందమయం చేసికోండి!

ఆనంద నిలయే శ్రీమద్విమానే స్వర్ణభూషితే
సర్వ మంగళ మాంగళ్యే దీవ్యతే నిత్యమంగళమ్.

ఇట్లు
రచయిత
జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

# కృతజ్ఞతాంజలి

సప్తగిరి సార్వభౌముడైన శ్రీనివాసుడు స్వయంగా సంకల్పించి, నాతో నిర్వహింపజేస్తూ వున్న 'సాహితీ యజ్ఞం' మంగళప్రదంగా నిర్విఘ్నంగా కొనసాగుతూనే వుంది.

ఈ యజ్ఞానికి ప్రధాన అధిదైవతం వక్షః స్థల శ్రీమహాలక్ష్మీ సమేతుడైన శ్రీశ్రీనివాస పరబ్రహ్మ మాత్రమే! యజ్ఞ వేదిక పవిత్రమైన 'సప్తగిరి' సానువులు!

తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారులు, సంయుక్త కార్య నిర్వహణాధికారులు అందరూ ఈ యాగానికి మంత్ర ద్రష్టలైన ఋత్విక్కులు!

దేవస్థానంలో పనిచేస్తున్న తక్కిన అధికార, అనధికార మిత్ర సహోద్యోగు లందరూ ఎప్పటికప్పుడు వలసిన యజ్ఞ ద్రవ్యాలను, సంభారాలను సేకరించి సమర్పించి సహాయమందించిన ఈ అధ్వర్య నిర్వాహకులు!

తిరుమల యాత్రికులు, భక్తులు అందరూ ఈ పవిత్ర యజ్ఞానికి పరిపుష్టం కలిగించిన ఆహూతులు!

ఇందరి పర్యవేక్షణలో 'బాలు' డైన ఈ రచయిత, కొండల రాయడి కైంకర్యపరుడిగా ఈ సాహిత్య యజ్ఞానికి దీక్ష వహించి కంకణం కట్టుకొన్న కర్త!

ఇందరి సమష్టి కృషితో మాత్రమే ఈ బృహత్ యాగం సప్తగిరీశుని సన్నిధిలో నిర్వహింపబడుతూ వున్నది. దాని ఫలితంగా ఇప్పటికి, ఈనాటికి ఆనందనిలయుడు 'అక్షర సుమదళాలు' మూడింటిని ముచ్చటగా ఈ రచయితకు ప్రసాదించాడు.

ఆ మూడు అక్షర సుమాలే-- 1. హరి కొలువు, 2. శ్రీనివాస వైభవం, 3. ఆనంద నిలయం. అందులో మొదటి రెండింటిని, అనగా--

1. హరి కొలువు, 2. శ్రీనివాస వైభవం గ్రంథాలను భక్తులందరు ఇది వరకే అందుకొన్నారు. ఇక మూడవది ప్రస్తుతం మీ చేతుల్లో ఉన్న 'ఆనంద నిలయం' పుస్తక సుమం.

నా రచనలను గూర్చి అభినందిస్తూ ఇలాంటి రచనా వ్యాసంగాన్ని నిరంతరం కొనసాగించాలని ప్రేరేపించి ప్రోత్సహిస్తున్న సాహితీ వేత్తలు, రచయితలు, విమర్శకులు - తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకర రెడ్డిగారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

ఈ మూడవ గ్రంథాన్ని కూడా దేవస్థానం వారి ధార్మిక ప్రచురణగా వెలువరింపజేసి భక్తులకు కానుకగా సమర్పించిన తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారులు, నిరంతర పరిపాలన నిమగ్నులు, భక్త జన సేవాతత్పరులు, సాహితీవేత్తలు, సౌమ్యులు, సహృదయులు అయిన శ్రీ కె.వి. రమణాచారి, ఐ.ఎ.ఎస్., గారికి భక్తి పూర్వక ప్రణామాంజలులు.

పరిపాలన బాధ్యతలతో నిరంతరం అన్ని శాఖలను తీర్చి దిద్దు తున్నప్పటికీ ప్రత్యేకంగా ఈ గ్రంథ ప్రచురణకు పూనుకొని, ఇంకా ఇతర ఆలయాల గురించి కూడా గాయాలని ప్రేరేపిస్తున్న సాహితీ ప్రియులు, నిరాడంబరులు తి.తి. దేవస్థానం సంయుక్త కార్య నిర్వహణాధి కారులు శ్రీ జి. బలరామయ్య, ఐ.ఎ.ఎస్., గారికి నా భక్తిపూర్వక నమస్కారములు.

ఇలాంటి ధార్మిక గ్రంథ రచనా విషయాల్లో ఎంతమాత్రం ఉపేక్ష తగదని ఎప్పటి కప్పుడు వెన్నుతట్టి ఉత్సాహ పరుస్తున్న తి.తి. దేవస్థానం ప్రజా సంబంధాధికారి శ్రీ కె. రాంపుల్లారెడ్డిగారికి ప్రత్యేకంగా నా కృతజ్ఞతాంజలులు.

ఇక ఈ రచనను 'సప్తగిరి' మాసపత్రికలో ధారావాహికంగా ప్రారంభించినది మొదలు పుస్తక ముద్రణ వరకు అనేక విధాలుగా తోడ్పడిన 'సప్తగిరి' సంపాదకులు శ్రీ సి. శైలకుమార్ గారికి నా కృతజ్ఞతాంజలులు.

ఈ గ్రంథాన్ని ప్రత్యేక శ్రద్ధతో ముద్రించుటకు చొరవ తీసుకొన్న తి.తి. దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ వి. సాంబ శివరావు గారికి, ఈ పుస్తక డిజైను చేసినటువంటి డి.టి.పి వారికి, మరియు టి.టి.డి. ప్రెస్ సిబ్బందికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథం ముద్రణలో దొరలిన అచ్చు తప్పులను, దోషాలను మలిముద్రణలో తప్పక సవరించగలనని తెలియజేసుకుంటున్నాను.

శ్రీవారి భక్తులు, పాఠకులు ఈ 'ఆనంద నిలయం' గ్రంథాన్ని శ్రీనివాసుని పాదపద్మముల మీది పూజా పుష్పంగా స్వీకరించి ఆనందించ గలరు.

"త్రికరణ శుద్ధిగా జేసిన పనులకు
దేవుడు మెచ్చును లోకము మెచ్చును."

--అన్నమాచార్యులు

వైశాఖ శుద్ధ తృతీయ — ఇట్లు

20-04-2007 — **జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

రచయిత

# ఇందులో. . .



| | | |
|---|---|---|
| ముందు మాట | – | iii |
| ఒక మాట | – | v |
| పీఠిక | – | vii |
| కృతజ్ఞతాంజలి | – | xi |
| సమర్పణ | – | xvii |
| ఆనంద నిలయం | – | 1 |
| సత్రయాగం | – | 2 |
| ఆదివరాహస్వామి అవతరణ | – | 3 |
| స్వామిపుష్కరిణి | – | 7 |
| స్వామిపుష్కరిణీ మహిమ | – | 8 |
| శంఖణమహారాజు | – | 9 |
| ఆత్మారాముడు | – | 9 |
| బ్రహ్మహత్యాదోష నివారణ | – | 14 |
| పరీక్షిన్మహారాజు | – | 15 |
| వైద్యుని పరమధర్మాలు | – | 17 |
| నరకభయం తొలుగుతుంది | – | 21 |
| ధర్మగుప్తునిచరిత్ర | – | 22 |
| సుమతిగాథ | – | 25 |
| సమస్తతీర్థయాత్రాఫలం | – | 28 |
| సరస్వతీదేవి | – | 30 |
| స్వామిపుష్కరిణిలోని తొమ్మిది తీర్థాలు | – | 32 |

| | | |
|---|---|---|
| ఏడు కొండలు | – | 35 |
| వపా యాగం | – | 42 |
| కుమారధారాతీర్థం | – | 45 |
| కపిలతీర్థం | – | 50 |
| శక్రతీర్థం | – | 54 |
| విష్వక్సేనతీర్థం | – | 54 |
| పంచాయుధ తీర్థాలు | – | 54 |
| అనలతీర్థం | – | 54 |
| బ్రహ్మతీర్థం | – | 54 |
| సప్తర్షితీర్థాలు | – | 55 |
| పాండవతీర్థం | – | 55 |
| పాండవతీర్థ మాహాత్మ్యం | – | 56 |
| వైకుంఠగుహ | – | 58 |
| ఇంద్రాదులు విష్ణువును వెదకడం | – | 63 |
| దశరథుని వేంకటాచలయాత్ర | – | 64 |
| బ్రహ్మోత్సవాలు | – | 67 |
| చింతచెట్టు నీడన ఒక పుట్ట | – | 70 |
| యాగం ఎవరికోసం? | – | 72 |
| ఎవరు గొప్ప ? | – | 74 |
| సత్యలోక ప్రయాణం | – | 74 |
| కైలాస సందర్శనం | – | 75 |
| శ్రీ వైకుంఠప్రవేశం | – | 76 |
| ఆదిలక్ష్మి అలుక | – | 79 |
| విష్ణుదేవుని తరలిరాక | – | 80 |

| | | |
|---|---|---|
| విచిత్రమైన చెట్టు వింతయైన పుట్ట | – | 80 |
| గోపాలిక! ఆవూ ! దూడా! | – | 82 |
| శ్రీనివాసుని క్షీరపానం | – | 82 |
| చోళరాజుకు శాపం | – | 82 |
| వరాహస్వామి ఎవరు? | – | 84 |
| ఎవరీ వకుళమాత? | – | 85 |
| శ్రీనివాసుని వేట | – | 86 |
| ప్రేమానురాగాలు | – | 87 |
| వేదవతే మాయా సీత | – | 90 |
| ఎవరీ వేదవతి? | – | 91 |
| పూర్వజన్మలో ఆకాశరాజు | – | 93 |
| పెళ్లిరాయబారం | – | 94 |
| ఎరుకలసాని | – | 95 |
| వివాహ నిశ్చయం | – | 97 |
| ముక్కోటి దేవతల తరలిరాక | – | 98 |
| శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయం | – | 102 |
| తీర్థయాత్ర కూడదు | – | 107 |
| చెరిసగం | – | 108 |
| తొండమానుడు శ్రీనివాసుని దర్శించుట | – | 108 |
| భక్తశిఖామణి రంగదాసు | – | 111 |
| ఆనంద నిలయ ప్రవేశం | – | 112 |
| బ్రహ్మ అఖండం | – | 113 |
| బ్రహ్మోత్సవాలు | – | 114 |
| సిరి కొలువున్నచోటు | – | 115 |

| | | |
|---|---|---|
| తొండమానుడి శరణాగతి | - | 119 |
| శిలగా మారిన శ్రీనివాసుడు | - | 120 |
| సహస్రనామార్చన | - | 124 |
| మట్టిదళాలే నాకు మక్కువ | - | 126 |
| కూరిమి భక్తుడు కుమ్మరదాసు | - | 128 |
| ఆనందనిలయుని అర్చించే విధానం | - | 132 |
| వేంకటాచల క్షేత్ర విధులు | - | 136 |
| చేయవలసిన దానాలు-వాటి ఫలితాలు | - | 140 |


---



## సమర్పణం


యుగయుగాల నుంచి కోట్లాది మంది సామాన్య భక్తులు మొదలు బ్రహ్మదేవుని వరకు, పామరుల నుండి పరమ యోగులవరకు, అందరికీ........ దర్శించిన వెంటనే దివ్యానందానుభూతులను పంచుతూ ఆనందనిలయ విమానాంతర్భాగంలో సార్థక నామధేయుడై కొలువైవుంటూ నిరంతరం భక్తులకోసమే ఎదురు చూస్తూ నిలిచివున్న ఆనందనిలయునకు--

***"ఆనందనిలయే శ్రీమద్విమానే స్వర్ణభూషితే***
***సర్వ మంగళ మాంగల్యే దీవ్యతే నిత్యమంగళమ్."***

అని మంగళ నీరాజనాలిస్తూ, ఆ స్వామివారి దివ్య పాదపద్మాలకు ఈ "ఆనంద నిలయం" అనే అక్షరసుమాన్ని నతమస్తకులమై సమర్పించుకుందాం.

గోవిందా! గోవిందా!! గోవింద!!!

సంపూర్ణమ్ - మంగళం మహత్



# ఆనంద నిలయం

తిరుమల క్షేత్రం ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుణ్య స్థలం. ఈ దివ్య స్థలంలో వెలసి ఉన్న స్వామి శ్రీ వేంకటేశ్వరుడు. ఈ స్వామివారిని దర్శించడానికి నిరంతరం ప్రపంచం నలుమూలలనుంచీ భక్తులు వస్తూ ఉంటారు. రావడమే కాదు. ఆ భక్తు లందరూ ఆ భగవంతుని భక్తితో, ఆర్తితో, ఆర్ద్రంగా, ఆనందంగా ఏడుకొండలవాడని, తిరుమలేశుడని, శ్రీనివాసుడని, అడుగడుగుదండాలవాడని, ఆపదమొక్కులవాడని, కోరిన వరాలరాయడని, వడ్డికాసులవాడని................ ఇలా ఎన్నో పేర్లతో పిలుస్తుంటారు. ఎన్నో మొక్కుబళ్లు చెల్లిస్తుంటారు. ఎన్నో నైవేద్యాలు సమర్పిస్తారు. ఉత్సవాలు కూడా చేయిస్తారు.

ఇలాగ ఎన్నో విధాల, మరెన్నో విధాల తనను మనసా వాచా కర్మణా సేవించి తరిస్తున్న భక్తులకు ఆ స్వామి అత్యంత సులభుడై వారి వారి కోరికలను ఇట్టే తీరుస్తున్నాడు. ఆ తిరుమలేశుడు ఎందరికో కాళ్లు ఇచ్చాడు. ఎందరికో కన్నులిచ్చాడు. మరెందరికో కడుపు నింపాడు. ఇంకెందరికో కడుపును పండించాడు. ఎందరికో మాట లిచ్చాడు. కొందరికైతే మాట నిలబెట్టాడు. ఈ కోరికలు తీర్చడంలో ఏ మాత్రం పక్షపాతం చూపించడు. చిన్నా పెద్దా తేడా లేదు. ఆడా మగా తారతమ్యం లేదు. కుంటీ, గుడ్డీ, చెవిటీ, మూగా అన్న ఈసడింపు ఇసుమంతైనా లేదు. కుల, మత, వర్గ, వర్ణ, విచక్షణ అసలే లేదు. భాషా భేదం అంతకన్నా లేదు. ఇంతటి భక్తప్రియుడైన ఆ కొండలరాయుడు ఎక్కడినుండి వచ్చాడు? ఎప్పుడు వచ్చాడు? అసలు ఆ స్వామివారి చరిత్ర ఏమిటి? స్వామివారు రాకముందు ఇక్కడ ఎవరైనా నెలకొని ఉన్నారా?........ ఇలాంటి ప్రశ్న పరంపరలకు, సందేహాలకు చక్కటి సమాధానమే ఈ "ఆనంద నిలయం" -- మీరు చదవండి! మీ వాళ్లతో చదివించండి!! మీరందరూ కలిసి ఆనందించండి!!!

## సత్రయాగం

పూర్వం ఒకానొకప్పుడు నైమిశారణ్యంలో శౌనకాది మహామునులు అందరూ చేరారు. పవిత్రమైన ఆ దివ్యభూమిలో, మానవులందరికీ ఈతి బాధలన్నీ తొలగాలనీ, సుఖశాంతులు వర్ధిల్లాలనీ కోరుతూ, తద్వారా జగత్కల్యాణాన్ని అభిలషిస్తూ, ఆ మహర్షు లందరూ పన్నెండేళ్లపాటు సుదీర్ఘంగా కొనసాగే 'సత్రయాగం' అనే మహా యజ్ఞాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ యాగానంతరం విరామవేళల్లో, వేదవ్యాస మునీంద్రుల ప్రియశిష్యుడైన సూతుడనే మహనీయునిచేత, పురాణాలు, పుణ్యకథలు, తీర్థ విశేషాలు, క్షేత్ర మాహాత్మ్యాలు వింటూ సత్కాలక్షేపం చేస్తూవుండేవారు.

ఆ మహర్షులు ఒకనాడు సూతునితో ఇలా అన్నారు.

"సూత మహాశయా! మీరు చెప్పే కథలు చాలా ఇంపుగాను ఉన్నాయి. ఆసక్తిని కలిగించేవిగానూ ఉన్నాయి. ప్రస్తుతం మాకు ఒక సందేహం కలుగుతూ ఉంది.

అదేమిటంటే శ్రీమన్నారాయణుడు సాక్షాత్తుగా ఈ భూలోకంలో నూట ఎనిమిది దివ్య స్థలాలల్లో వెలసి ఉంటూ ఆరాధింపబడుతున్నాడని చెప్పబడుతూ వున్నది. ఆ దివ్య ప్రదేశాలన్నీ "దివ్య తిరుపతులు" గా పేరు పొంది ఉన్నాయి కదా! మరి వాటిల్లో శ్రీరంగం, శ్రీముష్ణం, తోతాద్రి, సాలగ్రామం, నైమిశారణ్యం, బదరికాశ్రమం, కాంచీపురం, వేంకటాచలం అనే ఈ ఎనిమిది పుణ్యక్షేత్రాల్లో శ్రీ మహావిష్ణువు స్వయంగా అవతరించి పూజలను అందుకొంటూ భక్తుల కోరికలను తీరుస్తూ ఉన్నాడని కూడా ప్రసిద్ధి ఉంది కదా!

మరి ఈ ఎనిమిది దివ్య స్థలాల్లో కూడా శ్రీహరికి మిక్కిలి ఇష్టప్రదమైన పుణ్యక్షేత్రం ఏది? అది ఎక్కడుంది? ఇంకా ఆ పుణ్యభూమి యొక్క అనేకమైన విశేషాలను, విశిష్టతలను తెలుసుకోవాలని చాల ఆసక్తిగా ఉంది. దయచేసి ఆ దివ్య ప్రదేశం మహత్త్వాన్ని మాకు విపులంగా వివరించవలసిం" దని అడిగారు.

అక్కడ చేరిన మునులు అందరూ ఆతురతతో అడిగిన ఆ ప్రశ్నలకు సూతుడు చాల ఆనందపడ్డాడు. అరమోడ్పు కన్నులతో ఒక అనిర్వచనీయమైన దివ్యానుభూతికి లోనయ్యాడు. పిదప కొద్దిసేపటికి తేరుకొన్నాడు.

"తపోధనులారా! మీరందరూ చాల చక్కని ప్రశ్నలను వేశారు. తెలుసుకోవాలనే ఆసక్తితో కూడిన నిజమైన సందేహాలను వెలిబుచ్చారు. శ్రీమహావిష్ణువు శ్రీమహా వైకుంఠం తర్వాత ఈ భూలోకంలో లీలామానుష రూపంతో సంచరించడానికి ఎక్కువగా ఇష్టపడే దివ్యక్షేత్రం వేంకటాచలం. ఈ క్షేత్ర ప్రశస్తి, మహిమలు ఇప్పటివీ, ఈనాటివీ కావు. శ్వేతవరాహ కల్పం నుండీ ఆ యా యుగాల్లో ఈ పుణ్యస్థలంలో శ్రీమహా విష్ణువు లీలామానుష విగ్రహుడై విహరిస్తూ ఉండినాడు. ఆ దేవదేవుడు ఈ కలియుగంలో "వేంకటేశ్వరుడు" అనే ప్రసిద్ధమైన పేరుతో అర్చారూపంలో సాలగ్రామ శిలామూర్తిగా స్వయం వ్యక్తుడై సాక్షాత్కరించి, దివ్య మంగళ విగ్రహ సౌందర్యంతో భక్తులకు దర్శనమిస్తూ, కోరిన వరాలను అన్నింటిని అనుగ్రహిస్తూ "కలౌ వేంకట నాయకః" అని ప్రఖ్యాతి పొంది ఉన్నాడు.

ఈ స్థలం మాహాత్మ్యాన్నీ, శ్రీ స్వామివారి లీలలను ఆ బ్రహ్మేంద్రాది దేవతలు, ఈశానాది దిక్పాలురు, సహస్ర ఫణాలు కలిగిన ఆదిశేషుడు మున్నగువారు సైతం సమగ్రంగా, సంపూర్ణంగా వర్ణించలేరు సరికదా! వారందరూ కనీసం కొంతవరకైనా అర్థం చేసుకొన్నారనడం కూడా సందేహాస్పదమే! మరి అలాంటిది కేవలం మానవ మాత్రుడినైన నేనెంతటి వాడిని? అయినప్పటికీ మా గురువరేణ్యులైన వేదవ్యాస మునీంద్రులవారి అనిర్వచనీయమైన అనుగ్రహంవల్ల మీరు కోరిన శ్రీ వేంకటాద్రి మహిమనూ, ఆ శ్రీ వేంకటేశ్వరస్వామివారి లీలలనూ, భక్తప్రియత్వాన్నీ, నిండుదయనూ, యధాశక్తిగా తెలియజేయడానికి ప్రయత్నిస్తాను. మీరు అందరూ సావధానులుగా ఉంటూ అత్యంత శ్రద్ధగా, భక్తిగా ఆలకించండి.

ఈ కధను చెబుతున్న నాకు, వింటూవున్న మీకందరికీ సకల శ్రేయస్సులు కలగడంతోపాటు, ప్రత్యక్షంగా వేంకటాచలయాత్ర చేసిన దివ్యానుభూతి కలుగుతుంది. తద్వారా సప్తగిరీశుని సంపూర్ణమైన ఆశీస్సులను పొందుదాం!" అంటూ సూతమహర్షి ఇలా ప్రారంభించాడు.

## ఆదివరాహస్వామివారి అవతరణ

"పూర్వం ఒకానొక సమయంలో క్షీరసముద్రంలో శేషశాయి అయిన శ్రీమహా విష్ణువు నాభి (బొడ్డు) నుండి వింత వింత తేజస్సులతో ప్రకాశిస్తున్న ఒక సువర్ణ పద్మం ఆవిర్భవించింది. అందువల్లనే ఆ హరి 'పద్మనాభుడు' అని పిలువబడినాడు.

ఆ పద్మంలో నుండి నాలుగు ముఖాలతో బ్రహ్మదేవుడు జన్మించాడు. విష్ణుదేవుడు ఇలాగ తన బొడ్డులోని పద్మంలో కుమారుడై అవతరించిన చతుర్ముఖ బ్రహ్మను చూచి లోకాలన్నింటిని సృష్టిచేసే కార్యక్రమాన్ని చేపట్టవలసిందని ఆజ్ఞాపించాడు. తండ్రిగారి ఆనతిపై బ్రహ్మదేవుడు సమస్త లోకాలను సృష్టించగా, వాటిని విష్ణువు చక్కగా పోషించ సాగినాడు. ఇలా కొంతకాలం గడచిపోయింది. కాలం ఏ ఒక్కరికోసం క్షణమైన ఆగుతుందా? ఏ మాత్రం ఆగదు కదా!

మానవకాలమానం ప్రకారం కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగూ కలిపి ఒక సమిష్టి మహాయుగం అంటారు. ఇట్లాంటి సమిష్టి మహాయుగాలు ఒక వేయి గడచిపోగా బ్రహ్మదేవునికి ఒక అర్థరోజు మాత్రం అనగా పగటిపూట మాత్రం గడచిపోయింది. తర్వాత అంతే కాలపరిమితిగల రాత్రి సమయం ప్రారంభమవడంతో బ్రహ్మదేవుడు, సృష్టి కార్యక్రమంలో క్షణమైనా తీరికలేనందువల్ల, కాస్త విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు. కాని ఇంతలో బాగా అలసి ఉన్న బ్రహ్మదేవునికి ఎక్కడలేని నిద్ర ముంచుక వచ్చింది. అలా కునుకుపట్టడంతో ఆయన చేసిన సృష్టి కార్యక్రమం అంతా అస్తవ్యస్తమై అల్లకల్లోలమయింది. సూర్యచంద్రుల గతులు తారుమారు అయ్యాయి. మేఘాలు ఎడతెరపి లేకుండా కుంభవృష్టిని కురిపించాయి. ప్రపంచం అంతటా జలం ఆవరించి జల ప్రళయం ఏర్పడింది. అనంతమైన ఆ ప్రళయ సాగరంలో భూగోళం పూర్తిగా మునిగిపోయింది.

అదే సమయంలో హిరణ్యాక్షుడనే రక్కసుడు భూమండలాన్ని పాతాళానికి తీసుకొని వెళ్లి దానితో ఆడుకొంటూ నానా బీభత్సం చేశాడు. ఇలాగ వేయి యుగాల కాలం గడచిపోగా, బ్రహ్మదేవునికి మళ్లీ పగలు ప్రారంభం కావడంతో మెలకువ అయ్యింది. ఇంతలో శ్రీమహావిష్ణువు శ్వేతవరాహరూపునిగా అవతరించి జలంలో మునిగి ఉన్న భూమిని ఉద్ధరిస్తూ ఉండగా హిరణ్యాక్షుడు అడ్డుపడ్డాడు. శ్వేత వరాహస్వామి వానిని సంహరించి, తన కోరలతో భూమిని పైకెత్తగా దేవతలు దుందుభులను మ్రోగించారు. పూలవాన కురిపించారు.

శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవుణ్ణి పిలిచి ముందుమాదిరే మళ్లీ సృష్టి కార్యం కొనసాగించవలసిందని ఆజ్ఞాపించి, తదితర దేవతలనందరినీ వాళ్ళ వాళ్ల స్థానాలకు పంపించి వేశాడు. అనంతరం ఆదివరాహస్వామి తన ప్రక్కనే భక్తితో నిలుచొని ఉన్న గరుత్మంతునితో ఇలా పలికినాడు.

"పక్షిరాజా! భూదేవిని ప్రళయార్ణవం నుండి ఈ వరాహరూపంతో సముద్ధరించాను. అందువల్ల భూదేవి నన్నుపతిగా వరించింది. అందుకు నేను అంగీకరించాను కూడ. మరి వికృతమైన ఈ రూపంతో వైకుంఠానికి వెళ్లినట్లయితే, లక్ష్మీదేవి నన్ను చూచి భయపడనూ వచ్చు. లేదా నవ్వనూ వచ్చు. అంతేగాక ఇక్కడే కొంతకాలం పాటు ఉంటూ ఈ భూలోకాన్ని జాగ్రత్తగా పరిరక్షించవలసిన పని, బాధ్యత కూడా ఉంది. అందువల్ల నీవు వైకుంఠానికి వెళ్లు. అక్కడ ఉన్న నా క్రీడాచలాన్ని తీసుకొని రా!" అని ఆజ్ఞాపించి, ఆ క్రీడాద్రిని స్థాపించడానికిగాను, పావనమైన సువర్ణముఖరీ నదీ తీరంలో ఉత్తరం దిక్కున అనువుగా ఉండే ఒక దివ్య స్థలాన్ని శ్రీమహావిష్ణువు ఎంపిక చేసుకొన్నాడు.

స్వామివారి ఆజ్ఞతో పక్షీంద్రుడు వైకుంఠానికి వెళ్లి లక్ష్మీదేవితో జరిగిన కథంతా విపులంగా విన్నవించి, క్రీడా పర్వతాన్ని తీసుకొని వెళ్లడానికి వచ్చానన్నాడు. లక్ష్మీదేవి కూడా తానూ స్వామిచెంతకు చేరాలని సంకల్పించుకొన్నది. తన మూల స్వరూపాన్ని వైకుంఠంలోనే ఉంచి ఒకే ఒక కళాంశంతో భూలోకానికి బయలుదేరింది. ఇలాగ వైకుంఠం లోని ప్రముఖ పరివారంతో శ్రీలక్ష్మీదేవితో కూడిన క్రీడాద్రితోను గరుత్మంతుడు భూలోకం చేరుకొన్నాడు. స్వామివారు సువర్ణముఖి నదికి ఉత్తర భాగంలో చూపిన పుణ్య స్థలంలో ఆ క్రీడాచలాన్ని ప్రతిష్ఠించాడు.

శ్వేతవరాహస్వామి గరుత్మంతుడు తెచ్చి స్థాపించిన క్రీడా పర్వతాన్ని భూదేవీ సమేతంగా అధిరోహించి అందలి స్వామిపుష్కరిణికి పడమటి గట్టున నిలిచాడు. అంతలో బ్రహ్మేంద్రాది సర్వదేవతలు కూడ అక్కడికి అరుదెంచి, ఆదివరాహరూపంలో అద్భుతావహమైన ప్రకాశంతో దర్శనమిస్తూ ఉన్న శ్రీమహావిష్ణువు యొక్క లీలలను, వరాహరూపంలో హిరణ్యాక్షుని సంహరించి, భూదేవిని ఉద్ధరించిన వైనాన్ని గొప్పగా కొనియాడుతూ చేతులెత్తి నమస్కరిస్తూ ఇలా ప్రార్థించారు.

"స్వామీ! ఆదివరాహావతారా! శ్రీహరీ! మీకు అనంతకోటి నమస్కారాలు. మీ యీ వరాహరూపం ఆశ్చర్యంగాను, అద్భుతంగాను ఉండడమేగాక చాల భయానకంగా కూడా ఉంది. మీ ఉగ్రత్వాన్ని కాస్త ఉపశమింపజేసుకొని, సర్వలోకాలలోని భక్తుల కోసం మీరు ఇక్కడే ఈ దివ్య క్షేత్రంలోనే పరమశాంత స్వరూపంతో లక్ష్మీభూదేవు లిరువురితో కలిసి ఈ శ్వేత వరాహరూపంతోనే కొలువై ఉంటూ దర్శనాన్ని అనుగ్రహించి

ఆనందింప జేయవలసింది. ఇంకా అనంతమైన మీ దివ్య మహిమను లీలలను సర్వత్రా చాటుతూ ఉండవలసింది" అని వినయపూర్వకంగా అభ్యర్థించారు.

దేవతల ప్రార్థనలకు సంతోషించిన ఆదివరాహస్వామి ఇలా పలికినాడు.

"హిరణ్యాక్షుని సంహరించిన నేను ఒక మహోద్దేశంతోనే ఇప్పటి నుంచి, ఇచ్చట స్థిరంగా ఉండ దలంచాను. మీరు అందరూ నా సంకల్పాన్ని అనుసరించి, అట్లాగే ప్రార్థించారు. లక్ష్మీదేవిని నా వక్షః స్థలంలో నిలుపుకొని దివ్యదర్శనం ప్రసాదిస్తూ, భక్తజనుల కోరికలను తీరుస్తూ ఉంటాను".

అని అంటూ ఆ స్వామివారు సౌమ్యరూపాన్ని సవదరించి శ్రీ భూదేవీ సమేతంగా 'స్వామిపుష్కరిణి' కి (కోనేటికి) పశ్చిమతీరాన, స్వర్ణమయమై దివ్యకాంతులతో ప్రకాశిస్తూ ఉన్న దివ్య విమానం (గోపురం) కలిగి ఉన్న భవనంలో ప్రవేశించినాడు. అలా వేభవోపేతంగా విమాన మందిరంలో కొలువుదీరి ఉన్న శ్రీవరాహస్వామివారిని దేవత లందరు పరిపరి విధాలుగా పొగిడారు, కీర్తించారు, స్తుతించారు. అంతలో అందరూ చూస్తూ ఉండగానే ఆ దివ్యవిమానం అదృశ్యం అయింది. శ్రీ స్వామివారి దివ్య మహిమలకు ఆశ్చర్యపడుతూ బ్రహ్మాది దేవతలు అంతా స్వామివారి విమానం అదృశ్యమైన వైపుగా ఆకాశంలో ఆసక్తిగా, కళ్ళు నిగిడించి చూస్తూ అనేక విధాలుగా స్తోత్రాలు చేస్తూ వారి వారి లోకాలకు వెళ్ళిపోయారు. అనంతరం వరాహస్వామి లక్ష్మీదేవితో ఇలా అన్నాడు.

"లక్ష్మీ! నీవు నా వికార స్వరూపాన్ని చూచి భయపడతావని తలంచి నేను వైకుంఠానికి రాలేదు. అయినా నీవే సపరివారంగా నా దగ్గరకు వచ్చినావు. నాకు చాలా ఆనందమయింది."

అప్పుడు లక్ష్మీదేవి-- "స్వామీ! మీరు ఎక్కడుంటే అక్కడే నేను. మీ తోడిదే నా లోకం. మిమ్మల్ని విడిచి ఒక్క క్షణమైనా ఉండగలనా! అందువల్ల అందరితో పాటుగా నేనూ కదలివచ్చాను. నన్ను మన్నించ గోరుతున్నాను" అని వేడుకొన్నది.

"దేవీ! దానవ స్వభావంతో ప్రవర్తిస్తున్న దుష్టులనుండి సత్పురుషులను సంరక్షించడానికే నేను ఈ భూమి మీద నిలిచాను. వైకుంఠం కంటే కూడా ఇక్కడే

చాల బాగా ఉంది" అని అంటూ స్వామి, ఆదిలక్ష్మిని ఆలింగనం చేసికొని తన వక్షః స్థలంలో నిలుపుకొన్నాడు.

ఆ నాటి నుండి శ్రీ, భూదేవి సమేతుడైన శ్వేత వరాహస్వామివారు వలసినపుడు భక్తులకు సౌమ్య రూపంతో దర్శనమిస్తూ, మిగిలిన సమయాల్లో లీలామానుష రూప ధారియై ఆ క్రీడాచలంలో విహారం చేస్తూ ఉండినాడని సూతమహర్షి వివరించి చెబుతూ ఉండగా, శౌనకాది మహర్షులు మళ్లీ తమకు కలిగిన సందేహాలను ఇలా వెలిబుచ్చారు.

"మునీంద్రా! శ్రీహరి క్రీడాద్రిపై 'స్వామిపుష్కరిణి' కి పశ్చిమతీరాన ఉన్న దివ్య విమాన మందిరంలో వెలసినాడని చెప్పారు కదా! ఆ స్వామి అక్కడే ఎందుకు నిలిచాడు. అందులకు ప్రత్యేకమైన కారణం ఏమైనా ఉందా? ఆ పుష్కరిణిని "స్వామి పుష్కరిణి" అని అన్నారు. ఎందుకు ఆ పేరుతో పిలిచారు? ఆ పుష్కరిణి యొక్క మహిమలు ఎలాంటివి? వాటిని మాకు వివరంగా తెలియజేయవలసింది" అంటూ ప్రార్థించారు.

అందులకు సూతుడు 'సరే' నన్నట్టుగా తల ఊపుతూ ఇలా ప్రారంభించాడు.

## స్వామి పుష్కరిణి

శ్రీ వైకుంఠంలోని క్రీడాచలం మీద ఉన్న "క్రీడావాపి" నే "స్వామి పుష్కరిణి" అంటారు. శ్రీ మహావిష్ణువు ఆనతిమేరకు గరుత్మంతుడు క్రీడాద్రితో పాటు క్రీడావాపిని కూడా తెచ్చి ఇక్కడ స్థాపించాడు.

శ్రీదేవీ భూదేవులతో కలిసి వైకుంఠనాథుడైన శ్రీమహావిష్ణువు ఈ పుష్కరిణిలో జలక్రీడలాడినందువల్ల ఇది విరజానదివలె పరమ పవిత్రమై వెలుగొందుతూ ఉంది. అంతేగాక గంగాది నదులకన్నా అత్యంత మహిమ కలదిగా ప్రసిద్ధి పొందింది. లోకంలోని సమస్త పాపాలను పోగొట్టే ప్రభావంగల పరమ పుణ్యమైన తీర్థం ఈ పుష్కరిణి! ఈ కోనేటిని దర్శించినా, సేవించినా స్మరించినా సమస్త సిద్ధులు కరతలా మలకమవుతాయి.

"స్వామి పుష్కరిణీ స్నానం సద్గురోః పాద సేవనమ్
ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యంత దుర్లభమ్

దుర్లభం మానుషం జన్మ దుర్లభం తత్ర జీవనమ్
స్వామిపుష్కరిణీ స్నానం త్రయ మత్యంత దుర్లభమ్".

"స్వామిపుష్కరిణీ స్నానం, సద్గురు పాదసేవనం, ఏకాదశీవ్రతం ఈ మూడు కార్యక్రమాలు మానవుని జీవితంలో లభ్యం కావడం అత్యంత దుర్లభం. అలాగే మానవునిగా జన్మించడం, మానవునిగా మనుగడ సాగించడం, ఆ మానవ జీవితంలో స్వామిపుష్కరిణిలో స్నానం చెయ్యడం -- అనే ఈ మూడు కార్యాలు కూడడం కూడా చాల దుర్లభం" అని వరాహపురాణం చాటుతోంది.

వేంకటాద్రిపై వెలసి ఉన్న ఈ కోనేరు, అనంతమైన మహిమలతో విరాజిల్లుతూ, ప్రపంచంలోని తీర్థాలన్నింటికీ 'స్వామి' వలె అనగా, ప్రభువువలె అగ్రగణ్యమై ఉన్నందువల్ల "స్వామిపుష్కరిణి" అని ప్రసిద్ధికెక్కి సార్థక నామధేయాన్ని పొందింది.

ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే
ఆయాన్తి సర్వతీర్థాని స్వామిపుష్కరిణీ జలే
తత్ర స్నానం ప్రకుర్వంతి యే నరాః ప్రీత మానసాః
తే సర్వ పాపై ర్ముచ్యంతే సగోత్ర జ్ఞాతి బాంధవాః.

ఇంతటి పరమపావని అయిన ఈ పుష్కరిణిలో ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశి మరునాటి అరుణోదయ వేళలో ముల్లోకాలలోని సమస్త తీర్థాలు వచ్చి చేరతాయట! అందుకే ఆ రోజు "స్వామి పుష్కరిణీ తీర్థ ముక్కోటి" గా చెప్పబడుతున్నది. ఇలాగ ధనుర్మాసంలో శుక్లపక్ష ద్వాదశినాడు అరుణోదయ వేళలో ఎవరైతే మనఃప్రీతితో స్నానం చేస్తారో వారు, వారి సగోత్రీకులైన దాయాదులు, బంధువులు అందరూ అన్ని పాపాల నుండి విముక్తులవుతారు.

ఈ స్వామి పుష్కరిణీ ప్రభావం ఎనలేనిది. అయినా ఈ తీర్థ మహిమను చాటే రెండు మూడు గాథలను ఈ సమయంలో మనం తప్పక తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. వాటిని గురించి జాగ్రత్తగా వినండి మరి" అంటూ సూత మహర్షి ఇలా కొనసాగించాడు.

## స్వామిపుష్కరిణీ మహిమ

స్వామి పుష్కరిణీ ప్రభావాన్ని, మహిమను చాటే గాథల్లో, మొదట చెప్పుకోవలసినది, ప్రముఖంగా స్మరించవలసినది శంఖణ మహారాజు వృత్తాంతం.

## శంఖణ మహారాజు

పూర్వకాలంలో కాంభోజ దేశాన్ని శంఖణుడు అనే మహారాజు పరిపాలించేవాడు. ప్రజలను కన్నతండ్రివలె చక్కగా పాలన చేస్తూ మంచి పేరుతెచ్చుకొన్న ఈ రాజు అందరినీ ఏ మాత్రం సందేహం లేకుండా సులువుగా నమ్మేవాడు. అందువల్లే ఆ రాజు శత్రువులచేత సులభంగా మోసగింపబడి రాజ్యాన్ని పోగొట్టుకొని విచారంతో దేశద్రిమ్మరియై తిరుగుతూ వుండినాడు. భార్యా సమేతంగా అష్ట కష్టాలు పడుతూ, దిక్కు తెన్నూగానక కాలుగాలిన పిల్లివలె తిరుగుతుండినాడు.

కష్టకాలంలోను, గ్రహసంచారం సరిగాలేని పాపపు వేళల్లోను క్షేత్రదర్శనం, మహాపురుషుల సందర్శనం చెయ్యడం మంచిదన్న పెద్దల మాటలను అనుసరించి ఆ రాజు శ్రీరంగం, రామేశ్వరం, మధుర, కంచి వంటి అనేక పుణ్య క్షేత్రాలను దర్శిస్తూ ఆ సంచారంలో చివరకు శ్రీ వేంకటాచల దివ్య క్షేత్ర సమీపంలోనికి వచ్చి చేరాడు. అక్కడికి దగ్గర్లోనే వున్న పావన సువర్ణముఖరీ నదిలో భక్తి శ్రద్ధలతో సంకల్ప పూర్వకంగా భార్యతో కలిసి స్నానం చేశాడు.

పిదప అక్కడికి అతి సమీపంలోనే సాక్షాత్తు శ్రీమహాలక్ష్మిదేవి, సహస్ర దళాలు కలిగిన బంగారు పద్మంలో "పద్మావతి" గా అవిర్భవించిన "పద్మసరోవరం" వుందని కూడ విన్నాడు. అచటికి వెళ్లి అందులో స్నానం చేశాడు. పద్మావతి అమ్మ వారిని ధ్యానిస్తూ కొద్దిసేపు విశ్రాంతి తీసుకొన్నాడు. తిరిగి తిరిగి బాగా అలసిన ఆ రాజుకు కునుకు పట్టింది. ఆ నిద్రలో చక్కని కల వచ్చింది. ఆ స్వప్నంలో తనను ఎవరో పిలిచి, వెంటబెట్టుకొని వెళుతూ, వేంకటాచల క్షేత్రాన్ని అధిరోహింపజేసి, చివరకు ఆ క్షేత్రం మీద వున్నటువంటి పవిత్రమైన "స్వామిపుష్కరిణి" ని చూపించినారు. అంతేకాదు, ఈ పుష్కరిణిలో స్నానం చేసినట్లయితే నీ కష్టాలన్నీ తొలగుతాయనీ, గ్రహదోషాలు అన్నీ పోతాయనీ శుభప్రదమైన కల్యాణ పరంపరలు వృద్ధి చెందుతాయనీ, నీ రాజ్యం మళ్లీ సిద్ధిస్తుందని చెప్పినట్లుగా ఒక విచిత్రమైన దివ్యానుభూతిని పొందుతూ ఆ రాజు నిద్ర మేల్కొన్నాడు.

కలలో తనకు కలిగిన ఆ విచిత్రమైన అనుభవానికి ఆశ్చర్యాన్ని పొందుతూ, అద్భుతమైన, అవ్యక్త మైన ఒక ఆనందాన్ని చవిచూస్తూ, శంఖణ మహారాజు భార్యతో కూడ వేంకటాచల క్షేత్రాన్ని భక్తితో అధిరోహించినాడు. అక్కడి పవిత్ర వాతావరణానికి,

ప్రకృతి సౌందర్యానికి, ఆధ్యాత్మిక తేజస్సుకు ఆశ్చర్య పడుతూ, అక్కడ వెలసివున్న పవిత్ర మైన "స్వామిపుష్కరిణి" లో మునక లిడినాడు. స్నానం చెయ్యడంతో పాటు అనుదినం శ్రీహరిని ధ్యాన మననాదులతో తపస్సు చేస్తూ వుండినాడు. ఇలా సుమారుగా ఆరు నెలల కాలం సునాయాసంగా గడచిపోయింది.

అనంతరం ఒకనాడు ఆ పుష్కరిణి మధ్యభాగంలో అద్భుతమైన వింత వింత తేజస్సులతో ప్రకాశిస్తూ వున్న ఒక బంగారు దివ్యవిమానం అవిర్భవించింది. ఆ బంగారు విమానంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమహా విష్ణువు దివ్యాభరణాలతో సుగంధ సుమనోహరమైన పుష్పమాలలతో అలంకరింపబడి, దేదీప్య మానంగా వేయి వెలుగులతో దర్శన మిచ్చినాడు. అపూర్వమైన ఈ సన్నివేశానికి విస్మయాన్ని పొందిన బ్రహ్మాది దేవత లందరూ ఆ స్వామిమీద పూలవానను కురిపించారు. అందరూ, అనేక విధాలుగా, ఎవరికి తోచినట్లు వారు ఆ స్వామివారిని పెక్కు రీతుల ప్రస్తుతించారు.

శంఖణ మహారాజుకూడ దేవతలందరిచేత కీర్తింపబడుతున్న శ్రీమహా విష్ణువును కన్నులారా దర్శిస్తూ, భార్యతోకూడ కలిసి స్తోత్రం చేసినాడు. సాష్టాంగ దండ ప్రణామాలాచరించినాడు. నమస్సుమాంజలులతో అర్చించినాడు. ఆ చక్రవర్తి భక్తికి సంతృప్తి చెందిన శ్రీహరి ఇలా అన్నాడు.

"రాజా! నీకోసమే ఇప్పుడు నేను ప్రత్యక్షమయ్యాను. తొలుత స్వామి పుష్కరిణీ స్నానంతోనే నీ పాపాలన్నీ నశించిపోయాయి. పిదప ఈ నా దర్శనంతో పుటం పెట్టిన బంగారం వలె నీ కలుషాలన్నీ పూర్తిగా తొలగి పోయి, నీవు పునీతుడవయ్యావు. పోయిన నీ రాజ్యం మళ్లీ అతి త్వరలోనే నీకు సంప్రాప్తిస్తుంది. చాలకాలం సకల రాజభోగాలు, సౌఖ్యాలు అనుభవిస్తూ రాజ్యమేలుతావు. అంతమాత్రమే కాదు. చివరకు నీకు పునరావృత్తి రహిత కైవల్యం కూడా సిద్ధిస్తుంది" అని అనేక విధాలుగా వరాలను అనుగ్రహించి అంతర్హితుడయ్యాడు.

శ్రీస్వామివారి దివ్య వాక్కులకు, అమృత దృష్టులకు ఆనంద భరితుడైన శంఖణమహారాజు పదే పదే ఆ స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని స్మరించు కొంటూ, స్వామిపుష్కరిణికి నమస్కారాలర్పించి, తిరిగి తన రాజ్యాన్ని చేరుకొన్నాడు. దైవానుగ్రహం వలన శంఖణుడు శత్రువులను అనాయాసంగా జయించినాడు. ప్రజల

ఆదరాభిమానాలతో మళ్లీ సింహాసనాన్ని అధిష్ఠించినాడు. అలా ఆ మహారాజు జనరంజకంగా సుఖసంతోషాలతో రాజ్యంచేస్తూ చిట్టచివరకు మోక్షాన్ని కూడా పొందాడు అని అంటూ, దీనికంతటికీ స్వామిపుష్కరిణీ స్నానమే ప్రధాన కారణం. అలాగే స్వామి పుష్కరిణి మహిమను తెలియజేసే మరో ఇతివృత్తాన్ని కూడా వినండి" అని అంటూ సూతుడు ఇలా కొనసాగించినాడు.

## ఆత్మారాముడు

చాలకాలంక్రిందట మధ్యదేశంలో సదాచార సంపన్నుడు అయిన **ఆత్మారాముడు** అనే సద్బ్రాహ్మణుడు వుండేవాడు. ఆ విప్రుడు భక్తి ప్రపత్తులతో నిరంతరం అతిథి అభ్యాగతులను సత్కరిస్తూ వుండేవాడు. అయన నిత్యమూ అన్నదానాలతో పాటు, దైనందిన అధ్యాత్మిక కార్యక్రమాలను ఆచరిస్తూ ఉత్తమ గృహస్థుగా కాలం గడుపుతూ వుండినాడు. ధారాళమైన బుద్ధితో ఆచరించిన దానధర్మాలవల్ల పెద్దలు చేర్చిపెట్టిన ఆస్తిపాస్తులు అన్నీ హారతి కర్పూరంలాగా కరిగిపోయి కొన్నాళ్లకు కటిక దరిద్రుడయ్యాడు. కేవలం దారిద్ర్యమేగాక అష్టకష్టాలకు లోనయ్యాడు. అందువల్ల తాను వుండిన ఊరును విడిచిపెట్టి దేశద్రిమ్మరియై దిక్కుతోచక సంచరిస్తూ వుండినాడు.

అలా తిరుగుతూ తిరుగుతూ ఒకప్పుడు వేంకటాచల క్షేత్రానికి దిగువన వున్న 'కపిలతీర్థం' చేరుకొన్నాడు. ఆ పుణ్య తీర్థంలో స్నానాదులు ముగించుకొని శ్రీ కపిలేశ్వర స్వామివారిని దర్శించినాడు. పిదప వేంకటాద్రి పర్వతాన్ని ఎక్కుతూ వుండగా ఆత్మారామునికి ఆదారిలో ఒక గుహ గోచరించింది. అందులో 'సనత్కుమారుడు' అనే యోగి తపస్సు చేసుకొంటూ వుండగా, చూచి ఆత్మారాముడు ఆ మునిని భక్తితో నమస్కరించి ప్రార్థించినాడు. తన కథనంతా విన్నవించుకొని తన కష్టాలు తొలగే తరణోపాయం ఉపదేశించవలసిందని ప్రాధేయ పడినాడు.

అప్పుడు సనత్కుమారుడు ఆ విప్రుని దీనస్థితిని దివ్యదృష్టితో గమనించి "నీవు గడచిన జన్మల్లో అనేక పాపాలు చేశావు. అందువల్లే నీవు అంతులేని కష్టనష్టాలకు లోనయ్యావు. అయితే ఆ పాపాలన్నీ కపిలతీర్థంలో స్నానం చేసినందువల్ల నశించి పోయాయి. ఇక, ఇప్పుడు సకల సంపదలు కలగడానికై లక్ష్మీదేవి అనుగ్రహం నీకు తప్పక కావాలి. ప్రస్తుతం ఆ మహాలక్ష్మీదేవి వేంకటాద్రి క్షేత్రంలో లీలామానుష రూపంలో విహరిస్తూ వున్న శ్రీ మహావిష్ణువుయొక్క వక్షః స్థలంలో "వ్యూహలక్ష్మి" గా

కొలువై వున్నది. వేంకటాచల క్షేత్రంలోవున్న పవిత్రమైన "స్వామి పుష్కరిణి" లో స్నానమాచరించి ఆ జగన్మాతను ఉపాసించినట్లయితే, ఆ తల్లియొక్క అపారమైన కృపాదృష్టి నీపై పడుతుంది. అప్పుడు నీవు కోరినవన్నీ నీకు సంప్రాప్తిస్తాయి అంటూ క్రింది మహా మంత్రాన్ని ఉపదేశించినాడు.

దయాలోల తరంగాక్షీ పూర్ణచంద్ర నిభాననా
జననీ సర్వలోకానాం మహాలక్ష్మీః హరిప్రియా.

సర్వపాపహరా సైవ ప్రారబ్ధస్యాపి కర్మణః
సంహృతౌతు క్షమాసైవ సర్వ సంపత్ప్రదాయినీ

తస్యాః వ్యూహ ప్రభేదాస్తు లక్ష్మీః కీర్తిర్జయేతిచ
తత్ర యా వ్యూహలక్ష్మీః సా ముగ్ధా కారుణ్యా విగ్రహా
అనాయాసేన సాలక్ష్మీః సర్వపాప ప్రణాశినీ
సర్వైశ్వర్య ప్రదా నిత్యం తస్యాః మంత్ర మిమం శృణు.

"వేదాదిమాయై మాత్రే చ లక్ష్మ్యై నతిపదం వదేత్
పరమేతి పదం చోక్త్వా లక్ష్మ్యై ఇతి పదం తతః

విష్ణు వక్షః స్థితాయై స్యాత్ మాయా శ్రీతారికా తతః
వహ్నిజాయాన్త మంత్రోఽ యం అభీష్టార్థ సురద్రుమః

ద్విభుజా వ్యూహలక్ష్మీ స్స్యా ద్బద్ధ పద్మాసన ప్రియా
శ్రీనివాసాంగ మధ్యస్థా సుతరాం కేశవ ప్రియా.

తామేవ శరణం గచ్ఛ సర్వభావేన సత్వరమ్
ఇతి మంత్ర ముపాదిశ్య దదృశే న కుత్రచిత్."

పున్నమి చంద్రునివలె చక్కని ముఖారవిందంతో ప్రకాశిస్తున్న శ్రీ మహాలక్ష్మి సర్వలోక జనని! ఆమె శ్రీహరికి అత్యంత ప్రియురాలై భక్తు లందరిమీదా కరుణరసాన్ని ప్రవహింపజేసే కన్నులతో విరాజిల్లుతూ వుంటుంది.

ఆ జగన్మాత అతి దుస్సహములైన ప్రారబ్ధాలను, కలుషాలను పోగొట్టడమేగాక, సర్వసంపదలను ప్రసాదించడంలో మిక్కిలి సమర్థురాలు!

లక్ష్మి, కీర్తి, జయా అను రూపాలు ఆ జగజ్జననియొక్క వ్యూహ భేదాలు. ముఖ్యంగా శ్రీనివాసుని వక్షఃస్థలంలో వేంచేసి వున్న వ్యూహ రూపం "లక్ష్మి". ఆమె ముగ్ధ మనోహరంగా, కరుణా స్వరూపిణిగా దర్శన మిస్తూ వుంటుంది.

ఆ వ్యూహలక్ష్మి అనాయాసంగా సర్వపాపాలను నశింపజేయడమేగాక, సకలైశ్వర్యాలను అనుగ్రహిస్తూ వుంటుంది. ఆమె మంత్రాన్ని ఉపదేశిస్తాను, జాగ్రత్తగా వినవలసింది.

'వేద' అనే పదం 'మాత' అనే పదం, 'లక్ష్మి' అనే పదం, 'పరమలక్ష్మి' అనే పదం, 'విష్ణువక్షఃస్థితాయై' అనే పదం 'మాయ' అనే పదం 'తారికా' అనే పదం ఇంకా.........

'వహ్నిజాయై' అనే పదాలను చేరుస్తూ ఆ మంత్రాన్ని ఉచ్చరించాలి. ఈ మంత్రం కల్పవృక్షం వలె అన్ని కోరికలను తీరుస్తుంది.

శ్రీనివాసుని వక్షఃస్థలంలో పద్మాసనస్థయై రెండుభుజాలను కలిగి వున్న వ్యూహలక్ష్మి శ్రీమహావిష్ణువునకు అత్యంత ప్రియురాలై వుంటుంది. స్వామి పుష్కరిణిలో నియమ నిష్ఠలతో స్నానంచేస్తూ మనసా, వాచా, కర్మణా అన్నివిధాలా నీవు ఆ వ్యూహ లక్ష్మిని శరణాగతిని పొందుతూ వెంటనే ఉపాసించవలసింది" అంటూ వ్యూహలక్ష్మి మహా మంత్రాన్ని ఆత్మారామునికి ఉపదేశించి సనత్కుమారయోగి అదృశ్యమయ్యాడు.

మహనీయుని దర్శనంతోపాటు జరిగిన సన్నివేశానికి ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని పొందుతూ, ఆత్మారాముడు మరింత భక్తి ప్రపత్తులతో వేంకటాచల పర్వతాన్ని ఎక్కుతూ ఆ పర్వత సానువులలో అక్కడక్కడ నెలకొనివున్న పవిత్ర తీర్థాల్లో మునకలిడుతూ ముందుకు సాగినాడు. అందులో ముఖ్యంగా, ఆ దారిలో కనపడిన పదిహేడు తీర్థాలలో స్నానంచేసి, చివరకు శేషాచలాన్ని చేరుకున్నాడు. అక్కడ ప్రతిరోజు దీక్షగా పవిత్రమైన "స్వామి పుష్కరిణి" లో స్నానమాచరిస్తూ, శ్రీస్వామివారిని, ఆయన వక్షఃస్థలంలో కొలువైవున్న "వ్యూహలక్ష్మి" ని భక్తి తత్పరతతో ఆరాధించినాడు. కొంత కాలానికి శంఖచక్రాది పంచాయుధాలతో, హారకేయూరాది కిరీట కుండలాలతో, వక్షఃస్థల మహాలక్ష్మితో కూడా శ్రీమహావిష్ణువు ఆత్మారామునకు సాక్షాత్కరించి దర్శనమిచ్చాడు. ఆ దివ్య స్వరూప దర్శనంతో నిశ్చేష్టుడై ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిన ఆత్మారాముని నిండుగా అనుగ్రహిస్తూ శ్రీనివాసుడు "ఓ విప్రుడా!

స్వామిపుష్కరిణీ స్నానంతో నీ పాపం పూర్తిగా నశించింది. లక్ష్మీదేవి యొక్క అపారమైన కరుణ నీపై ప్రసరించింది. ఇకమీదట సకల సంపదలతో తుల తూగుతూ దానధర్మాలను ఆచరిస్తూ సుఖంగా వర్థిల్లుము" అని వరమిచ్చి అంతర్ధాన మయ్యాడు.

అలా దర్శనమిచ్చి అదృశ్యు డైన శ్రీస్వామివారి దివ్య మంగళ స్వరూపాన్నీ, లీలలనూ--

వేంకటేశా త్పరో దేవో నాస్త్యన్యః శరణం భువి
వేంకటేశ సమో దేవో నాస్తి నాస్తి మహీతలే
స్వామిపుష్కరిణీ తీర్థ సమం నాస్తి నచాస్తి హి.

"భూలోక వైకుంఠమైన శేషాచలంలో కొలువై వున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారిని మించిన పరదైవం ఇతరత్రా ఎక్కడా లేనే లేదు. ఆ స్వామిని శరణు వేడితే చాలు! అంతకంటే శరణాగతి లేదు! ఇక ఈ భూలోకంలో శ్రీ వేంకటేశ్వరునికి సమానమైన దేవుడు ఎక్కడైనా వున్నాడా! అంటే లేడనే ఘంటాపథంగా చెప్పవచ్చు. అలాగే వేంకటాద్రి క్షేత్రంలో వెలసివున్న 'స్వామి పుష్కరిణి' తీర్థానికి సాటిరాగల పుణ్యతీర్థం ఎక్కడా లేనే లేదు" అని అనేకవిధాలుగా కొనియాడుతూ ఆత్మారాముడు తన గురువైన సనత్కుమార యోగిని భక్తితో స్మరిస్తూ స్వగ్రామం చేరుకొని సుఖంగా జీవితాన్ని కొనసాగించి, చివరకు ముక్తిని పొందినాడు. అంతేకాదు స్వామిపుష్కరిణీ తీర్థమహిమ అనంతం! అద్భుతం! అంటూ శంఖుని కథను, ఆత్మారాముని వృత్తాంతాన్ని చెప్పిన తర్వాత స్వామిపుష్కరిణీ తీర్థ మహత్యాన్ని గూర్చి సూతుడు ఇంకా ఇలా కొనసాగించాడు.

## బ్రహ్మహత్యాదోష నివారణ

పూర్వం ఒకానొకప్పుడు దేవతల సేనాధిపతి అయిన కుమారస్వామి లోకకంటకుడైన తారకాసురుణ్ణి సంహరించినాడు. అందువల్ల ఆయనకు బ్రహ్మహత్యా పాపం చుట్టుకుంది. ఆ దోషంనుండి తప్పించుకోవడానికి దాన్ని సమూలంగా పోగొట్టుకోవడానికి షణ్ముఖుడు ఎక్కడెక్కడో తిరిగాడు. కాని ఏ మాత్రం లాభం లేక పోగా, అనిశ్చితంగా లోకాలన్నీ తిరగడం వల్ల విసిగి వేసారి పోయాడు. సుబ్రహ్మణ్య స్వామి చివరకు పరమేశ్వరుని శరణు వేడినాడు. పరమశివుడు వేంకటాద్రికి చేరి అందున్న "స్వామిపుష్కరిణి" ని సేవించుకోమని అనతి ఇచ్చాడు. వెంటనే కుమారస్వామి అక్కడికి

వెళ్లి ఆ పుణ్యతీర్థ పావనజలాల్లో స్నానమాచరించినాడు. ఆ తర్వాతనే ఆయన ఆ బ్రహ్మహత్యాపాపం నుండి విముక్తిని పొందగలిగాడు. అంతట ఆ పుష్కరిణీ మహిమా విశేషాలకు ఆశ్చర్య పడుతూ కుమారస్వామి, పిదప శ్రీ భూ దేవేరుల సమేతంగా లీలామానుష రూపంతో ఆ దివ్య స్థలంలో సంచరిస్తున్న శ్రీ మహావిష్ణువును సందర్శించి ధన్యుడై వెళ్లినాడు" అంటూ సూతమహాముని ఇంకా ఇలా అన్నాడు.

ఓ మహాపురుషులారా! ఈ సందర్భంలోనే స్వామిపుష్కరిణీ యొక్క మహత్త్వాన్ని గూర్చి తెలియజేసే కాశ్యపుడనే విప్రుని అద్భుత గాథ జ్ఞాపకం వస్తున్నది. దాన్ని కూడా మీకందరకు తెలియజేస్తాను సావధానంగా వినండి మరి!

## పరీక్షిన్మహారాజు

అభిమన్యుని పుత్రుడగు పరీక్షిన్మహారాజు హస్తినాపురాన్ని పరిపాలిస్తున్న రోజులవి. ఒకానొక రోజు వేటకువెళ్లిన పరీక్షిత్తు బాగా అలసి సొలసి, ఆకలి దప్పులతో బాధా తప్తుడయ్యాడు. అయినా వేటమీద విపరీతమైన ఆసక్తితో ఒక మృగాన్ని తరుముతూ వెంటబడినాడు. ఆ జింక ఆ రాజు చూపుల నుంచి త్రుటిలో తప్పించుకొని పారిపోయింది. దానికై వెదుకుతూ వున్న ఆ రాజునకు శమీకుడను ముని ఆశ్రమం కనిపించింది. ఆ ఆశ్రమం ముందుభాగంలో విశాలమైన వృక్షచ్ఛాయలో తపోమగ్నుడైన శమీకుడు కనపడినాడు. వేట విసుగుతో ఇవేమీ గమనించని పరీక్షిత్తు శమీకుని దగ్గరికి వెళ్లి "మునీంద్రా! నేను తరుముతున్న జింక ఈ మార్గంలో వచ్చిందా? మీరేమైనా చూశారా?" అని ప్రశ్నించినాడు. దీర్ఘమైన ధ్యానంలో మునిగి వున్నందువల్ల ఆ శమీకమహర్షి బదులు పలుకలేదు. మళ్లీ మళ్లీ ప్రశ్నించి విఫలుడైన మహారాజు ఆకలి దప్పులతో వివేకశూన్యుడయ్యాడు. ఎక్కడలేని కోపం వచ్చింది? హస్తినాపుర చక్రవర్తిని. నాకు ఈ బడుగు బాపనితో పరాభవం జరగడమా? అని అనుకుంటూ యుక్తా యుక్త జ్ఞానం కోల్పోయినవాడై తీవ్రమైన కోపంతో పక్కనే పొదల్లో చచ్చిపడియున్న ఒక పామును తన వింటి (ధనువు) కొనతో తెచ్చినాడు. తపస్సుచేసికొంటున్న ముని మెడలో హారంవలె వేసి వెళ్లిపోయాడు. తరువాత ఆశ్రమం చేరుకున్న శమీకుని పుత్రుడు, శృంగి అనువాడు తన తండ్రి మెడలో వేలాడుతున్న చచ్చిన పామును చూచినాడు. పరీక్షిత్తు ఈ పని చేసినట్లుగా ఇతరులవల్ల తెలిసికొన్న శృంగి, తండ్రి మీద భక్తితో మహా కోపంతో "నా తండ్రి మెడలో చచ్చిన పామును వేసినవాడు

ఏడురోజులలో 'తక్షకుడు' అనే మహా విషసర్పం చేత కరువబడి చచ్చుగాక!" అని తీవ్రంగా శపించినాడు.

తపస్సును చాలించి, మేల్కొన్న శమీకునికి, తన పుత్రుడిచ్చిన శాపం గురించి తెలియవచ్చింది. ప్రజల బాగోగులను చూచే రాజుకు శాపమివ్వడం తన పుత్రుని అవివేక కార్య మని చింతించినాడు. వెంటనే గౌరవముఖుడనే తన శిష్యుని పరీక్షిత్తు దగ్గరికి పంపి, తగు జాగ్రత్తలు తీసికొని తనను తాను కాపాడుకోవలసిందని తెలియ పరచినాడు. ఈ శాప విషయాన్ని విన్న రాజు 'మహనీయులను, పెద్దలను అగౌరవ పరచడం అనర్థదాయకం' కదా! అని దుఃఖించినాడు. గంగానది మధ్యలో ఒంటి స్తంభంపైన ఒక మంటపాన్ని నిర్మింపజేసినాడు. అక్కడికి మహాసర్పవిషాలను పోగొట్టే వైద్యులను, మంత్ర శాస్త్ర వేత్తలను పిలిపించుకున్నాడు. ఏదిఏమైనా, ముక్తి కలిగించే విష్ణుగాథలను వినే కుతూహలంతో దేవర్షులను, బ్రహ్మర్షులను, ఇతర యోగులను ఆహ్వానించి వారి చేత భగవంతుని లీలలను విన సాగినాడు.

ఇది ఇలా వుండగా మహా మంత్రవేత్త అయిన కాశ్యపుడు అనే బ్రాహ్మణుడు తక్షకుని విషం నుండి రక్షించాలన్న సంకల్పంతో రాజు దగ్గరకు వస్తూ వుండినాడు. అది చివరి రోజు. అనగా ఏడవరోజు. దరిద్రుడైన ఆ విప్రుడు రాజును బ్రదికించి సంపదను పొందవలెననే ఉత్సాహంతో ఉరుకులు పరుగులమీద పరీక్షిత్తుదగ్గరకు వస్తూ వుండినాడు. తక్షకుడు దీనిని గమనించి, బ్రాహ్మణ వేషంలో కాశ్యపుని దగ్గరకు వచ్చి "విప్రోత్తమా! ఎవరు మీరు? ఎక్కడికి మహా వేగంగా పరుగెడుతున్నారు?" ఇత్యాదిగా ప్రశ్న లడిగినాడు. అంత కాశ్యపుడు "నేను కాశ్యపుడు అని పిలువబడుతున్న మహా మంత్రవేత్తను! తక్షకుని విషంచేత మరణించే పరీక్షిన్మహారాజును, నా మంత్రసిద్ధి చేత క్షణాల్లో బ్రతికిస్తాను. తద్వారా ధనవంతుణ్ణి అవుతాను" అని చెప్పాడు.

అలాగా, అయితే ఆ తక్షకుణ్ణి నేనే! ఇదిగో! ఈ మహావృక్షాన్ని ఇప్పుడు కాటు వేస్తాను. నీ శక్తి చూపించ వలసింది -- అంటూ తక్షకుడు తన విషం చేత ఆ చెట్టును భస్మం చేశాడు.

వెంటనే కాశ్యపుడు తన మంత్ర మహత్త్వం చేత తక్షకుని విషం వల్ల భస్మమైన ఆ మహావృక్షాన్ని క్షణాల్లో మిస మిస ఛాయలతో మెరసేట్లు పచ్చగా చెట్టును

బ్రతికించినాడు. అంతకు ముందే ఆకులకోసం చెట్టెక్కిన ఒక బ్రాహ్మణుడు చెట్టుతోపాటు మాడి మసి అయి, తర్వాత కాశ్యపుని మంత్రసిద్ధి చేత చెట్టుతోపాటు తాను బ్రతికినాడు.

ఇది గమనించిన తక్షకుడు, కాశ్యపునితో "అయ్యా! విప్రవర్యా! నీవు మహా మహిమాన్వితుడవైన మంత్ర సిద్ధుడవు. కాని శృంగిఋషిచే ఇవ్వబడిన శాపం కూడ అమోఘం కదా! ఋషి ఇచ్చిన శాపం నిర్వీర్యం కాకూడదు. కనుక నీవు తిరిగి వెళ్లవలసింది. అందుకుగాను అంత కంటె అధికమైన ధనాన్ని నీకు ప్రసాదిస్తాను. ఆలోచించుకో" అని అన్నాడు.

కాశ్యపుడు దివ్యదృష్టిచేత పరీక్షిత్తు యొక్క పూర్వాపరాలను యోచన చేసి, ఆ రాజు ఎలాగైనా అల్పాయుష్కుడే కనుక తాను వెళ్లి వైద్యం చెయ్యడం వ్యర్థమేనని నిర్ణయించి, తక్షకుడిచ్చిన ధనాన్ని మూట గట్టుకొని వెళ్లిపోయాడు.

ఆ తర్వాత పరీక్షిన్మహారాజు తక్షకుని విషంవల్ల మృతుడయ్యాడు.

చెట్టుతోపాటు భస్మమై, మరల ఆ వృక్షంతోపాటు బ్రతికిన విప్రునివల్ల కాశ్యపుడు చేసిన పనిని తెలిసికొనిన లోకులందరు అతణ్ణి ఈసడించు కొన్నారు. ఎవరూ అతనిని దరిచేరనీయలేదు. కాశ్యపుని చూచిన వెంటనే అస్పృశ్యుని వలె దూరంగా తొలగిపోతూ వుండినారు. ఈతడు ఎక్కడికి వెళ్లినా ఆ ప్రదేశాల్లోని జనులందరు ఇతనిని తరిమి వేస్తూ వుండినారు. ఇలా దిక్కుగానక తిరుగుతూ తిరుగుతూ చివరకు "శాకల్య ముని" అనే మహానుభావుని శరణు వేడి తనకు వాటిల్లిన దీనత్వాన్ని విన్నవించుకొన్నాడు.

"స్వామీ! మహానుభావా! నేను ఎక్కడికి వెళ్లినా అందరూ నిష్కారణంగా నిందిస్తూ వున్నారు. మరి నేను ఏలాంటి పాపాలను చెయ్యలేదు. మరి అందరూ ఎక్కడికి రానియ్యకుండా తరిమి వేస్తున్నారు. మరి నేను చేసిన దోషమేమో తెలియజెప్పి నన్ను రక్షించ వలసిందని పెక్కు విధాల ప్రాధేయపడుతూ ప్రార్థించినాడు.

## వైద్యుని పరమ ధర్మాలు

అంత శాకల్యమహర్షి, కాశ్యపుని క్రిందినుంచి పైకి చూస్తూ, కొద్ది సేపు ఆలోచించి, విప్రోత్తమా! నీవు మహా అపరాధం చేశావు. బ్రాహ్మణ శాపాన్ని పొంది,

మహాకాలనాగు అయిన తక్షకుని ఘోర విషంచేత మరణించే పరీక్షిత్తును 'మంత్రం చేత రక్షించ కుండా, ధనాశకు లోనై వైద్యం చెయ్య కుండానే తిరిగి వెళ్లావు.

ఆ పరీక్షిన్మహారాజు విష్ణుభక్తి కలవాడు. మహాయోగి. మీదు మిక్కిలి ప్రజలందరికీ తమ రాజును రక్షించు కొనవలసిన బాధ్యత వుంది. కాని అలాంటి చక్రవర్తిని నీవు రక్షించకుండా వెళ్లడం క్షంతవ్యంకాని నేరం చేసినట్లయింది.

*యావత్కంఠ గతాః ప్రాణాః ముమూర్షో ర్మానవస్య హి*
*తావ చ్చికిత్సా కర్తవ్యా కాలస్య కుటిలా గతిః*
*ఇతి ప్రాహుః పురా శ్లోకం భిషగ్వైద్యాబ్ధి పారగాః*
*తతశ్చికిత్సా శక్తోఽపి యస్మా దకృతభేషజః.*

రోగి చనిపోవడానికి సిద్ధంగా వున్నా సరే. వాడి కంఠంలో ప్రాణ మున్నంత వరకు వైద్యుడు అనేవాడు తనకు తెలిసిన వైద్యంచేస్తూ బ్రతికించడానికి తీవ్ర ప్రయత్నం చేసి తీరాలి. ఎందుకంటే కాలం చాల వక్రమైనది. అని ఈ విధంగా ఆయుర్వేద వైద్య శిఖామణులైన పెద్దలు చెబుతూ వుంటారు.

కేవలం కీర్తి కాంక్షతోనో, ధనాశతోనో వైద్య వృత్తిని స్వీకరించరాదు. సేవాభావంతో కూడిన వైద్యుడు ఎట్టి పరిస్థితులలోను వైద్యం చేయననరాదు. అంతే గాదు. రోగాన్ని బట్టి పూర్తిగా వైద్యం చెయ్యాలి. "త్వరలో రోగి మరణిస్తాడు" అనే మాట వైద్యుడు ఎప్పుడు చెప్పరాదు. రోగి కంఠంలో ప్రాణ మున్నంతవరకు వైద్యుడు తప్పక చికిత్స చేసియే తీరవలెను. వైద్యు డనేవాడు రోగాన్ని గూర్చి, చికిత్సను గూర్చి ఆలోచించాలి గాని, ప్రాణాన్ని గూర్చి నిర్ణయించరాదు. అంతేగాక, లేని రోగాన్ని ఉందని చెప్పడం గాని, తక్కువగా వున్న రోగాన్ని తీవ్రంగా వుందని చెప్పడం గాని చెయ్యరాదు. ఎంతో ఓపికగా, ఓర్పుగా, నేర్పుగా వైద్యుడు వ్యవహరించినపుడు తన వృత్తికి న్యాయం చేసినవాడై, ఇహ పర సౌఖ్యాలను పొందగలడు.

నీవు మంత్ర శక్తిచేత పరీక్షిన్మహారాజునకు వైద్యం చేయగల సమర్థుడవై వుండి కూడా, ఆయన ఆయుస్సు తీరిందని ముందుగానే నీవే నిర్ణయించి ధనానికి ప్రలోభపడి, వైద్యం చెయ్యకుండా తిరిగి వెళ్లావు. ఆ పాపం నీ వెంటబడి వుంది. అందువల్లే లోకులు అందరూ నిన్ను నిందించడం జరుగుతున్నది. వెడలగొట్టడం జరుగుతున్నది -- అని శాకల్య ముని వివరించినాడు.

అంత కాశ్యపుడు పరివిధాల చింతిస్తూ, "ఓ శాకల్యమహర్షీ! నన్ను ఆ ఘోర పాపం నుండి విముక్తుణ్ణి చేసే మార్గం ఉపదేశించవలసింది. మళ్లీ యథా పూర్వంగా బంధువులు, స్నేహితులు, ప్రజలందరూ నన్ను ఆదరించేటట్లు అనుగ్రహించ వలసింది అంటూ ప్రాధేయపడినాడు.

వెంటనే శాకల్యముని కొంత సేపు అరమోడ్పు కన్నులతో ధ్యానించి--

"అస్య పాపస్య శాంత్యర్థం ఉపాయం ప్రవదామి తే<br>
తత్కర్తవ్యం త్వయా శీఘ్రం విలంబం మా కృథా ద్విజ!<br>
సువర్ణ ముఖరీ తీరే లక్ష్మీపతి నివాసభూః<br>
వేంకటాద్రి రితి ఖ్యాతః సర్వలోకేషు పూజితః<br>
తస్మిన్ శేషగిరౌ పుణ్యే సురాసుర నమస్కృతే<br>
బ్రహ్మహత్యా సురాపాన స్వర్ణస్తేయాది నాశకే.<br>
స్వామిపుష్కరిణీ చేతి సర్వ పాపాపనోదినీ<br>
ఉత్తరే శ్రీనివాసస్య వర్తతే మంగళప్రదా.<br>
తం గత్వా వేంకటంశైలం స్వామిపుష్కరిణీం శుభామ్<br>
స్నాత్వా సంకల్పపూర్వం తు వరాహస్వామినం హరిమ్.<br>
సేవిత్వా పశ్చిమేతీరే నిర్గత్య హరి మందిరమ్<br>
గత్వా తత్ర విధానేన స్వర్ణాచల నివాసినమ్.<br>
శ్రీనివాసం పరం దేవం భక్తానాం అభయప్రదమ్<br>
శంఖచక్రధరం దేవం వనమాలా విభూషితమ్<br>
దృష్ట్వా నిర్ధూత పాపోఽసి సంశయం మాకృథా ద్విజ."

ఓ కాశ్యపుడా! నీవు చేసిన ఈ ఘోర పాపం శాంతించడానికిగాను ఒక ఉపాయం చెప్తాను. ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా దాన్ని ఆచరణలో పెట్టుము అంటూ శాకల్యుడు ఇలా అన్నాడు.

పరమపావనమైన సువర్ణ ముఖరీనదీ తీరాన శ్రీనివాసుడైన శ్రీమహావిష్ణువునకు నివాస స్థానమై ప్రకాశిస్తూ, సర్వలోకాలచేత పూజింపబడుతూ వేంకటాచల దివ్యధామం ప్రసిద్ధంగా నెలకొనివుంది.

ఆ దివ్య క్షేత్రం బ్రహ్మహత్య, సురాపానం, బంగారాన్ని దొంగిలించడం వంటి మహాపాపాలను పోగొడుతూ, నిత్యమూ దేవతలచేతా, రాక్షసులచేతా నమస్కరింప బడుతూ వుంది.

"స్వామిపుష్కరిణీం త్యక్త్వా తీర్థ మన్య ద్వ్రజే త్తు యః
స్నిగ్ధం స గోపయస్త్యక్త్వా స్నుహీక్షీరం ప్రయాచతే.
స్వామితీర్థం స్వామితీర్థం స్వామితీర్థ మితి ద్విజాః
త్రిఃపఠన్తో నరా ఏవం యత్ర క్వాపి జలాశయే
స్నాన్తి సర్వే నరాస్తేవై యాస్యన్తి బ్రహ్మణః పదమ్."

"శ్రీ వేంకటాచల క్షేత్రంలోని స్వామిపుష్కరిణీ తీర్థాన్ని విడిచిపెట్టి ఇతర తీర్థాలకు వెళ్లినవారు శ్రేష్ఠమైన, పవిత్రమైన చిక్కని ఆవుపాలను విడిచిపెట్టి బొమ్మజెముడు చెట్టుపాలను స్వీకరించినట్లు అవుతుంది. భక్తులు ఏ తీర్థాల్లో గాని, ఏ నదుల్లో గాని స్నానం చేసే సమయంలో "స్వామిపుష్కరిణి, స్వామిపుష్కరిణి, స్వామిపుష్కరిణి" అని మూడు మార్లు స్మరిస్తే చాలు. వారు అందరూ బ్రహ్మపదమైన మోక్షాన్ని తప్పక పొందుతారు.

అలాంటి పరమపవిత్రమైన వేంకటాచలక్షేత్రంలో శ్రీనివాస ప్రభువునకు ఉత్తర దిక్కున అతి సమీపంలో సర్వపాపాలను నశింప జేయడమే గాక సర్వ శుభాలను ప్రసాదించే "స్వామిపుష్కరిణి" అనే దివ్య సరోవరం ఉంది.

నీవు ఆ క్షేత్రానికి వెంటనే వెళ్లు. ఆ పర్వతంమీదవున్న శుభప్రదమైన స్వామిపుష్కరిణిలో సంకల్ప పూర్వకంగా భక్తి శ్రద్ధలతో స్నానం చేసిన పిదప ఆ పుష్కరిణికి వాయవ్యమూలలోవున్న శ్రీ ఆదివరాహస్వామివారిని సేవించు.

తదుపరి ఆ పుష్కరిణికి పశ్చిమ తీరాన ఆనందనిలయంలో కొలువై వుంటూ, శంఖ చక్రాదులతో, వనమాలాదులతో అలంకరింపబడి భక్తులకు భయాలను పోగొట్టి వరాలను ప్రసాదిస్తూ దివ్యదర్శనమిస్తూ వున్న శ్రీనివాసుణ్ణి పరమ విశ్వాసంతో సేవించుకో. నీ పాపాలను పోగొట్టుకో. ఈ విషయంలో ఎంత మాత్రం సందేహించవద్దు అని ఉపదేశించాడు.

మంత్రవైద్యుడగు కశ్యపుడు శాకల్యమునికి నమస్కరించి వెంటనే వేంకటాచల యాత్రకు వెళ్లినాడు. ఆ క్షేత్రంమీద వున్న "స్వామిపుష్కరిణి" పవిత్రజలాల్లో శాస్త్ర

విధిగా స్నానమాచరించి పాపవిముక్తుడై, పూర్వరీతిగానే జను లందరిచేత గౌరవింప బడినాడు" అంటూ పుష్కరిణీ మహత్మ్యాన్ని తెలుపుతూ సూతమహర్షి ఈ గాథను విన్నవారు విష్ణులోకంలో పూజింపబడతారని శౌనకాదులతో ఇంకా ఇలా అన్నాడు.

## నరకభయం తొలగుతుంది

స్వామి పుష్కరిణీ స్నానం వల్ల పవిత్రత చేకూరుతుంది. ఎవరైతే స్వామి పుష్కరిణిని కీర్తిస్తూ, స్తుతిస్తూ, పరమ భక్తి ప్రపత్తులతో అందులో స్నానం చేస్తారో వారికి తామిస్రం, అంధ తామిస్రం, మహారౌరవం, రౌరవం, కుంభీపాకం, కాలసూత్రం, అసిపత్రవనం........ అదిగా వున్న ఇరవై ఎనిమిది విధాలైన మహా నరకాలు తొలగుతాయి. ఈ మహానరకాలన్నీ ఊహించలేని, వర్ణించలేని, చెప్పలేని మహా పాపాలు చేయడంవల్ల కలుగుతాయి. అలాంటి మహాపాపాలన్నీ ఒక్క "స్వామి పుష్కరిణి" తీర్థ స్నానంమాత్రం చేతనే నశిస్తాయి. అందువల్ల ఇలాంటి పవిత్రమైన "స్వామి పుష్కరిణి" ని భక్తితో కీర్తించాలి. ఆ పావన జలాల్లో అత్యంత విశ్వాసంతో, భక్తి ప్రపత్తులతో స్నానం ఆచరించాలి, సేవించాలి. పరమ పుణ్యప్రదమైన "స్వామి పుష్కరిణి" ని ఏ మాత్రం అగౌరవించకూడదు. స్వామిపుష్కరిణీ మహత్మ్యాన్ని గూర్చి ఎంత మాత్రం సందేహించకూడదు. అంతేగాదు పరమభక్తి విశ్వాసాలతో వున్న వారికి కుశంకలను కలిగించ కూడదు. ఆ విశ్వాసాలన్నీ భ్రమ, అసత్యం అని అంటూ ఎవరైతే ఇతరులకు కూడా విశ్వాసాన్ని పోగొడతారో, వాళ్లు నికృష్టమైన పంది జన్మను పొంది వ్యర్థ జన్ములై వుంటూ -- పైచెప్పిన మహా నరకాలను పొందుతారు.

"అహో మౌర్ఖ్య మహోమౌర్ఖ్యం అహో మౌర్ఖ్యం ద్విజోత్తమాః
స్వామి తీర్థాభిధే తీర్థే సర్వ పాతక నాశనే.
అద్వైత జ్ఞానదే పుంసాం భుక్తి ముక్తి ప్రదాయిని
ఇష్ట కామ ప్రదే నిత్యం తథై వాజ్ఞాన నాశనే.
స్థితేఽ పి తద్విహాయాయం రమతేఽ న్యత్ర వై జనః
అహో మోహస్య మాహాత్మ్యం మయా వక్తుం నశక్యతే.
స్నాతస్య స్వామితీర్థే తు నాస్తికా ధ్భయ మస్తి వై
స్వామి తీర్థంచ పశ్యన్తి తత్ర స్నాంతి చ యే నరాః
స్తువంతి చ ప్రశంసంతి స్పృశంతి చ నమంతి చ

న పిబంతి హి తే స్తన్యం మాతౄణాం ద్విజపుంగవాః
ఏవం వః కథితం విప్రాః స్వామితీర్థస్య వైభవమ్
భుక్తి ముక్తి ప్రదం నౄణాం సర్వపాప నిబర్హణమ్."

"ఓ మహర్షులారా! మానవులు ఎంతో మూర్ఖులు, వారి మూర్ఖత్వం ఆశ్చర్య కరమైంది. ఎందుకంటే స్వామి పుష్కరిణీ తీర్థం సర్వ పాతకాలను నశింప చేస్తున్నది.

సర్వ చరాచరాలన్నీ బ్రహ్మాత్మకమే నన్న బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదిస్తూ, ఇహ లోకంలో భక్తిని, తదుపరి ముక్తిని ఇలాగ ఇహపర సుఖాలను అనుగ్రహించడమే గాక అజ్ఞాననాశినిగా స్వామి పుష్కరిణి ప్రసిద్ధికెక్కింది.

ఇలాంటి పుష్కరిణిని విడిచి పెట్టి ఇతరమైన వ్యర్థమైన విషయాల మీద మానవులు ఆసక్తిని కలిగి చర్చిస్తున్నారు. వారి అజ్ఞానం ఇంతటిది అని వర్ణించడానికి నాకు సాధ్యం కాదు.

స్వామి పుష్కరిణీ స్నానం నాస్తికులవల్ల కలిగే భయాన్ని పోగొడుతుంది. ఆ తీర్థాన్ని సేవించినవారు, ఆ తీర్థ జలాలలో స్నానం చేసినవారు, ఆ పుష్కరిణిని స్తుతించినవారు, పొగడినవారు, తాకినవారు లేదా నమస్కరించిన వారు....... ఇలాంటి వారందరూ మాతౄగర్భంలో తిరిగి పుట్టనే పుట్టరు. స్తన్యం తాగనే తాగరు. అనగా వారికి పునర్జన్మ వుండదు!

అందువల్ల, పండితులైన ఓ మునులారా! భక్తి ముక్తులను ప్రసాదించే టటువంటి, సర్వ పాపాలను పోగొట్టేటటువంటి పుణ్యప్రదమైన స్వామిపుష్కరిణీ వైభవాన్ని మీకు తెలియ జేశాను" అంటూ, సూత మహాముని శౌనకాదులతో ఇంకా ఇట్లా అన్నాడు.

## ధర్మగుప్తుని చరిత్ర

పూర్వం చంద్రవంశంలో నందుడు అనే రాజు ప్రసిద్ధుడై ప్రజారంజకంగా పాలిస్తూ వుండినాడు. అతనికి 'ధర్మగుప్తుడు' అనే పుత్రుడు కలిగాడు. కొంతకాలానికి అతనికి రాజ్యాన్ని ఇచ్చి, నందుడు తపోవనానికి వెళ్లాడు.

ధర్మగుప్తుడుకూడ సార్థక నామధేయుడై ప్రజలను ధర్మయుక్తంగా పాలిస్తూ తండ్రిని మించిన తనయుడై వర్ధిల్లినాడు. ఒకనాడు ధర్మగుప్తుడు వేటకు వెళ్లి

అడవిలో తిరుగుతుండగా చీకటిపడింది. ఆ రాత్రివేళ ఒక సింహం కంటబడి దానిచే తరుమబడి నాడు. ప్రాణభయం చేత ధర్మగుప్తుడు పరిగెత్తుతూ ఒక చెట్టుపైకి ఎక్కి కూర్చున్నాడు. అయితే ఆ చెట్టుపైన అంతకుముందే ఒక ఎలుగుబంటి వుండింది. దానిని చూచేటప్పటికి రాజుగారి గుండె గుభేలుమంది. అతని పరిస్థితి "ముందు నుయ్యి, వెనుక గొయ్యి" వలె భీతావహమై వుండింది.

ఇంతలో ఆ భల్లూకము మానవ భాషలో "రాజా! భయపడ వద్దు. ఈ రాత్రికి ఈ చెట్టుపైనే మనం ఇద్దరం విశ్రాంతి తీసుకొందాం. నీకు నావల్ల ఎలాంటి హాని కలుగదు. కనుక ఎలాంటి ఆందోళన లేకుండ ముందుగా అలసివున్న నీవు నిశ్చింతగా నిద్రపొమ్ము. చెట్టుక్రింద వున్న సింహంబారినుండి నిన్ను కంటికి రెప్పవలె కాపాడ తాను. ఆ తర్వాత నేను నిద్రపోతాను. నన్ను నీవు రక్షించవలసింది" అని పలికింది.

ధర్మగుప్తుడు నిశ్చింతగా నిద్ర పోయాడు. చెట్టు క్రింద కాచుకొనివున్న సింహం, ఎలుగుతో -- రాజును తనకు ఆహారంగా క్రిందికి పడత్రోయవలసిందిగా కోరింది. కాని ఎలుగు "నేను ఇతనికి అభయమిచ్చి వున్నాను. అతడు నన్ను పూర్తిగా నమ్మి వున్నాడు. నమ్మిన వారికి ద్రోహం చెయ్యరాదు. ద్రోహం తలపెట్టరాదు. అలాంటి వారికి నిష్కృతి లేదు. అందువల్ల నీవు నీ దురాశను వదలి వెళ్లిపోవలసింది" అని పలికింది. ఇంతలో రాజు మేల్కొన్నాడు. పిదప ఎలుగుబంటి నిద్ర కుపక్రమించింది. రాజు దానిని కాపాడుతూ వుండినాడు. యథాప్రకారంగా సింహం రాజుతో మాట్లాడుతూ "ఆ ఎలుగుబంటిని నాకు ఆహారంగా పడద్రోయవలసిం" దని అడిగింది. అంత రాజు ముందు వెనుక ఆలోచించకుండా నమ్మక ద్రోహంతో ఆ నిద్రలోవున్న ఎలుగును చెట్టు నుంచి త్రోసి వేసినాడు. ఇంతలో మేల్కొన్న భల్లూకం జారిపడకుండా గభాలున ఒక కొమ్మను పట్టుకొని పైకి వచ్చింది. కోపంతో-- "నమ్మకద్రోహీ! నిన్ను రక్షించిన పాపానికా నన్ను పడద్రోసినావు. నీలాంటి కృతఘ్నుడు తప్పక శిక్షింప బడవలసిందే. అందువల్ల నీవు మతి భ్రమించి పిచ్చివాడివై తిరగ వలసింది" అని శపించింది.

పిచ్చివాడై, ఏదేదో వదరుతూ, తిరుగుతూ వున్న ధర్మగుప్తుణ్ణి అతని మంత్రులు చూచారు. వారు ఆ పిచ్చి రాజును అడవిలో రేవానదీ తీరంలో తపస్సు చేసుకొంటున్న అతని తండ్రియగు నందుని దగ్గరకు తీసుకొని వెళ్లారు. ఆ నందరాజు కుమారుని వింతగాథను విని బాధపడుతూ జైమినిమహర్షి దగ్గరికి తీసుకొని వెళ్లి, పిచ్చి తొలగే ఉపాయాన్ని తెలుపవలసిందని ప్రాధేయపడినాడు. అంత జైమిని మహర్షి

దివ్యదృష్టితో పరికించి, "చేసిన మేలును మరవడమేగాక, మీదు మిక్కిలి నమ్మక ద్రోహం చేసిన ఫలితంగా శాపగ్రస్తుడయ్యా" డని చెపుతూ ఇంకా ఇలా అన్నాడు.

"సువర్ణముఖరీ తీరే వేంకటో నామ పర్వతే
సర్వపాపహరే పుణ్యే నానా ధాతు వినిర్మితే
స్వామిపుష్కరిణీ చేతి తీర్థమస్తి మహత్తరమ్
పవిత్రాణాం పవిత్రం హి మంగళానాం చ మంగళమ్.
శ్రుతి సిద్ధం మహాపుణ్యం బ్రహ్మహత్యాది శోధకమ్
నీత్వా తత్ర సుతం తేఽద్య స్నాపయస్వ మహామతే
ఉన్మాద స్తత్క్షణా దేవ తస్య నశ్యే న్నసంశయః."

పరమపావని అయిన సువర్ణ ముఖరీనదీ తీరంలో సర్వపాపహరమైన, పవిత్రమైన వేంకటాచలమనే క్షేత్రం వుంది.

ఆ దివ్య క్షేత్రంలో స్వామిపుష్కరిణి అనే తీర్థం వుంది. అది పవిత్రమైన వాటిల్లో అతి పవిత్రమైంది. మంగళప్రదమైన తీర్థాల్లో అత్యంత మంగళప్రదమైంది.

ఆ పుష్కరిణి వేదాల్లో సుప్రసిద్ధంగా పేర్కొనబడింది. ఆ పుణ్యతీర్థం బ్రహ్మహత్యాది దోషాలను పోగొడుతుంది. అందువల్ల నీ పుత్రుణ్ణి వేంకటాచలానికి తీసు కెళ్లు. అక్కడి 'స్వామిపుష్కరిణి' లో స్నానం చేయించు! వెంటనే మతి భ్రమ తొలగుతుంది. పిచ్చి కుదిరి మళ్లీ మామూలు మనిషి అవుతాడు.

జైమినిమహర్షి ఆదేశం మేరకు నందమహారాజు తన పుత్రుడైన ధర్మగుప్తుని స్వామిపుష్కరిణిలో స్నానం చేయించగానే స్వస్థుడయ్యాడు. పిదప వారు శ్రీవేంకటేశ్వర స్వామివారిని సేవించి కృతార్థులయ్యారు. ధర్మగుప్తుడు శ్రీ స్వామివారి అపారకరుణకు, స్వామిపుష్కరిణీ మాహాత్మ్యానికి ఆశ్చర్యపడి ఆనందంతో భక్తి ప్రపత్తులతో అనేక మొక్కులు చెల్లించి, వివిధ రకాలైన అన్నదాన, ధనదాన, గోదాన, భూదానాదులు నిర్వహించి తిరిగి రాజ్యం చేరుకొన్నాడు.

"ఏవం వః కథితా విప్రాః ధర్మగుప్త కథా శుభా
యస్యాః శ్రవణ మాత్రేణ బ్రహ్మ హత్యా వినశ్యతి"

మహర్షులారా! ఇప్పుడు నేను చెప్పిన ధర్మగుప్తుని గాథను వినిన వారికి బ్రహ్మహత్యాదోషంవల్ల కలిగిన పాపం నశిస్తుంది. అంటూ శౌనకుడు ఇలా కొనసాగించాడు.

"వేంకటాద్రౌ మహాపుణ్యే సర్వ పాతక నాశనే
స్వామిపుష్కరిణీ చేతి వర్తతే మంగళప్రదా
భో! భో! తపోధనాః సర్వే నైమిశారణ్య వాసినః.
స్వామితీర్థస్య మాహాత్మ్యం భూయోఽపి ప్రవదామ్యహమ్."

"సర్వ పాతకాలను నాశన మొనరించే వేంకటాద్రి క్షేత్రం మహా పుణ్యప్రద మైనదిగా ప్రసిద్ధి కెక్కింది. ఆ దివ్య ప్రదేశంలో మంగళప్రదములైన సకల కల్యాణ పరంపరలను కలిగించే "స్వామి పుష్కరిణి" అనే తీర్థ రాజం వర్ధిల్లుతూ వుంది కదా! పరమపవిత్రమైన నైమిశారణ్య క్షేత్రవాసులైన శౌనకాది మహామునులారా! మీకందరికీ ఆ స్వామిపుష్కరిణీ తీర్థం యొక్క మహత్త్వాన్ని మళ్లీ మళ్లీ ఇంకా ఇలా తెలుపుతున్నాను. చక్కగా వినవలసింది" అంటూ సూతమహర్షి వేంకటాచలంమీద శ్రీఆదివరాహస్వామివారు కొలువై వుండటం మున్నగు వివరాలతోపాటు స్వామి పుష్కరిణి మహిమలను గూర్చి ఇలా అన్నాడు.

## సుమతి గాథ

పూర్వం మహారాష్ట్రదేశంలో యజ్ఞదేవుడు అను విప్రుడు వుండినాడు. ఇతడు స్వపరభేదాలు చూపక, అందరియందు దయ గలిగి, నిత్యమూ శివకేశవులను ఆరాధించుచు ఉత్తముడైన బ్రాహ్మణునిగా పేరు గాంచినాడు. నిత్యమూ అతిథి అభ్యాగతుల సేవలో పునీతుడైన, ఆ పండితునికి లేక లేక 'సుమతి' అనే పుత్రుడు కలిగినాడు.

తండ్రికి తగిన పుత్రునిగా పెరిగి పెద్దవాడైన సుమతికి అందాలభరణి అయిన కన్యతో వివాహం అయింది.వారి సంసారం సుఖంగా చక్కగా సాగుతున్న తరుణం అది. "వినాశకాలే విపరీత బుద్ధిః" అన్నట్లుగా సుమతి చక్కని చుక్క అయిన భార్యను, అత్యంత ప్రేమగా చూచుకునే తల్లిదండ్రులను వదలిపెట్టి భోగలాలసుడై వేశ్యలమీది ఆసక్తితో ఉత్కళ దేశానికి సంచారం వెళ్లాడు.

ఆ సమయంలో నవ యౌవనంతో మిసమిసలాడుతూ వున్న ఒక బోయకన్నె అతని కంటబడింది. ఆ వారిజేక్షణ వాలుచూపులకు వశుడైన సుమతి ఆమె వెంటబడినాడు. ప్రేమ మూర్తులైన తల్లిదండ్రులను, సున్నిత మనస్కురాలైన భార్యను,

చివరకు తను పుట్టిన గ్రామాన్ని మరచిపోయినాడు. పూర్తిగా ఆ వేశ్యాంగన ఇంటనే స్థిరపడినాడు. ఆ బోయవనిత ఈసడించుకొన్నా, అమే తన సర్వస్వమని భావిస్తూ రాత్రింబవళ్లూ ఆమె కొంగు నంటివుంటూ, ఆ విప్రుడు ఆ యువతి సహవాసంతో మద్యమాంసాదులను సేవిస్తూ, తింటూ, తిరుగుతూ భ్రష్టుడైనాడు. అతని అలవాట్లే గాక వేష భాషలు కూడ పూర్తిగా మారి పోయినాయి. చివరకు తాను ఒక విప్రుడన్న విషయాన్ని పూర్తిగా మరచిపోయి, బోయవానిగానే తిరుగుతూ వుండినాడు.

ఆ భ్రష్ట బ్రాహ్మణుడు ధనార్జన కోసం ఒకనాడు ఇతర బోయవాళ్లతో కలిసి దొంగతనం చేయడానికై బయలుదేరినాడు. అందుకోసం ధనవంతు డైన ఒక విప్రుని ఇంట ప్రవేశించినాడు. ఇంతలో ఆ గృహ యజమాని ఎదురుపడి పోరాడే అంతలో సుమతి, ఆ విప్రుని తన వాడియైన ఖడ్గంతో హత్యచేసి, ఆ ఇంటవున్న ధనాన్ని దోచుకొని పోతూ వుండినాడు. అప్పుడు భయంకర స్వరూపంతో "బ్రహ్మ హత్య"

*నీలవస్త్రధరా, భీమా భృశం రక్త శిరోరుహా*
*గర్జన్తీ సాట్టహాసం కంప యంతీ చ రోదసీ.*

నల్లని వస్త్రాలను ధరించి భయాన్ని కలిగించే విరబోసుకున్న ఎర్రని జుట్టుతోను, భూమి ఆకాశాలు కంపించేట్లుగా పక పక మని వికటాట్ట హాసం చేస్తూ అతని వెంటబడింది.

ఆ విప్రుడు తన వెంటబడి తరుముతున్న బ్రహ్మహత్యను చూచి భయ పడుతూ పరుగిడసాగినాడు. అయినా అది అతనిని వెంబడిస్తూ వుండింది. ఇలా ఆ భ్రష్టబ్రాహ్మణుడు తిరుగుతూ తిరుగుతూ చివరకు తన స్వగ్రామాన్ని చేరుకొని అత్యంత భయంతో తండ్రి యజ్ఞదేవుని శరణు వేడినాడు. ఇంతకాలం ఎక్కడ వున్నాడో తెలియక అపరిమితమైన కన్న ప్రేమతో బాధపడుతుండిన తండ్రికి కన్న కొడుకును చూచిన వెంటనే ప్రాణం లేచి వచ్చింది. అక్కున చేర్చుకున్నాడు. ఏ మాత్రం భయపడవద్దని పలుకుతూ ప్రేమతో ఆదరించినాడు.

ఇంతలో అక్కడికి చేరుకొన్న బ్రహ్మహత్యా దోషం వికృతరూపంతో చిందులేస్తూ--

"ఓ స్వామీ! యజ్ఞదేవా! సర్వ విధాలా భ్రష్టుడైన నీ పుత్రుణ్ణి నీవు ఆదరించవద్దు. వీడు సురాపానం చేశాడు. మాంసాదుల్ని భక్షించాడు. మీదు మిక్కిలి

బ్రాహ్మణున్ని హత్య చేశాడు. ఇతడు మాతృద్రోహి, పితృ ద్రోహి. అంత మాత్రమే గాదు. కన్న తల్లిదండ్రులను విడిచిపెట్టి, తానే సర్వస్వం అని నమ్ముకొని వెంట వచ్చిన భార్యను విడిచిపెట్టి వేశ్యాలోలుడైన మహా పాపాత్ముడు వీడు. అలాంటి వీణ్ణి నీవు స్వీకరించినట్లయితే నేను నిన్ను, నీ భార్యను, వీడి భార్యను.... ఇలా వంశాన్ని పూర్తిగా మింగివేసి సర్వ నాశనం చేస్తాను. వీడి వల్ల నీ వంశాన్ని పాడుచేసికోవద్దు. అందువల్ల బాగా ఆలోచించుకొని ఈ దుష్టుణ్ని ఇప్పుడే విడిచిపెట్టు. మిమ్మల్ని వదలి పెట్టి వీణ్ణి మాత్రం మింగుతాను" అని కర్కశంగా పలికింది.

వెంటనే యజ్ఞదేవుడు "వీడు ఎంతటి పాపాలను చేసి చెడిపోయి నప్పటికీ, ఇతను నా పుత్రుడు కదా! వీని మీద ప్రేమను ఎలా చంపుకోగలను. కనుక వీణ్ణి నేను ఎలా వదలగలను" అని పలుకునంతలో బ్రహ్మహత్య మిక్కిలి కోపంతో యజ్ఞదేవుడు చూస్తూ వుండగానే 'సుమతి' ని గట్టిగా కొట్టింది. ఆ సుమతి తండ్రిని చూస్తూ దీనాతి దీనంగా బిగ్గరగా ఏడుస్తూ విలపించినాడు.

అతని ఈ స్థితికి అతని తల్లిదండ్రులు, భార్య ఎంతో బాధ పడుతుండగా ఇంతలో అక్కడికి రుద్రుని అంశతో జన్మించినవాడు, పరమయోగి, మునీశ్వరుడు అయిన దుర్వాసమహర్షి వచ్చినాడు.

ఆ మహర్షిని చూచి యజ్ఞదేవుడు అనేక విధాలుగా ప్రార్థిస్తూ, తన పుత్రుని చూపించి, వీడొక్కడే నాకు సంతానం. వీడు చనిపోతే నా వంశం పూర్తిగా అంతరించి పోతుంది. ఎలాగైనా సరే, నా పుత్రుని బ్రహ్మహత్య నుండి రక్షించవలసిందని ప్రాధేయపడినాడు.

అంత దుర్వాసమహర్షి అనేక విధాలుగా ఆలోచించి "యజ్ఞదేవా! నీ పుత్రుడు చేసిన పాపం ఇంతింత అని చెప్పలేనిది. దానికి ఎన్ని ప్రాయశ్చిత్తాలు చేసుకొన్నా విముక్తి అసాధ్యం. అయినా ఒకే ఒక మార్గం కనపడుతున్నది. అత్యంత జాగ్రత్తగా వినవలసింది.

మహా పవిత్రమైనదియు, సర్వ విధాలైన మహా పాపాల్ని నశింపజేసే దివ్య క్షేత్రం ఒకటి ఈ భూమండలంపైన వుంది. అదే శ్రీ వేంకటాచలం. ఆ పుణ్యస్థలంలో సర్వ శుభ పరంపరలను ప్రసాదించే 'స్వామిపుష్కరిణి' అనే తీర్థం వెలసివుంది. ఆ

కోనేటి పవిత్ర జలాల్లో నీ పుత్రుణ్ణి స్నానం చేయించి నట్లయితే నీ పుత్రుని వెంటబడిన బ్రహ్మహత్యాదోషం క్షణంలో తప్పక నశిస్తుంది.

మహావృక్షాల్ని కూల్చే గండ్రగొడ్డలివలె "స్వామిపుష్కరిణి" పాతకాల్ని నశింపజేస్తుంది. ఏ మాత్రం సందేహించవద్దు. అతి శీఘ్రంగా వేంకటాచలానికి వెళ్లండి. అచటి స్వామిపుష్కరిణి తీర్థాన్ని సేవించుకోండి" అంటూ ఆశీర్వదించి పంపినాడు.

వెంటనే యజ్ఞదేవుడు శ్రీ వేంకటేశుని సన్నిధికి వెళ్లి ముందుగా "స్వామి పుష్కరిణి" లో తన పుత్రుణ్ణి స్నానం చేయించాడు. అంతలో ఆకాశవాణి మధురమైన వాక్కులతో ఇలా పలికింది.

"ఓ యజ్ఞదేవా! మహాభాగా! నీ పుత్రుడు బ్రహ్మహత్యాపాపం నుండి విముక్తుడై పరమ పవిత్రుడైనాడు. ఇందులో ఎంత మాత్రం నీవు సంశయించవలసిన పనిలేదు."

పుటం పెట్టిన బంగారం వలె పాపవిముక్తుడైన పుత్రునితో పాటు వేంకటా చలపతిని దర్శించి, యజ్ఞదేవుడు స్వగ్రామం చేరుకొన్నాడు. అందువల్లే--

*"ఏవం ప్రభావం తత్తీర్థం పాపవృక్ష కుఠారకమ్*
*ఏవం వః కథితం విప్రాః ఇతిహాసం పురాతనమ్*
*శృణ్వతాం పఠతాం చాపి వాజపేయ ఫలం లభేత్."*

మహావృక్షాల్ని కూల్చే గండ్ర గొడ్డలివలె, స్వామిపుష్కరిణి మహా పాతకాల్ని నశింపజేస్తుంది. అత్యంత ప్రాచీనమైన దివ్యగాథను మీకు వినిపించాను. ఓ శౌనకాదులారా! పరమ పవిత్రమైన ఈ కథను విన్నవారికీ, చదివినవారికీ అత్యంత సులభంగా వాజపేయయాగం చేసినంత ఫలితం చేకూరుతుంది" అంటూ సూతమహర్షి ఇంకా ఇలా అన్నాడు.

## సమస్త తీర్థయాత్రా ఫలం

ఒకానొకప్పుడు మార్కండేయమహాముని బ్రహ్మదేవునిగూర్చి అత్యంత భక్తిశ్రద్ధలతో తపస్సు చేసినాడు. ఆయన తపశ్శక్తికి సంతసించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై "మునీంద్రా! ఏ ఉద్దేశంతో తపమాచరిస్తున్నావు. అది నెరవేరుస్తాను. కోరుకో" అని పలికినాడు. అంత మార్కండేయుడు "బ్రహ్మదేవా! విశ్వంలో వున్న

సమస్త తీర్థాలను అన్నింటిని సేవించే శక్తిని ప్రసాదించవలసింది" అని వర మడిగినాడు.

బ్రహ్మ దేవుడు వెంటనే "మహర్షీ! నీ కోరిక ఎన్ని వేల ఏండ్ల కైనా తీరదుగాక తీరదు. అది నీకే గాదు. నాకును, రుద్రునికి సైతము సాధ్యం కాదు. అయినా చింతించవలసిన పని లేదు. సర్వ తీర్థయాత్రాఫలం సిద్ధించు నట్లుగా ఒక ఉపాయం చెబుతాను. జాగ్రత్తగా విను.

"అస్తి శ్రీ వేంకటోనామ ప్రథితః పర్వతోత్తమః
ద్రవిడేషు మహాపుణ్యః సేవిత స్త్రిదశై ర్గిరిః
తస్య శృంగే సుమహతీ పుణ్యా పాపవినాశినీ
స్వామిపుష్కరిణీ నామ సరసీ సర్వ కామదా."

ఇక్కడికి సుమారు రెండు వందల యోజనాల దూరంలో సకల దేవతలచేత సేవింపబడుతున్న శ్రీ వేంకటం అనే పర్వతరాజం విరాజిల్లుతోంది. అది మహాపుణ్య ప్రదమైంది.

ఆ పర్వత శిఖరంపైన "స్వామి పుష్కరిణీ" అనే పేరుగల అద్భుతమైన సరస్సు వుంది. అది అన్ని పాపాలను పోగొట్టడమేగాక, పుణ్యాలను పెంచుతూ, సర్వ కోరికలను తీరుస్తుంది కూడా.

"ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యాం అరుణోదయే
ఆయాన్తి సర్వ తీర్థాని స్వామిపుష్కరిణీ జలే."

ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో అనగా మార్గశిరమాసం శుక్ల పక్షంలో ద్వాదశీ తిథిదినంనాడు ఉషోదయాన ముల్లోకాల్లోని తీర్థాలన్నీ ఈ స్వామిపుష్కరిణిని అవహిస్తాయి. ఎందుకంటే ఆ తీర్థాలు అన్నీ, ఎందరో పాపాత్ములు తమలో మునిగినందువల్ల అపవిత్రాలై వుంటూ, తమకు సంక్రమించిన పాపాలను ఆ రోజు స్వామిపుష్కరిణిలో మునిగి పోగొట్టు కుంటాయట! అందువల్ల "ఓ మార్కండేయ మహర్షీ! నీవు కూడ శుభప్రదమైన ఆ విశేషదినాన వేంకటాచలం మీది స్వామిపుష్కరిణీ తీర్థంలో మునక లిడవలసింది. తద్వారా సమస్త తీర్థాలను సేవించిన ఫలితం నీకు దక్కుతుం" దని బ్రహ్మదేవుడు ఆదేశించినాడు.

ఇలాగ చతుర్ముఖబ్రహ్మ దేవుడు ఆనతిచ్చిన ప్రకారం మార్కండేయమహర్షి వేంకటాచల క్షేత్రానికి వెళ్లి మార్గశీర్ష శుక్లద్వాదశి నాటి అరుణోదయ వేళలో స్వామిపుష్కరిణిలో స్నానం చేశాడు. తదుపరి శ్రీ వేంకటాచలపతిని అనేక విధాల ప్రార్థించి కృతార్థుడై వెడలినాడని శౌనకాదులకు చెబుతూ సూతుడు స్వామిపుష్కరిణిని గూర్చి ఇంకా ఇలా తెలియజేశాడు.

## సరస్వతీ దేవి

పూర్వం ఒకప్పుడు సరస్వతీ దేవి గంగానది మున్నగు మహానదుల కంటే ఉన్నతమైన, మహిమాన్వితమైన తీర్థరాజంగా పేరు పొందాలని, గౌరవాలను పొందాలని తలంచి, సరస్వతీనదిగా ప్రవహింప సాగింది. అదే సమయంలో పులస్త్యుడను మహర్షి తపమాచరించుటకు ఆ నదీ తీర ప్రాంతానికి వచ్చాడు. అచటికి వచ్చిన ఆ మహర్షిని చూచి కూడ సరస్వతీనది, పుత్ర ప్రభావంతో పూజించలేదు. కనీసం పలకరించనైనా లేదు.

*"తతస్తాం కుపితః ప్రాహ యా తే కాంక్షా సరస్వతి*
*తవ సా విఫలా భూయాత్ నదీ రూపేణ సర్వదా.*

*గుణ సామాన్య భావేఽపి విష్ణుపాద ప్రభావతః*
*తవాధికేన యశసా భవిష్యతి సరిద్వరా*
*తీర్థోత్కృష్టా సైవ భూయాత్ భువి గంగాఖ్యయా శుభా."*

అందులకు పులస్త్య మహర్షి మిక్కిలి కోపిస్తూ "ఓ సరస్వతీ! నీవు గంగాది నదులకంటే ప్రసిద్ధురాలివి కావాలన్న నీ కోరిక ఫలించదుగాక ఫలించదు. నీకు ఇతర నదులన్నింటి వలె సాధారణ ధర్మం నీయందు వున్నప్పటికీ, శ్రీ మహావిష్ణువు యొక్క పాదాలనుండి ఉద్భవించిన పవిత్ర గంగానది మాత్రమే అన్ని నదులకంటే గొప్పదిగా పేరు పొందుతుంది" అని శపించినాడు.

ఈ ముని ఇచ్చిన శాపానికి సరస్వతీనది కుపితురాలై ఇలా అన్నది. ఓ మహర్షీ! తాపసివై వుండి కూడ తామసంతో నీవు నిష్కారణంగా నన్ను శపించినావు. అందువల్ల--

*"రాక్షస స్తే భవే ద్వంశో విష్ణో ర్రప్రియ కారకః".*

"శ్రీమహావిష్ణువునకు అప్రియులైన రాక్షసులతో నీ వంశం వర్ధిల్లు గాక!" అని తిరిగి శాప మిచ్చింది. వెంటనే పులస్త్యుడు తొందరపాటుతో కూడిన తన అవివేకానికి చింతిస్తూ, తనను నిండు దయతో క్షమించవలసిందని, ఆమె ఇచ్చిన శాపాన్ని మరల్చవలసిందని అనేక విధాలుగా ప్రార్థించినాడు. పశ్చాత్తాపంతో వినయంగా ప్రాధేయపడుతున్న పులస్త్యుని చూచి సరస్వతీనది క్షమాబుద్ధితో నీ వంశంలో చివరివాడు మాత్రం మహావిష్ణువునకు అత్యంత ప్రీతికారకుడై, భక్తుడై విభీషణుడనే పేరుతో చిరంజీవిగా వర్ధిల్లగలడని వరమిచ్చింది.

పిదప సరస్వతీనది నదు లన్నింటిలో కూడ శ్రేష్ఠత్వాన్ని, ఉన్నత మైన స్థానాన్ని పొందగోరుతూ శ్రీ మహావిష్ణువును గూర్చి తీవ్రంగా తపస్సు చేసింది. ఆమె పట్టుదలకు, భక్తికీ మెచ్చిన విష్ణుదేవుడు ప్రత్యక్షమై కావలసిన వరం ప్రసాదిస్తాను కోరుకోమని చెప్పాడు. వెంటనే సరస్వతీనది పులస్త్యబ్రహ్మ ఇచ్చిన శాపంవల్ల దీనత్వాన్ని పొందిన తనకు తిరిగి నదీ శ్రేష్ఠత్వాన్ని ప్రసాదించవలసిందిగా ప్రార్థించింది.

వెంటనే విష్ణుభగవానుడు 'పులస్త్య బ్రహ్మ ఇచ్చిన శాపంవల్ల నదీ రూపంలో శ్రేష్ఠత్వాన్ని పొందలేక పోయినా, పుష్కరిణీ రూపంలో నీవు పరమోన్నత మైన స్థానాన్ని పొందడమే గాక అత్యంత పవిత్రమైన తీర్థరాజంగా విరాజిల్లునట్లుగా నీకు వరమిస్తు న్నాను' అంటూ ఇలా అన్నాడు.

"అతః శేషగిరిం గచ్ఛవాసార్థం యామి తం గిరిమ్
గిరే ర్దక్షిణభాగే తు మూర్ధ దేశే సుఖం వస
స్వామిపుష్కరిణీ నామ్నా వసేయం తవ దక్షిణే.
త్రిసః కోట్యర్థ కోటీ చ తీర్థాని భువనత్రయే
స్వస్వ పాపవిమోక్షార్థం యాచయిష్యన్తి మాం శుభే.
తేషాం పాప విమోక్షార్థం త్వయి స్నానం దదామ్యహమ్
ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే
స్నానార్థ మాగతం తీర్థ జాలం ప్రేష్యత్వ మాప్నుయాత్
తీర్థాధిరాజ్యే తత్తీర్థ జాలం త్వామభిషేక్షతి."

'నీవు వెంటనే ఇక్కడినుంచి శేషాచల దివ్యక్షేత్రానికి వెళ్లు. ఆ పుణ్యస్థలం మీద "స్వామి పుష్కరిణి" అనే పేరుతో పరమపవిత్రమైన తీర్థంగా వెలసివుండు.

నేను అక్కడికి వచ్చి నీకు దక్షిణ తీరంలో కొలువై వుంటాను. అంతేకాదు. ముల్లోకాల్లో వెలసివున్న మూడున్నర కోట్ల తీర్థాలన్నీ ఆయా సందర్భాల్లో ఆయా భక్తుల వల్ల తమకు సంక్రమించిన పాపాలన్నింటిని పోగొట్టుకొనుటకై నావద్దకు వచ్చి నన్ను ప్రార్థిస్తాయి. ఆ సమయంలో వాటి పాపవిముక్తికై, ప్రతి సంవత్సరం మార్గశిర మాసంలో శుక్ల పక్షంలోని ద్వాదశినాటి అరుణోదయ వేళలో "స్వామి పుష్కరిణి" అని పిలువబడే నీలో స్నానం చేయవలసిందిగా ఆ తీర్థా లన్నింటిని ఆదేశిస్తాను. ఆ శుభ సమయంలో ఆ తీర్థాలు అన్నీ నిన్ను చేరి కీర్తిస్తూ, నిన్ను అభిషేకిస్తూ, నీలో స్నానమాడి పునీతములవుతాయి' అని అంటూ విష్ణు భగవానుడు సరస్వతీనదికి వరాన్ని ప్రసాదించినాడు. అలా వెలసిన తీర్థరాజమే "స్వామి పుష్కరిణి" అని ప్రసిద్ధమైన పేరు పొందింది. ఇలా ఎన్నెన్నో విధాల వింత వింత గాథలతో, అద్భుత వృత్తాంతాలతో విరాజిల్లుతూ వున్న ఈ స్వామిపుష్కరిణి మధ్య భాగంలో సుమారు తొమ్మిది పవిత్ర తీర్థాలున్నాయి. వాటి పేర్లను, వాటి మహిమలను కూడా వినండి అంటూ సూత మహర్షి ఇలా కొనసాగించాడు.

## స్వామి పుష్కరిణిలోని తొమ్మిది తీర్థాలు

ఇంతవరకు ఎన్నో విధాలుగా, ఎన్నెన్నో ఆశ్చర్యకరమైన విషయాలను, అద్భుత విశేషాలను తెలుసుకున్న శ్రీస్వామి పుష్కరిణి యొక్క మధ్య భాగంలో కూడ అనేకమైన పుణ్యతీర్థాలు వెలసి వున్నాయి. వాటిలో అత్యంత ప్రధానంగా చెప్పుకోదగినవి తొమ్మిది తీర్థాలు.

## కుబేర తీర్థం

"ఉత్తరే ధనదం తీర్థం ధనదేన వినిర్మితమ్
యత్ర స్నాత్వాఽఘ నిర్ముక్తో ధనసంపద మాప్నుయాత్."

స్వామిపుష్కరిణిలో ఉత్తరాన ధనదతీర్థం నెలకొనివుంది. ఈ తీర్థాన్ని కుబేరుడు నిర్మించాడట. అందువల్లే ఇది కుబేరతీర్థం అని కూడా పిలువ బడుతున్నది. దీనిలో స్నానమాచరిస్తే చాలు. సర్వపాపాలు నశించడమేగాక ధనధాన్యాది సంపదలన్నీ సంప్రాప్తిస్తాయి.

## గాలవతీర్థం

*"ఐశాన్యాం గాలవంతీర్థం గాలవేన వినిర్మితమ్*
*తత్ర స్నాత్వా చ పీత్వాచ భుక్తిం ముక్తిం చ విన్దతి."*

స్వామిపుష్కరిణిలో ఈశాన్య భాగంలో గాలవతీర్థం వుంది. ఇది గాలవ మహర్షిచే నిర్మితమైంది. ఈ భాగంలోని తీర్థాన్ని త్రాగినా, లేదా ఇందులో స్నానంచేసినా ఇహ, పర సుఖాలు రెండూ ఒనగూడుతాయి.

## మార్కండేయ తీర్థం

*"మార్కండేయం పూర్వభాగే మార్కండేయ వినిర్మితమ్*
*తత్ర స్నాన్తి నరా యేతు తేషా మాయుః ప్రవర్ధతే."*

స్వామిపుష్కరిణిలో తూర్పు భాగంలో మార్కండేయ మహర్షి నిర్మితమైన మార్కండేయ తీర్థం వుంది. ఇక్కడ స్నానం చేసిన మానవులకు దీర్ఘాయుస్సు కలుగుతుంది.

## అగ్ని తీర్థం - యమతీర్థం

*"అగ్నినా నిర్మితం తీర్థ మాగ్నేయ్యాం పాపమోచనమ్*
*దక్షిణే యమతీర్థం తు నరకోత్తార కారణమ్."*

వేంకటాచలంమీది స్వామి పుష్కరిణిలో ఆగ్నేయమూలలో అగ్ని దేవునిచే స్థాపించబడిన ఆగ్నేయ తీర్థం వుంది. ఇందులో స్నానం చేసినట్లయితే పాపాలనుండి విముక్తి లభిస్తుంది.

అలాగే దక్షిణ భాగంలో యమతీర్థం వుంది. ఈ తీర్థంలో స్నానం చేసిన మానవునికి నరక బాధ తప్పుతుంది.

## వసిష్ఠ తీర్థం

*"వశిష్ఠ నిర్మితం తీర్థం రాక్షసం త్వృణ మోచనమ్."*

వశిష్ఠ మహర్షిచే నైరృతి దిశలో నిర్మింపబడిన 'వసిష్ఠ తీర్థం' కూడా ఈ స్వామి పుష్కరిణిలో భాగంగానే ఆవిర్భవించింది. ఈ తీర్థ స్నానంవల్ల తీవ్రమైన అప్పుల బాధలు తొలగుతాయి.

## వరుణతీర్థం - వాయుతీర్థం

"వారుణే వాయుతీర్థం చ సద్యః కైవల్యదాయకమ్."

అలాగే ఈ స్వామి పుష్కరిణిలో పడమట వరుణతీర్థం మరియు వాయుమూలన వాయుతీర్థం కూడా వున్నాయి. ఈ తీర్థాలు ముక్తిని కలిగిస్తాయి.

## సరస్వతీ తీర్థం

"మధ్యే సరస్వతీ తీర్థం మహాపాతక నాశనమ్
య ఏషు నవతీర్థేషు స్నాన మేక దినే నరః."

ఇక స్వామి పుష్కరిణి మధ్యభాగంలో మహా పాతకాలను నాశనం చేసేటటువంటి సరస్వతీ తీర్థం వుంది. ఇలా "స్వామిపుష్కరిణి" అని ప్రసిద్ధి చెందిన పవిత్రమైన కోనేటిలో తొమ్మిది తీర్థాలు నెలకొనివున్నాయి.

"య యేషు నవ తీర్థేషు స్నాన మేక దినే నరః.
కృత్వా పశ్యే చ్ఛ్రీనివాసం నపునర్జాయతే తు సః
స్వామిపుష్కరిణీ స్నానం శ్రీనివాసస్య దర్శనమ్.
సహస్రనామపఠనం నాల్పస్య తపసః ఫలమ్
అస్నాతు ర్నవతీర్థేషు వరాహం చా ప్యపశ్యతః.
సర్వం నిష్ఫలతాం యాతి శ్రీనివాసో న తుష్యతి
ఫలం ధర్మాదికం చైవ న యచ్ఛతి నృణాం విభుః."

ఈ తొమ్మిది తీర్థాలలో ఒకే రోజున స్నానం చేసిన తర్వాత స్వామి పుష్కరిణికి దక్షిణ తీరంలో కొలువై వున్న శ్రీనివాస భగవానుని దర్శనం చేసుకొన్న మానవునికి పునర్జన్మ వుండదు. అనగా మోక్షం కలుగుతుంది.

స్వామిపుష్కరిణీ స్నానం, శ్రీ వేంకటేశ్వరస్వామివారిదర్శనం, విష్ణు సహస్రనామ పారాయణం - ఈ మూడు కార్యాలు అత్యంత ఉత్తమమైన తపః ఫలాన్ని కలిగిస్తాయి. అందువల్ల తొమ్మిది తీర్థాల నెలవుగా వున్న స్వామి పుష్కరిణిలో తప్పక స్నానం చేయాలి. ఆ తర్వాత అక్కడ వున్న శ్రీ వరాహస్వామివారిని దర్శించాలి. అలా చేయని వాడు ఆ క్షేత్రంలో ఎన్ని సేవలు చేసినప్పటికీ, అవన్నీ నిష్ఫలాలే అవుతున్నాయి. నిరుపయోగములు గానే మిగులుతున్నాయి.

కనుకనే వేంకటాచలం మీది ఈ "స్వామిపుష్కరిణి"ని ఒకానొకప్పుడు దశరథమహారాజు సేవించుకొని సంతానాన్ని పొందాడు. పిదప శ్రీరామచంద్రుడు కూడా ఈ క్షేత్రాన్ని దర్శించికొని రావణాసురునిచేత అపహరింపబడిన సీతాదేవిని పొందాడు.

ఇలాగ ఎంతో మహిమాన్వితమైన స్వామిపుష్కరిణి గొప్పదనాన్ని ఎంత చెప్పు కున్నా తక్కువగానే వుంటుంది. అది అనంతం. అందువల్ల ప్రస్తుతం తర్వాతి వృత్తాంతాల్ని తెలుసుకుందాం. ప్రసంగవశాన స్వామి పుష్కరిణీ మహత్త్వాన్ని గూర్చి తెలిపే విషయాలు ఇంకా ఏవైనా వుంటే ఆయా సందర్భాల్లో చర్చించుకుందాం.

## ఏడు కొండలు

"కృతే వృషాద్రిం వక్ష్యన్తి త్రేతాయా మంజనాచలమ్
ద్వాపరే శేష శైలేతి కలౌ శ్రీ వేంకటాచలమ్
నామాని యుగభేదేన శైలస్యాస్య భవన్తి హి."

కృతయుగంలో 'వృషాద్రి' అనీ, త్రేతాయుగంలో 'అంజనాద్రి' అనీ, ద్వాపరయుగంలో 'శేషశైలం' అనీ, అలాగే కలియుగంలో 'వేంకటాద్రి' అనీ ప్రసిద్ధమైన నామాలతో వెలుగొందిన క్షేత్రాన్ని గూర్చి సూతుడు శౌనకాది మహర్షులకు వేంకటాచల క్షేత్ర మాహాత్మ్యాన్ని గూర్చి వివరించాడు.

ఈ విధంగా అనేకానేక విధాలుగా, ఎన్నెన్నో మహా పాతకాలను దహించే దివ్యాతిదివ్యమైన పుణ్యక్షేత్రం కాబట్టి దీనికి వేంకటాచలం అనే సార్థక నామధేయం ఏర్పడింది.

పరమపవిత్రమైన ఈ పర్వత సానువులు ఎల్లప్పుడూ పచ్చని చెట్లతో, పూపొద రిండ్లతో పవిత్ర పరిమళ ఝురులతో నిండి వుంటాయి. ఎక్కడ చూచినా తామర కొలనులు, ఆ కొలనులపై తిరుగాడే తుమ్మెదలతో నేత్రపర్వంగా దర్శనమిస్తూ రమణీయమైన ప్రకృతి సౌందర్యంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అంతేకాదు పనస, అరటివంటి పండ్ల తోటలతో ప్రకాశిస్తూ వుంటుంది ఈ క్షేత్రం.

ఎన్నో మృగాలకు, పక్షి సంతతులకు నిలయం ఈ కొండ. ఎందరో మహర్షులు, మరెందరో యోగులు, దేవతలూ ఈ సప్తగిరి సానువులలో జంతు రూపాల్లో సంచరిస్తుంటారు. అందువల్లే ఈ క్షేత్రంలో జంతువుల, పక్షుల అరుపులే వేదసారమైన

శ్రీహరి సంకీర్తనలు! పవిత్రమైన ఈ పర్వతంలోని రాళ్లగుట్టలన్నీ రత్నరాసులే! చింతామణులే! ఇందలి గుహలు సకల సంపదలకు స్థావరాలు.

పూర్వం మేరుపర్వతం బ్రహ్మదేవుని ప్రార్థించిందట! నా పేరు భూలోకంలో చిరస్థాయిగా వుండేట్లుగా వరమిమ్మని. అందువల్లే ఆ మేరువే 'బంగారు కొండ' గా ప్రసిద్ధి చెందునట్లుగా నవరత్నాలను, కల్పవృక్షాలను నారులుగా పోసి ఈ పర్వతరాజాన్ని ఏర్పరచి, బ్రహ్మాండ భాండ కుక్షు దీన్నే ఆధారంగా చేశాడు బ్రహ్మదేవుడు.

ఇలాంటి పరమ పావనమైన దివ్య క్షేత్రంలో ఒక చోట బ్రహ్మాది దేవతలు, మరొకచోట పరమ భాగవతోత్తములైన ఋషులు, యోగులు, వేదాలు, సూర్యచంద్రాది నవగ్రహదేవతలు, సకల తీర్థాలు, సర్వ పర్వతాలు ఇలా ఎందరెందరో మంచి మనస్సులతో తపస్సు చేస్తుంటారు. తమ కోరికలు తీర్చుకోవడంతో పాటు లోక కల్యాణంకోసం వీరంతా ప్రార్థిస్తుంటారు.

ఇక శ్రీ శుకయోగీంద్రుడు, బ్రహ్మాదులు అచటి రామచిలుకలతో కలిసి శ్రుతులను చక్కగా గానం చేస్తుండగా ఈ మంగళ ధ్వనులతో ఈ పర్వత సానువులు ప్రతిధ్వనిస్తూ వుంటాయి. మహా యోగీశ్వరులు నెమళ్లతోపాటుగా 'తకధిమ్మని' నాట్యం చేస్తుంటారు. కోయిలలచేత, గోరు వంకలచేత సమస్త పురాణాలను వింటూ వుంటారు. ఇలా సర్వ విద్యలకు, సమస్త కళలకు నిలయమై ప్రకాశిస్తూ వుంటుంది ఈ క్షేత్రరాజం.

వేంకటాచలంలోని స్వామిపుష్కరిణి ఇత్యాదిగా వెలసివున్న అనేకానేకాది తీర్థాలు, పుష్కరిణులు పామరులను, అమరులుగా చేస్తుంటాయి. భక్తుల పాప సమూహాలను నాశనం చెయ్యడమేగాక సమస్త కోరికలను తీరుస్తుంటాయి. కనుకనే ఈ క్షేత్రం కామితఫలదాయినిగా ప్రసిద్ధి కెక్కింది.

భూలోక వైకుంఠంగా వెలసిన ఈ శేషాచల క్షేత్రంలోనే కొంతకాలం వుంటూ లోకాలనన్నింటిని రక్షించ వలసిందని బ్రహ్మాదిదేవతలు ప్రార్థించగా వారి ప్రార్థనను అంగీకరించి శ్రీదేవీ భూదేవీ సమేతుడై శ్రీమహావిష్ణువు ఇక్కడ నిలిచాడు. ఈ పుణ్యక్షేత్రానికి అనేకమైన పేర్లు వున్నాయి. నింగిలోని నక్షత్రాలను, నేలలోని ధూళి రేణువులను లెక్కించవచ్చు నేమోకానీ, ఈ క్షేత్రానికిగల మహిమలను పేర్లను లెక్కించటం సాధ్యం కాదు. అయినప్పటికీ ఈ గిరియొక్క మాహాత్మ్య వైభవాన్ని చాటే కొన్ని నామాలను గురించి పరిశీలిద్దాం.

సంపదలను కోరుతూ సేవించే వారిని 'చింతామణి' వలె ఆదుకొని వారి కోరికలను తీరుస్తున్న పర్వతం కనుక 'చింతామణి పర్వతం' అనీ, పరిపూర్ణమైన జ్ఞానాన్ని కోరేవారికి జ్ఞానాన్ని అనుగ్రహించేది కనుక 'జ్ఞానాద్రి' అనీ, కోరికలను తీర్చే తీర్థాలకు నిలయమై వున్నందున 'తీర్థాచలం' అనీ, ఈ దివ్యస్థలంలో అనేకమైన పుష్కరిణులు వుండటంచేత 'పుష్కరాద్రి' అనీ, 'పుష్కరశైలం' అనీ, ఇది శ్రీవైకుంఠం నుండి తేబడిన గిరి గనుక 'వైకుంఠాద్రి' అనీ శ్రీ మహా విష్ణువు శ్వేతవరాహ రూపంతో అవతరించి, భూదేవిని రక్షించి, భూదేవితో నిలిచి వున్నందున 'ఆదివరాహ క్షేత్రం' అనీ, 'శ్రీ భూవరాహ క్షేత్రం' అని 'శ్వేత వరాహ క్షేత్రం' అనీ, నీలుడు అనే మునీంద్రుడు తపస్సుచేసి సిద్ధిని పొందినందువల్ల 'నీలాద్రి' అనీ, ఇలా అనేక పేర్లతో పిలువబడు తున్నది. అంతమాత్రమే కాదు. శ్రీమహావిష్ణువు శ్రీదేవీ భూదేవులతో కలిసి క్రీడిస్తూ విహరించే పర్వతం కనుక 'క్రీడాచలం' అనీ, శ్రీహరి, శ్రీమహాలక్ష్మిని వక్షః స్థలంపై అధివసింపజేసుకొని శ్రీనివాసుడను నామధేయంతో ఆనందమయ స్వరూపుడై ఆనంద నిలయంలో దర్శనమిస్తున్నందువల్ల 'ఆనందా చలం' అని సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి ఈ పర్వతంలో వేంచేసివుంటూ, భక్తులకు సకల సంపదలను ప్రసాదిస్తున్నది కనుక శ్రీశైల మని ఇలా అనంతమైన పేర్లు ఈ క్షేత్రానికి వున్నాయి.

*"బహూని చాస్యనామాని కల్పభేదాద్భవంతి హి*
*యావదుక్తా భగవతః కల్యాణ గుణ రాశయః*
*తావంతోఽస్య గిరేస్సంతి గుణాః పరమ పావనాః*
*అస్య వేంకటశైలస్య మాహాత్మ్యం యావదస్తి హి*
*తావద్వక్తుం చ కార్త్స్న్యేన న సమర్థ శ్చతుర్ముఖః*
*షణ్ముఖశ్చ సహస్రాస్యః ఫణీ దేవాః పరే కిము?"*

"అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన భగవానుని కల్యాణ గుణ పరం పరలు ఎట్లు అసంఖ్యాకములో, అలాగే ఈ క్షేత్రరాజంయొక్క నామాలు మహిమా న్వితములైన గుణాలు కల్పభేదాలనుబట్టి అసంఖ్యాకములై వర్ధిల్లుతున్నాయి. అలాంటి వేంకటాచల మాహాత్మ్యం గురించి వివరించి చెప్పటానికి చతుర్ముఖ బ్రహ్మదేవునికి గాని, షణ్ముఖాలు కలిగిన కుమారస్వామికినిగాని, వేయి నాలుకలు కలిగిన ఆదిశేషునకు గాని, ఇతర దేవతలకు గాని సాధ్యం కానే కాదు" అని సూత మహర్షి వేంకటాచల క్షేత్ర నామాలను గురించి వాటి మహిమలను గూర్చి శౌనకాది మహర్షులకు వివరిస్తూ, వారి కోరిక మేరకు ఏడుకొండలుగా ప్రసిద్ధిపొందిన పేర్లను గూర్చి వివరించినాడు.

## శేషశైలం

ఆదిశేషుడు శ్రీమహావిష్ణువునకు పాన్పుగా, పీఠంగా, గొడుగుగా ఇలా అనేక విధాల ఉపయోగపడుతూ సేవిస్తూ వుంటాడు. ఒకానొకప్పుడు ఈ ఆదిశేషునికి, వాయుదేవునికి నేను గొప్ప అంటే నేను గొప్ప అని వివాదం జరిగింది. నీకు శక్తి వుంటే నన్ను కదల్చు అంటూ ఆదిశేషుడు వేంకటాచలాన్ని చుట్టుకుంటాడు. వాయుదేవుడు పర్వతాన్ని చుట్టుకొన్న ఆదిశేషుణ్ణి బలంగా విసిరివేయగా పర్వతంతో పాటు ఇక్కడవచ్చి పడతాడు. ఓడిపోయిన కారణంగా చింతతో వున్న ఆదిశేషుణ్ణి శ్రీనివాసుడు ఓదారుస్తూ నిన్ను నేను ఆభరణంగా ధరిస్తాననీ, ఈ క్షేత్రం నీ పేరుతో ప్రసిద్ధిపొందునట్లుగా వర మిస్తానని అంటాడు. ఆనాటినుండి ఇది 'శేషాచలం'అనీ, 'శేషాద్రి' అనేపేర్లను పొందడమేగాక, శ్రీనివాసుడు శేషాచలపతి నామధేయంతో నాగాభరణుడై విరాజిల్లుతున్నాడు.

## గరుడాద్రి

శ్రీ మహావిష్ణువు హిరణ్యాక్షుని ఆదివరాహరూపంతో సంహరించి భూదేవిని రక్షించిన పిదప, గరుత్మంతుని పిలిచి శ్రీ వైకుంఠానికి వెళ్లి తన క్రీడాద్రిని తెమ్మని ఆదేశిస్తాడు. గరుత్మంతుడు తెచ్చినందువల్లే ఇది 'గరుడాచలం' అని, 'గరుడాద్రి' అని ప్రసిద్ధి పొందింది.

## వేంకటాద్రి

'వేం' అనగా సమస్త పాపాలను, 'కటః' దహించునది -- అనగా పాపరాసులను భస్మం చేసేది కనుక ఈ దివ్య క్షేత్రం 'వేంకటాచలం' అని పిలువబడుతున్నది. అంతేగాక--

*"వేంకారో ఒమృత బీజస్తు కటమైశ్వర్య ముచ్యతే*
*అమృతైశ్వర్య సంఘత్వాత్ వేంకటాద్రి రితి స్మృతః."*

వేం అమృతత్వాన్ని, కటః ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తున్నందువల్ల కూడ ఈ క్షేత్రం 'వేంకటాద్రి' అని కూడ పేరు పొందింది. అందువల్లే ఈ స్వామి వేంకటేశ్వరుడనే పేరుతో పిలువబడుతున్నాడు.

## నారాయణాద్రి

పూర్వం ఒకానొకప్పుడు నారాయణుడు అనే భక్తుడు ఈ క్షేత్రంలో స్వామిపుష్కరిణీ తీరాన తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన వేంకటాచలపతి వరం కోరుకొమ్మని చెప్పగా నారాయణుడు ఈ క్షేత్రం తన పేరుతో ప్రసిద్ధి పొందాలనీ, అందులో శ్రీనివాసుడు ప్రత్యక్షంగా భక్తులకు దర్శనమివ్వాలనీ ప్రార్థించాడు. ఆ భక్తుని కోరికమేరకు ఈ పర్వతం 'నారాయణాద్రి' అనీ, 'నారాయణాచలం' అని పేరు పొందింది.

## వృషభాద్రి

పూర్వం వృషభాసురుడు అనే శివభక్తుడు బలగర్వితుడై విశృంఖలంగా సంచరిస్తూ వుండినాడు. దుష్టుడై లోకకంటకుడుగా విహరిస్తున్న వృష భుడు కిరాత వేషధారియైన శ్రీహరితో యుద్ధానికి తలపడినాడు. ఆ ఘోర యుద్ధంలో చిట్టచివరకు శ్రీనివాసుడు సుదర్శనచక్రాన్ని వానిపై ప్రయోగించినాడు. ఎదురులేని సుదర్శ నాయుధంతో తనకు చావు తప్పదని భావించిన వృషభుడు శ్రీ మహావిష్ణువును ఇలా ప్రార్థించాడు.

*"అద్యప్రభృతి చాయం వై గిరి రుచ్ఛ్రిత శేఖరః*
*మదాఖ్యయా ప్రథాం యాతు 'వృషభాచల' ఇత్యపి."*

"పరంధామా! నన్ను సంపూర్తిగా క్షమించవలసింది. పరమాత్మా! నీచేతిలో అందులోను నీ సుదర్శన చక్రాయుధంతో మరణించడం నా మహద్భాగ్యంగా భావిస్తున్నాను. కాని నాదొక కోరిక. నా యీ చివరి కోరికను తీర్చగల కరుణామయుడవు నీవు. ఇక్కడే ఈ పర్వతం మీదే వెలసి నీవు వుంటావు కదా! మరి నీవు వున్న ఈ పర్వతం 'వృషభాచలం' అని నా పేరుతో ప్రసిద్ధమగునట్లు అనుగ్రహించ వలసింది" అంటూ కన్నుల నిండా నీళ్లు కారుతుండగా భక్తిప్రపత్తులతో శరణు వేడుతూ వినయవినమ్రంగా అభ్యర్థించాడు.

*"వృషభాసుర! మద్భక్త్యా విముక్తిం యాస్యసి ధ్రువమ్*
*గిరిశ్చాయం భవన్నామ్నా ప్రసిద్ధ మధిగచ్ఛతు."*

వృషభాసురుని ప్రార్థనను ఆలకించిన శ్రీవిష్ణుభగవానుడు 'వృషభాసురా! నీవు కోరినట్లుగా అవుతుంది. నేటినుంచి ఈ పర్వతం 'వృషభాద్రి' అనే పేరుతో

ప్రసిద్ధిపొందుతుంది' అంటూ తన సుదర్శనచక్రంతో రాక్షసుని వధించినాడని బ్రహ్మాండ పురాణంలో చెప్పబడింది. అలాగే వరాహ పురాణంలో మరో విధంగా చెప్పబడిన గాథను మీకు విన్పిస్తాను. సావధానంగా వినండి -- అంటూ సూతుడు ఇలా కొనసాగించాడు.

పూర్వం ఒకానొక సమయంలో వృషభుడు అనే రాక్షసుడు శేషాచల పర్వతాన్ని ఆక్రమించి అచట తపస్సు చేసుకుంటున్న యోగులను, మునులను తీవ్రంగా బాధిస్తూ వుండినాడు. ఆ తాపసులందరూ వాని ధాటికి ఆగలేక శ్రీనివాసుని దగ్గరికి వెళ్లి శరణు వేడుతూ వృషభాసురుని ఆగడాలను ఇలా వివరించారు.

*"భగవన్నరవిందాక్ష! వృషభోనామ రాక్షసః*
*సమ్బాధతే సదా క్రూరః తపో భఙ్గకరః ఖరః*
*తస్మాద్రక్ష క్షరాతీత భయాద్రాక్షస కల్పితాత్*
*బాధమిత్యుక్తవాన్ కృష్ణో దుష్ట మభ్యద్రవ ద్రుషా*
*సరాక్షసో మహావీర్యః తీర్థే తుమ్బురు సంజ్ఞకే*
*స్నాత్వా త్రిషవణం పుణ్యాం సాలగ్రామ శిలాం నృప!*
*నారసింహాత్మికాం దివ్యాం సకరాలా మధో ముఖామ్*
*నిత్య మారాధయే యాహ మితి నిశ్చిత్య పూజయన్*
*పూజాన్తే స్వశిరఃపుష్పం ఖఙ్గే నాహృత్య భూపతే*
*సమర్పయామాస తతః తచ్ఛిరః పునరాగతమ్."*

"స్వామీ! శ్రీనివాసా! తుంబురు తీర్థంలో వృషభుడనే రాక్షసుడు మమ్మల్ని అనేక బాధలు పెడ్తున్నాడు. వాడు ప్రతి రోజూ ఈ తీర్థంలో నృసింహ సాలగ్రామాన్ని భక్తితో ఆరాధిస్తూ పూజ చిట్ట చివరలో తన శిరస్సును తన ఖడ్గం చేతనే ఖండించుకొని దాన్ని శిరః పుష్పంగా నృసింహానికి సమర్పిస్తుంటాడు. విచిత్రమేమో కాని మళ్లీ వాని శిరస్సు యథాతథంగా మొలుస్తుంది. ఇలా గత ఐదు వేల సంవత్సరాలనుంచి ఇది కొనసాగుతునే వుంది. వాని బారి నుండి లోకాల్ని రక్షించవలసిందంటూ మునులు ప్రార్థించగా శ్రీనివాసుడు వెంటనే వాని వద్దకు వెళ్లినాడు.

అంత ఆ వృషభాసురుడు ప్రత్యక్షమై కనిపించిన శ్రీనివాసుని, 'స్వామీ! నీవు కోరిన వరాల రాయడవు కదా! మరి నాకు యుద్ధాన్ని భిక్షగా ఒసగుము' అని కోరగా,

శ్రీహరి వానితో యుద్ధానికి హోరాహోరీగా తలపడినాడు. చివరకు శ్రీనివాసుడు తన సుదర్శన చక్రాయుధాన్ని ప్రయోగించి వాని శిరస్సును ఖండించబోగా, ఆ రాక్షసుడు ఈ పర్వతం తనపేరుతో ప్రసిద్ధమగునట్లు కోరుతూ మరణించినాడు. అందుకు శ్రీనివాసుడు అంగీకరించి వరమిచ్చినందువల్ల ఇది వృషభాద్రి పేరుతో ప్రసిద్ధిని పొందింది.

## వృషాద్రి

'వృషాద్రి' 'వృషభాద్రి' రెండు సమానార్థకాలుగా స్వీకరించి వృషభాసుర వృత్తాంతంవల్ల ఆ పేర్లు ఏర్పడ్డాయని కొందరు అంటారు. కాని ప్రత్యేకంగా 'వృషాద్రి' అనే పేరుతో కూడ ఈ పర్వతం ప్రసిద్ధి పొందింది.

'వృషం' అనగా ధర్మం. ఒకా నొకప్పుడు ధర్మదేవత, తన అభివృద్ధి కొరకై ఈ శేషాచల పర్వతంపై తపస్సు చేసిందట.

*"గిరావస్మిం స్తపస్తేపే ధర్మో ఽపి స్వాభివృద్ధయే*
*తస్మాదాహు ర్వృషాద్రిం తం మునయో వేదపారగాః."*

అందువల్లే ఈ పర్వతం 'వృషాద్రి' అనే మరో పేరుతో ప్రసిద్ధి పొందింది.

## అంజనాద్రి

త్రేతాయుగంనాటి గాథ ఇది. కేసరి అనే వానరరాజు వుండినాడు. ఆయన భార్య అంజనాదేవి. ఈమెకు సంతానం లేనందువల్ల చింతిస్తూ మతంగముని దగ్గరికి వెళ్లి, తన బాధను వెళ్లబోసుకుంది. వెంటనే మతంగుడు ఆలోచించి ఇలా అన్నాడు.

"అమ్మా! పంపానదికి తూర్పు దిక్కున ఐదువందల యోజనాల దూరంలో నారసింహ క్షేత్రం వుంది. దానికి దక్షిణ దిక్కునే నారాయణగిరి క్షేత్రం. ఆ క్షేత్రంలో 'స్వామిపుష్కరిణి' అనే పవిత్రమైన తీర్థరాజం వెలసివుంది. ఆ కోనేటికి ఉత్తరదిక్కున ఒక క్రోశం దూరంలో 'ఆకాశగంగ' అనే పవిత్ర తీర్థం నెలకొని వుంది. అందులో ప్రతిదినం స్నానంచేస్తూ పన్నెండేళ్ల పాటు తపస్సు చేస్తూ ఉండు. నీకు తప్పక గుణవంతుడు, శ్రేష్ఠుడు, అనంత బలశాలి, సర్వలోక ప్రసిద్ధుడు అయిన పుత్రుడు కలుగుతాడు" అంటూ ఆశీర్వదించి పంపాడు.

మతంగముని ఆదేశానుసారం అంజనాదేవి వేంకటాచల క్షేత్రాన్ని చేరుకొని 'స్వామిపుష్కరిణి' లో స్నానం చేసింది. ఆ పుష్కరిణీ తీరంలో వుండే అశ్వత్థ వృక్షానికి

ప్రదక్షిణం చేసి, ఆ ప్రక్కనే వున్న శ్రీ వరాహస్వామివారిని దర్శించింది. పిదప 'ఆకాశ గంగ' తీర్థానికి చేరుకొని, అక్కడ ఉపవాస దీక్షతో వ్రతమాచరించింది. ఇలా ఒక సంవత్సరం గడచిన తర్వాత, వాయుదేవుడు ప్రతిరోజు ఒక ఫలాన్ని ఆమె చేతిలో వుంచుతుండగా ఆమె దానిని తింటూ తపస్సు కొనసాగిస్తూ వుండింది. ఒకానొకరోజు వీర్యంతో నిండిన ఒక ఫలాన్ని వాయుదేవుడు అంజనాదేవికి ప్రసాదించినాడు. ఆమె యథాక్రమంగా ఆకలితో ఆ ఫలాన్ని ఆరగించగా గర్భవతి అయింది. పది మాసాల తరువాత ఆమెకు ఒక పుత్రుడు కలిగాడు.

అతడే "ఆంజనేయుడు", "హనుమంతుడు" అనే పేర్లతో జగత్ప్రసిద్ధుడై చిరంజీవిగా వెలసినాడు.

*"అంజనావ్రత మాస్థాయ పుత్రం ప్రాప గిరీశ్వరే*
*తస్మా దంజన శైలోఽ యం లోకే విఖ్యాత కీర్తిమాన్."*

అందువల్లే ఈ పర్వతం 'అంజనశైలం' అనీ, 'అంజనాద్రి' అనీ, 'అంజనా చలం' అనీ ప్రసిద్ధిని, పొందింది.

ఇలాగ ప్రసిద్ధమైన ఈ ఏడు పేర్లతో ఏడుకొండలు ఏర్పడినందువల్ల ఈ దివ్యక్షేత్రం 'సప్తగిరి' శైలమనీ, ఏడు కొండల క్షేత్రమనీ పేరొందింది. ప్రధానమైన ఈ పేర్లు మాత్రమేగాక, ఈ వేంకటాచల క్షేత్రానికి అనంతమైన పేర్లు కాలాంతరంలో ఏర్పడినాయి. వాటిని లెక్క పెట్టడం ఎవరికిని సాధ్యం కానే కాదు. అంటూ సూతుడు **వేంకటాచల క్షేత్రానికి వున్న అనంతమైన పేర్లను గూర్చి, మహిమలను గూర్చి వివరిస్తూ ఇలా అన్నాడు!**

## వపా యాగం

ఇంతటి మహామహిమోపేత మైన ఈ పుణ్య క్షేత్రంలో శ్రీమహావిష్ణువు పూర్వం ఒకానొకప్పుడు శ్రీమహాలక్ష్మితో కూడి విహరిస్తూ వుండినాడు. సరస సంభాషణలతో ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, అక్కడక్కడ పూచిన పుష్పాల సౌకుమార్యాన్ని లక్ష్మీదేవికి చూపిస్తూ, గల గలా పారే సెలయేళ్ల సొంపు సోయగాలను వర్ణిస్తూ తిరుగుతూ వున్న ఆ దివ్య దంపతులకు ఒక దృశ్యం గోచరించింది.

ఆ కారడవిలో మధ్యన వున్న విశాలమైన చదునైన ప్రదేశంలో కొందరు మునులు వేదమంత్రాలు పఠిస్తూండినారు. మరికొందరు మహర్షులు ఒక హోమవేదిక

చుట్టూ పరివేష్టించి కూర్చొని యజ్ఞం చేస్తుండినారు. కొందరు మునిబాలకులు ఆ యాగానికి కావలసిన సమిధలు, ఇంకా ఇతర వస్తు సామగ్రి అందిస్తూ వుండినారు. పరమ పవిత్రమైన ఆ వేంకటాచల క్షేత్రం మీది పర్వత సానువుల మధ్య ఆ మహర్షులు చేస్తున్న దివ్యహోమంవల్ల, హోమధూపాల సువాసనలతో ఆ ప్రదేశం మరింత ఆధ్యాత్మిక వాతావరణంలో వింత వింత తేజస్సులతో ప్రకాశిస్తూ వుండింది. వాళ్లంతా తమనుతాము మరచిపోయి తదేక దీక్షా మగ్నులై హోమ కార్యంలో మునిగి వుండినారు. ఇలా ఆ మహర్షులు చేస్తున్న అద్భుతమైన యాగాన్ని గురించి చెబుతూ శ్రీమహావిష్ణువు తన వెంట సంచరిస్తున్న శ్రీమహాలక్ష్మితో ఇలా అన్నాడు.

"ప్రియురాలా! లక్ష్మీ! ఆ మహాయోగులు చేస్తున్న మహాయజ్ఞాన్ని గమనించావా! చూడు. బాగా పరిశీలించు. అత్యంత శ్రద్ధతో, ఓర్పుతో నియమ నిష్ఠలతో వాళ్లు ఆచరిస్తున్న యాగం ఎవరిని గురించో చేస్తున్నా రనుకుంటున్నావ్ కదూ! ఆ హోమం మన ఇద్దరిని ఉద్దేశించే నిర్వహింప బడుతున్నది. అందువల్ల మనం ఇద్దరం కూడ వారి వద్దకు వెళ్లి, వాళ్లు చేస్తున్న యాగ ఫలాన్ని స్వీకరిద్దాం. కాని ఈ రూపాలతో మాత్రం కాదు. విచిత్రమైన వేషాలతో వెళ్లి వాళ్లను కాస్త పరీక్షిద్దాం. పరీక్షించిన తరువాత వారి హోమాన్ని సఫలీకృతం చేద్దాం తెలిసిందా" అంటూ శ్రీమహావిష్ణువు తన వేషం వెంటనే మార్చుకున్నాడు. ఆయన విచిత్ర వేషానికి అనుగుణంగా లక్ష్మీదేవి కూడ తన రూపాన్ని మార్చుకుంది.

శ్రీ వేంకటేశ్వరుడు అత్యంత మనోహరమైన విటుని రూపంలో వెలుగొందినాడు. కంటికింపైన వస్త్రాలను ధరించినాడు. చేతులకు సుకుమారమైన సుందరమైన సుగంధ పుష్పమాలలను చుట్టుకొన్నాడు. చేతిలో వయ్యారంగా ఒక పుష్పాన్ని ధరించినాడు. ఇలా కామోద్రేకివలె నటిస్తున్న ఆ స్వామికి తగినట్లు లక్ష్మీదేవి కూడా ఉల్లి పొరలాంటి సున్నితమైన వస్త్రాలను, పుష్పాలను అలంకరించు కొన్నది. ఒకచేతితో స్వామిని పట్టుకొని వయ్యారంగా సోలిపోతున్నట్లుగా మన్మథలావణ్యంతో ప్రకాశిస్తూ వుండింది. ఇరువురూ సుగంధ వాసనలు వెదజల్లే తాంబూలాన్ని నములుతూ ఒకరు నొకరు ప్రేమగా, గోముగా చూసుకుంటూ ఒకరి కొకరు లాలనగా మాట్లాడుకుంటూ, చిరు నగవులతో వుండగా ఆమునుల దగ్గరికి వచ్చారు.

ఇలాగ వింతగా కనిపిస్తున్న వేశ్యావిటులను చూస్తూ మునులందరూ సంభ్రమంతో లేచి నిలబడ్డారు. వీరిద్దరూ ఎంతో విచిత్రంగా హొయలు పోతూ వున్న వీరి సౌందర్యాన్నీ, దర్పాన్నీ మునులు కన్ను లార్పకుండా చూస్తూ, 'వీరు లోకోత్తర పురుషులై వుండవచ్చునేమో! ఈ నిర్జనారణ్యంలో సంచరిస్తున్న సుందర సుకుమార శరీరులైన వీరు నిజంగా మానవులేనా! ఆటవికులా! విచ్చలవిడి శృంగారంతో స్వేచ్ఛగా విహరిస్తున్న వీరు ఎవరైతే ఏమి? ఎంతో వర్చస్సుతో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నారు. వీళ్లతో మాట్లాడాలని అనిపిస్తున్నది' అని మునులందరూ తమలో తాము అనుకుంటూ ఆ మాయా విట దంపతులతో ఇలా అన్నారు--

"అయ్యా! మీరెవరు? చక్రవర్తి లక్షణాలతో ప్రకాశిస్తున్న నీవు రాజువా? అయితే ఏ దేశానికి అధిపతివి? నీ తల్లి దండ్రులెవరు? నీ పేరేమిటి? ఏ మాత్రం దాచకుండా మీ విషయాలు అన్నింటిని తెలియపరచండి."

అంత ఆ మాయా విటుడు "మునులారా! నేను రాజును కానే కాను. బ్రాహ్మణున్ని అంత కన్నా కాను. అసలు నాకు జాతే లేదు. నేను తల్లి దండ్రులు లేనివాణ్ణి. నాకు ఒక చోటంటూ లేనే లేదు. నేను అంతటా వుంటాను. అనేక వేషాలను ధరిస్తుంటాను. ఫలానా పేరు నాది -- అనే నిర్దేశం లేదు. అన్ని పేర్లూ నావే. నాకు ఎలాంటి నీచమైన హేయమైన గుణాలు లేవు. మేము మిమ్మల్ని చూడడానికి వచ్చాము. మీరు అందరూ కలిసి ఏదో యాగం చేస్తున్నట్లుంది.ఏదో హోమం చేస్తున్నట్లున్నారు. అది సరే! ఆ ప్రక్కన పులిచర్మంతో పూర్తిగా చుట్టబడిన యజ్ఞ పాత్ర వుంది కదా. దానిలోని వపను ఎప్పుడు యజ్ఞ కుండంలో వ్రేల్చుతారు? విజ్ఞులైన మీరు కాలయాపన చేస్తూ యజ్ఞవిధిని సరిగా పాటించడం లేదు" అని పలికాడు.

అంత మునులు ఆ మాయా విటుని మాటలకు ఆశ్చర్యపడుతూ, తమ తప్పిదాన్ని తెలుసుకొని ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా సువాసనతో కూడిన పాత్రలోని వపను (యజ్ఞ పశువు యొక్కపొత్తి కడుపులో పలుచని పొరగా వున్న క్రొవ్వు) హోమంలో వ్రేలుస్తూ వపాయాగాన్ని కొనసాగించారు.

వెంటనే మాయా విటుడు అదృశ్యమై, అచ్చోట శంఖ చక్ర గదా ధారియైన శ్రీమహావిష్ణువు లక్ష్మీసమేతంగా ప్రత్యక్షమై ఆ యజ్ఞఫలాన్ని స్వీకరించినాడు. అద్భుతమైన ఈ సంఘటనకు అబ్బుర పాటుకు లోనై మునులందరూ శ్రీస్వామివారిని కన్నులారా దర్శించినారు. మన యజ్ఞాన్ని సఫలీకృతం చెయ్యడానికే సాక్షాత్తు

శ్రీ వేంకటేశ్వరుడే విటుని రూపంలో వేంచేశాడు కదా! అని ఆనందిస్తూ మిగిలిన యాగాన్ని పూర్తి చేశారు. పూర్వం జాబాలి మహర్షి చేత విన్న ఈ కథను నేను మీకు వివరించాను. ఇదే కాక ఆ మునీంద్రుడు కుమారధారా తీర్థాన్ని గూర్చి నాకు చెప్పాడు. దానిని కూడ తెలియజేస్తాను.

## కుమారధారా తీర్థం

పూర్వం ఒక వృద్ధ బ్రాహ్మణుడు తన కుమారుడైన కౌండిన్యునితో కలిసి దేశ సంచారం చేస్తూ ఆ యా దివ్య ప్రదేశాలను దర్శిస్తూ చివరకు వేంకటా చలక్షేత్రం చేరుకున్నాడు. ఆ సమయంలో తన కొడుకు తప్పి పోవడంతో, ఆ వృద్ధుడు ఆర్తితో, అతణ్ణి "ఓ కౌండిన్యా! ఒరే! కౌండిన్యా! ఎక్కడికి వెళ్లావురా! నాయనా! ఈ ముసలి వాణ్ణి విడిచి వెళ్లడం న్యాయమేనా! కౌండిన్యా! ఎక్కడరా నీవు" అని బిగ్గరగా అరుస్తూ ఆక్రందన చేస్తూ తిరుగుతుండినాడు.

*"పురాతు వేంకటాధీశః చచార గిరిమూర్ధని*
*కుమార స్సన్విశాలాక్షః కోమలాఙ్గో మనోహరః"*

అంతకు పూర్వమే ఆ పర్వత సానువుల్లో సుందరమైన, విశాలమైన కన్నులతోను, సుకుమారమైన అవయవాలతోను, మనోహరుడైన యువకుని రూపంతో వేంకటా చలపతి సంచరిస్తుండినాడు. అలా తిరుగుతున్న వేంకటేశ్వరునికి, కొడుకు కోసం తాపత్రయపడుతూ కాలుగాలిన పిల్లిలాగా అరుస్తూ తిరుగుతూ వున్న ముసలి బ్రాహ్మణుడు కనిపించాడు. వెంటనే శ్రీనివాసుడు ఆ విప్రుని వద్దకు వచ్చి "అయ్యా! ఓ శత వృద్ధా! నీకు కళ్లు కన్పించడంలేదు. చెవులు కూడా సరిగా వినిపించునట్లు లేవు. ఈ నిర్జనారణ్యంలో తారట్లాడుతూ ఎవరి కోసం అరుస్తున్నావు. ఇక్కడ ఈ పరిసరాల్లో ఎవరూ కన్పించడం లేదే!" అని అడిగినాడు.

"అయ్యా స్వామీ! మీరెవరో గాని ఆప్యాయంగా పలకరిస్తున్నారు. నన్ను గూర్చి ఆసక్తితో అడుగుతున్నారు. నా పుత్రుడు కౌండిన్యుడు. అతడు నన్ను వదలిపెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు. నేను దారి తప్పి సంచరిస్తూ వాని కోసం అరుస్తున్నాను. బ్రహ్మ దేవుడు నన్ను జీవింపజేయడం చాలా బాధగా వుంది.నా మీద దయపెట్టి నన్ను రక్షించు" అంటూ ఆ విప్రుడు ప్రాధేయ పడినాడు.

*"తవ విప్ర! శరీరం చ జరితం పలితం తథా*
*లంబతే పక్ష్మణీ త్వక్చ న చ పశ్యసి కించన*

అతః పరం చ విప్రేంద్ర జీవనేచ్ఛా తవాస్తి కిమ్
న వా పూర్వోక్త వాక్యం తు సత్యం వా వద సువ్రత."

"అయ్యా బ్రాహ్మణుడా! వృద్ధాప్యం చేత నీ శరీరం చిక్కి శల్యమైంది. తెల్లగా పాలివుంది కూడ. నీ కనురెప్పలు, చర్మము వాలిపోవు చున్నవి. కండ్లు కూడా కానరాకున్నవి. మరి ఇంత దుర్దశలో కూడా నిన్ను పుత్ర వ్యామోహం విడిచి పోలేకున్నది. ఇది చింతించవలసిన అంశము. ఇప్పుడైనా పుత్ర వ్యామోహాన్ని వదలి నిశ్చితంగా వుండు. ఇంతకు ముందు ముక్తి కోసం నీవు పలికిన మాటలు సత్యములే అని భావిస్తూ వున్నాను. అందువల్ల నీకు ముక్తిని ప్రసాదిస్తాను. నీకు పూర్తిగా అంగీకారమేనా!" అని శ్రీహరి అడిగినాడు. అప్పుడు విప్రుడు ఇలా బదులు పలికాడు.

" ఇత్యుక్తః ప్రాహ విప్రోఽపి
నా స్తీచ్ఛా జీవనే మమ
కిన్తు నిత్యాని కర్మాణి
జ్యోతిష్టోమ మఖాని చ
నా నుష్ఠితాని దేవానా
మృణీ కథమహం పునః
త్యక్ష్యామిదేహం భో రాజన్!
సత్యమేవ బ్రవీమితే."

"ఓ మహా ప్రభో! నిజంగా ఈ వృద్ధాప్యంలో ఇంకా జీవించాలనే ఆశ నాకు ఏ మాత్రం లేదు. కాని నా గత జీవితంలో నిత్య కర్మలను గాని, జ్యోతిష్టోమాదులైన యజ్ఞాలను కాని నేను చేయలేదు. దేవ పితృయజ్ఞాది కార్యక్రమాలు కూడా చేయనందువల్ల దేవతలకు, పితరులకు ఋణగ్రస్థుడ నయ్యాను. కావున నేను ఇంకా జీవిం చాలని, ఆ కార్యక్రమాలను నిర్వహించాలని నిండుగా భావిస్తున్నాను. అందువల్ల ఇప్పుడే నేను మరణించుటకు ఇష్టపడటం లేదు. నేను సత్యమే చెబుతున్నాను. ప్రభూ! దయతలచి నన్ను రక్షించ వలసింది" అంటూ విప్రుడు ప్రాధేయ పడినాడు.

అంత స్వామివారు అతని చేతిని పట్టుకొని మెల్లగా నడిపించుకొంటూ అచటికి అతి సమీపంలో ప్రవహిస్తూవున్న స్వచ్ఛమైన జలధారను చూపుతూ 'ఇందులో స్నానం చేసిన తర్వాత నీ ఆశ్రమానికి వెళ్లవచ్చు' అని పలుకగా ఆ వృద్ధుడు వెంటనే

ధారక్రింద స్నానం చేశాడు. ఆశ్చర్యంగా, అద్భుతంగా ఆ విప్రుడు పదహారేళ్ల నవ యువకుడుగా మారాడు. ఆ వెను వెంటనే యువకుని రూపంలో వున్న వేంకటాచలపతి వేయి కన్నులతో, సహస్ర శీర్షుడై, విశ్వరూపంతో దర్శన మిచ్చాడు. ఆ దివ్య దర్శనానికి ఆనందించిన దేవతలు అందరూ పూలవాన కురిపించారు. అనేక విధాలుగా స్తుతించారు, కీర్తించారు. ఆ విప్రుడు కూడా సాష్టాంగ దండ ప్రణామ మాచరించి ప్రార్థించినాడు.

'ఓ విప్రుడా! ఇక మీదట సర్వసౌఖ్యాలనుభవిస్తూ ఇంతవరకు నీవు చేయనటు వంటి యజ్ఞకార్యాలను నిర్వహిస్తూ వుండు. అందుకు తగిన సంపదల నన్నింటిని నీకు అనుగ్ర హిస్తున్నాను" అంటూ ఆశీర్వదించి స్వామి అదృశ్యమైనాడు.

ఇలా నూరేండ్ల పండు ముసలివాణ్ణి, పదహారేళ్ల కుమారునిగా మార్చిన ఈ 'జల ధారా తీర్థం' ఆనాటి నుండి "కుమారధారా తీర్థం" గా ప్రసిద్ధి పొందింది.

"త్రికాల మత్ర యస్స్నాతి త్రిమాసం విజితేంద్రియః
వలీపలిత నిర్ముక్తో వజ్ర కాయో భవేన్నరః
సర్వపాప వినిర్ముక్తో యాతి విష్ణోః పరంపదమ్."

ఇంద్రియ నిగ్రహాన్ని పాటిస్తూ ప్రతి రోజూ మూడువేళలా ఈ కుమార ధారా తీర్థంలో స్నానం చేయాలి. అలా మూడు నెలలపాటు క్రమం తప్పకుండా ఈ తీర్థంలో ఎవరైతే స్నానం చేస్తూ సాధన చేస్తారో వారికి వృద్ధాప్యం తొలగుతుంది. అంతేకాదు. శరీరం వజ్ర పటుత్వం పొందుతుంది. సర్వ పాపాలు తొలగుతాయి. సర్వ సంపదలతో పాటుగా సుఖాలు కలుగుతాయి. చిట్ట చివరకు విష్ణుసాయుజ్యం కూడా కలుగుతుంది. అనగా ముక్తి కలుగు తుందని సారాంశం -- అంటూ సూత మహర్షి పూర్వం జాబాలి మహర్షిచే తాను విన్న "కుమారధారా తీర్థ మహిమ"ను తెలియజేస్తూ ఇంకా ఇలా కొనసాగించాడు.

## కుమారధారా తీర్థ మహిమ

షణ్ముఖుడైన కుమారస్వామి దేవతల ప్రార్థనపై పూర్వం దేవ సేనాధిపతిగా అంగీకరించినాడు. ఇంతలో దేవతలకు తారకాసురునికి తీవ్రమైన యుద్ధం జరిగింది. ఆ ఘర్షణలో దేవసేనాధిపతియైన కుమారస్వామి తారకాసురుణ్ణి సంహరించాడు. అందువల్ల బ్రహ్మహత్యాదోషం కుమారస్వామి వెంట పడింది. దాన్ని పోగొట్టుకోవడానికి

ఎక్కడెక్కడో తిరిగి, చివరకు కైలాసానికి చేరుకొని పరమేశ్వరుణ్ణి శరణు వేడి దానికి తగిన నివారణోపాయాన్ని తెలుపవలసిందని ప్రార్థించినాడు.

"భూలోకంలో భరత ఖండంపై వెలసివున్న వేంకటాచలానికి వెళ్లు. ఆ క్షేత్రంలో పరమపుణ్యప్రదమైన లోకపావనమైన ఒక తీర్థం వెలసివుంది. నీవు ప్రతిరోజు ఆ తీర్థంలో స్నాన మాడుతూ ఆ దివ్య స్థలంపై కొలువై వున్న శ్రీ వేంకట ప్రభువులను గూర్చి తపమాచరించ వలసింది" అంటూ పరమశివుడు కుమారస్వామిని ఆదేశించినాడు. అందువల్లనే కుమార స్వామి ఈ తీర్థంలో స్నానంచేస్తూ దోష నివృత్తిని పొందినందువల్ల ఇది "కుమార ధారా తీర్థం" అని ప్రసిద్ధి పొందింది.

"కుంభ సంస్థే రవౌ మాఘే పౌర్ణమాస్యాం మహా తిథౌ
మఘా నక్షత్ర యుక్తాయాం భూధరేంద్రే వసుంధరే
కుమార ధారికా నామ సరసీ లోకపావనీ
యత్రాస్తే పార్వతీసూనుః కార్తికేయోఽగ్ని సంభవః
దేవసేనా సమాయుక్తః శ్రీనివాసార్చకోఽమలే
తస్యాం యఃస్నాతి మధ్యాహ్నే తస్య పుణ్యఫలం శృణు
గంగాది సర్వతీర్థేషు యః స్నాతి నియమాత్ ధరే
ద్వాదశాబ్దం జగద్ధాత్రి తత్ఫలం సమవాప్ను యాత్
యోన్నం దదాతి తత్తీర్థే శక్త్యా దక్షిణయాన్వితమ్
స తావత్ ఫలమాప్నోతి స్నానే తూక్తం ఫలం యథా."

--వరాహ పురాణం

ఈ కుమారధారా తీర్థ మాహాత్మ్యాన్ని గురించి శ్రీవరాహస్వామివారు భూదేవితో తెలుపుతూ ఇలా అన్నాడు. "ఓ భూదేవీ! ప్రతి సంవత్సరం మాఘమాసంలో సూర్యుడు కుంభరాశిలో సంచరిస్తున్న సమయంలో మఘా నక్షత్రంతో కూడిన పున్నమినాడు మధ్యాహ్న సమయంలో ఈ కుమారధారా తీర్థంలో నియమ నిష్ఠలతో స్నానం చేస్తూ సాధన చేయాలి. ఇందులో ఒకానొకప్పుడు పార్వతీ దేవి పుత్రుడు, అగ్ని సంభవుడైన కుమార స్వామి తన దేవేరి అయిన దేవసేనతో కూడి లోకపావనమైన ఈ తీర్థంలో స్నానం చేస్తూ శ్రీనివాస ప్రభువును సేవించినాడు. మరి అలాంటి పరమ పుణ్యప్రదమైన ఈ కుమారధారికా తీర్థంలో ఎవరైతే స్నానం చేస్తారో వారికి గంగాదిగా వున్న సర్వ తీర్థాలలో పండ్రెండేళ్లపాటు స్నానం చేసిన ఫలితం సిద్ధిస్తుంది. అంతేకాదు,

ఆ నదీ తీర్థ సన్నిధిలో భక్తులు బ్రాహ్మణులకు అన్నదానం చేసి, దక్షిణలతో కూడిన తాంబూలాన్ని సమర్పించిన ఫలితం కుమారధారా తీర్థంలో స్నానం మాత్రంచేతనే కలుగుతుంది. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు."

అని సూత మహర్షి వరాహపురాణంలోను, మార్కండేయ పురాణంలోను చెప్పబడిన కుమారధారికా తీర్థ మహిమను గూర్చి తెలుపుతూ శౌనకాదులతో ఇంకా ఇలా అన్నారు--

"అస్య తీర్థస్య మహిమా హ్యహో! వాచామగోచరః
కుమారతీర్థే యః స్నాతో నిష్పాపః స సుఖీ భవేత్
శ్రీవేంకటేశః ప్రీయతా మిత్యేవ కథయన్ సదా
దృష్టం ఫలమవాప్యాన్తే విష్ణు లోకం జగామహ
కుమారధారికే త్యేవ విష్ణునా ప్యేకదోదితమ్."

ఈ కుమారధార తీర్థమహిమ అహో! ఎంతటిదో, ఎంతెంతటిదో కదా! మాటలలో చెప్పలేనిది. ఈ తీర్థంలో స్నానం మాత్రం చేతనే పాపాలు తొలగుతాయి, సుఖాలు కలుగుతాయి. ఇలాంటి మహిమోపేతమైన ఈ తీర్థం అంటే శ్రీ వేంకటేశ్వరస్వామివారికి చాలా ప్రియమైనది. ఈ తీర్థ మహిమను గూర్చి ఎవరైతే వింటారో, దర్శిస్తారో సత్ఫలితాలు కలగడమేగాక, ఆ భక్తులకు విష్ణులోకం సిద్ధిస్తుందని చెప్పబడిందని అంటూ సూతమహర్షి కుమారధారాతీర్థాన్ని గూర్చి అనేక విధాలుగా వివరిస్తూ శౌనకాదులవైపు సంతృప్తిగా తిలకించాడు.

ఆ మహర్షులందరూ సూత మహర్షిని ఆనందంగా, ఆరాధనా పూర్వకంగా చూస్తూ ఒక్కుమ్మడిగా అందరూ ఇలా అన్నారు. "ఓ మహాను భావా! సూతమహాశయా! భవ్యమైనట్టి శ్రీ వేంకటాచల దివ్య క్షేత్రాన్ని గూర్చి ఇంకా ఇంకా మాకు తెలుసుకోవాలని వుంది. చాలా అద్భు తంగాను, ఆసక్తిగాను చెబుతున్నారు. అందువల్ల మీరే మా సందేహాలను తీరిస్తే బాగుంటుంది. మీ కథా శైలిలోనే వినాలని మేమందరం చాల కుతూహలంగా వుంది. అదేమంటే మీరు ఇంతకు ముందు శ్రీ వేంకటపర్వతం మీద వెలసివున్న పవిత్రమైన "స్వామి పుష్కరిణి" ని గూర్చి దాని మాహాత్మ్యాన్ని గూర్చి వివరించారు కదా! ఆ సందర్భంలో మీరు ఒక మాట అన్నారు. ఆత్మా రాముడు వేంకటాచల క్షేత్రాన్ని అధిరోహిస్తూ ఆ దారిలో వున్న పదిహేడు తీర్థాలను

సేవించి తరించినా డంటిరి కదా! ఆ పదిహేడు తీర్థాలు ఏవి? వాటి గొప్పదనం ఎలాంటిది? ఆ క్షేత్రంలో ఇంకా ఏవైన ఇతర తీర్థాలు వున్నాయా! వుంటే వాటిని గూర్చి కూడా వినాలని మాకు బలే జిజ్ఞాసగా వుంది. ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా వాటిని గూర్చి వివరించి చెప్ప వలసింది మహర్షీ!" అంటూ ప్రార్థించారు.

"ఓ తపోధనులారా! మీరు శ్రద్ధాభక్తులతో, ఆసక్తితో వినగోరుతున్న విషయాలను తప్పక వివరిస్తాను" అంటూ సూతుడు శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఇలా ప్రార్థించారు.

*"యాత్రా యజ్ఞా వ్రతా ధర్మా దానాన్యన్యా న్యసంఖ్యయా*
*తవ నామస్మృతే ర్భక్త్యా కలాం నార్హన్తి షోడశీమ్."*

స్వామీ! ఏడుకొండలవాడా! నీ నామము అనన్య సామాన్యమైనది. అనేకానేకములైన బదరికాశ్రమాది క్షేత్ర యాత్రలు, యజ్ఞయాగాదులు, వ్రతాలు, ధర్మకార్యాలు, అన్నదానాదులు మరెన్నో అసంఖ్యాకాలైన దానాలు ఎన్నెన్నో చేసినా అవన్నీ కూడ భక్తితో ఒక్కసారి చేసిన నీ నామస్మరణంవల్ల కలిగే ఫలితంలో పదహారవ వంతుకు కూడా సరితూగలేవు కదా! అందువల్లే నీ నామమహత్యాన్ని చాటే నీ కథామృతాన్ని ఇలా విన్పించే మహద్భాగ్యం కలిగిందికదా! అంటూ ప్రార్థించి సూతుడు శౌనకాది మహర్షులతో ఇలా కొనసాగించాడు.

ఈ వేంకటాద్రి పర్వత సానువుల్లో వున్న అనేకమైన పుణ్య తీర్థాల్లో, మనం ప్రధానంగా చెప్పుకో దగినవి, స్మరింపదగినవి సుమారు 365 తీర్థాలు వున్నాయి. ఈ దివ్య తీర్థాలను దేవతలు, యక్ష గంధర్వ కిన్నర కింపురుషాదులు, దేవర్షులు, యోగులు, మునులు........ ఇలా ఎందరో ఎంద రెందరో ఎన్నో విధాలుగా ఎల్లప్పుడు సేవించి తరిస్తూనే వుంటారు. అయితే ఆ తీర్థాలలో కొన్ని ప్రస్తుతం ఎక్కడ వున్నాయో కూడా తెలియదు. కొన్ని తీర్థాలు మాత్రమే బహిర్గతాలై వున్నాయి. కొన్ని తీర్థాలు అత్యంత రహస్యంగా అదృశ్యములై, అగోచరాలై కేవలం వాటి పేర్లు మాత్రమే వినవస్తు న్నాయి. వీటన్నింటిలో ఆత్మారాముడు ప్రధానంగా దర్శించి సేవించిన కపిల తీర్థాది పదిహేడు తీర్థాలతో పాటు మరికొన్ని ప్రసిద్ధ పుణ్య తీర్థాలను గూర్చి వివరిస్తాను.

## కపిల తీర్థం

పూర్వం భగీరథచక్రవర్తి ప్రయత్నంవల్ల పాతాళలోకం చేరుకున్న పవిత్ర గంగానది 'భోగవతి' అని ప్రసిద్ధమైన పేరును పొందింది. ఆ పాతాళ లోకంలో

'భోగవతి' గా పేరు పొందిన ఆ గంగానది ఒడ్డున ఒకప్పుడు కపిలుడు అనే మహర్షి ఆశ్రమాన్ని ఏర్పరచుకొని అందులో ఒక శివలింగాన్ని కూడా ప్రతిష్ఠించుకొని పూజిస్తుండినాడు.

కపిలుడు పూజిస్తున్న ఆ మహాశివలింగం వింత వింత కాంతులతో ప్రకాశిస్తూ వుండడమేగాక, ఆ శివలింగం రోజు రోజుకు అద్భుతావహంగా ఊర్ధ్వ ముఖంగా పెరుగుతూ భూమిని కూడ చీల్చుకొని చివరకు వేంకటాచల క్షేత్ర మూలంలో స్వయంభువుగా వెలసింది. ఇంకా ఇంకా పెరుగుతున్న అద్భుతమైన ఆ శివలింగాన్ని ఇకమీదట పెరగ కుండా చేయవలెనని సంకల్పించిన శ్రీ మహావిష్ణువు గోపాలుడుగా మారి రక్షిస్తుండగా, బ్రహ్మదేవుడు కపిల ధేనువుగామారి ఆ శివలింగం మీద అనంతమైన క్షీరధారలను కురిపించి అభిషేకం చేస్తూ ఇరువురూ అనేక విధాల ప్రార్థించారు. అంతటితో పాతాళ లోకం నుండి విపరీతంగా పెరుగుతూ వున్న ఆ మహా శివలింగం వేంకటాద్రి పర్వత మూలంలో ఏర్పడిన గుహలో స్వయంభువుగా నిలిచింది.

పాతాళలోకం నుండి భూమిని పెకలించుకొని వచ్చిన ఆ శివలింగంతో పాటు పక్కనే వున్న 'భోగవతి' గంగ కూడ పెల్లుబికింది. స్వయంభువుగా ఆవిర్భవించిన ఆ పాతాళ శివలింగాన్ని అక్కడే ఉద్భవించినభోగవతీ తీర్థ జలాలతో దేవతలందరూ అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు.

ఈ శివలింగాన్ని తొలుత పాతాళంలో కపిలమహర్షి పూజించి నందువల్ల ఈ శివుడికి 'కపిలేశ్వరుడు' అని, 'కపిలేశ్వర మహాశివలింగం' అని ప్రసిద్ధమైన పేర్లు ఏర్పడ్డాయి. అలాగే ఈ 'కపిలేశ్వరుని సన్నిధిలో పెల్లుబికిన 'భోగవతి' గంగ 'కపిలతీర్థం' అనే పేరుతో పరమ పావన తీర్థరాజంగా ప్రసిద్ధికెక్కి తనలో స్నానంచేసినవారి పాపాల నన్నింటిని పోగొడుతున్నది. ఆ కపిల తీర్థంలో వెలసిన శ్రీకామాక్షీ సమేత శ్రీ కపిలేశ్వరస్వామివారు భక్తులపాలిట ఆర్త రక్షకుడై సమస్త దోషాలను పరిహారం చేస్తూ సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తున్నాడు. అంతేకాదు. పూర్వం ఒకప్పుడు దుర్వాసమహర్షి బ్రహ్మదేవునికి ఈ కపిలేశ్వరమహాశివలింగాన్ని చూపిస్తూ ఇలా వివరించినాడని పరమేశ్వరుడు పార్వతీదేవికి ఆ వృత్తాంతాన్ని ఇలా తెలియజేశాడు.

"ఆదౌ రజతవర్ణంచ మధ్యే స్వర్ణ ప్రభం మహత్
అగ్రేఽ రుణాభం సంభూతం పంచవక్త్రం త్రయంబకమ్

పంచవర్ణం మహాభీమం పాతాలాధిష్ఠితం సదా
మహర్షిణా కృతే పూర్వం కపిలేన ప్రపూజితమ్
'కపిలేశ్వర' ఇత్యేతత్ కృతే ఖ్యాతం యుగేపురా
త్రేతాయా మగ్నినా పశ్చాత్ 'ఆగ్నేయ' మితి కీర్తితమ్
నాద్యన్తం మహాలింగం ద్వాపరే చక్రపూజితమ్
కలౌ యుగే భవిష్యం తత్ కపిలా పూజితం శివమ్."

ఆ మహాశివలింగం మూలంలో (క్రింది భాగం) రజత వర్ణం కలిగి తెల్లగాను, మధ్యభాగంలో సువర్ణ కాంతులతో బంగారువలె పసుపు రంగులోను, అగ్రభాగాన అనగా పై భాగాన తామ్రంవలె ఎర్రని రంగుతోను ప్రకాశిస్తూ వుంటుంది.

కృతయుగంలో ఈ శివలింగాన్ని కపిలమహర్షి పూజించినందువల్ల మహా కపిలశివలింగంగా పిలువబడింది. త్రేతాయుగంలో ఈ లింగం అగ్నిదేవునిచే ఆరాధింపబడి నందువల్ల 'ఆగ్నేయలింగం' అని పేరు పొందింది. అలాగే ఆద్యంతాలు లేని ఈ మహా లింగాన్ని ద్వాపరయుగంలో సుదర్శన చక్ర భగవానుడు అర్చించినాడు. కలియుగంలో ఈ శివలింగాన్ని కపిలధేనువు తన క్షీరధారలచే అభిషేకించింది.

ఇంతటి పరమ పవిత్రమైన ఈ కపిలతీర్థ క్షేత్రంలో స్నానమాడి, ఇక్కడున్న శ్రీ కామాక్షీ కపిలేశ్వరులను సేవించుకొని తదుపరి ఈ కపిలతీర్థంతో కలిపి పదిహేడు పుణ్య తీర్థాలను దర్శించుకొని చివరకు వేంకటాచల క్షేత్రం చేరుకొని ఇష్టార్థ సిద్ధిని పొందిన ఆత్మారాముని కథను ముందే విన్నాం కదా! అంటూ సూతమహర్షి ఇలా కొనసాగించాడు.

పూర్వం ఒక బ్రాహ్మణుడు పుణ్య క్షేత్రాలను దర్శిస్తూ ఆయా తీర్థాలలో మునక లిడుతూ దేశ సంచారం చేస్తూ వుండినాడు. అసలు ప్రపంచంలో ఎన్ని తీర్థాలు ఉన్నాయో, వాటి అన్నింటిలోను స్నానం చేసి తరించాలని భావించి తిరుగుతూ వుండినాడు. ఇలా విశ్రాంతి లేకుండా తిరుగుతున్నందువల్ల అతను చాల బలహీనుడై శుష్కించిన శరీరంతో నీరసించి శోషపడి మగత నిద్రకు లోనయ్యాడు. ఆ నిద్రలో శ్రీనివాసుడు కనపడి ఇలా అన్నాడు.

"...................................

కి మర్థం గచ్ఛసి ద్విజ!

అస్మిన్ పుష్కర శైలేంద్రే.
సంతి దివ్యాని సప్త చ
దశ తీర్థాని తత్రాద్యం
కాపిలం సర ఉత్తమమ్
స్నాత్వాచైతేషు విప్రేంద్ర
శాస్త్రోక్త జ్ఞాన పూర్వకమ్
కృత్స్న తీర్థఫలం పుణ్యం
ప్రాప్స్యసి త్వం న సంశయః".

ఓయీ విప్రోత్తమా! నీ యీ ప్రయత్నం అసాధ్యమైంది. ఎవ్వరికీ నెరవేరదు. ఎప్పటికీ నెరవేరదు కూడా. కాని, వేంకటాచల క్షేత్రంలో 'కపిల తీర్థం' మొదలుగా అత్యంత ప్రధానమైన పదిహేడు పుణ్య తీర్థాలు ఉన్నాయి. వాటిల్లో శాస్త్రోక్తంగా నియమంగా స్నానం చేస్తే చాలు. ప్రపంచంలోని తీర్థాలన్నింటిలో స్నానం చేసిన ఫలితం వస్తుంది. ఇందులో ఏ మాత్రం సందేహింపవలసిన పని లేదు. అందు వల్ల నీవు అలా చేస్తే నీ కోరిక నెరవేరు తుంది" అని శ్రీహరి పలుకగా ఆ విప్రుడు మేల్కొని, తీర్థాటనను మాను కొన్నాడు. నేరుగా వేంకటాచల క్షేత్రం చేరుకొని కపిలతీర్థం మొదలుగా ప్రధానమైన పదిహేడు తీర్థాలను సేవించి ముక్తిని పొందినాడు. కపిలతీర్థం గురించి వివరంగా తెలుసుకొన్నాం కదా!

ఆ కపిలతీర్థానికి పై భాగంలో వున్న పదహారు తీర్థాలను గూర్చి తెలుసు కుందాం.

"తద్బిలం కాపిలం తీర్థం సర్వపాప ప్రణాశనమ్
తదూర్ధ్వ దేశే శక్రస్య తీర్థం పరమ పావనమ్
అహల్యా సంగ సంభూత శాప మోక్షస్తు యత్ర తత్
విష్వక్సేనసర స్తస్మా దూర్ధ్వం పుణ్య వివర్ధనమ్
వరుణస్యాత్మజో యత్ర తపః కృత్వా సుదుస్తరమ్
సారూప్యం చ హరేః ప్రాప్య సైనాపత్య మవాప హి
పంచాయుధానాం తీర్థాని తదూర్ధ్వం భాంతి సత్తమాః
తదూర్ధ్వ మగ్నికుండం స్యాత్ దురారోహ ముపర్యతః

బ్రహ్మ తీర్థం మహా హత్యామోచనం పుణ్య వర్ధనమ్
మునీనాం చైవ సప్తానాం పుణ్య తీర్థాని సంత్యతః".

## శక్రతీర్థం

కపిలతీర్థానికి పై భాగాన శక్ర తీర్థం వుంది. శక్రుడు అనగా ఇంద్రుడు. గౌతమమహర్షి భార్య అయిన అహల్యతో సంగమించిన దోషాన్ని ఈ తీర్థంలో స్నానం చేసి పోగొట్టుకున్నాడు. అందువల్లే ఇది శక్రతీర్థం అయింది.

## విష్వక్సేన తీర్థం

ఈ తీర్థం ప్రక్కనే వరుణ దేవుడి పుత్రుడైన విష్వక్సేనుడు తపస్సు చేశాడు. శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై శంఖ చక్రాయుధాలను అనుగ్రహించి విష్వక్సేనుణ్ణి తన సేనాధిపతిగా నియమించుకొన్నాడు. అందువల్లే ఇది విష్వక్సేన తీర్థం అని ప్రసిద్ధి పొందింది. ఇది శక్ర తీర్థానికి పై భాగంలో వుంది.

## పంచాయుధ తీర్థాలు

విష్వక్సేన తీర్థానికి పై భాగంలో వేంకటాచల పర్వత సానువుల్లో వున్నాయి. శ్రీనివాసుని పంచాయుధాలైన శంఖం, చక్రం, గద, ఖడ్గం, ధనస్సు -- వేర్వేరు స్థలాల్లో శ్రీమహావిష్ణువును గూర్చి తపస్సు చేశాయట. శ్రీహరి ప్రత్యక్షమై వాటిని అనుగ్రహించిన దివ్య స్థలాలే ఆ పంచాయుధ తీర్థాలు. అవే చక్ర తీర్థం, శంఖ తీర్థం, గదా తీర్థం, నందక తీర్థం, ధనుస్తీర్థాలు. ఈ పంచాయుధ తీర్థాల్లో స్నానం చేసిన వారికి పాపాలు, శత్రు భయం తొలుగునట్లు శ్రీహరి వరమిచ్చాడు.

## అనల తీర్థం

పూర్వం అగ్నిదేవుడు ఈ తీర్థంలో స్నానమాడి తనకు వచ్చిన కడుపునొప్పిని పోగొట్టుకున్నాడు. అందువల్లే ఇది అనల తీర్థం అనీ, అగ్ని తీర్థం అని ప్రసిద్ధి కెక్కింది. ఇది పంచాయుధ తీర్థాలకు పై భాగంలో నెలకొని వుంది.

## బ్రహ్మ తీర్థం

అగ్నితీర్థంపైన బ్రహ్మతీర్థం ఉంది. ఇచట బ్రహ్మ దేవుడు శ్రీహరిని గూర్చి తపస్సు చేసి, తన సృష్టి కార్యక్రమం సులువుగా కొనసాగునట్లుగా వరాన్ని పొందాడట! ఇక్కడ బ్రహ్మ హత్యాది దోషాలు తొలగుతాయని ప్రసిద్ధి.

## సప్తర్షి తీర్థాలు

బ్రహ్మ తీర్థానికి పై భాగాన సప్త ఋషులు వెలయింప చేసిన ఏడు పుణ్య తీర్థాలు వున్నాయి. ఇవి అత్యంత మహిమ గలిగిన తీర్థాలుగా పేరు పొందాయి.

దివ్యమైన శ్రీ వేంకటాచల పర్వతసానువులలో కపిల తీర్థాది పదిహేడు తీర్థాలతోపాటు నెలవైవున్న ఇంకా కొన్ని పవిత్ర తీర్థాలను గూర్చి తెలుసుకుందాం.

## పాండవ తీర్థం

ద్వాపరయుగం నాటి గాథ ఇది. పాండవులైన ధర్మరాజాదులు మాయా జూదంలో రాజ్యాన్ని పోగొట్టుకొని అడవుల పాలయ్యారు. ఇలా అష్ట కష్టాలకు లోనై భరింపరాని వేదనలతో కుములుతున్న పాండవులదగ్గరికి పరామర్శించుటకుగాను శ్రీకృష్ణ భగవానుడు వచ్చాడు. ఆ సమయంలో వారు అందరూ తమ బాధనంతా వెళ్ల బోసుకొని దుఃఖించారు. అంత శ్రీ కృష్ణుడు వారిని ఓదారుస్తూ "పాపాలను దహించి వేసి, కష్టాల నన్నింటిని పోగొట్ట వేంకటాచలానికి యాత్ర చెయ్యండి. ఆ దివ్య ధామంలో "క్షేత్రపాలక తీర్థం" అనే పేరుతో ఒక మహామహిమాన్విత మైన పుణ్య తీర్థం ఉంది. ఆ తీర్థంలో ఒక్క ఏడాదిపాటు మీరందరూ పవిత్ర స్నానాలు చేస్తూ, అందున్న వేంకటాచలపతిని నియమనిష్ఠలతో ఉపాసించండి. మీకు మంచి కాలం వస్తుంది" అని ఉపదేశవాక్యాలు పలికినాడు.

శ్రీకృష్ణపరమాత్మ ఆదేశించినట్లుగా పాండవులు, ద్రౌపదితో కూడ కలిసి ఆనంద నిలయానికి ఈశాన్యమూలలో అతి దగ్గరలో వున్న క్షేత్రపాలక తీర్థంలో వుంటూ ఒక్క సంవత్సర కాలంపాటు శ్రీనివాసుణ్ణి ఉపాసిస్తూ ఆరాధించారు. ఇలా జరుగుతూ వుండగా--

"తదా కదా చిద్ధర్మోఽపి దదర్శ స్వప్న ముత్తమమ్
యస్మా దస్మిన్మహా తీర్థే స్థితం వత్సర మాత్రకమ్.
అనేన పుణ్య యోగేన భవన్తః క్షీణ కల్మషాః
యుద్ధే జయం తథా రాజ్యం గమిష్యన్తి క్రమాగతమ్."

ఒకనాడు ధర్మరాజుకు దివ్యమైన స్వప్నం వచ్చింది. ఆ కలలో "మీ మీ పాపాలన్నీ నశించినాయి. మీ బాధలన్నీ సులభంగా తొలగుతాయి. మీరు వెంటనే వెళ్లి యుద్ధం చెయ్యండి. ఆ యుద్ధంలో మీకు తప్పక జయం కలుగుతుంది. మళ్లీ

మీ రాజ్యం, మీ భోగాలు మీకు యథాక్రమంగా ఒనగూడుతాయి" అని ఎవరో అన్నట్లుగా దివ్యవాక్కులు విన్పించినాయి.

వారు ఆశ్చర్యంతో, ఆనందంతో మళ్లీ మళ్లీ వేంకటాచలపతికి అనేక మారులు నమస్కరించి స్తుతించినారు. తిరిగి వెళ్లి యుద్ధంలో శత్రువుల నోడించి సామ్రాజ్య లక్ష్మిని పొందినారు. ఆ తీర్థంలో పాండవులు కొంతకాలంపాటువుండి వేంకటాచలపతిని ఉపాసించి సిద్ధిని పొందినందువల్ల ఆ క్షేత్ర పాలక తీర్థాన్ని--

"తదా ప్రభృతి తత్తీర్థం పాండవంచ విదుర్బుధాః."

"పాండవతీర్థం" అని విబుధులు పిలవటం జరుగు తున్నందువల్ల ఆనాటి నుండి అది పాండవతీర్థంగా పరమపావన తీర్థరాజమై అలరారుతూ వుంది.

## పాండవ తీర్థ మాహాత్మ్యం

వృషభస్థే రవౌ రాధే ద్వాదశ్యాం రవివాసరే
శుక్లే వాప్యథ వాకృష్ణే పక్షే భౌమ సమన్వితే
తీర్థే పాండవనామ్న్యత్ర సంగవే స్నాతి యోనరః
నేఉహ దుఃఖ మవాప్నోతి పరత్ర సుఖ మశ్నుతే.

సూర్యభగవానుడు వృషభరాశి యందు సంచరిస్తున్న సమయంలో శుక్ల పక్షంలో ద్వాదశితో కూడిన ఆదివారంనాడు కాని లేదా కృష్ణ పక్షంలో మంగళవారంనాడు కాని ఈ పాండవ తీర్థంలో స్నానంచేసినట్లయితే ఈ భూలోకంలో దుఃఖాలు దరిచేరవు, పర లోకంలో కూడ సర్వసుఖాలను పొందగలరని అంటూ సూతమహర్షి శౌనకాదులకు వేంకటాచల క్షేత్రం గొప్పదనాన్ని ఇలా వివరించినాడు.

ఈ శేషాచల పర్వతంలో జరాహర తీర్థం వలిఘ్న తీర్థం, కాయ రసాయనతీర్థం వంటి అనేక తీర్థాలు అగోచరాలైవున్నాయి. కాని కొందరు పుణ్యాత్ములైన మహాత్ములకు మాత్రం ఆ తీర్థాలు దర్శనమిస్తూ ఇష్టార్థ సిద్ధిని ప్రసాదిస్తూ వున్నాయి. ఏది ఏమైనా ఈ వేంకటాచల క్షేత్రం గొప్పదనం, మహిమ ఇంతింత అని వర్ణించుటకు సాధ్యం కానిది. ఈ పర్వతం మీద ఎన్నెన్నో నిధులు నిక్షిప్తమై వున్నాయి. సప్తగిరులుగా ప్రసిద్ధిచెందిన ఈ పర్వత సానువులలో అడుగడుగునా, ప్రతి అణువణువునా అనేక మహిమలు పొంగులు వారుతూ వుంటాయి.

"పంగుర్జంఘాల ఏవస్యాత్ అచక్షుః పద్మలోచనః
మూకో వాచస్పతి ర్దూరశ్రావీ తు బధిరో భవేత్.

వంధ్యాతు బహుపుత్రా చ నిర్ధన స్సధనో భవేత్
ఏతత్సర్వం గిరౌ భక్తి మాత్రేణైవ భవేద్ధ్రువమ్.
తత్త్వతో వేంకటాద్రేస్తు స్వరూపం వేత్తి కః పుమాన్
శ్రీనివాస గిరిశ్చాయం కదాచిత్కనకాచలః.
కదా చిత్ జ్ఞాన రూపోఽ యం కదా చ్ఛిద్రత్నరూపకః
శ్రీనివాస ఇవాభాతి కదాచిద్భూషణోజ్జ్వలః.
కాల భేదేన కేషాంచిత్ ప్రాకృతాచల రూపధృత్
తస్మాదస్య గిరేః పుణ్యం మాహాత్మ్యం వేత్తి కః పుమాన్."

ముఖ్యంగా అత్యంత భక్తి విశ్వాసాలతో ఈ వేంకటాద్రి పర్వతాన్ని ఎక్కినట్లయితే అనేక సిద్ధులు కలుగుతాయి.

కుంటివాడికి కాళ్ళు రావడమే గాక పరిగెత్తగలడు. పుట్టుగుడ్డివాడికి కమలాలవంటి కన్నులు వస్తాయి. ఇక మూగవానికి కేవలం మాటలు రావడమే గాక బృహస్పతివంటి వాడవుతాడు. చెవిటివాడు వినగల్గడమేకాక దూరశ్రవణ నైపుణ్యాన్ని కూడా పొందుతాడు.

"ఆమె పుట్టు గొడ్రాలు. ఆమెకు ఈ జన్మలో సంతానం కలుగనే కలుగదు" అని పేరు పడిన సంతానహీన అయిన స్త్రీ, ఈ సప్తగిరులను ఎక్కినట్లయితే ఆమె వంధ్యాత్వం పోవడమేగాక బహుసంతానాన్ని పొందుతుంది. నిర్ధనుడు ధనవంతుడగును. ఇలాంటి గొప్ప సంఘటలన్నీ వేంకటాద్రిమీది భక్తి విశ్వాసాలవల్ల మాత్రమే సిద్ధిస్తాయి. ఇలాంటి క్షేత్రంయొక్క అనంతమైన మాహాత్మ్యాన్ని ఏ మానవుడు ఏ మాత్రం తెలుసుకోగలడు? ఎంత వరకు తెలుసు కోగలడు?

ఒక్కొక్కసారి ఈ పర్వతం సాక్షాత్తు బంగారు మేరుపర్వతం మాదిరిగా సాక్షాత్కరిస్తుంది. ఒక పర్యాయం జ్ఞానరూపంగా, మరోసారి రత్నమయంగా, ఇంకోసారి సాక్షాత్తు ఈ కొండే శ్రీనివాసునిగాను, వేరొకప్పుడు అనేకానేక వజ్ర వైడూర్య మరకత మాణిక్యాలు పొదిగిన సర్వాభరణాలతో అలంకరింపబడి నయన మనోహరంగా సాక్షాత్కరిస్తుంది. కాని ఇలా ఏ పుణ్యాత్ములకో, ఏ మహనీయులకో, సాధకులకో అలా దర్శనమిస్తుంది తప్ప మిగిలినవారికి మాత్రం తన మహత్వాన్ని మరగుపరచుకొని వుంటూ ఈ వేంకటాచలపర్వతం కాలవశాన రాళ్ళు రప్పలచే నిండిన మామూలు కొండలాగా

గోచరిస్తుంది. అందువల్ల మహిమాన్వితమైన ఆ కొండ గొప్పదనాన్ని ఎవ్వరూ ఎంతమాత్రం తెలుసుకోలేరు. అసలు ఎంతమాత్రం ఊహించ జాలరుకూడా.

మరి నేను వీనిలో కొన్నింటిని విన్నాను. కొన్నింటిని స్వయంగా కన్నులారా నా భాగ్యం కొద్దీ దర్శించాను. స్వయంగా అనుభవించి ఆనందించాను. అయినా వాటిని పూర్తిగా మీకు వివరించజాలను, వివరించలేనుకూడా అంటూ సూత మహర్షి శౌనకాది మహర్షులతో పలుకుతూ, కాస్త విశ్రాంతి కోసం కనులు మూసుకుంటూ ధ్యాన నిమగ్ను డయ్యాడు.

వేంకటాద్రేస్తు మాహాత్మ్యం జనకర్ణ రసాయనమ్
శ్రుణ్వతాం నాస్తి తృప్తిస్తు మునీనాం నో బుధోత్తమ.
భూయః కథయ వృత్తాంతం శ్రుతం కించిత్త్వయా పురా
ఇత్యుక్తః ప్రాహ సూతోఽపి శ్రుతం చ ముని పుంగవాన్.

వెంటనే "ఓ సూత మహర్షీ! వేంకటాద్రియొక్క మాహాత్మ్యం మాకు చెవులకింపుగా వుంది. వింటున్న కొద్దీ మాకు ఇంకా ఇంకా వినాలని వుంది. కనుక ఓ యోగివర్యా! మీరు గతంలో విన్నదానిలో కొంతలో కొంతైనా మాకు తెలియజేస్తూ, మమ్మల్ని కృతార్థుల్ని చేయవలసిందిగా కోరుతున్నాం" అని శౌనకాది మునులు ప్రార్థించారు. అంత సూత మహర్షి ఆ వేంకటాచలపతి మహత్వం అనంతమైనది, అవ్యక్త మైనది. అయినా నా శక్తిమేరకు మీకు వివరిస్తాను అంటూ ఇలా కొనసాగించాడు.

## వైకుంఠ గుహ

త్రేతాయుగంలో జరిగిన దివ్యగాథ ఇది. శ్రీరామ లక్ష్మణులు అరణ్యావాసం చేస్తున్న సమయంలో రావణాసురుడు అపహరించిన సీతాదేవిని వెదకుతూ వానర సేనతో కలిసి వేంకటాద్రి దివ్యధామాన్ని చేరుకున్నారు.

ఆ సమయంలో ఆ పర్వత సానువులలో ఆంజనేయుని మాతృమూర్తి అయిన అంజనాదేవి తపస్సు చేసికొంటూ వుండింది. అచటికి వచ్చిన శ్రీరామచంద్రుణ్ణి చూచి అంజనాదేవి చాల ఆనందపడుతూ--

"నమస్కృత్య మహాభాగా వచనం చేదమబ్రవీత్
ప్రతీక్షన్తీ మహాబాహో త్వదాగమన మద్భుతమ్
తిష్ఠామ్యస్మిన్ గిరౌ రామ మునయోఽపి చ కాననే
తపః కుర్వన్తి సతతం త్వదాగమన కాంక్షయా

త్వాన్ష్వ్రాన్ష్వ మనుజ్ఞాప్య గంతు మర్హసి సువ్రత!
ఇత్యుక్తః ప్రాహ రామోఽపి హనూమన్మాతరం ప్రతి."

రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ ఓ మహానుభావా! అద్భుతమైన ఆనందకరమైన నీ రాకకొరకై నేను ఎదురు చూపులు చూస్తున్నాను. అంతేకాదు, ఈ పర్వతంమీద అనేకమంది మునీశ్వరులందరు కూడా నీ ఆగమనాన్ని కోరుతూ ఎప్పుడెప్పుడా నీ దర్శనభాగ్యం కలిగేది అంటూ ఆతృతగా, దీక్షగా తపస్సులను చేసికొంటున్నారు. నీవు మా అందరి కోరికలను తీర్చి మా ఆతిథ్యాన్ని స్వీకరించి మమ్ములను కృతార్థులను చేసి వెళ్లవలసిందని ప్రార్థించింది.

అందులకు అంగీకరించిన శ్రీరాముడు హనుమదాది వానర వీరులతో కూడా వేంకటాచలాన్ని ఎక్కుతుండగా దారిలో ఎందరో ఋషులు శ్రీరాముని దర్శించి వేనోళ్ల కీర్తించారు. తమ జన్మలు ధన్యములయ్యాయని స్తుతించారు. ఇలా అందరినీ ఆనందింపజేస్తూ రామలక్ష్మణులు ఆ పర్వతం మీద ఆకాశగంగ తీర్థంవద్ద వున్న అంజనాదేవి ఆశ్రమానికి వెళ్లి ఆమెను సంతోషింప జేసినారు.

తదుపరి రామలక్ష్మణులు, హనుమంతుడు, సుగ్రీవ, అంగద జాంబవదాదిగా వున్న వానరులందరూ స్వామిపుష్కరిణిలో స్నానం చేసి విశ్రాంతి తీసుకొంటూ వుండినారు. ఇంతలో వానరులందరు సహజమైన చాపల్యంతో వేంకటాద్రిలోని కొండలు, కోనలను కలియ తిరుగుతూ వుండగా వారికి శ్రీ స్వామిపుష్కరిణికి ఈశాన్య దిశలో ఒక చీకటి గుహ కనపడింది. ఆ గుహలో ఏముందో చూడాలనే ఆసక్తితో వానరులు కొందరు అందులో ప్రవేశించారు. అలా లోపలికి కొంతదూరం వెళ్లేసరికి పెద్ద వెలుగుతో వున్న ఒక మహానగరం గోచరించింది. ఆ నగరంలో ఎందరో స్త్రీ పురుషులు కనపడినారు. వారందరూ విష్ణువు వలెనే శంఖ చక్రాలను ధరించి, తెల్లని వస్త్రాలతో ప్రకాశిస్తూ వుండినారు. ఇంకా లోనికి వెళ్ళగా ఆ నగర మధ్యంలో సూర్య ప్రకాశంతో వెలుగొందుతున్న ఒక దివ్య విమానం గోచరించింది. ఆ విమానం మేరు శిఖరం వలె గోచరిస్తూ అనేక మణి మంటపాదులతో విరాజిల్లుతూ వుండింది.

"చతుర్బాహు ముదారాఙ్గం శంఖ చక్ర ధరం పరమ్
పీతాంబర ధరం సౌమ్య మాసీనం కాంచనాసనే
ఫణామణి మహాకాన్తి విరాజిత కిరీటినమ్
భోగి భోగే సమాసీనం సర్వాభరణ భూషితమ్.

ఆసనోపరి విన్యస్త వామేతర కరామ్బుజమ్
ప్రసార్య దక్షిణం పాద ముద్ధృతే వామజానుని
ప్రసార వామహస్తాబ్జం శ్రీభూమిభ్యాం నిషేవితమ్
సేవితం నీళయా దేవ్యా వైజయన్త్యా విరాజితమ్
శ్రీ వత్స కౌస్తుభోరస్కం వనమాలా విభూషితమ్
కృపారస తరంగౌఘ పూర్ణ నేత్రామ్బుజ ద్వయమ్
శశిప్రభా సమచ్ఛత్రం చామరవ్యజనే శుభే
హస్తాభ్యాం ధారయంతీభిః నారీభిః సేవితం ముదా."

కోటి సూర్యప్రకాశంతో వెలుగుతున్న ఆ బంగారువిమానం నడుమ భాగాన వున్న ఆదిశేషుని వేయి పడగలపై దివ్యమైన మణులు ప్రకాశిస్తూ వుండినాయి. ఆ శేషునిపై శయనించియున్న చతుర్భుజుడైన శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చు చుండినాడు. ఆయన వక్షఃస్థలంమీద శ్రీమహాలక్ష్మి కొలువై వుండగా, భూదేవి నీళాదేవి అయనకు పాదసేవలు చేస్తూ వుండినారు. నారదాది యోగులు గానంచేస్తూ అనేక విధాలుగా ఆ స్వామివారిని స్తుతిస్తూ, కీర్తిస్తుండినారు. ఆయన కంఠంలో వైజయంతి మాల, శ్రీకౌస్తుభాది మణిహారాలు విరాజిల్లుచూ వుండినాయి. ఆయన చూపులు కరుణ రసంతో పొంగి పొరలుచుండెను. ఆ శ్రీమన్నారాయణునికి ఇరు వైపులా సేవకులు తెల్లని వింజామరులు వీస్తూ వుండగా మరికొందరు సేవకులు గొడుగులు ధరించి వుండినారు. కొందరు పుణ్యస్త్రీలు ఆ స్వామివారిపై సుగంధ పరిమళ ద్రవ్యాలను చల్లుతూ ఆనందంగా వుండగా ఆ వాతావరణమంతా ఒక అనంతమైన, అద్భుతమైన ఆధ్యాత్మిక తేజస్సుతో నిండివుండినది. ఈ దృశ్యాన్నంతా లోపలికి వెళ్లిన వానరులు దర్శించి ఆశ్చర్యానికి లోనయ్యారు.

ఇంతలో చతుర్భుజాలతోను, శంఖచక్రాది దండాలను ధరించిన ఒక పురుషుడు వింతగా చూస్తూ వున్న వానరులను బెదరించినాడు. వానరులు భీతులై ఒక్క ఉదటున పరుగెత్తుతూ గుహ బయటకి వచ్చిపడ్డారు. గుహ బయట వున్న మరికొంత మంది వానరులకు తాము చూచిన ఆశ్చర్యకరమైన ఘట్టాలను వివరించుగా, మిగిలినవారు కూడా మేము కూడా చూస్తాం! ఎక్కడ అంటూ ఆ గుహవైపు దృష్టి సారిస్తూ, రెండడుగులు ముందుకు వేసి మరింత విస్మయానికి లోనయ్యారు. ఇంతకుముందు తాము చూచిన మహానగరమూ, ఆ దివ్య పురుషుల జాడే కన్పించ

లేదు. మీదు మిక్కిలి వారు ప్రవేశించిన గుహ ఆనవాలు కూడ వారికి గోచరించ లేదు. ఇంతకుముందు తాము దర్శించిన దృశ్యమంతా కలా! లేక భ్రమనా! అని వింతవింతగా ఆశ్చర్యానికి లోనయ్యారు. తదుపరి తమ ప్రభువైన శ్రీరామచంద్ర మూర్తికి కూడ ఈ విషయాన్ని గూర్చి విన్నవించినారు.

"అనంత పుణ్యప్రదమైన ఈ వేంకటాచలపుణ్యక్షేత్రంలో సాక్షాత్తు వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుడు లీలా మానుష రూపంలో సంచరిస్తూ వుంటాడు. అందువల్లే ఈ పుణ్యస్థలం భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి పొందింది. ఈ కొండ మహిమ అనంతం, అవ్యక్తం. దేవతలకుకూడ ఈ కొండ గొప్పదనంలో ఆవగింజంతయినా అర్థంకాదు. మరి మీ పూర్వపుణ్యభాగ్యంవల్ల సాక్షాత్తు శ్రీమన్నారాయణుని దర్శనం కలిగింది. ఆ స్వామివారితో పాటు, శ్రీ భూదేవేరులను, ఆయన కింకరులను దర్శించుకొన్నారు. ప్రత్యేకంగా మీరు లోపలికి ప్రవేశించిన గుహ 'వైకుంఠ గుహ'. శ్రీ మహా విష్ణువునకు శ్రీ వైకుంఠం ఎలాగో ఈ క్షేత్రం కూడా అంతే ప్రీతికరమైంది. అందువల్లే ఇక్కడ విహరిస్తూ వుంటాడు. ఏ కొద్ది పుణ్యపురుషులకో, మహనీయులకు దర్శనమిస్తుంటాడు. అని శ్రీరాముడు వైకుంఠ గుహ ప్రాశస్త్యాన్ని భూలోక వైకుంఠమైన వేంకటాచల మాహాత్మ్యాన్ని సంగ్రహంగా వానరులకు వివరించినాడు. ఆ తర్వాత రామ లక్ష్మణులు లంకకు చేరుకొని సీతను అపహరించిన రావణాసురుని సంహరించి సీతాదేవితో పాటు అయోధ్యానగరాన్ని చేరుకొన్నారు అని సూతుడు అంటూ--

*"యదా యదా కలిః కాలో యదా వా జనతా గిరౌ*
*తదా గుహాయాం తస్యాంతు వసిష్యన్తీతి నః శ్రుతమ్.*
*ఏవం ప్రభావః శేషాద్రిః వసత్యస్మిన్ జగన్మయః.*
*నీలమేఘనిభం శ్యామం నీలోత్పలవిలోచనమ్*
*నీలాద్రి శిఖరస్థం తం భజామ్యత్రైవ సుస్థితమ్."*

కలికాలం సంభవించిన సమయాల్లో లేదా జన సమ్మర్దం ఎక్కువైన సందర్భాల్లో శ్రీమన్నారాయణుడు రహస్యంగా అగోచరుడై ఆ గుహలో కొలువై వుంటాడట! మరి శేషాచల మాహాత్మ్యం అనంతమైనది. అందువల్లే సర్వాంతర్యామి యగు వైకుంఠవాసుడు లీలాస్వరూపుడై తన నిత్య సూరులతో నిరంతరం విహరిస్తూ వుంటాడు.

నీలమేఘశ్యాముడు, నల్లని కలువలవంటి కన్నులతో ప్రకాశిస్తూ, నీలాద్రి అయిన వేంకటాచలంలో వేంచేసిన వున్న ఆ వేంకట భగవానుని నేను ఇక్కడి నుంచే స్మరిస్తూ ప్రార్థిస్తున్నాను. ఓ మహనీయులారా! మీ భాగ్య వశం చేత 'వైకుంఠ గుహ' యొక్క దివ్యగాథను వీనులవిందుగా విన్నారు కదా! ఈ కథ విన్నవారికి, వినిపించిన వారికి కూడా కలిదోషాలు పోతాయి. సర్వ సౌఖ్యాలు కలుగుతాయి. పెద్దలైన పరమ యోగులద్వారా నేను విన్న ఈ వృత్తాంతాన్ని మీకు తెలియజేసినందులకు నాకు కూడా పరమానందం కలుగుతున్నది అంటూ సూతుడు కనులు మూసుకొని శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని ధ్యానిస్తూ, అవ్యక్తమైన ఒక దివ్యానుభూతికి లోనయ్యాడు.

*"బధిరాణాం చ శ్రోత్రాణి త్వత్కథా శ్రవణం వరమ్*
*జడం మూకం చ వాచాలం కరోఽప్యధ్యయనాన్వితమ్*
*మందబుద్ధిం ప్రాజ్ఞతమం సాంఖ్యయోగ సమాధిగమ్*
*అకరస్య కరౌ దత్త్వా కరోషి తవ పూజకమ్*
*అపదస్య పదే దత్త్వా త్వత్తీర్థ క్షేత్ర గామినమ్*
*యద్యద్దుఃఖం భవేద్భక్తే తత్తత్సద్యో హరిష్యసి*
*కుబ్జత్వం కుష్ఠతాం నానారోగానప్యాభిచారికాన్*
*హృత్వా దదాస్యంగదార్ఢ్యం సౌందర్యం త్వద్దయాద్భుతా*
*శ్రీనివాస! బహూక్త్యా కిం భక్త సర్వార్తి నాశనే*
*సర్వార్థ పూరణే చాపి త్వత్సమోఽంబ దే నకుత్ర చిత్."*

"శ్రీ స్వామి! వేంకటేశా! చెవిటివానికి చెవులను ఇచ్చి మంగళకరమైన నీ దివ్య గాథను వినేట్లుగా అనుగ్రహిస్తావు. అలాగే మూగవానికి మాట్లాడగల శక్తిని ప్రసాదించి తద్వారా సర్వోన్నతమైన వేదాల్ని పఠించేట్లు చేస్తున్నావు కదా! ఓ శ్రీనివాసా! చేతులు లేని మొండివాడికి చేతులను ఇచ్చి నీ పూజ చేయించు కోవడమే గాక, కుంటివానికి నడకను ప్రసాదించి క్షేత్రసందర్శనం చేయించగలవాడవు నీవే గదా! అంతేకాదు ఎన్నెన్ని దుఃఖాలు వున్నాయో అలాంటి వాటినన్నింటిని పోగొడుతున్నావు. శరీరానికికలిగే ముసలితనం,కుష్ఠరోగం మున్నగు భయానకమైన రోగాలు, విషప్రయోగం వంటి దుష్ఫలితాలను పరిహరించి వజ్రదేహాన్ని ప్రసాదించే స్వామివి నీవే కదా!

అంతేకాదు ఓ స్వామీ! నీవు దానిని ప్రసాదిస్తావు. దీనిని అనుగ్రహిస్తావు అని గొప్పగా చెప్పడంలో ఏ మాత్రం ప్రయోజనం లేదు. సారాంశం ఏమిటంటే ఈ బ్రహ్మాండ భాండాలలో భక్తుల దుఃఖాలను పోగొట్టి సమస్త కోరికలను తీర్చడంలో నీకు సాటి రాగల వారెవరూ లేనే లేరు. అలాంటి మహిమాన్వితమైన నీ దివ్యగాథలను స్మరించే భాగ్యం కలిగింది కదా" అంటూ సూత మహాశయుడు శ్రీనివాసుని ప్రార్థించాడు.

## ఇంద్రాదులు విష్ణువును వెదకడం

పూర్వం ఒకానొకప్పుడు సనక నందనసనత్కుమార సనత్సుజాతులను మహర్షులు నలుగురు శ్రీ వైకుంఠానికి వెళ్లారు. శ్రీమన్నారాయణుని దివ్యసందర్శనం కోసం వచ్చిన ఈ మహా యోగులను లోనికి వెళ్లకుండా వైకుంఠం ద్వారపాలకులైన జయ, విజయులు అడ్డుకున్నారు. లోపల శ్రీ లక్ష్మీనారాయణులు ఏకాంతంగా వున్నారనీ, ఈ వేళలో వారి ఏకాంతానికి ఎంతమాత్రం భంగం కలిగించకూడదనీ, అందువల్ల వారిని లోనికి అనుమతించడం కుదరదని గట్టిగా అడ్డుపడినారు. తమకు కలిగిన అవమానానికి తీవ్రంగా కోపించి ఆ మహా యోగులు తమను అడ్డగించిన జయ విజయులను రాక్షసులుగా జన్మించమని శపించి వెళ్లిపోయారు. ఆ శాప ఫలితంగా ఆ ద్వార పాలకులు ఒక జన్మలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా పుట్టి, లోక కంటకులుగా వీరవిహారం చేశారు. ఆ సందర్భంలో శ్రీహరి, ఆదివరాహానిగా, ఉగ్ర నరసింహానిగా అవతారాలెత్తి ఆ రాక్షసులను సంహరించాడు.

మరొకసారి ఆ జయ విజయులు రావణ కుంభకర్ణులై జన్మించి లోకాలను పీడించసాగినారు. వీరు పెట్టే బాధలకు తట్టుకోలేక లోకాలన్నీ తల్లడిల్లినాయి. చివరకు ఈ రక్కసుల బాధలకు ఓర్వలేక దేవాంద్రాది దేవతలు, అనేకమంది ఋషులు, యోగులు విన్నవించుకొని రక్షించవలసిందని శ్రీమన్నారాయణుని వేడుకోవడానికి వైకుంఠానికి వెళ్లారు. అనేక విధాలుగా ప్రార్థిస్తూ తమకు దర్శనమిమ్మని ఎలుగెత్తి వేడినారు. అంతలో వారికి-- "ఓ మహనీయులారా! ఈ విషయాన్ని జాగ్రత్తగా వినండి! శ్రీ మహావిష్ణువు వైకుంఠ లోకంలో లేనే లేడు. ప్రస్తుతం భూలోకంలోనే ఒక దివ్యమైన పర్వతంపై విహరిస్తున్నాడు" అంటూ ఒక దైవవాణి విన్పించింది.

అందుకు ఆశ్చర్యపడుతూ ఇంద్రాదులు అందరూ భూలోకానికి వెళ్లి శ్రీ విష్ణుదేవుడు ఎక్కడ వున్నాడా అంటూ అన్నిచోట్లా గాలించారు. కాని వారికి భూమిమీద

శ్రీహరి ఎక్కడా కన్పించనందున మళ్లీ వైకుంఠానికి బయలుదేరారు. ఇంతలో ఆ దారిలో వారికి దేవర్షి అయిన నారద మునీంద్రులు ఎదురు పడ్డారు. దేవేంద్రాదులు తాము విష్ణుదేవుని దర్శనం కోసం లోకాలన్నీ వెదుకుతున్న సంగతిని నారదునితో విన్నవించారు. నారదుడుకూడా శ్రీహరి వైకుంఠంలో లేడనీ, అసలు ఆయన ఎక్కడున్నాడో ఎవరికీ తెలియదంటూ, అందరినీ బ్రహ్మదేవుడున్న సత్యలోకానికి పిలుచుకొని వెళ్లాడు. బ్రహ్మదేవునికి, తాము వచ్చిన విషయాలను వివరించి విష్ణువు దర్శనం చేయించవలసిందని అందరూ అనేక విధాలుగా ప్రార్థించారు. అంతలో బ్రహ్మ దేవుడు వారిని అందరిని ఓదారుస్తూ "విష్ణుమాయ అగమ్యగోచరం. ఆయన ఎక్కడున్నాడో ఎవరూ కనుగొనలేరు. భూలోకంలో అయోధ్యను పరిపాలిస్తున్న దశరథ మహారాజు సంతానార్థమై శ్రీ మహావిష్ణువును వేడుకొనుటకుగాను పరమ పవిత్రమైన వేంకటాచల క్షేత్రానికి రాబోతున్నాడు. ఆ పర్వతంపై శ్రీహరి దర్శనం కోసం తపస్సు చేయబోతున్నాడు. ఆ చక్రవర్తికి వరం ఇవ్వడానికి శ్రీమహావిష్ణువు దర్శనం ఇస్తాడు. అంతవరకు ఆ దివ్య క్షేత్రమైన ఆ వేంకటాద్రికి వెళ్లి దశరథ చక్రవర్తితోపాటుగా మనం అందరం కూడా శ్రీహరి కోసం తపస్సులను చేసుకొంటూ కాలం గడుపుదాం" అంటూ పల్కి దేవేంద్రాదులతో కలిసి బ్రహ్మ దేవుడు వేంకటాద్రిని చేరుకొన్నాడు. ఆ క్షేత్రంపైన నెలకొనివున్న అత్యంత పుణ్యప్రదమైన స్వామిపుష్కరిణి పవిత్రజలాలలో స్నానం చేస్తూ శ్రీస్వామి వారిని గూర్చి తపస్సు చేసుకొంటూ దేవతలందరూ శ్రీమహావిష్ణువు యొక్క దివ్య దర్శన భాగ్యం కోసం అర్రులు చాస్తూ నిరీక్షిస్తూ వుండినారు. ఇలా కొంతకాలం జరిగింది.

## దశరథుని వేంకటాచలయాత్ర

పురోహితుడైన వశిష్ఠ మహాముని ఆదేశంపై సంతానం కోసం దశరథమహారాజు వేంకటాచల దివ్య క్షేత్రం చేరుకున్నాడు. అప్పటికే ఆ పుణ్య స్థలంలో బ్రహ్మేంద్రాది దేవతలు, అనేకమంది పరమయోగులు అనేక విధాలుగా తపస్సులు చేసికొంటూ వుండటం చూచి దశరథుడు సంతోషంతో సతమతమయ్యాడు. ఈ మహనీయుల దర్శనంతో తన జన్మ ధన్యమయింది. తన తపస్సు వల్ల కాకపోయినా, ఈ మహనీయుల తపస్సువల్ల అయినా శ్రీహరి తప్పక ప్రత్యక్షమవుతాడనీ, తన కోరిక నెరవేరగలదనీ సంతోషించి దశరథుడు తాను తపస్సును ప్రారంభించాడు. ఇలా

కొంతకాలం గడిచింది. ఒకానొక దివ్య శుభోదయాన కోటి సూర్య తేజంతో ప్రకాశిస్తున్న ఒక బంగారు దివ్య విమానం పెద్ద మోత (శబ్దం) తో ప్రత్యక్షమైంది. ఆ బంగారు విమానం మహనీయమై ఆశ్చర్యకరమై, అద్భుతమైన తెల్లని మేఘంవలె స్వచ్ఛమైన కాంతితో, అనేక బంగారు శిఖరాలతో అలంకృతమై వుంది.

ఇంకా ఆ విమానం అనేకమైన రత్నాలతో పొదగబడింది. ముత్యాలహారాలతో శోభాయమానంగా అలంకరింపబడింది. దివ్యమైన ప్రకాశంతో మిరుమిట్లు గొలుపుతూ చూచేకొద్దీ ఆనందాన్ని పెంపొందించేదిగా వుంది.

అయితే ఆ పర్వత సానువుల్లో సంచరించే మునీంద్రులకు గానీ, ఇంద్రాది దేవతలకుగానీ, ముందు ఎన్నడూ, అలాంటి అద్భుత విమానం కనిపించనేలేదట!

ఆ మునులందరూ ఆ పర్వతం మీద మును పెన్నడూ చూడని అద్భుతాకృతి గల విమానాన్నీ ఆ విమానం మధ్యలో పురుషోత్తముడైన భగవానుని దర్శించారు. శంఖ, చక్ర, నందక, గదాధారియై, మరకత మాణిక్య వజ్ర వైడూర్యాలు పొదిగిన అనేక ఆభరణాలను అలంకరించుకొని, వక్షః స్థల మహాలక్ష్మితో ఇరువైపుల శ్రీ భూ నీళా దేవులతో ప్రకాశిస్తూ, కటి వరద హస్తాలతో పద్మపీఠంపై నిలిచి, కరుణాకటాక్ష వీక్షణాలతో శ్రీమహావిష్ణువు అక్కడ వున్న వారందరికీ దర్శన మిచ్చినాడు.

మునులతోపాటుగా బ్రహ్మేంద్రాది దేవతలు, తమకు దివ్య సందర్శన మిచ్చిన శ్రీనివాసుని అనేక విధాల ప్రార్థించారు. రావణ కుంభ కర్ణాదులను సంహరించి లోకాలకు వారి వలన కలిగిన బాధలను పోగొట్టవలసిందని అనేక విధాలుగా ప్రాధేయపడినారు. ఈ సందర్భంలోనే దశరథ మహారాజు శ్రీస్వామివారిని స్తుతిస్తూ తనకు సంతానాన్ని ప్రసాదించవలసిందని వేడుకొన్నాడు. శ్రీహరి వెంటనే వారి ప్రార్థనలను ఆలకించి దశరథునితో "ఓ రాజా! నీవు అయోధ్యకు వెళ్ళు. సంతానం కోసం పుత్రకామేష్టియాగం నిర్వహించవలసింది. ఆ యాగఫలంవల్ల నాకు సాటిరాగల నలుగురు పుత్రులు నీకు జన్మిస్తారు. వెంటనే బయలుదేరు. నీ కోరిక నెరవేరుతుంది. అభీష్ట సిద్ధిరస్తు!" అని ఆశీర్వదించి పంపినాడు.

తర్వాత బ్రహ్మేంద్రాది దేవతల, మునులవైపు తిరిగి చూస్తూ, శ్రీమహావిష్ణువు "నేను దశరథునికి ప్రసాదించిన వరంవల్ల మీ మీ కోరికలు కూడా నెరవేరతాయి. నేను దశరథునికి పుత్రునిగా మానవునిగా అవతరించి దుష్టరాక్షసులైన రావణ కుంభ కర్ణాదులను సంహరిస్తాను. ఈ క్రూరులకు మానవులవల్ల మాత్రమే మరణం

సంభవిస్తుంది. అందువల్లే నేను పురుషోత్తముడైన మానవునిగా అవతరించి రావణ కుంభకర్ణులను వధించి లోక రక్షణ చేస్తాను. అందువల్ల మీరు అందరూ, మీ మీ తపస్సులను చాలించి మీ మీ లోకాలకు వెళ్లి మీ మీ కార్యాలను నిర్వర్తిస్తూ వుండండి" అంటూ అక్కడ చేరిన వారందరికి వరాలను గుప్పించినాడు.

ఇంతలో బ్రహ్మ దేవుడు సంతోషిస్తూ, విష్ణు భగవానునికి చేతులు జోడించి, మనసారా ప్రార్థిస్తూ, "నా దొక సందేహం. తండ్రీ! నీవు శ్రీ వైకుంఠాన్ని వదలిపెట్టి, లీలా మానుష రూపంతో ఇక్కడ, ఈ వేంకటాచలంపై సంచరిస్తూ చాల కొద్దిమందికి మాత్రమే నీ దివ్య దర్శన భాగ్యాన్ని అనుగ్రహిస్తున్నావు. మరి ఈ భూలోకంలో సంచరిస్తూ కూడా నిన్ను ఈ మానవులందరు నిన్ను దర్శించలేక పోతున్నారు. అలా కాకుండ భూలోకంలోని మానవులందరు నిన్ను సులభాతి సులభంగా దర్శించేట్లుగా అనుగ్రహించి తద్వారా భూలోకంలో సుఖశాంతులు వర్ధిల్లేటట్లుగా వరమి" మ్మని ప్రార్థించినాడు.

వెంటనే శ్రీహరి "పుత్రా! నేను ఏదైతే సంకల్పించానో అదే నీవు కోరావు. కాని ప్రత్యక్షంగా అర్చా రూపంతో మానవులందరికి దర్శనమివ్వడానికి ఇంకా కొంతకాలం గడచిపోవాలి. అంతవరకు ఈ క్రీడాద్రిలో నేను లీలామానుష రూపంతో సంచరిస్తూ కొంతమంది యోగ్యులకు, మహనీయులకు మాత్రమే నా సందర్శనభాగ్యం కలిగిస్తుంటాను. అందువల్ల నీ కోరిక తీరడానికి ఇంకా కొంత సమయం పడుతుంది. ఆ తర్వాత నేను స్వయంవ్యక్త రూపంతో ఈ దివ్య క్షేత్రంపై వక్షఃస్థలమహాలక్ష్మితో అవిర్భవించి భక్తులైన మానవులందరికీ దివ్యదర్శనాన్ని అనుగ్రహిస్తూ వారి కోరికలనన్నింటిని తీరుస్తాను. అందరినీ తరింపజేస్తాను. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు" అని బ్రహ్మదేవునితో పలికి నిండుగా ఆశీర్వదించినాడు.

శ్రీనివాసుడు చూపించిన అనంతమైన కరుణకు బ్రహ్మ దేవుడు అపరిమిత మైన ఆనందాన్ని పొందుతూ "స్వామీ! శ్రీహరీ! మీరు మా కోరికలనన్నింటిని అనుగ్ర హించినందులకు చాలా సంతోషంగా వుంది. ఈ శుభ సందర్భంలో మీకు ఉత్సవాలతో పాటుగా అత్యంత వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించాలని మాకు అందరికీ మహా ఉత్సాహంగావుంది. మా ఉత్సాహాన్ని, ప్రోత్సాహి స్తూ, ఉత్సవాలు నిర్వహించడానికి అంగీకరించి మాకు ఆనందాన్ని కలుగజేయవలసింద"ని ప్రార్థించగా విష్ణువు అంగీకరించాడు.

## బ్రహ్మోత్సవాలు

బ్రహ్మదేవుడు, భక్తవత్సలుడైన శ్రీనివాసుడు అంగీకరించడంతో పరమానందాన్ని అనుభవిస్తూ దేవశిల్పి అయిన విశ్వకర్మను స్మరించి పిలిపించినాడు. శ్రీ భూనీళా సమేతంగా శ్రీనివాసుని ఊరేగించుటకుగాను మణిమయమైన ఒక దివ్య రథాన్ని తయారు చేయవలసిందని, అలాగే మహోన్నతమైన రథోత్సవంతోపాటుగా అనేక వాహనసేవలను నిర్వహించుటకుగాను, బంగారుమయమైన వివిధ వాహనాలను నిర్మించవలసిందని, ఈ మహోత్సవాలను తిలకించుటకు వచ్చే దేవ,దానవ, యక్ష, కిన్నర గంధర్వులు విడిది చేయుటకు అనేకమైన వసతులతో కూడిన దివ్య భవనాలతో కూడివున్న ఒక మహానగరాన్ని నిర్మించవలసిందని కోరినాడు. విశ్వకర్మ అందుల కంగీకరించి, అందరు ఊహించిన దానికంటే మహోన్నతంగా బ్రహ్మదేవుని ఆజ్ఞను నెరవేర్చినాడు.

అంతలో శ్రీవిష్ణ్వంశ సంభూతుడైన వైఖానసమహర్షి, శ్రీ మహావిష్ణువు శ్రీవైకుంఠంనుండి భూలోకానికి అవతరించిన లగ్నానికి సరిగ్గా, కన్యామాసంలోని శుక్ల పక్షంలో వచ్చిన శ్రవణ నక్షత్రంలో మంగళప్రదంగా అవబృథం జరుగునట్లుగా నిర్ణయించాడు. దానికి తొమ్మిది రోజులు ముందుగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ఆ నాటి నుండి తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు వైభవంగా జరుగునట్లుగా వైఖానసముని ముహూర్తం నిశ్చయించినాడు. సేనాధిపతి అయిన విష్వక్సేనుడు అన్ని దిక్కులకు తాను స్వయంగా వెళ్లి శ్రీనివాసునికి జరుపబడే బ్రహ్మోత్సవాలకు అందరినీ ఆహ్వానించి వచ్చినాడు.

శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు, ప్రతిఉత్సవానికి ముందుగా శ్రీస్వామివారి ప్రధానఆయుధమైన సర్వరక్షకుడైన శ్రీ సుదర్శనభగవానుడు పురవీధులలో ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా శ్రీనివాసుని ఉత్సవాలకు భంగం కలుగకుండా ఏర్పాట్లు చేసి పర్యవేక్షించినాడు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభించుటకు ముందురోజు దివ్యముహూర్తంలో విష్వక్సేనులవారి పర్యవేక్షణంలో మృత్సంగ్రహణం (పుట్టమన్ను సేకరణ), నవధాన్యాల అంకురార్పణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

రెండవ రోజున పుణ్యాహవాచనం, శాంతిహోమం, గరుడహోమం, కంకణ ధారణ, దత్తం (సంకల్పం) మొదలైన వైదిక కార్యక్రమాలన్నీ వైఖానసముని ఆధ్వర్యంలో పూర్తి అయిన తర్వాత శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీనివాసునికి నూతన వస్త్రాలతోను, వజ్ర వైడూర్య, మరకత మాణిక్యాలు పొదిగిన విశేష ఆభరణాలతోను, పుష్పమాలలతోను అలంకారం చేశారు. పిదప బంగారు పల్లకిలో ఆలయానికి ప్రదక్షిణంగా పురవీథుల్లో బ్రహ్మదేవుని సారథ్యంలో శ్రీదేవి భూదేవులతో కూడిన శ్రీనివాసుడు ఊరేగుతుండగా ఉత్సవాలు తిలకించడానికి వచ్చిన దేవ దానవ యక్ష గంధర్వులు, మానవులు..... ఇలా ఎందరో శ్రీనివాసునికి జయ జయధ్వానాలు చేశారు.

పిదప సుముహూర్తంలో బ్రహ్మదేవుడు గరుడపతాకాన్ని బంగారుధ్వజ స్తంభంపై వైభవంగా ఆరోహణ చేయించి, సకల దిక్కులలో వున్న అన్ని లోకాల వాసులను ఆహ్వానించి బ్రహ్మోత్సవాలను ప్రారంభింపజేశాడు. అది మొదలుగా తొమ్మిది రోజులపాటు పెద్ద శేషవాహనం, చిన్న శేషవాహనం, హంసవాహనం, సింహ వాహనం, కల్పవృక్షం, మోహినీఅవతారం, గరుడవాహనం, హనుమద్వాహనం, గజవాహనం, సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం..... రథోత్సవం మున్నగు ఉత్సవాలను, అంగరంగ వైభంగా బ్రహ్మదేవుడు జరిపించాడు. చివరిరోజున సుదర్శన సహితుడై శ్రీభూదేవులతో కూడి వున్న శ్రీనివాసునికి మంగళ స్నానాదులు పూర్తి అయిన తరువాత సుదర్శన భగవానునికి శ్రవణనక్షత్ర శుభ సమయంలో స్వామిపుష్కరిణిలో మంగళస్నానం అనే 'అవభృథం' కార్యక్రమం జరుపబడింది. ఆ సమయంలో సుదర్శన భగవానుడితోపాటు భక్తులందరూ స్వామి పుష్కరిణిలో మునకలిడుతూ పవిత్రస్నానాలు చేశారు. ఈ చక్రస్నాన కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.

"బ్రహ్మదేవుడు నిర్వహించిన ఈ ఉత్సవాలు 'బ్రహ్మోత్సవాలు'గా జగత్ప్రసిద్ధిని పొందుతాయని, ఈ ఉత్సవాలలో పాల్గొని దర్శించినవారి కోరికలన్నీ తప్పక తీరుతాయని, సుదర్శనునితో పాటు శ్రవణనక్షత్రం రోజున స్వామిపుష్కరిణిలో ఎవరైతే స్నానం చేస్తారో వారి పాపాలన్నీ నశిస్తాయని, సర్వ శుభపరంపరలు కలుగుతా" యని అంటూ విష్ణువు, ఈ బ్రహ్మోత్సవాలు ఇక మీదట నిరాఘాటంగా, నిరాటంకంగా జరుపబడతాయని వరాలిచ్చి వచ్చిన భక్తు లను వారి వారి స్థలాలకు సాగనంపినాడు.

అంత బ్రహ్మ దేవుడు చాలా సంతోషిస్తూ శ్రీనివాసునితో "స్వామీ! మీరు ఇకపై జగత్కల్యాణం కోసం అందరికీ ప్రత్యక్షంగా దర్శనం ఇస్తే బాగుంటుంది. అందు కోసం మీరు ఇక్కడే ప్రత్యక్షంగా నిలిచి అందరికీ దర్శనాన్ని అనుగ్రహించ వలసింది" అంటూ వేడికొన్నాడు.

శ్రీమహావిష్ణువు "నీ కోరిక తప్పక నెరవేరుతుంది. కాని అందుకోసం ఇంకా కొంతకాలం వేచివుండాలి" అంటూ అందరూ చూస్తూవుండగా శ్రీభూదేవులు కూడివున్న శ్రీనివాసుడు తన బంగారు విమానంతో సహా అదృశ్యమయినాడు.

శ్రీనివాసుడు అదృశ్యమైన దిక్కులో ఆశ్చర్యంతో చూస్తూ ఆ స్వామిలీలలు అగమ్య గోచరం కదా! అని అనుకొంటూ బ్రహ్మాది దేవతలు వారి వారి స్వస్థానాలకు వెళ్లిపోయారు అంటూ సూతమహర్షి వివరించగా శౌనకాది మునులు నిశ్చేష్టులై శ్రీనివాసుని దివ్యగాథను వింటూ, సంభ్రమానికి లోనై ఇలా అడిగారు.

"స్వామీ! సూతమహర్షీ! శ్రీ వేంకటేశుని దివ్యగాథ సర్వపాపహరం! పరమ పవిత్రం! మహిమోపేతమైన ఆ వృత్తాంతాన్ని కొనసాగించి సర్వజనులను కృతార్థులను చేయవలసింది అంటూ మునులందరూ అభ్యర్థించారు.

సూతమహర్షి వారి ప్రార్థనకు సమ్మతించినట్లుగా తలను ఊపుతూ ఇలా కొనసాగించాడు.

**వేంకటాచలపర్వతసానువులలో శ్రీమహాలక్ష్మి భూదేవులతోకూడి శ్రీమహావిష్ణువు** లీలామానుష రూపంతో విహరిస్తూ వుండినాడు. ఆ పర్వత లోయలలో సంచరిస్తూ పర్వత సోయగాలను, తిలకిస్తూ, అక్కడ వున్న పవిత్ర తీర్థాలతో జలకాలాడుతూ వుండినాడు. కొన్ని కొన్ని వేళల్లో ఉత్తములైన మానవులకు, తపస్సంపన్నులైన ఋషివర్యులకు స్వర్ణమయమగు ఆనందనిలయం అనే దివ్యవిమానంలో కొలువైవుంటూ సందర్శనాన్ని అనుగ్రహిస్తూ వుండినాడు. అలా దర్శించి, ప్రార్థించిన వారి అందరి కోరికలను నెరవేరుస్తూ వుండినాడు. ఆ స్వామివారికి ఇష్టమైనపుడు మాత్రమే భక్తులకు ప్రత్యక్షమవుతూ, కోరిన భక్తులకు కొంగుబంగారంగా, అర్థించినవారికి అరచేతి మాణిక్యంగా, కొలిచిన వారికి కోటి వరాలరాయనిగా......... ఇలాగ అనేక విధాలుగా వరాలను గుప్పిస్తూ వుండినాడు. మిగిలిన వేళల్లో అదృశ్యమై లీలామానుష రూపంలో ఆ వేంకటాచల క్షేత్రంలో విహరిస్తూ వుండినాడు.

శ్రీ వైకుంఠంలో శేషశాయి అయి శ్రీభూదేవులతో క్షీర సముద్రంలో సేవింపబడుతున్న శ్రీహరికి, భూలోకంలోని ఈ వేంకటాచల క్షేత్రరాజం అత్యంత

ఇష్టమైన దివ్యస్థానంగా ప్రసిద్ధికెక్కినందువల్ల ఈ క్షేత్రం భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి పొందింది. అలాంటి దివ్య క్షేత్రమైన ఈ వేంకటాచలం అనేకానేకమైన పేర్లతో, ఆయా యుగాల్లో పిలువబడుతూ వుండటమేగాక ప్రధానంగా కృతయుగంలోనూ, త్రేతా యుగంలోను, ద్వాపర యుగంలోను సాక్షాత్తు బంగారు పర్వతంగా, అనంతమైన, మణిమయమైన శిఖరాలతో భక్తులకు దర్శనమిస్తూ దివ్యానందాన్ని కలుగజేస్తూ, దర్శించిన వెంటనే సఫలీకృతుల్ని చేస్తూ వుండింది.

శ్రీ మన్నారాయణుడు తాను, హిరణ్యాక్షుని సంహారంకోసం శ్వేతరూపుడై ఆదివరాహస్వామిగా అవతరించి లీలామానుషరూపంతో ఈ వేంకటాచలంలో విహరిస్తూ కూడ, మరోవైపు సాక్షాత్తుగా శ్రీమహావైకుంఠంలో శేషశాయిగా విరాజిల్లుతూ తుంబురనారదాది మహాభక్తులతో నిరంతరం సేవింపబడుతూ కీర్తింపబడు తుండినాడు.

## చింతచెట్టు నీడన ఒక పుట్ట!

ఇలా వుండగా కొంతకాలానికి శ్రీ మహావిష్ణువుయొక్క మహిమోపేతమైన అనంతమైన లీలలను, గమనించిన నారదమహర్షి ఒకానొక సారి సత్యలోకానికి వెళ్లి తండ్రియైన బ్రహ్మదేవుని దర్శించి ఇలా ప్రార్థించినాడు. "తండ్రీ! తమరు శ్రీమహా విష్ణువును వేంకటాచల క్షేత్రంలో ప్రత్యక్షంగా దర్శనమిస్తూ భక్తులను అనుగ్రహించ వలసిందని ఆస్వామిని ప్రార్థించి చాలా కాలమైంది కదా! మరి ఇన్ని వేల ఏండ్లు గడచినా మీ అభ్యర్థనను ఆ స్వామి తీర్చినట్లు లేదుకదా! మీ ఈ కోరిక ఎప్పుడు తీరుతుంది మరి? ఈ భూలోక మానవులకు ఎప్పుడు ప్రత్యక్షంగా శ్రీమన్నారాయణుని దర్శనభాగ్యం కలుగుతుందో! వారు ఆ దివ్య సమయం కోసం ఇంకా ఎంతకాలం వేచివుండాలో కదా! అని సందేహ పరంపరలను వెలిబుచ్చినాడు.

వెంటనే బ్రహ్మదేవుడు "అవును నారదా! నీవు సమయానికి నాకు జ్ఞాపకం చేశావు. చాలా బాగుంది. నిజమే శ్రీమన్నారాయణుడు ఈ భూలోకంలో ముఖ్యంగా కలియుగ మానవులకోసం ప్రత్యక్షంగా దర్శనమిస్తూ కోరిన వరాలరాయనిగా "కలౌ వేంకట నాయకః" అన్న ప్రసిద్ధిని పొంది వరాలను ఇస్తానని దేవతలందరికీ వరాన్ని ప్రసాదించి చాలా కాలం గడచిపోయింది. ఆ విషయాన్ని గూర్చి నేనూ అనేక విధాల ఆలోచిస్తూ వుండగా, సరిగా అదే సమయంలో నీవు నా దగ్గరికి వచ్చి ఆ విషయంలో

నన్ను గట్టిగా ప్రయత్నించమన్నట్లుగా ప్రేరేపించావు. మరి ఈ మహత్కార్యం నెరవేరడానికి నీ సహాయ సహకారాలు కూడా కావాలి నారదా! అందుకోసం నీవు నిరంతరం సిద్ధంగా వుంటావు గదా నారదా!" అని ఆనతిచ్చినట్లుగా నారదుని వైపు చూచాడు. అంత నారదమహర్షి "నారాయణ! నారాయణ!! అది ఎంతటి మాట! లోకకల్యాణం కోసమే నేను కంకణం కట్టుకొని హరినామస్మరణ చేస్తూ త్రిలోక సంచారం చేస్తున్నవాణ్ణి గదా తండ్రీ! జగత్కల్యాణమూర్తి యైన శ్రీనివాసుడు భువిలో ప్రత్యక్షంగా కొలువై భక్తులందరికి సులభంగా దర్శనమిస్తూ అందుబాటులో వుండటానికి నేనేం చెయ్యాలో, అందులో నేనే పాత్ర ధరించాలో చెప్పు తండ్రీ! అది నామహద్భాగ్యంగా భావిస్తాను. వెంటనే ఆజ్ఞాపించు తండ్రీ!" అని ప్రార్థించాడు.

వెంటనే బ్రహ్మదేవుడు నారదునితో ఇలా అన్నాడు "నేను శేషాద్రి పర్వతాగ్రాన వున్న స్వామిపుష్కరిణి తీరాన ఒక దివ్య ప్రదేశంలో త్రేతాయుగంలో వున్న దశరథ మహారాజుయొక్క అంశతోను, ద్వాపరయుగంనాటి వసుదేవుని అంశతోను ఒక దివ్యమైన చింతచెట్టును సృష్టిస్తాను. ఆ చెట్టు పెరిగి పెద్దదై శాఖోపశాఖలతో విరాజిల్లుతూ మహావృక్షమై అలరారుతుంది. ఆ వృక్షంక్రింద సమీపంలో, శ్రీరామ చంద్రుని మాత అయిన కౌసల్యాదేవి అంశతోను, అలాగే శ్రీకృష్ణ భగవానుని మాత అయిన దేవకీదేవి అంశతోను విశాలమైన ఒకపుట్టను ఏర్పాటు చేస్తాను. ఓ నారదమహర్షీ! నీవు ఎలాగైనా బాగా ఆలోచించి శ్రీ వైకుంఠంలో విరాజమానుడైన శ్రీమన్నారాయణుడు, వేంకటాద్రిలో స్వామిపుష్కరిణి చెంతవున్న చింతచెట్టుక్రింది పుట్టలోనికి చేరునట్లుగా ప్రయత్నించు. ఏ మాత్రం అలసత్వం లేకుండా ఈ కార్యాన్ని తొందరగా నిర్వర్తించు. అలా చేసినట్లయితే మన కోరికా తీరుతుంది. తద్వారా భూలోకవాసులైన కలియుగ మానవుల భాగ్యంకూడ పండుతుంది. వారికి శ్రీస్వామి వారిని ప్రత్యక్షంగా దివ్య దర్శనం చేసుకొని తరించే దివ్య సమయం కూడ త్వరలో వస్తుంది" అంటూ బ్రహ్మ దేవుడు స్వామిపుష్కరిణీతీరాన ఒక చింతచెట్టునూ, దానిక్రింద ఒక పుట్టనూ సృష్టించాడు.

వెంటనే బ్రహ్మదేవుని చేత సృష్టింపబడిన ఆ దివ్య వృక్షాన్ని, ఆ చెట్టునీడలో ఆవిర్భవించిన వల్మీకాన్ని నారదమహర్షి సంభ్రమాశ్చర్యాలకు లోనై కన్నులారా దర్శించి, వాటికి అత్యంత భక్తి ప్రపత్తులతో నమస్కరించాడు. తదుపరి బ్రహ్మదేవునితో ఇలా అన్నాడు.

చరాచర సృష్టికర్తయైన ఓ తండ్రీ! నీవు సృష్టించిన ఈ వృక్షరాజం, దాని చ్ఛాయలో వున్న వల్మీకం అద్భుతమైన తేజస్సుతో ప్రకాశిస్తున్నాయి చాల అద్భుతం! కాని జగత్కల్యాణం కోసం శ్రీమహావిష్ణువును భూలోకానికి రప్పించే ఈ వల్మీకంలో ప్రవేశపెట్టించగలనా? అది నాతో సాధ్యమయ్యే కార్యమేనా? ఏది ఏమైనా ద్వాపరయుగం పూర్తి కావస్తున్నది కదా! భూలోకంలో ఎక్కడచూచినా పాపం పెచ్చు పెరిగిపోతున్నది. మరి తన దివ్యలీలలతో దుష్టుల్ని శిక్షిస్తూ, శిష్టుల్ని రక్షిస్తూ కలియుగంలో ఆదుకొనేందుకు సాక్షాత్తు ఆ పరంధాముడే భువిపై తనకు తానై అవతరింపజేసుకోవాలి. అందుకు మనం తోడ్పడాలి తప్ప, కేవలం ఇతరులకు సాధ్యంకానే కాదు. అయినా మీ ఆనతి ప్రకారం అలాగే ప్రయత్నిస్తాను, అంటూ నారదుడు బ్రహ్మదేవునికి నమస్కరించి వీడ్కోలు తీసుకొన్నాడు.

శ్రీ వైకుంఠవాసుడు లోకకల్యాణం కోసం ఈ భూలోకంలో ఎప్పుడు అవతరిస్తాడో, అప్పుడు తాను అందుకోసం ఎలాగైనా తోడ్పడాలి అని ఆలోచిస్తూ నారద మహర్షి అందుకోసం మార్గాన్ని అన్వేషిస్తూ నారాయణ! నారాయణ! అంటూ తిరుగు తుండినాడు. ఇలా చాలా కాలం గడచి పోయింది.

## యాగం ఎవరికోసం?

చివరకు ద్వాపరయుగంకూడా పూర్తి కావచ్చింది. ద్వాపరయుగం చివరిరోజుల్లో అక్కడక్కడ మిగిలి వున్న ధర్మం అడుగంటి పోతుండింది. ఎటుచూసినా దుర్మార్గం, దౌష్ట్యం, అశాంతి, నిర్లిప్తత చోటు చేసుకొన్నాయి. దీనితో అధర్మం పెచ్చుపెరిగి వీరవిహారం చేస్తున్న రోజులు అవి. అంతేగాక విచ్చలవిడి శృంగారం లోకమంతటా విజృంభించింది. కాంతా కనకాలే ప్రాధాన్యం వహించాయి. మద్యం ఏరులై పారింది. మాంస భక్షణం మితిమీరిపోయి హింస చోటుచేసుకుంది. ఇలా లోకులందరూ దుర్భరమైన పరిస్థితుల్లో బతుకుల్ని బరువుగా ఈడుస్తూ భగవంతుని అనుగ్రహానికి అర్రులు చాస్తూ వున్న రోజులు అవి.

అలాంటి సమయంలో మహర్షులు, పరమయోగులు, మునీశ్వరులు......... ఇలా ఎందరెందరో గంగాతీరంలో ఒక్క చోట చేరారు. లోకంలో చెలరేగిన అశాంతిని గూర్చి విచారించారు. లోక కల్యాణాన్నిగూర్చి, ప్రశాంతతనుగూర్చి అనేక విధాలుగా చర్చించారు. ఎన్నెన్నో విధాలుగా ఆలోచించారు. చిట్టచివరకు, త్వరలో లోకక్షేమం సిద్ధించడానికి అతి సులభమైన మహత్కార్యం 'యజ్ఞం' అని నిర్ణయించారు. ప్రపంచ

శాంతికై.తాము నిర్వహించబోయే మహోన్నతమైన యాగానికి కావలసిన సంభారాలన్నీ సమకూర్చుకున్నారు. ఒకానొక శుభప్రదమైన రోజున శుభముహూర్తంలో యజ్ఞాన్ని చేయడానికి పూనుకొన్నారు.

అక్కడ చేరినవారందరూ, లోకంలోని అశాంతి తొలగి జగత్కల్యాణం సిద్ధించాలని సంకల్పం చేసుకొని, అత్యంత భక్తి ప్రపత్తులతో నియమనిష్ఠలతో యజ్ఞం ప్రారంభిస్తున్న శుభతరుణంలో అక్కడికి నారద మునీంద్రులు వచ్చారు. ఋషులంతా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. తాము ప్రారంభించబోతున్న యాగానికి దేవర్షి అయిన నారదుడు రావడం శుభసూచకమనీ, తమ కార్యం తప్పక సిద్ధిస్తుందనీ భావించి, ఆనందిస్తూ నారదమహర్షిని సగౌరవంగా ఆహ్వానించారు. భక్తిపూర్వకంగా ఆయనకు అర్ఘ్య పాద్యాచమనాలను సమర్పించారు.

నారదమహర్షి వారిఆదరణకు చాల తృప్తి చెందుతూ, "మహనీయులారా! మీరేదో శుభప్రదమైన మహత్కార్యంలో మునిగి వున్నట్లున్నారు! ఏంచేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు" అని ప్రశ్న పరంపరల్ని గుప్పించాడు. మహర్షి పుంగవులందరూ ఆయన రాకను వేనోళ్ల పొగడుతూ లోకకల్యాణం కోసం తాము తలపెట్టిన యజ్ఞాన్ని గూర్చి నారద మహర్షితో వినయంగా విన్నవించారు. అందుకు నారదుడు సంతోషిస్తూ చాల బాగుంది. ఈ యజ్ఞకార్యం సంకల్పించడం శుభసూచకమే. మీకోరిక తప్పక నెరవేరుగాక! నెరవేరుతుంది కూడా. కాని ఈ యాగం ఎవరి కోసం చేస్తున్నారు?. ఈ యజ్ఞం ఏ దేవుణ్ణి గూర్చి నిర్వహించబడుతున్నది? మీ దృష్టిలో ఎవరు వున్నారు" సవివరంగా తెలియ జేయండి అన్నాడు. అందులకు కార్యనిమగ్నులైన ఋషు లందరూ ఒకరి మొగాలొకరు వింతగా చూసుకొన్నారు. అవును మనం ఈ యాగాన్ని ఎవరిని ఉద్దేశించి చేస్తున్నాం! అంటూ ఒకరి సందేహాన్ని మరొకరు ముఖ కవళికలతో ప్రశ్నించు కొన్నారు. ఇంతలో నారదుడే మాట్లాడుతూ ఇలా అన్నాడు.

దేవతలలో కెల్ల త్రిమూర్తులైన బ్రహ్మదేవుడు, శ్రీమహావిష్ణువు, పరమేశ్వరుడు అత్యంత ప్రధానులు కదా. వారి ముగ్గురిలో కూడా ఆర్తులను ఆదుకొనే ఆపద్బంధవు ఎవరు? మొక్కిన వెంటనే వరమిచ్చే దేవుడు ఎవడు? అన్ని పాపాలను పొగొట్టే దేవాధిదేవుడు ఎవరు? భక్తులపాలిటి పారిజాతమై అరచేతి మాణిక్యమై కొంగు బంగారమై కోరినవరాలను అన్నింటిని గుప్పించే సర్వోత్తముడైన దేవుడు ఎవరో ముందుగా పరీక్షించుకొని నిర్ణయించండి. అలాంటి దేవునివల్ల జగత్కల్యాణం తప్పక

సిద్ధిస్తుంది. అందువల్ల ఈ యజ్ఞానికంటె కూడ ముందుగా ఆ కార్యాన్ని కొనసాగించండి!" అంటూ మునులందరితో వీడ్కోలు తీసుకున్నాడు.

## ఎవరు గొప్ప!

మహర్షులందరూ నారదుడు చెప్పిన సలహాను గూర్చి ఆలోచించారు. ఆయన చెప్పినది నిజమేకదా! మనం ఎవరిని గూర్చి ఈ యజ్ఞాన్ని తలపెట్టాలి! ఆ మహర్షి చెప్పినట్లుగా ముందుగా త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో గొప్పవారు ఎవరో నిగ్గుదేల్చిన తర్వాత, వారిని గూర్చి ఈ యాగాన్ని చేద్దాం అని నిర్ణయించారు. అయితే త్రిమూర్తులను పరీక్షించి వారిలో ఉత్తమోత్తముడైన దేవుడు ఎవరో నిర్ణయించడం సామాన్యులకు సాధ్యమయ్యేపనేనా? మరి ఈ కార్యాన్ని ఎవరికి అప్పజెప్పితే బాగుంటుంది. ఎవరు ఈ కార్యాన్ని అత్యంత సమర్థంగా నిర్వహించ గలరు? అని అనేక విధాలుగా చర్చించుకొని చివరకు ఈ కార్యాన్ని తపస్సంపన్నులు పరమభక్తుడైన భృగుమహర్షికి అప్పజెప్పారు. 'ఈ కార్యభారాన్ని వహించి చక్కగా నెరవేర్చ గలవాడివి నీవే' అంటూ అనేకవిధాలుగా ప్రార్థించారు. వీరి ప్రార్థనతో జగత్కల్యాణం తప్పక సిద్ధించబోతోందన్న స్ఫురణ గలిగి, భృగుమహర్షి అందుకు అంగీకరించి, కంకణం కట్టుకొని బయలుదేరాడు" అంటూ సూతమహర్షి విన్పించాడు.

## సత్యలోక ప్రయాణం

నారదమహర్షి ఆదేశం మేరకు, మహర్షుల ప్రార్థన మేరకు భృగుమహర్షి తొలుత సత్యలోకానికి బయలు దేరినాడు. దారిలో ఆయన పరిపరివిధాల ఆలోచిస్తూ "మహోన్నతులైన త్రిమూర్తులను పరీక్షించి, వారిలో ఎవరు పరమ సత్త్వసంపన్నులో, ఎవరు లోకకల్యాణ కారకులో, ఎవరు భూలోకవాసుల కష్టాలను పారద్రోలగలరో తేల్చి చెప్పడం ఎంతో అసాధ్యమైన కార్యం కదా! మరెంతో ప్రమాదమైన కార్యం కదా ఇది! అయినా ఈ నా ప్రయత్నంలో భవిష్యత్తులో జరుగనున్న జగత్కల్యాణ మహత్కార్యం గోచరిస్తున్నది. మరి ఇందుకు నేను పాత్ర వహించడం నా సుకృతం కదా" అని అనుకుంటూ నడుస్తున్నంతలో సత్యలోకం చేరుకున్నాడు భృగుమహర్షి.

ఆ సత్యలోకంలో దివ్యమైన విశాలమైన సభా భవనంలో చదువులతల్లి సరస్వతితో కూడిన బ్రహ్మదేవుడు తన చతుర్ముఖాలతో శుభ్ర సుభగంగా నాలుగు వేదాలను వల్లిస్తూవుండినాడు. మరోవైపు సంకల్పమాత్రం చేతనే చరాచర జగత్తులను

సృష్టిస్తూ వుండినాడు. మరోవైపు సభాస్థలిలో వేంచేసి వుండి, తనను అనేక విధాల కీర్తిస్తూ వున్న వివిధ దేవతలను, పరికిస్తూ తన క్రీగంటి చూపులతో అనుగ్రహిస్తూ వుండినాడు. ఇలాంటి శుభప్రదమైన వేళలో మంగళప్రదమైన దివ్య సభాస్థలిలో ప్రవేశించిన భృగుమహర్షి, జగత్పిత అయిన బ్రహ్మదేవుని, సరస్వతిదేవిని వినయ వినమ్రంగా దర్శించినాడు. సాష్టాంగ ప్రణామా లాచరించినాడు అనేక విధాల స్తోత్రం చేసినాడు.

సరస్వతీదేవితో సంగీత సాహిత్య రసాస్వాదన చేస్తూ లీనమైవున్న బ్రహ్మదేవుడు గాని, వీణాగానం చేస్తూవున్న సరస్వతీదేవిగాని, ఆ సభలో వేంచేసి మైమరచివున్న ఇతరదేవతలుగాని, భృగుమహర్షి రాకను గమనించనే లేదు. ఆయన ప్రార్థనల్ని విననేలేదు సరికదా! కనీసం కన్నెత్తి అయినా భృగువును చూడనే లేదు. అయినా, ఆ మహర్షి మరింత ఓపికతో బ్రహ్మదేవుని ప్రార్థిస్తూ, ఆయన చూపులో పడాలని అనేక విధాల ప్రయత్నించి విఫలుడయినాడు. ఇది తనను ఉద్దేశించి బ్రహ్మదేవుడు స్వయంగా చేసిన అవమానంగా గోచరించింది భృగుమహర్షికి! ఇంతే కోపం కట్టలు తెంచుకుని ప్రవహించింది. తీవ్రమైన ఆ కోపంలో "ఎంతటి సృష్టికర్త అయినా ఎంతటి వేదసంపన్నుడైనా ఈ బ్రహ్మదేవుడు రజోగుణంతో నిండివున్నాడు. ఇతనిలో సత్త్వగుణం ఏ మాత్రం రవంతయినా వెదకినా కనిపించదే! ఇతను లోకానికి ఏమి మేలు చేయగలడు? కనుక ఇతడు దేవతలలో కల్ల సర్వోన్నతమైన స్థానం పొందడానికి గాని లేదా, మహర్షులు సమర్పించబడే యజ్ఞఫలాన్ని అందుకోవడానికిగాని అర్హుడు గాడు" అని అనేకవిధాలుగా ఆలోచించి ఒక నిశ్చయానికి వస్తూ, తీవ్రమైన కోపం తగ్గక రజోగుణ ప్రధానుడైన చతుర్ముఖ బ్రహ్మదేవునికి భూలోకంలో అర్చనలు, ఆరాధనలు మున్నగు పూజలు లేకుండు గాక" అని శపించి అక్కడి నుంచి వెనుదిరిగి తిన్నగా కైలాసం వైపు నడక సాగించినాడు.

## కైలాస సందర్శనం

సత్యలోకంలో దేవతల సమక్షంలో సాక్షాత్తు బ్రహ్మదేవుడు తనకు చేసిన తీవ్రమైన అవమానాన్ని గూర్చి ఆలోచిస్తూ అన్య మనస్కుడై అశాంతితో కైలాసంవైపు నడక సాగించినాడు. సత్యలోకంలో తనకు కలిగిన అశాంతి, దివ్యమంగళ సన్నిధానమైన కైలాసంలో అయినా తొలగుతుందేమో అన్న ఆశతో ఆర్తితో తిన్నగా కైలాసం చేరుకొన్నాడు భృగుమహర్షి. అక్కడా కూడా అయనకు చుక్కెదురయ్యింది.

ఏకాంతంగా పార్వతీ పరమేశ్వరులు వున్నారని, అలాంటి సమయంలో ఎవరూ ప్రవేశించరాదని, ప్రవేశించ కూడదని, ద్వారపాలకుడైన నందీశ్వరుడు అడ్డం పడ్డాడు. అసలే కోపంతో సమయాసమయాలు స్ఫురించని భృగువు నందీశ్వరుని తొలగద్రోచి లోపలికి ప్రవేశించినాడు. లోపల అభ్యంతరమందిరంలో పార్వతీ పరమేశ్వరులు సరస సల్లాపాలతో, ఆనందంగావున్న సమయంలో తీవ్రమైన కోపంతో ప్రవేశించిన భృగువును వారు చూడనే లేదు. అయినా ఆ ఋషి పార్వతీ పరమేశ్వరు లను అనేక విధాల కీర్తించినాడు, స్తుతించినాడు. ఇతని స్థితిని గమనించిన పార్వతీదేవి భృగువు రాకను పరమశివునకు విన్నవించింది. తమ ఏకాంతానికి భంగం కలిగిస్తూ దురుసుగా లోపలికి ప్రవేశించిన భృగువును చూచి శివుడు శివమెత్తి నాట్యం చేస్తూ తన త్రిశూలంతో చంపటానికి ప్రయత్నించినాడు. అంతలో పార్వతీదేవి పరమశివునకు అడ్డుపడుతూ "ప్రభూ! విచక్షణా జ్ఞానం లోపించిన ఈ ఋషిని నిండుదయతో పెద్ద మనసుతో క్షమించి వదలిపెట్ట వలసింద" ని ప్రార్థించింది.

పార్వతీదేవి అడ్డుపడటంతో ప్రాణాలు నిలిచిన భృగువు బ్రతుకు జీవుడా! అని ఆలోచిస్తూ, అయినా ఈ పరమేశ్వరుడు తామసగుణంతో నిండి వున్నాడు. మరి ఇలాంటి దేవుడు ఎలా సర్వోన్నతుడుగా స్థానం పొందగలడు? ఎలా మా యజ్ఞఫలాన్ని పొందగలడు? ఇతనికా అర్హత లేదు గాక లేదు. మరి ఇలాంటివాడు భూలోకంలో స్థాణువై, లింగాకారంలో మాత్రమే పూజలు పొందును గాక!" -- అంటూ శపించి వెను తిరిగినాడు.

## శ్రీవైకుంఠ ప్రవేశం

కైలాసంలో తీవ్రమైన మనస్తాపాన్ని పొందిన భృగుమహర్షి తనకు జరిగిన అవమానాన్ని గూర్చి పరి పరివిధాలుగా ఆలోచిస్తూ శ్రీ వైకుంఠాన్ని చేరుకొన్నాడు.

శ్రీ వైకుంఠంలో క్షీరసముద్రంలో, ఆదిశేషుడు తన వేయిపడగలను గొడుగుగాను, శరీరాన్ని పాన్పుగాను అమర్చి సేవిస్తూ వుండగా, ఆ శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు పవళించి, అరమోడ్పు కన్నులతో వుండినాడు. ఆయన హృదయంపై శ్రీమహాలక్ష్మీదేవి తల ఆనించి, కన్నులలో కన్నులు పెట్టి ఆనందంగా చెపుతున్న విషయాలను మైమరచి వింటూ విష్ణు భగవానుడు పరమానందంగా గడుపుతున్న మధుర క్షణాలు అవి. అలాంటి రసవత్తరమైన గంభీరమైన సన్నివేశంలో భృగుమహర్షి

వైకుంఠంలో ప్రవేశించి, ఆ దివ్య దంపతులను దర్శించుకొన్నాడు. అనేక విధాలుగా స్తుతించినాడు.

"ప్రసన్నో నీలమేఘస్త్వం శ్రీ భూవిద్యుత్సమన్వితః
హృద్వ్యోమగస్త్రి తాపఘ్నో భక్త సర్వేష్ట వార్షుకః
అభీష్టాష్టమ వారాశౌ నిమజ్యోన్మజ్జితం నిజమ్
ఆనన్దాష్ట మను ద్వీపే సంస్థాపయసి చాదరాత్
సర్వ సౌఖ్య మిహాముత్ర స్వర్మక్త్యా నన్ద వర్ధనః."

"ఓ స్వామీ! శ్రీహరీ! నీవు అత్యంత ప్రసన్నుడివై వుంటూ భక్తులకు 'సర్వాభీష్టాలు' అనే వర్ష పరంపరల్ని కురిపిస్తుంటావు. మరి వర్షాల్ని కురిపించే మేఘాలలాగ నీవు ఇంద్ర నీలమణి వంటి దేహకాంతితో ప్రకాశిస్తూ వుంటావు. నీ హృదయాకాశంలో వింతవింతలుగా మెరుస్తున్న మెరుపు తీగలవలె శ్రీదేవి భూదేవులు వేయి వెలుగులతో ప్రకాశిస్తున్నారు. భక్తులకు నీ సందర్శనం వల్ల తాపత్రయాలైన ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవికములను పోగొట్టడమేగాక సకల కోరికలను వర్షిస్తుంటావు కదా ప్రభూ! అంతేగాదు సప్త సముద్రాల కతీతమైన ఎనిమిదవ సముద్రంగా పిలువబడే "అనంతానంతమైన అభీష్టాలను ప్రసాదించడం" అను కృపాసముద్రంలో నీ భక్తులను మునక లెత్తిస్తూ వారి వారి కోరికలను నెరవేరుస్తూ మహానందమనబడు ఎనిమిదవ ద్వీపంలో మహావాత్సల్యంతో వారికి స్థానాన్ని కల్పిస్తావు. అనగా ఇహపర సుఖాల్ని ప్రసాదిస్తూ, తద్వారా అలౌకిక ఆనందాన్ని ప్రసాదిస్తుంటావు కదా ప్రభూ!" అని భృగువు అనేక విదాలుగా ప్రార్థిస్తూ, కీర్తిస్తూ సాష్టాంగ దండప్రణామాలాచరించినాడు.

భృగువు ఇన్ని విధాలా ఆర్భాటంగా అట్టహాసంగా కీర్తిస్తున్నా, పరిసర వాతావరణాన్నీ, బాహ్య ప్రపంచాన్నీ పూర్తిగా మరచిపోయి, శ్రీమహాలక్ష్మితో సరస సంభాషణలతో మునిగినట్లుగా భ్రమింపచేస్తూ గోచరిస్తున్న జగన్నాటక సూత్రదారి అయిన మహావిష్ణువు పరాకుగా వుండినాడు. భృగువు రాకను గాని, ఆయన ప్రార్థనల్ని గాని గమనించనట్లుగానే మహాలక్ష్మిని మరింత దగ్గరగా వక్షః స్థలానికి హత్తుకొన్నాడు.

అప్పటికే సత్యలోకంలో బ్రహ్మదేవుని దగ్గరా, కైలాసంలో పార్వతీ పరమేశ్వరుల సన్నిధిలో తీవ్రంగా అవమానింపబడ్డ భృగువు తోక తొక్కబడిన కోడెత్రాచులాగా మరింత

ఎగిరిపడ్డాడు. ఆవేశంతో ఊగిపోయినాడు. కోపం కట్టలు తెంచుకొని వచ్చింది. తనేమిటి? పరమోన్నతుడైన పరంధాముడేమిటి? అన్న విచక్షణ జ్ఞానంకూడ కోల్పోయినాడు. ఇక్కడా ఎదురైన నిరాదరణకు తాళలేక పోయినాడు. కైలాసంలో, సత్యలోకంలో కేవలం మాటలతో సరిపెట్టుకొన్న ముని, ఇక్కడ ఈ వైకుంఠంలో దుశ్చేష్టలకు పాల్పడ్డాడు. అంతే తీవ్రమైన ఆవేశకావేశాలకు లోనై పరిగెత్తుకొంటూ వెళ్లి శ్రీమహావిష్ణువు వక్షః స్థలంలో తన్నటానికి తన కాలును ఎత్తాడు. ఏకాంతంలో పరమ ప్రశాంతమైన వాతావరణంలో ఆదమరచి శ్రీపతిఎదపై తల ఆన్చివున్న శ్రీమహాలక్ష్మీదేవి ఈ హఠాత్పరిణామానికి అదిరిపడి, తీవ్రమైన ఆందోళనతో ఉలిక్కిపడి పక్కకు తొలిగింది. అంతే ఆ ఋషి కాలు లక్ష్మీదేవికి నిరంతరం ఆవాసస్థానమైన శ్రీమహా విష్ణువు యొక్క వక్షఃస్థలంపై బలంగా తాకింది. ఈ విపరీత సంఘటన నుండి తేరుకొన్న శ్రీహరి, వెంటనే శేషపాన్పు నుండి తటాలున లేచి నిలబడినాడు. కోపంతో ఊగిసలాడుతున్న మహర్షిని చిరునవ్వుతో చూచినాడు. పైపెచ్చు రెండు చేతులు జోడించి ప్రణామాలాచరించినాడు. అంతేకాదు, ఆ మహర్షివర్యుని రాకను గమనించని తమ ఏమరుపాటును క్షమించమని ప్రాధేయపడుతూ, ఆ మునిని గౌరవంగా శేషపాన్పుపై కూర్చొండబెట్టి, పెక్కువిధాల అనునయించినాడు. మునీశ్వరుని పాదాలచెంత కూర్చొన్న భగవానుడు పాదాలను ఒత్తుతూ, ఆ మునిపాదంలో విచిత్రంగా వున్న 'కన్ను' ను నలిపివేశాడు. దానితో ఋషికి తన అహంకారం, అజ్ఞానం తెలిసివచ్చింది. తన తప్పిదాన్ని క్షమించమని అనేక విధాలుగా స్తుతించినాడు.

"శ్రీవత్స వక్షసం శ్రీశం శ్రీలోలం శ్రీకర గ్రహమ్
శ్రీమన్తం శ్రీనిధిం శ్రీఢ్యం శ్రీనివాసం భజేஉ నిశమ్."

"స్వామీ! సర్వజగత్ప్రభూ 'శ్రీవత్సం' అనే మచ్చ (గుర్తు) ను నీ వక్షః స్థలంలో కలిగివుంటావు. లక్ష్మీదేవితో హావభావాలతో లలిత శృంగారాలలో ఆసక్తిగా వుంటావు. లక్ష్మీదేవిని నీకర పద్మలో స్వీకరించినవాడవు. ఋగ్వేదాది చతుర్వేదాలలో పరిపూర్ణుడవు. సమస్తైశ్వర్యంచే సంపూర్ణుడవు. త్రిమూర్త్యాత్మక శక్తులైన శ్రీమహాలక్ష్మి, శ్రీమహా సరస్వతి, శ్రీపార్వతీదేవిలకు మూలభూతమై ప్రకాశిస్తూవున్న సాక్షాత్తు రమాదేవి చేత నిత్యమూ నుతింపబడున్న ఓ శ్రీనివాసా! నిన్ను నేనే నిరంతరం భజిస్తాను" అంటూ భృగువు అనేక విధాలుగా రమాదేవితో కూడివున్న శ్రీమహావిష్ణుని

ప్రార్థించినాడు. త్రిమూర్తులలో శ్రీమహావిష్ణువు ఒక్కడే పరమోన్నతుడు, పరమశ్రేష్ఠుడు, సత్త్వగుణ సంపన్నుడు అని నిర్ణయించి ఆయనే తాము నిర్వహించే యాగఫలాన్ని స్వీకరించడానికి యోగ్యుడు అని తీర్మానించినాడు. ఇలా శ్రీ మహావిష్ణువు యొక్క పురుషోత్తమత్వాన్ని అనేక విధాలుగా భావిస్తూ పరిపరి విధాలుగా ఆలోచిస్తూ వైకుంఠాన్నుంచి భూలోకానికి బయలుదేరాడు భృగు మునీశ్వరుడు.

నారదుని ఆనతి మేరకు, మహర్షుల ప్రార్థనపై భృగు మహర్షి త్రిలోకాలకు వెళ్లి, త్రిమూర్తులలో కెల్ల శ్రీ మహా వైకుంఠవాసుడైన శ్రీ మహావిష్ణువే సర్వోన్నతుడైన దేవాధిదేవుడని నిగ్గ తేల్చుకొని వచ్చి చెప్పగా మునీశ్వరు లందరూ శ్రీ మన్నారాయణుని గూర్చి, యజ్ఞాన్ని ఘనంగా నిర్వర్తించి, యజ్ఞఫలాన్ని ఆయనకే సమర్పించి కృత కృత్యులయ్యారు.

## ఆదిలక్ష్మి అలుక!

పరమ కోపిష్ఠి అయిన భృగుమహర్షి తన శ్రీవారి వక్షః స్థలాన్ని తన్ని అపవిత్రం చేసిన ఆ ఋషి చేష్టను ఏ మాత్రం సహించలేక పోయింది శ్రీ మహాలక్ష్మి. "నిరంతరం అనపాయినిగా శ్రీస్వామివారి ఎదలో వుంటున్న తనను ఈ వెర్రివాడు విచక్షణ జ్ఞానం ఏ మాత్రం లేకుండా తీరని అవమానం చేశాడు. ఇంతటి దుశ్చర్యను చేసిన ఆ మునిని దండించకపోగా విష్ణుభగవానుడు, మీదు మిక్కిలి శేషపాన్పుపై సగౌరవంగా కూర్చోన బెట్టినాడు. అంతటితో ఊరుకోక తనన తన్నినందుకు అతని పాదాలు కందినవో, ఏమోనని అతని పాదాలను ఒత్తుటయా! ఇది మరింత భరింపరాని వేదన" అని తలపోస్తూ లక్ష్మీదేవి అవమాన భారంతో కుంగిపోయింది. ముని పాద తాడనంతో అపవిత్రమైన శ్రీస్వామివారి హృదయంలో తనకు ఇక స్థానం లేదని పరి పరివిధాలుగా తీవ్ర మనస్తాపంతో వైకుంఠాన్ని వదలి భూలోకానికి బయలుదేరింది.

తనను విడిచి వెళ్లవద్దని, తనను క్షమించవలసిందని అంటూ, "ఆ మునీశ్వరుడు గొప్ప తపస్సంపన్నుడు మాత్రమేగాక అంతరంగిక భక్తుడు కూడ. అందువల్ల ఏదో తెలియని ఆవేశంతో చేసిన దోషాన్ని క్షమించటం తప్పు ఏమాత్రం కానే కాదు. అంతేకాదు. ఆయన కాళ్లను ఒత్తడం నిన్నవమానం చెయ్యటం కోసమే అని ఏ మాత్రం తలంచనే వద్దు. ఆ కార్యం ద్వారా ఆయన పాదంలో వున్న అహంకార నేత్రాన్ని నలిపివేసి, అతని తప్పును తెలుసు కొనేట్లుగా చేశాను. అందువల్ల ఆ ఋషీశ్వరుడు తన అపరాధాన్ని మన్నించమని వేడికొంటూ అనేక విధాలుగా నిన్నూ,

నన్నూ కీర్తించాడు, ప్రార్థించాడు, ప్రాధేయపడినాడు. అందువల్ల లక్ష్మీ! నీవు అలుకను పూర్తిగా మానివేసి, నన్ను ఈ వైకుంఠాన్ని విడిచి ఎక్కడికీ వెళ్లవద్దు" అని విష్ణుదేవుడు మహాలక్ష్మిని వేడికొన్నాడు. అయినా లక్ష్మీదేవి ససేమిరా! అని పట్టినపట్టు వీడక తీవ్రమైన కోపంతో, ఏ మాత్రం తరగని దుఃఖభారంతో ఆయన ప్రార్థనను చెవిని బెట్టక నిర్లక్ష్యంచేసి వైకుంఠాన్ని విడిచి భూలోకానికి చేరుకొంది. భూలోకంలో పరమపవిత్రమైన పుణ్యస్థలమైన కొల్హాపురమనేచోట ఒంటరిగా తపమాచరించుకొంటూ కాలం వెళ్లబుచ్చుతూ వుండింది.

## విష్ణుదేవుని తరలిరాక!

శ్రీవైకుంఠంలో అనునిత్యం తనను సేవించడంద్వారా ఆనందాన్ని కలిగిస్తూ, తద్వారా తానూ పరమానందాన్ని పొందుతూ వున్న ఇల్లాలు మహాలక్ష్మీదేవి, ఇలా అర్థాంతరంగా, ఆ తాపసి కారణంగా తనను విడిచి వెళ్లడం విష్ణువు ఏ మాత్రం భరించలేకపోయాడు. ఇల్లాలు లేని ఇల్లు కళావిహీనమై వెలుగొందినట్లుగానే శ్రీవైకుంఠంకూడ ఆ జగదేకమాత లేనందువల్ల కళాకాంతుల్ని పోగొట్టుకొని వెల వెల పోయింది. ఇక లక్ష్మిలేని ఈ వైకుంఠంలో నా కేమిటి పని? అని తీవ్రమైన విరహంతో విష్ణువు వైరాగ్యానికి లోనయ్యాడు. లక్ష్మీ! ఓ లక్ష్మీ!! అంటూ వెర్రిగా కేకలేస్తూ వైకుంఠాన్ని వదలిపెట్టి లక్ష్మీదేవి నడచిన దారిలోనే భువికి తరలి వచ్చాడు. అయినా ఆమె జాడ కానరాలేదు. ఆమె కోసం భూలోకమంతా వెతికి వెతికి వేసారినాడు. కాని విష్ణువునకు లక్ష్మి ఎక్కడ వున్నదో, ఎక్కడ దాగి వున్నదో కూడ ఆచూకీ తెలియరాలేదు. లక్ష్మీదేవి లేకుండా వైకుంఠానికి వెళ్లడం బాధాకరమని తలంచాడు. లక్ష్మీదేవి లేని శ్రీ వైకుంఠం ప్రవేశించడం వ్యర్థమనిపించింది. ఇలా ఆలోచిస్తూ శ్రీనివాసుడు తిరుగుతూ తిరుగుతూ చివరకు వేంకటాచల పర్వతాన్ని చేరుకొన్నాడు.

## విచిత్రమైన చెట్టు! వింతయైన పుట్ట!!

మహామహిమోపేతమైన శ్రీ వేంకటాచలపర్వత సానువులలో తిరుగుతూవున్న శ్రీమహా విష్ణువునకు ఒక పుష్కరిణి (కోనేరు) కనపడింది. ఆ పవిత్ర పుష్కరిణికి ఒడ్డున అతి సమీపంలో దక్షిణ దిక్కున విశాలమైన ఒక చింతచెట్టు గోచరించింది. ఆ చెట్టుకు కాండము బాగా లావుగా వుండి, దాని కొమ్మలు, రెమ్మలు శాఖోపశాఖలుగా పెరిగి అత్యంత విస్తృతంగా వ్యాపించి వుంటూ, ఆ చెట్టు నీడ ఎటూ తిరగక, ఆ

వృక్ష మూలంలోనే స్థిరంగా పడేది. అందువల్లే ఆ 'చెట్టునీడ తిరుగనిచింతచెట్టు' అని ప్రసిద్ధి పొందింది. అంతమాత్రమే గాక అది నిద్రపోని (ఉన్నిద్ర తింత్రిణీ వృక్షం) చింతచెట్టుగా పిలువబడింది. దాని శాఖలు కొన్ని చిగిరించగా మరికొన్ని శాఖలు పుష్పించగా, ఇంకొన్ని శాఖలు కాయలు, పండ్లు కాస్తూ వుండేది. ఇలా అన్ని కాలాల్లో విశ్రాంతి అనేది ఎరుగక ఆ చెట్టు నిరంతరం చిగిరించటం, పుష్పించటం, ఫలించటంవల్ల అది నిద్రపోని చింతచెట్టుగా పిలువబడింది.

దిక్కుతెలియక, దిక్కుగానక తిరుగుతున్న శ్రీనివాసుడు బాగా అలసిపోయినాడు. అలా అలసి పోయిన విష్ణువునకు ఆ చింతచెట్టు చల్లని నీడలో సేదతీర్చుకొమ్మని తనను పిలిచినట్లుగా తోచింది. అంతే ఆనందంతో విశాలమైన ఆ చింతచెట్టు కిందికి చేరాడు. అక్కడే ఆ చెట్టు కిందే వున్న విశాలమైన పుట్టలోని తొర్రలో తలదాచుకొన్నాడు. ఆ చింతచెట్టును, ఆ చెట్టుక్రింది పుట్టను శ్రీనివాసుని కోసమే బ్రహ్మదేవుడు సృష్టించాడు కదా! బ్రహ్మ దేవునిచే నిర్మింపబడిన చెట్టు క్రింది పుట్టలో కొన్నివేల ఏండ్లు శ్రీహరి తలదాచుకొని కాలం వెళ్లబుచ్చసాగినాడు అని సూతమహర్షి వివరిస్తుండగా శౌనకాదులు ఇలా అడిగారు. "మహర్షీ! శ్రీమహావిష్ణువు వేంకటాచల పర్వతంపైన ఆ చింతచెట్టు క్రిందవున్న ఆ పుట్టలోనే ఎందుకు తలదాచుకొన్నాడు?"

సూతుడు వాళ్ల ప్రశ్నలకు అదో వింతగాథ! ఇంతకు ముందే మీకు జెప్పాను. అయినా మళ్లీ వినండి. ఆ చెట్టు సామాన్యమైన చింతచెట్టు కాదు. ఆ చెట్టు క్రింది పుట్ట కూడా మామూలు చీమలపుట్ట కాదు, పాముల పుట్ట అంత కన్నా కాదు.

త్రేతాయుగంలో రామావతార సమయాన శ్రీరామచంద్రుని ఎడబాటుకు దశరథుడు విలపించి విలపించి మరణించినాడు. ఆ తర్వాత కౌసల్యాదేవి కూడ రాముని ఎడబాటుతో చాల పరితపించింది. అందువల్ల వారిరువురికీ రామునిపై ఎంతమాత్రం మమకారం తీరనే లేదు. అలాగే ద్వాపరయుగంలో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు శ్రీకృష్ణపరమాత్మునిగా అవతరించినాడు. కాని అప్పటి పరిస్థితులనుబట్టి ఆ కృష్ణుడు తల్లిదండ్రులైన దేవకీవసుదేవులవద్ద గాక గొల్లపల్లెలో యశోదానందులవద్ద పెరిగి పెద్దవాడైనాడు. అందువల్ల దేవకీ వసుదేవులకు కూడ పుత్రుని మీది మమకారం తీరనే లేదు.

అందువల్లనే అటు త్రేతాయుగంలో కౌసల్యా దశరథులకు, ఇటు ద్వాపరయుగంలో దేవకీ వసుదేవులకు కలిగిన బాధను తీర్చి పుత్ర సుఖాన్ని

కలిగించటానికి బ్రహ్మదేవుడు సంకల్పించాడు. తదనుగుణంగా బ్రహ్మదేవుడు, దశరథ వసుదేవుల అంశతో ఈ నీడ తిరుగని చింతచెట్టునూ, అలాగే కౌసల్యాదేవి దేవకీ మాతల అంశలతో చెట్టుక్రింది పుట్టనూ సృష్టించాడు. జగత్కల్యాణం కోసం భువికి తరలి వచ్చిన శ్రీమహావిష్ణువు వేంకటాద్రి క్షేత్రంలో కోనేటి తీరాన చెట్టుక్రింది పుట్టలో వాసం చేసి జన్మ జన్మల మాతాపితల ఋణాన్ని తీర్చుకొన్నాడు.

## గోపాలిక! ఆవూ! దూడా!

ఏ ఆలనా పాలనా లేకుండ శ్రీవైకుంఠపతి కారడవిలో చింతచెట్టుక్రింద వున్న పెద్ద పుట్టలో తలదాచుకొని ఆకలి దప్పులతో అలమటిస్తూ వున్న విషయం బ్రహ్మాది దేవతల ద్వారా కొల్హాపురంలో వున్న శ్రీమహాలక్ష్మి విని చాలా బాధ పడింది. అయినా ఆయన దగ్గరికి వెళ్లడానికి ససేమిరా! నిరాకరించింది. చివరకు శ్రీనివాసునికి ఆకలి దప్పులు దీర్చడానికి బ్రహ్మదేవుడు, శివుడు ప్రార్థించగా లక్ష్మీదేవి అంగీకరించింది.

వారి కోరికపై తాను గోపాలికగానూ మారింది. బ్రహ్మదేవుడు గోవుగాను, శివుడు దూడగానూ మారగా వారిని గోపాలిక అయిన లక్ష్మీదేవి వెంటనిడుకొని ఆ ప్రాంతాన్ని పాలిస్తున్న చోళరాజు ఆస్థానానికి చేరుకొంది.

అసాధారణమైన దేవతాంశ కలిగిన ఇటువంటి ఆవూ, దూడ మీదగ్గరే వుంటే చాలా బాగుంటుందని వాటిని ఆ రాజుకు విక్రయించి కొల్హాపురానికి తిరిగి వెళ్లిపోయింది.

## శ్రీనివాసుని క్షీరపానం!

గొల్లవారి పసులకాపరి ప్రతిరోజూ ఆలమందతో పాటు కొత్తగా వచ్చిన ఆవుదూడలను కూడ మేతకు తోలుకొని వెళ్లేవాడు. మేతకు వెళ్లిన కొత్తఆవు, దూడతోకూడ పసులమందను వదలిపెట్టి గొల్లకాపరి కన్నుగప్పి అడవిలో చింత చెట్టు క్రిందవున్న పుట్టలో దాగి వున్న శ్రీనివాసుని వద్ద కెళ్లి పుట్టలో ధారగా పాలుగార్చేది. పుట్టలోని దేవుడు ఆ పాలను కడుపారా తాగుతూ తృప్తి చెందేవాడు. పాలను కార్చిన తరువాత మళ్లీ యథా ప్రకారం ఆవూ, దూడా మందలో చేరి రాజుగారి గోశాలకు చేరుకొనేవి. ఇలా కొంతకాలం సాగింది.

## చోళరాజుకు శాపం!

పిల్లవానికి అవసరమైన పాలను ఆ కొత్తగోవు ఏ మాత్రం ఇవ్వనందున రాణిగారు గొల్లవానిపై కోపించి, రాజుగారికి ఫిర్యాదు చేసింది. రాజుగారు వాణ్ణి

దండించడమే గాక కొరడాతో దెబ్బలు కొట్టించి, జాగ్రత్తగా ఆవునూ,దూడనూ గమనించవలసిందని హెచ్చరించినాడు. ప్రాణభీతితో ఆలమందలోని కొత్త ఆవునూ, దూడనూ జాగ్రత్తగా గమనిస్తున్న గొల్లవానికి ఒక విచిత్ర సన్నివేశం కంట పడింది.

యథాప్రకారం మరునాడు ఆవు మెల్లగా మందను విడిచిపెట్టి కొండలు గుట్టలు దాటుకుంటూ పుష్కరిణి సమీపంలో వున్న పుట్టను ఎక్కి దాని బొరియలో పాలను ధారగా కార్చసాగింది. తన ప్రాణానికి గండం తెచ్చిపెట్టిన ఆవు వింతగా పుట్టలో పాలను కార్చడం చూచి కోపం పట్టలేక గొల్లవాడు దొంగచాటుగా వెళ్లి, ఆవుపై గొడ్డలిని ఎత్తి ఒక్క వేటును శక్తి కొద్దీ గట్టిగా కొట్టాడు. అలికిడికి ఆవు బెదిరి పక్కకు తప్పుకోగా ఇంతలో పుట్టలో దాగి వున్న శ్రీనివాసుడు గబాలున పైకి లేచాడు. అంతే వున్నఫళంగా ఆ గొల్లని గొడ్డలివేటు శ్రీనివాసుని నుదుటికి తగిలి బొట బొట నెత్తురు జిమ్మింది. ఆ పసులకాపరి గబాలున తన గొడ్డలి వేటుకు నెత్తురు చిమ్ముతున్న శ్రీనివాసుణ్ణి చూస్తూ దిక్కుతోచక దిమ్మెరపోయి భయభ్రాంతుడై అక్కడికక్కడే మృతి చెందినాడు.

వెంటనే ఆవు పరిగెత్తుకొంటూ చోళరాజు ఆస్థానానికి కెళ్లి కన్నీరు కారుస్తూ అంబారవాలు చేసింది. నానా గగ్గోలు పెట్టింది. ఈ పరిస్థితిని గమనించిన రాజు ఆందోళనతో ఆవు వెంట నడచి, గొల్లవాడు చచ్చిపడివున్న పుట్టదగ్గరకు చేరు కొన్నాడు. ఇంతలో పుట్టలో దాగివున్న స్వామివారు పైకి వచ్చి "ఓరీ పాపాత్మా! నీవు చాలా ఘోరకృత్యం చేశావు. చక్కగా పాలిస్తూ నన్ను రక్షిస్తున్న పవిత్రమైన గోమాతను నీ సేవకుడు కొట్టాడు. దాన్ని రక్షించడానికి నేను పూను కొన్నప్పుడు నాకు ఈ గాయం తగిలింది. దీనికంతా కారణం నీవు వెర్రిగొల్లవాణ్ణి బెదిరించడమే. ఈ అనుచిత కార్యం వల్ల నీకు మహాపాపం సంక్రమించింది. ప్రజలు, సేవకులు, భార్యాపిల్లలు చేసిన పాపాలు ప్రభువునకు చెందుతాయి. అందువల్ల ఈ దుష్కార్య ఫలితాన్ని నీవు తప్పక అనుభవించి తీరాలి. కనుక ఈ క్షణమే నీవు పిశాచ రూపాన్ని పొందుదువు గాక" అని శ్రీనివాసుడు తీవ్రంగా శపించాడు.

"దేవాదిదేవా! స్వామీ! తెలియక జరిగిన దోషానికి ఇట్లా శపించడం నీకు తగినదేనా స్వామీ!" అంటూ అనేక విధాలుగా కీర్తిస్తూ ప్రాధేయపడినాడు. ఆశ్రిత వత్సలుడైన శ్రీనివాసుడు కరుణించి "రాజా! కొద్దికాలంలోనే ఆకాశరాజు తన కూతురు పద్మావతిని నాకు ఇచ్చి పరిణయం చేస్తాడు. అల్లుడనైన నాకు ఆ రాజు ఒక బంగారు

కిరీటాన్ని కానుకగా ఇస్తాడు. దాన్ని నేను ధరించిన సమయంలో నీకు శాప విముక్తి కలుగుతుంది'' -- అంటూ వరమిచ్చాడు. వెంటనే చోళరాజు పిశాచమై వెడలిపోయినాడు.

ఇంతలో అక్కడ చచ్చిపడివున్న గొల్లవాని బంధువులు వచ్చి స్వామివారికి వరపడి లబోదిబో మన్నారు. శ్రీనివాసుడు వారికి అభయమిస్తూ 'భూలోకంలో నన్ను తొలిగా దర్శించిన వ్యక్తి ఆ పసులకాపరి. ఇకమీదట కలియుగాంతంవరకు ఇతని సంతతివారైన మీకు ప్రతిరోజు తొలిగా దర్శనం చేసుకొనే భాగ్యాన్ని ప్రసాదిస్తున్నాను'' అంటూ వారికి వరమిచ్చినాడు.

పిదప గొల్లవానివల్ల కలిగిన గాయాన్ని మాన్పు కోవడానికి వనమూలికల కోసం వెదకుతున్న శ్రీనివాసునికి ఆదివరాహస్వామి కనిపించాడు. ఈ వరాహస్వామి అంతకు ముందే చాలకాలం కింద అక్కడ ఆ క్షేత్రంలో స్థిరపడినాడు. వరాహస్వామి వారికి తన దీన గాథను విడమర్చి చెప్పుతూ శ్రీనివాసుడు, తానూ ఆ క్షేత్రం మీద ఉండటానికి నూరు అడుగుల స్థలాన్ని దానంగా ఇమ్మని ప్రార్థించాడు.

వరాహస్వామివారు శ్రీనివాసుని కోరికను సమ్మతిస్తూ, తానిచ్చే నూరు అడుగుల స్థలానికి డబ్బు చెల్లించవలసిందని కోరాడు. ప్రస్తుతం తన వద్ద చిల్లి గవ్వైనా లేదనీ, అందుకు ప్రతిఫలంగా తన దగ్గరికి దర్శనార్థం వచ్చే భక్తులచేత, యాత్రికుల చేత 'మొదటి పూజ, మొదటి నైవేద్యం, మొదటి దర్శనం'' వంటి ఏర్పాటును కట్టడిగా చేయిస్తానని శ్రీనివాసుడు వాగ్దానం చేశాడు. అలాగే దానశాసన పత్రంకూడా రాసిచ్చాడు. అందుకు వరాహస్వామి అంగీకరించి స్వామిపుష్కరిణీ దక్షిణ తీరంలో శ్రీనివాసునికి స్థలాన్ని ధారాదత్తం చేశాడు.

## వరాహస్వామి ఎవరు?

పూర్వం ఒకానొకప్పుడు జలప్రళయం ఏర్పడింది. ఆ ప్రళయంలో లోకాలన్నీ నీటిలో మునిగిపోయాయి. అదే సందర్భంలో హిరణ్యాక్షుడనే దుష్టరాక్షసుడు భూమండలాన్ని బంతిగా చేసుకొని ఆడుకొంటూ నానాభీభత్సం చేశాడు. చివరకు నీటిలో భూమిని ముంచి అల్లకల్లోలం చేశాడు. ఆ సమయంలో శ్రీమహావిష్ణువు శ్వేత వరాహరూపంలో అవతరించి తనవాడి కోరలతో హిరణ్యాక్షుని సంహరించి, నీటిలో మునుగుతున్న భూదేవిని ఉద్ధరించి రక్షించినాడు. యక్ష కిన్నర గంధర్వాది దేవత లందరూ, శ్రీ భూవరాహస్వామి మీద పూలవానకురిపించి అనేక విధాలుగా కీర్తించారు.

ఇదే శ్వేతవరాహ రూపంతోనే, భూదేవితో కూడి దర్శనం ఇస్తూ ఈ వేంకటాచలక్షేత్రంపైనే, మరికొంతకాలం పాటు దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేస్తూ వుండవలసిందని అందరూ అనేక విధాలుగా ప్రార్థించారు. అందరి కోరికలను మన్నించి సరేనన్నాడు శ్రీవరాహస్వామి. అప్పటినుంచే శ్వేత వరాహకల్పం ప్రారంభం అయింది. అంతేకాదు, భూదేవిని రక్షించి, భూదేవితో కలిసి ఆదివరాహస్వామి స్థిరపడి కొలువై దర్శనమిస్తూ వున్న ఈ దివ్యక్షేత్రమే ఆదివరాహక్షేత్రంగా ప్రసిద్ధి కెక్కింది. అక్కడే ఆ క్షేత్రంలో కొలువై వున్న ఆది వరాహస్వామివారిని వకుళమాలిక అనే యోగిని సేవిస్తూ సపర్యలు చేస్తూ కాలక్షేపం చేస్తూ వుండేది.

ఇలా కొంతకాలం గడచింది. ఇంతలో వృషభాసురు డనే క్రూర రాక్షసుడు ఆ కొండల కోనల్లో తిరుగుతూ అక్కడ తపమాచరించుకొంటున్న మునులను బాధిస్తూ వుండేవాడు. సజ్జనులను హింసిస్తూండేవాడు. వాళ్లందరూ వెళ్లి వరాహస్వామితో విన్నవించుకున్నారు. వాని బారినుండి తమను రక్షించమని అనేక విధాలుగా ప్రాధేయపడినారు. శ్వేత వరాహస్వామి చాలకాలంపాటు ఆ వృషభాసురునితో యుద్ధం చేసి, వాణ్ణి సంహరించాడు. అలా వీర విజయంతో తిరిగివస్తున్న సందర్భంలో వరాహస్వామికి ఆ పర్వతంలో తలమీది గాయంతో రక్తం కారుతూ, మూలికల కోసం అన్వేషిస్తూ వున్న శ్రీనివాసుడు కనపడ్డాడు.

శ్రీనివాసుని దీనగాథనంతా ఆలకించిన ఆదివరాహస్వామి వకుళమాలికను శ్రీనివాసునికి సేవ చెయ్యమని ఆదేశించినాడు. వరాహస్వామివారి ఆనతిపై నియోగింప బడిన వకుళమాత ఆక్షణంనుండి శ్రీనివాసుని కన్నకొడుకువలె భక్తిప్రేమలతో సేవించుతుండినది.

## ఎవరీ వకుళమాత!

ద్వాపరయుగంనాటి గాథ ఇది. ఆ యుగంలో శ్రీ విష్ణు భగవానుడు శ్రీకృష్ణునిగా అవతరించాడు. ఆ యుగంలో పొత్తిళ్లనాటి నుండి శ్రీకృష్ణుని పెంచి పెద్ద చేసిన మాతృమూర్తి యశోదాదేవి. ఆబాల్యం నుంచి శ్రీ కృష్ణుని కంటికి రెప్పలా కాచి రక్షిస్తూ పెంచి పెద్ద చేసింది. చిన్నప్పటి నుంచి ఎందరో రాక్షసులను సంహరించిన లీలల్నీ, మహిమల్నీ కన్నులారా చూచి ఆనందించింది. అయినా యశోదకు తనివి తీరలేదు. ఆయన సాక్షాత్తు భగవంతుడే అని తెలియని యశోద,

రాక్షసులవల్ల శ్రీకృష్ణునికి ఎక్కడ కీడు కలుగుతుందో అని అమె మనసు తల్లడిల్లేది. పాపం పుత్ర ప్రేమతో తన చిన్ని కన్నయ్యకు ఎక్కడ ఏ అపద కలుగుతుందో అని అహరహం బాధలు పడుతూ అష్ట కష్టాలు పడి పెంచి పెద్ద చేసింది.

కాని కంసుని వధానంతరం ఆ కృష్ణుడు తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులతో చేరినాడు. వారి దగ్గరే ఆయనకు వివాహాది కార్యక్రమాలన్నీ జరిగాయి. చిన్నప్పటి నుంచి పెంచి పెద్దచేసిన తాను శ్రీకృష్ణునికి వివాహాన్ని స్వయంగా చేసి సంతోషించే భాగ్యానికి నోచుకోలేదు కదా! అని చింతిస్తూవున్న యశోదమాత మనస్సును తెలుసుకొన్న శ్రీకృష్ణ పరమాత్మ "అమ్మా! నీవు ఏమాత్రం చింతించవలసిన పనిలేదు. మాతృమూర్తివి అయిన నీవు బాధపడితే ఈ కృష్ణునికి మనుగడే లేదు. ఇప్పుడు పెంచి పెద్ద చేసిన చేతులతోనే స్వయంగా నీవే నాకు వివాహాన్ని చేసి సంతోషించే భాగ్యాన్ని కలిగిస్తున్నాను. అది ఈ ద్వాపర యుగంలో కాదు. తర్వాత వచ్చే కలియుగంలో వేంకటాచల శిఖరాలమీద నీవు యోగినివై వున్న సమయంలో 'శ్రీనివాసుడను' పేరుతో నీ దగ్గరికి చేరతాను. ఇప్పటి ఈ ద్వాపరయుగం నాటి శ్రీకృష్ణుణ్ణే అప్పటి ఆ వేంకటాద్రి మీది కృష్ణుడినై వరలుతాను. ఆ సమయంలో నీచేతుల మీదుగానే నా వివాహం జరిపించి ఆనందించి నన్ను సేవించే భాగ్యాన్ని పొందగలవని తల్లిని ఊరడించి వరమిస్తాడు శ్రీనివాసుడు.

ఇదిగో ఆ ద్వాపరయుగంనాటి వరప్రభావంచేత ఆ యశోదాదేవి వకుళాదేవిగా అవతరించింది.

అప్పటి శ్రీ కృష్ణుడే నేడు శ్రీనివాసునిగా అవతరించి వేంకటాచలానికి చేరి వరాహస్వామి అండదండలతో అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకొన్నాడు. అప్పటినుండి వకుళమాత శ్రీనివాసుని ఆలనా పాలనా చూస్తూ అన్న పానాదులు, ఆకలి దప్పులను తీరుస్తూ తృప్తిగా కాలక్షేపం చేస్తూ వుండింది.

## శ్రీనివాసుని వేట!

ఇలా వరాహక్షేత్రంలో వకుళమాలిక సేవలో శ్రీనివాసుడు మహాలక్ష్మిని మరచిపోయి, కొండలు కోనలు తిరుగుతూ కొంత ఉపశమనాన్ని పొందుతూ కాలం వెళ్లబుచ్చుతుండినాడు. ఇలా కొంతకాలం జరిగింది.

ఒకానొక రోజు, శ్రీనివాసుడు విల్లంబులు చేత ధరించి గుర్రం మీద స్వారీ చేస్తూ రమణీయ దృశ్యాలను చూస్తూ, సుందర జలపాతాలనూ వీక్షిస్తూ, నెమళ్ళు,

కోకిలమ్మల శ్రుతి మధురమైన రాగాలను వింటూ వనవిహారం చేస్తుండినాడు. ఇంతలో ఆ కారడవిలో రక్షించండి! రక్షించండి! అనే ఆర్తనాదాలు శ్రీనివాసునికి వినిపించినై. వెంటనే శ్రీనివాసుడై దిగ్భ్రమ చెందుతూ విల్లంబులను సిద్ధంగా సవరించుకొంటూ ఆక్రందనలు వినవచ్చిన దిక్కునకు తన గుర్రాన్ని పరుగులు పెట్టించాడు. అక్కడ ఒక భయంకరమైన మదపు టేనుగు తరుముతుండగా చెట్టుకొకరు, పుట్టకొకరు ఆర్తనాదాలు చేస్తూ పరుగెత్తుతున్న కన్య కామణులు శ్రీనివాసుని కంట పడినాడు. వెంటనే శ్రీనివాసుడు "గజేంద్రా! అని గట్టిగా గర్జిస్తూ విల్లును గురిపెట్టి ఆ ఏనుగుకు ఎదురుగా వెళ్లాడు. ఆ గర్జనకు బెదరిపోయిన ఆ ఏనుగు అడవిలోనికి పారిపోయి ఎవరికీ కనపడకుండా అదృశ్యమయ్యింది.

తృటిలో తప్పిన ఘోర ప్రాణాపాయం నుంచి తేరుకొని వెర్రిగా దిక్కులు చూస్తున్న యువతుల దగ్గరికి వెళ్లాడు శ్రీనివాసుడు. వీళ్లు అప్సరసలా! లేక గంధర్వ కన్యకలా, అని ఆశ్చర్యపోతున్న శ్రీనివాసునికి, ఆ స్త్రీలమధ్యన చుక్కలనడుమ చందమామవలె ప్రకాశిస్తున్న యువతిని చూస్తూ, దిగ్భ్రమ చెందినాడు. అమె అందచందాలకు పరవశుడై కన్నులార్పక తదేకంగా చూస్తుండినాడు. ఆ యువతీమణి కూడా తమను ఏనుగు బారినుండి రక్షించి తమ ప్రాణాలను కాపాడిన అగంతకుని (శ్రీనివాసుని) చూస్తూ నివ్వెర పోయింది. ఆతని స్ఫురద్రూపానికి, అజానుబాహుత్వానికి శరీర తేజస్సుకు ఆశ్చర్యపోతూ మైమరచి శిలామూర్తివలె సోయగంగా నిలిచి కన్నులార్పక చూస్తూ వుండింది.

## ప్రేమానురాగాలు!

ఈ ఇరువురి వాలకాన్ని చూసిన చెలికత్తెలు అందోళనతో భయపడుతూ ఆ అగంతకుని గట్టిగా వారిస్తూ "ఎవరయ్యా నీవు? ఏమిటి మా చెలిని అలా కన్నులార్పక గుదిగుచ్చి చూస్తున్నావు? నీకు సభ్యత లేనట్లుగా వుందే! అమె ఎవరనుకున్నావు? ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న మా మహారాజు ఆకాశరాజుగారి గారాలపట్టి పద్మావతీ దేవి. అంతఃపుర కన్యకలు విహారంచేస్తున్న ఈ వనంలో పరపురుషులు ప్రవేశించడం నిషేధం. అందులో మా చెలి పద్మావతిని గుచ్చి గుచ్చి చూడటం చాలా తప్పు. వెళ్ళు! వెళ్ళు! తొందరగా ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ఇక్కడి నుంచి దూరంగా

వెళ్లిపో. ఇంకా ఏమిటి! అలా కొర కొర చూస్తావు. మేం చెప్పేది నీకు విన్పడ్డం లేదా! విన్పించినా అర్థం కావడం లేదా? ఇంకా నాలుగుకాలాలపాటు సుఖంగా భూమి మీద బతకాలనుకుంటున్నావా? లేదా? మా రాజభటులు వస్తే నీ సంగతి సరే సరి! ఏమిటి ఇంకా కొంచమైనా కదలవు" అని చెలికత్తెలు చుట్టుముట్టి శ్రీనివాసుని బెదిరిస్తూ ప్రశ్న పరంపరలతో వెడలగొట్ట జూచారు.

అంత పద్మావతి తన చెలికత్తెలను వారిస్తూ, అతను మనలను ఏనుగు బారినుండి రక్షించి మన ప్రాణాలను కాపాడిన ఆపద్బాంధవుడు. ఆయనను అలా తూలనాడ వద్దండి. అసలు అతనెవరు? ఎక్కడి నుంచి వచ్చాడు? ఇక్కడి కెందుకు వచ్చాడో? తెలుసుకొమ్మని తన సఖియలను కోరింది. పద్మావతి చొరవకు చెలికత్తెలు ఆశ్చర్యపోతూ "ఎవరయ్యా నీవు? నీ పేరేమిటి? నీ ఊరేమిటి? నీ తల్లిదండ్రులెవరు, నీ కులం ఏది? నీ గోత్రం ఏది?" అని అడిగారు.

అంత శ్రీనివాసుడు చిరుమందహాసం చేస్తూ, పద్మావతి నన్ను గూర్చి తెలుసుకోవాలన్న ఆసక్తి నాకు ఆనందం కలిగించింది. నా వివరాలను విను మరి. నా తండ్రి వసుదేవుడు. తల్లి దేవకీదేవి. బలరాముడు నా సోదరుడు. నన్ను శ్రీకృష్ణుడంటారు. వశిష్ఠ మహర్షి గోత్రానికి చెందినవాణ్ణి. మరి ఈ అందాల భరిణను నేను తొలిచూపులోనే ప్రేమించాను. నేను మీరంతా అంగీకరిస్తే పెళ్లికూడా చేసుకొంటాను" అంటూ చెలికత్తెలు వారిస్తున్నా పద్మావతి దగ్గరకు జరుగుతూ ఆమెను కౌగిలించడానికి చేతులు చాపినాడు.

ఆగంతకుని మాటలు, చేష్టలు వింతగాను, విడ్డూరంగాను శ్రుతిమించి రాగాన పడుతుండటాన్ని గమనించిన పద్మావతి చెలికత్తెలు అప్రమత్తలై అతనిని పరిపరి విధాల వారించారు. అయినా ఆ పర పురుషునివల్ల తమ రాకుమారికి రాబోతున్న ప్రమాదాన్ని ఊహించారు. అంతే ఇంక ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా శ్రీనివాసుణ్ణి రాళ్లతో రప్పలతో వెంటపడి తరిమి తరిమి కొట్టారు. ఏదో మైమరపులో వింత అనుభూతికి లోనై పద్మావతిని ఊహించుకొంటూ ఊహాలోకంలో విహరిస్తున్న శ్రీనివాసుడు ఈ హఠాత్పరిణామానికి నిశ్చేష్టుడయ్యాడు. వారి రాళ్ల దెబ్బలతో గాయాలు అయ్యాయి. కారుతున్న రక్తంతో, బాధపడిన మనసుతో తొలిచూపులోనే పద్మావతిని ప్రేమించిన శ్రీనివాసుడు ఆమెను వెనుకకు తిరిగి తిరిగి చూస్తూ వేంకటాద్రికి చేరుకొన్నాడు.

## వకుళమాత పరామర్శ!

ఈ రోజు ప్రొద్దున్నే వెన్నముద్దలు తినకుండా పరగడుపున శ్రీనివాసుడు ఎక్కడికి వెళ్లాడో అని పరిపరి విధాల ఆలోచిస్తూ వకుళమాత ఎదురు చూస్తూ వుండింది. ఇంతలో శరీరమంతటా గాయాలతో నెత్తుటి మరకలతో బాధతో మూలుగుతూ వస్తున్న శ్రీనివాసుణ్ణి, వకుళమాలిక చూచి ఆందోళన పడింది. అదుర్దాతో ఎదురువెళ్లి శ్రీనివాసుని చేతిని పట్టుకొని నడిపించుకొంటువస్తూ ఒళ్లంతా ఈ దెబ్బలేమిటి నాన్నా! అసలు ఏం జరిగింది! ఎవరు చేశారీపని? జరిగిన విషయాన్ని చెప్పరా. కన్నయ్యా! అని అంటూ కళ్లంబడి నీళ్లు పెట్టుకొంటూ తన చీర కొంగును చించి గాయాలకు కట్లు కట్టింది.

సన్నగా మూలుగుతూ వున్న శ్రీనివాసుడు, ఇక ఏ మాత్రం మభ్య పెట్టడం బాగుండదని తన తల్లితో పూర్తిగా జరిగిన కథనంతా పూస గుచ్చినట్లుగా వకుళమాలికకు విడమర్చి చెప్పినాడు.

నారాయణవనం పరిసర ఉద్యాన వనంలో విహరిస్తున్న ఆకాశరాజు కూతురు పద్మావతిదేవిని చూచి తాను ప్రేమించానని, అలాగే ఆమె కూడా తన ప్రేమలో పడిందనీ, ఇక ఆమెను నేను వివాహమాడనిదే బ్రతుక జాలననీ తల్లికి విశ్వచ్చిగా తెలియజేసినాడు.

"నాయనా! శ్రీనివాసా! నీవు సాక్షాత్తుగా శ్రీమన్నారాయణుడవని మర్చి పోయి నట్లున్నావు. శ్రీ వరాహస్వామి నిన్ను నాకు అప్పజెప్పినపుడు కూడా నిన్ను గూర్చి చాలా గొప్పగా చెబుతూ నాకు అప్పజెప్పినాడు. మరి అలాంటి దివ్య పురుషుడవు నీవు. సామాన్య మానవుడివలె కులగోత్రాలు తెలియని మానవకాంతను ప్రేమించడం, గూర్చి ఆలోచించటం, ఆమె లేకపోతే బ్రతక లేననడం విచిత్రముగానూ,వింతగాను వుంది. అలా చెప్పటం నీ వంటి వాడికి తగిన పనేనా? అది ఎంత వరకు సమంజసమో బాగా ఆలోచించు. నీ స్థాయికి తగినట్లు ఒకటికి పదిమార్లు ఆలోచించి తగినట్లుగా సరైన నిర్ణయం తీసుకొని నీవు క్షేమాన్ని పొందు. తద్వారా నన్నూ, లోకాలను, అందరినీ మెప్పించు" అంటూ శ్రీనివాసుని భావోద్వేగాన్ని తగ్గించడానికి వకుళమాలిక ప్రయత్నించింది.

"ఔనౌను తల్లీ! నీవు అన్న మాటలు అన్నివిధాల పరమ సత్యాలు. నేను ఎలాంటి పరిస్థితుల్లోను అనైతికంగా ప్రవర్తించను తల్లీ! కనీసం ఆలోచించనుగాక ఆలోచించను. నేను చూచి వరించిన ఆకాశరాజు కూతురు పద్మావతిదేవి నీవు తలంచినట్లుగా సామాన్య వనిత కానే కాదు. ఆమె సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి అంశతో ఈ భూలోకంలో నా కోసమే, నన్ను వివాహమాడటం కోసమే అయోనిజగా అవతరించిన కారణ జన్మురాలు. అమ్మా! ఆ పద్మావతి గాథను వివరంగా నీకు తెలియ చెప్తాను" అంటూ విష్ణువు తల్లితో ఇలా కొనసాగించాడు.

## వేదవతే మాయాసీత!

త్రేతాయుగంలో జరిగిన దివ్యగాథ ఇది. రామావతార సమయంలో దుష్ట రాక్షస సంహారానికై సీతాలక్ష్మణ సమేతంగా శ్రీరాముడు పదనాలుగేళ్లు అరణ్యావాసం చేశాడు. ఆ సందర్భంలో రావణాసురుడు సీతాదేవిని అపహరించాడు. అదే సమయంలో అగ్నిదేవుడు రావణాసురునికి అడ్డుపడి "రావణాసురా! నీవు తీసుకెళుతున్నది అసలైన సీతను కాదు. శ్రీరాముని భార్య అయిన అసలు సీత నా దగ్గర వున్నది.కనుక ఈమెను విడిచిపెట్టి నా దగ్గరున్న సీతను తీసుకెళ్లు" మని అంటూ ఆమెను అగ్ని ప్రవేశం చేయించి ఆమెను తన వద్ద భద్రంగా దాచి రక్షించాడు. ఆమెకు బదులుగా తన దగ్గరవున్న వేదవతిని సీతగా రావణుని మభ్యపెట్టి అతనికిచ్చి పంపివేశాడు. రావణాసురుడు అగ్నిదేవుని మాటలను నిజమని నమ్మి మాయా సీత అయిన వేదవతిని లంకకు తీసుకొనివెళ్లి బంధించినాడు.

రామరావణ యుద్ధంలో రావణాసురుడు సంహరింపబడగా రావణునివద్ద వున్న సీతను రాముడు స్వీకరించినాడు. కాని ఎలాంటి లోకనింద రాకుండుటకై సీతను అగ్ని ప్రవేశం చేయించినాడు. ఆ సమయంలో అగ్ని నుండి ఇద్దరు సీతలు వెలుపలికి వచ్చారు. ఈ సంఘటనకు శ్రీరాముడు ఆశ్చర్యపోతూ-- అగ్ని దేవుణ్ణి వీళిద్దరూ ఎవరు! ఇందులో అసలు సీత ఎవరు? అని ప్రశ్న పరంపరల్ని గుప్పించాడు.

వెంటనే అగ్నిదేవుడు "శ్రీరామచంద్రా! సీతాపహరణ సమయంలో అసలు సీతను నాదగ్గర వుంచుకొని మాయాసీత అయిన ఈ వేదవతిని రావణుని వెంట పంపాను. ఈ వేదవతి లంకలో సీతకు బదులుగా అనేక కష్టాలను అనుభవించింది.

చివరకు సీతమాదిరిగా నిన్నే భర్తగా అనుక్షణం భావించింది కూడా. అందువల్ల సీతాదేవితోపాటు, మాయాసీత అయిన ఈ వేదవతిని గూడ భార్యగా స్వీకరించ వలసిందని" అంటూ శ్రీరామచంద్రుని ప్రార్థించినాడు. అగ్నిభట్టారకుని ప్రార్థనను, కోరికను, సీతాదేవి కూడా సమ్మతిస్తూ, వేదవతిని కూడా భార్యగా స్వీకరించ వలసిందని శ్రీరాముని వేడుకొంది. అంత శ్రీరాముడు "ఈ అవతార సమయంలో ఒకే మాట! ఒకే బాణం! ఒకే సతి" అన్న వ్రత నియమంతో చరిస్తున్నందున ఈ మీ కోరిక ఈ సమయంలో తీరదు గాక తీరదు. కాని కలియుగంలో నేను వేంకటాచలంలో శ్రీ వేంకటేశ్వరునిగా అవతరించిన సమయంలో ఈ వేదవతి ఆకాశరాజు గారాలపట్టి పద్మావతిగా అవతరిస్తుంది. అప్పుడు ఆమెను పట్టపు దేవేరిగా స్వీకరించగలను. తద్వారా మీ అందరి కోరికా నెరవేరగలదు" అంటూ శ్రీరాముడు వాగ్దానం చేశాడు. పిదప అగ్నిదేవుడు వేదవతిని బ్రహ్మలోకం చేర్చాడు. శ్రీరాముడు సీతా సమేతంగా అయోధ్యను చేరుకొన్నాడు" అంటూ వివరించాడు.

అప్పటి శ్రీరామచంద్రుడే ఇప్పుడు శ్రీనివాసునిగా వచ్చాను. అప్పటి వేదవతి, ఇప్పుడు నారాయణవనాన్ని పాలిస్తున్న చక్రవర్తి ఆకాశరాజు కూతురు పద్మావతిగా అవతరించింది. అందువల్ల తల్లీ! వకుళమాతా! నీవు పద్మావతిని సామాన్య మానవకాంతగా తలంపవద్దు" అని శ్రీనివాసుడు పలికాడు. శ్రీనివాసా! చాలా బాగుంది నాయనా! నీవు చెప్పిన దివ్యవృత్తాంతం ఆశ్చర్యంగాను వుంది. ఆనందంగాను వుంది. అది సరే! రామావతార సమయంలో వేదవతిని గూర్చి చెప్పావు కదా! అసలు వేదవతి ఎవరు నాయనా? అని వకుళమాలిక ఆసక్తిగా శ్రీనివాసునివైపు చూస్తూ అడిగింది. శ్రీనివాసుడిలా చెప్పాడు.

## ఎవరీ వేదవతి?

పూర్వం ఒకానొకప్పుడు మయుడు అనే విప్రోత్తముడు ఉండేవాడు. ఆ బ్రాహ్మణుడు నిదురించే సమయంలో తప్ప, మేల్కొన్న సమయాల్లో ప్రతిక్షణం వేదాలను శ్రుతి శుభగంగా, భక్తిశ్రద్ధలతో పఠిస్తూ వుండేవాడు. నిత్య స్వాధ్యాయ నిరతుడైన ఈ మయుడు ఒకానొకప్పుడు నీటి కోసం ఒక చెరువుకు వెళ్లాడు. అప్పటికే ఆ సరస్సులో జలకాలాడుతూ అర్ధనగ్నంగా వున్న అప్సరస ఊర్వశిని చూచాడు. ఆ దేవకన్య అంగాంగ సౌందర్యాన్ని వీక్షించిన ఆ సద్బ్రాహ్మడికి కామ వికారం కలిగింది. అయినా వికల మనస్కుడైనప్పటికీ అతను వేదాధ్యయనం మానలేదు. ఇంతలో

అతనికి కామోద్రేకం ఎక్కువై వీర్య స్ఖలనం అయింది. తపస్సంపన్నుడైన అతని వీర్యం నుంచి ఆ క్షణంలోనే అద్భుత తేజోవిరాజమాన అయిన ఒక శిశువు ఉద్భవించింది. ఆ విప్రుడు ఆశ్చర్యంతో చూస్తూ- ఆడశిశువు పుట్టినందుకు ఆనంద పడుతూ ఆపాపను ఎత్తుకొన్నాడు. తాను వేదాలను వల్లిస్తుండగా పుట్టినందులకు ఆ పాపకు 'వేదవతి' అని నామకరణం చేసి అల్లారు ముద్దుగా పెంచాడు. ఆ చిన్ని పాప కూడ పేరుకు తగ్గట్టుగానే 'తండ్రి వలన వేదాలన్నిటిని అవలీలగా నేర్చుకొనింది. రాను రాను పెరిగి పెద్దదై వేద నిష్ణాతురాలైన వేదవతి, వేదపురుషుడైన సాక్షాత్తు శ్రీమహావిష్ణువునే తన భర్తగా పొందాలని నిశ్చయించుకొంది. ఇంతలో అద్భుత సౌందర్యరాశి అయిన వేదవతిని అతిబలుడు అనే రాక్షసుడు చూచాడు. ఆమెను ఎలాగైనా సరే తనదానినిగా చేసుకోవాలని వాడు ఆశపడినాడు.

ఆ వేదవతిని తనకిచ్చి పెళ్లి చేయవలసిందిని ఆ రక్కసుడు అమె తండ్రి అయిన మయుణ్ణి అడిగాడు. మయుడు అందుకు తిరస్కరించడమేగాక, ఆయమ శ్రీమహావిష్ణువును మాత్రమే పరిణయమాడుతుందని తెలియ జేశాడు. దానితో ఆ దానవుడు మహోగ్రుడై ఆ విప్రుణ్ణి వధించి వేదవతిని బలాత్కరించబోయాడు. ఆమె ఆ రాక్షసుణ్ణి భస్మం కమ్మని తీవ్రంగా శపించింది. ఆ శాప ప్రభావంతో వాడు వెంటనే బూడిద అయ్యాడు. ఆ తర్వాత వేదవతి శ్రీ మహావిష్ణువును భర్తగా పొందాలని తపస్సు చేస్తుండగా, రావణాసురుడు ఆమెను చూచాడు. అంతే ఆమె అందానికి. సౌకుమార్యానికి ఆశ్చర్యపోతూ తనను పెళ్లాడవలసిందని రావణాసురుడు ఆమెను వేధించాడు. అనేక విధాలుగా ఆమెను లొంగదీసుకోవాలని ప్రయత్నించి చిట్టచివరకు ఆమెను తాకి బలాత్కరించబోయినాడు. తన తపస్సును భంగం చేసి కామోద్రేకంతో కళ్లుకానక బలాత్కరించబోయిన నిన్ను, నా భర్త అయిన శ్రీమహావిష్ణువు చేతే నీవు మరణించేట్లుగా చేసి ప్రతీకారం తీర్చుకుంటానని తీవ్రమైన ప్రతిజ్ఞచేస్తూ, తనంతకు తాను ఆత్మజ్యోతిని వెలిగించుకొని ఆ అగ్నికి ఆహుతి అయి తద్వారా అగ్నిదేవుణ్ణి చేరుకొని ఆయన సంరక్షణలో వుండింది వేదవతి.

తర్వాతి కాలంలో సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకొని వెళ్తుండగా తాను ఆమెకు బదులుగా మాయాసీతగా అగ్నిదేవునిచేత రావణుని సమర్పింపబడి లంకకు వెళ్లింది. రావణ సంహారానంతరం నా అనుగ్రహంవల్ల వేదవతి బ్రహ్మలోకం చేరింది. అక్కడి నుంచి ఆకాశరాజు కూతురు పద్మావతిదేవిగా జన్మించింది. ఆ పద్మావతి

నన్ను చూసినప్పటినుంచి నామీద వలపుగొన్నది. ఆమె పరిస్థితీ కూడా నావలెనే స్థిమితము లేకుండా వున్నది తల్లీ!" అని శ్రీనివాసుడు వివరిస్తున్న పూర్వలీలా గాథలను మైమరచి వింటూ వకుళమాత ఆనందబాష్పాలు రాలుస్తూ కాస్త తేరుకొని, మరి పద్మావతిదేవి తండ్రి ఆకాశరాజు ఎవరు తండ్రీ! అని ప్రశ్నించింది.

## పూర్వజన్మలో ఆకాశరాజు

పూర్వం మాధవుడనే బ్రాహ్మణోత్తముడు ప్రారబ్ధవశం చేత కుంతల అనే స్త్రీతో సంబంధం పెట్టుకొని మహాపాపం చేశాడు. అతడు ఆ పాపవిముక్తికై వేంకటాద్రికి వచ్చి స్వామి పుష్కరిణిలో స్నానం చేశాడు. అక్కడే భగవంతుని కోసం తపస్సుచేశాడు. ఎంతకూ దేవుడు ప్రత్యక్షం కానందుకు చింతిస్తూ ప్రాణ త్యాగానికి తలపడ్డాడు. ఆ సమయంలో దేవుడు ప్రత్యక్షమై అతని భక్తికీ, తెంపరితనానికీ సంతసించి "పై జన్మలో పాండవ వంశంలో సుధర్ముడనే రాజుకు పుత్రునిగా పుట్టి ఆకాశరాజు అనే పేరుతో ప్రసిద్ధిని పొందుతావు. ఆ సమయంలో సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి స్వరూపిణి అయిన కన్యక నీకు పుత్రికగా లభిస్తుంది. పద్మావతిదేవి అన్న ఆ కన్యకామణిని నాకు ఇచ్చి వివాహం చేస్తావు. నీ కీర్తి ఆచంద్రతారార్కమై వెలుగుతుంది" అని వరమిచ్చాడు.

"అమ్మా! ఆ బ్రాహ్మణోత్తముడే ఈ ఆకాశరాజు. ఇతని భార్యామణి ధరణీదేవి. మహాపతివ్రత. వీరికి ఎంత కాలానికి సంతానం కలగనందున జ్యోతిష్కుల ఆజ్ఞమేరకు పుత్రకామేష్టి యాగం చేశారు. యాగ సందర్భంలో యజ్ఞ భూమిని దున్నుతూ వుండగా, నాగేటి చాలుతో ఒక బంగారు పెట్టె దొరికింది. ఆ పెట్టెను తెరచి చూడగా అందులో సహస్ర దళాలు కలిగివున్న ఒక బంగారు పద్మం, ఆ పద్మంలో వింత వింత తేజస్సులతో ప్రకాశిస్తున్న ఒక పసిపాప కానవచ్చింది. సంతతి లేని తనకు భగవానుడు ఇలా అనుగ్రహించాడని ఆనందించారు రాజ దంపతులు. పద్మంలో దొరకినందువల్ల 'పద్మావతి' అను నామకరణం చేసి పెంచి పెద్ద చేశారు. యవ్వనవతి అయి అద్భుత సౌందర్యంతో విరాజిల్లుతూ, చెలికత్తెలతో వనవిహారం చేస్తున్న ఆ పద్మావతినే నేను చూశాను. ఆమె చూచినప్పటి నుంచి నా మనస్స్థితి అగమ్యగోచరంగా వుంది తల్లీ! అమ్మా నా కథ అంతా నీకు అవగతమైంది కదా! నీ సందేహాలు తీరాయి కదా తల్లీ!" అంటూ అనంత లీలామానుష విగ్రహుడైన శ్రీనివాసుడు చెప్తున్న గాథలను మైమరచి వింటూ ఒక విచిత్రమైన పరమానుభూతికి లోనై "నాయనా! శ్రీనివాసా! చాల బాగుంది.

నాకు ఆనందంగా వుంది. ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటావో చెప్పు" మని వకుళమాత అడిగిందని సూతుడు శౌనకాదులతో వివరించాడు.

## పెళ్లి రాయబారం!

"అమ్మా! వకుళమాతా! నీవు నారాయణ వనం చక్రవర్తి ఆకాశరాజు దగ్గరికి వెళ్లి ఆయన కూతురు పద్మావతిని నాకు ఇచ్చి వివాహం చేయవలసిందిగా, అర్థించు తల్లీ! లోక కల్యాణం కోసం నీవు ప్రయత్నించే ఈ కార్యం తప్పక నెరవేరుతుంది. జననీ! నీవు ముందుగా ఈ పర్వత మూలంలో వున్న కపిలేశ్వరస్వామివారిని దర్శనం చేసికొనవలసింది.

*"అస్మా దేవ వరాన్మార్గాత్ అవరుహ్యా గిరేస్తటాత్*
*త్వం గచ్ఛాధః ప్రదేశే చ కాపిలం లింగముత్తమమ్*
*తత్రాస్తే తీర్థ రాజో యః కపిలేశ్వర సన్నిధౌ*
*తత్ర స్నాత్వా యథా యోగ్యం మదర్థం తీర్థ పుంగవే*
*కపిలేశ్వర మాసాద్య యాచ్యతాం వరమవ్యయమ్*
*శ్రీనివాసేన బాలేన సదా కల్యాణ కాంక్షిణా*
*ప్రేషితాఽహం తదర్థం వై కురు మేఽభీప్సితం ప్రియమ్.*

అమ్మా! వకుళాదేవీ! ఈ పర్వతానికి వెళ్లే మార్గంలో ఈ గిరికి క్రింది ప్రదేశంలో అత్యంత మహిమాన్వితమైన ఉత్తమమైన శ్రీ కపిలేశ్వర లింగం వుంది. ఆ కపిల మహాలింగం సన్నిధిలోవున్న పవిత్రమైన కపిలతీర్థ పుణ్యజలాల్లో తీర్థవిధిగా స్నానం చేసిన తరువాత నా యీ వివాహకార్యక్రమాన్ని చక్కగా నిర్విఘ్నంగా నెరవేర్చ వలసిందని శ్రీ కపిలేశ్వరస్వామివారిని దర్శించి భక్తితో ప్రార్థించు, నా వివాహ శుభకార్యం కోసం పంపబడుతున్న నీవు ఈ కార్యాన్ని నెరవేర్చి నాకు సంతోషాన్ని కల్గించు తల్లీ!" - అంటూ శ్రీనివాసుడు వకుళమాతను ప్రాధేయపడినాడు.

లోక కల్యాణం కోసం జగత్కల్యాణచక్రవర్తి అయిన శ్రీనివాసుడు తనపై వుంచిన కార్య భారానికి చాల ఆనందిస్తూ వకుళాదేవి "ఇది తనకు ఎన్నెన్నో జన్మల పుణ్య భాగ్యంచేత సిద్ధించింది కదా! అయినా ఈ కార్యక్రమంలో నేను నిమిత్త మాత్రురాల్ని. అంతా ఆ శ్రీనివాసుడే తన కార్యాన్ని తాను చక్కదిద్దుకోవాలి తప్ప, నేనెంతటి దాన్ని?" అని ఆలోచిస్తూ, శేషాచల పర్వత మూలంలో కపిలతీర్థం

చేరుకొంది. అక్కడ కపిలతీర్థంలో తీర్థవిధిగా స్నానమాడి, శ్రీ కామాక్షిసమేత కపిలేశ్వర స్వామివారిని అనేక విధాల స్తుతిస్తూ శ్రీనివాసుని కల్యాణాన్ని శుభస్య శీఘ్రంగా నెరవేర్చవలసిందని ప్రార్థించింది. అక్కడ నుంచి నారాయణవనానికి బయలు దేరింది.

దారిలో శ్రీ శుకమహర్షి ఆశ్రమాన్ని దర్శించింది. పిదప అక్కడికి దగ్గరలో వున్న అగస్త్యేశ్వర స్వామివారిని దర్శించింది. అదే సమయానికి, అగస్త్యేశ్వరస్వామికి అభిషేకాదులు నిర్వహించడానికి పద్మావతి దేవి చెలికత్తెలు రాగా, వకుళమాత వారిని కలిసింది. వాళ్లు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? ఎందుకోసం వచ్చారు? ఇత్యాది ప్రశ్న పరంపరలతో వివరం అడిగింది.

నారాయణవనం మహారాజు అయిన ఆకాశరాజు గారాలపట్టి పద్మావతిదేవి చెలికత్తెలం మేము. అమె వనవిహారం చేస్తుండగా ఒక దివ్య పురుషుడు కనపడ్డాడు. ఆ పురుషుణ్ణి చూచినప్పటినుండి మా యువరాణి పద్మావతి ప్రేమలో పడింది. విష తాపజ్వరానికి లోనయ్యింది. అస్వస్థతగా వున్న మా పద్మావతి ఆరోగ్యం కోసం మా రాజుగారు, రాణిగారు నమక చమక రుద్రాభిషేకం చేయించటానికి మమ్మల్ని ఇక్కడికి పంపారు. అందువల్ల మేము వచ్చాం. ఆ పురుషుడు ఎవరో, ఎక్కడివాడో మాకు తెలియదు. మా యువరాణి కోసం ప్రార్థించడానికి మేమూ వచ్చాం" -- అంటూ అన్ని వివరాలను వకుళమాతకు తెలియజేశారు పద్మావతి చెలికత్తెలు.

"అలాగా! అయితే మీ మహారాణితో నాకు కలయిక ఏర్పాటు చేయించండి. మీ యువరాణికి స్వస్థత తప్పక చేకూరగలదు" అంటూ వారిని ఒప్పించి వకుళమాత వారితో పాటు నారాయణవనానికి చేరుకొంది. ఇంతలో.........

## ఎరుకలసాని!

వేంకటాద్రినుండి తల్లి వకుళాదేవిని తన వివాహం కోసం పురమాయించి నారాయణవనానికి పంపిన శ్రీనివాసుడు వెంటనే తన రూపురేఖల్ని మార్చుకొన్నాడు. లీలామానుష రూపుడైన ఆ స్వామి ఎరుకను తెలియజెప్పే ఎరుకలసానిగా వేషం ధరించాడు. వెంటనే నారాయణపుర వీథుల్లో "ఎరుక సెబుతానమ్మ! ఎరుకో! ఎరుక! సోది సెబుతానమ్మ! సోది! సోదమ్మో సోది! ఎరుకమ్మో ఎరుక!" అంటూ నిండు ఆడు దనంతో వయ్యారాలు పోతూ అందరినీ అలరించింది. ఆకట్టుకొంది.

"పద్మావతికి గాలి సోకిందో! దృష్టిదోషమే తగిలిందో! ఏదైనా భూతం పట్టుకొందో! ఏమో! అందువల్ల సరిగా నిద్ర పోవడం లేదు. తిండి కూడ తినడం లేదు. పైపెచ్చు వళ్లు జ్వరంతో కాలిపోతున్నది. ఎన్ని మందులు, మాకులతో చికిత్స చేసినా అమె పరిస్థితి బాగుపడటం లేదే!" అని పరిపరి విధాల ఆలోచిస్తున్న ఆకాశరాజు భార్య ధరణీదేవికి ఎరుకలసాని అరుపులు చెవినబడ్డాయి.

"ఎరుకో! ఎరుక సెబుతానమ్మ ఎరుక! ఉన్నదున్నట్లు సెబుతాను. జరిగిందీ సెబుతాను. జరుగబొయ్యేదీ సెబుతాను. అన్నీ ఇట్టె ఇడమర్చి సెబుతాను. సోది సెబుతానమ్మ సోదీ! సోదెమ్మ సోదీ!"

వెంటనే ధరణీదేవి ఎరుకలసానిని అంతఃపురానికి పిలిపించింది. ఎరుకతెకు ఎదురుగా పద్మావతిని కూర్చో బెట్టి ఎరుకత చెప్పమని కోరింది.

ఎరుకలసాని వేషంలో వున్న శ్రీనివాసుడు పద్మావతి దేవి ఎడమచేతిని, తన చేతిలోనికి తీసుకొంటూ "కొండదేవరమీద ఆన! వున్నదున్నట్టు సెబుతానె తల్లె! అంటూ ఈ క్షణం నుంచి నీ బిడ్డ కుదుటబడుతందే తల్లె! నీ బిడ్డ చెయ్యి కొండమీది ఆదినారాయణుడు అందుకొన్నాడె తల్లె! కాదు కాదు తల్లె! తొందర్లో అందరి ఎదుట అందుకుంటాడె తల్లె! నీ బిడ్డ దేవాదిదేవుణ్ణి సూసింది. వాడిమీద మనసు పడ్డాదె తల్లె! వాడు గూడ ఈ బొమ్మ మీద మోజు పడ్డాడే తల్లె! అప్పట్నుంచే ఈ యిన జెరం చుట్టుకుందె తల్లె! నేం జెప్పేది సత్తెమే తల్లె! సత్తెమైతే 'ఔ' ననె తల్లె! లేకుంటే తలకాయ అడ్డంగా దిప్పె తల్లె! అవునుమల్ల! నేంజెప్పేది అబద్ధం ఎట్లా అవుతది తల్లె! మరి ఈ జెరం తగ్గి, బిడ్డ బతికి బట్టగట్టాలంటే ఆ కొండమీద వున్న ఆదిదేవునికిచ్చి మనువు సెయ్యండె తల్లె! దాని కెట్లా! అని ఆలోచన సెయ్యమాకండె తల్లె! ఈ బంగారు బొమ్మను మనుమాడ, బెమ్మాండ నాయకుడే నడచివస్తాడె తల్లె! ఈ పిల్ల నియ్యమని అడగడానికి కాసేపట్లో ఒక అవ్వ నీ ఇంటి ముంగిట్లో వాలేనె తల్లె! నేం జెప్పేది సత్తెమె తల్లె! కొండ దేవర మీద ఆన! తొందర్లో నీ బిడ్డకు లగ్గమౌతాదె తల్లె! నీ బిడ్డ అందగత్తె మాత్రమె కాదె! అదృష్టవంతురాలె తల్లె! నీబిడ్డ ఒంటిమీద నలిగిన పాత సీర ఇయ్యావె తల్లె! మళ్లీ లగ్గమేళ వస్తాను. అప్పుడు కొత్త కోక పెట్టాలె తల్లె!" అంటూ శ్రీనివాసుడు పద్మావతి చేతిని స్పృశిస్తూ ! అమె మనసుని మరింత ఊరిస్తూ వెళ్లిపోయాడు.

ఎరుకలసాని సోది చెప్పి అటు వెళ్లిందో లేదో విచిత్రంగా ఇటు వకుళమాత వచ్చింది. అగస్త్యేశ్వరునికి అభిషేకం చేయించి తీర్థప్రసాదాలను తీసుకొని పద్మావతి చెలికత్తెలు అంతఃపురం ప్రవేశించి అందజేశారు. పిదప తమ వెంట సప్తగిరుల నుండి వచ్చిన వకుళమాతను గూర్చి ధరణీదేవికి పరిచయం చేశారు. మహారాణి వకుళమాతకు సాదరంగా ఆహ్వానం పలుకుతూ ఎరుకలసాని సెప్పినట్లుగా జరుగుతున్నందుకు ఆశ్చర్యంతోకూడిన తొట్రుపాటుకు లోనయ్యింది. ఆ మహారాజు ఆకాశరాజును కూడా అంతః పురానికి పిలిపించింది.

వకుళమాత, ఆ రాజ దంపతులకు నమస్కరిస్తూ! శ్రీనివాసుడు వనవిహారం చేస్తున్న పద్మావతిని చూచి మోహించినాడనీ, ఆయన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడనీ, అందువల్ల పద్మావతిని ఇచ్చి కల్యాణం జరిపించ వలసిందని ప్రార్థించింది. పద్మావతి దేవి కూడ కారణజన్మురాలని వారికి ఎరుక పరిచింది.

ఆకాశరాజ దంపతులు అందుకు అనేక విధాలుగా ఆనందపడుతూ అది తమ అనేక జన్మల మహద్భాగ్యమని పలుకుతూ శ్రీనివాసునకు తమ పద్మావతిని ఇచ్చి వివాహం చెయ్యడానికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నామనీ, త్వరలో ముహూర్తాన్ని నిశ్చయించి వివాహాన్ని జరిపించగలమనీ వకుళమాతకు వాగ్దానం చేశారు.

సిద్ధించిన కోరికతో వకుళమాత అమితానందాన్ని పొందుతూ తొందరగా వరాహక్షేత్రాన్ని చేరుకొని తన కోసం ఎదురుచూస్తూ వున్న శ్రీనివాసునికి సందేహం నివృత్తి చేస్తూ తాను వెళ్లిన కార్యం "పండే" అంటూ పరమ సంతోషాన్ని వెలిబుచ్చింది.

## వివాహ నిశ్చయం!

వకుళమాత వెళ్లిన వెంటనే ఆకాశరాజు పద్మావతి స్థితిని తెలుసుకొని ఇక ఏ మాత్రం ఆలస్యం చెయ్యరాదని తలుస్తూ దేవగురువు బృహస్పతిని, శుకమహర్షిని పిలిపించాడు. వారితో పద్మావతి శ్రీనివాసుల వివాహాన్ని గూర్చి చర్చించి మంచి ముహూర్తం నిశ్చయించమని ప్రార్థించాడు.

ఆ ఇరువురు ఋషులు బాగా ఆలోచించి తర్కించి, చర్చించి అన్ని విధాలా అతి దగ్గరలో సిద్ధించబోయే వైశాఖమాసం శుక్లదశమీ శుక్రవారంనాటి ఉత్తర ఫల్గుణీ శుభ నక్షత్రంలో వివాహ ముహూర్తం అత్యంత శ్రేష్ఠమైనదిగా నిశ్చయించి శ్రీనివాసునకు, పద్మావతికి వివాహాన్ని నిర్ణయించి, వివాహ శుభలేఖను తయారుచేశారు.

ఆకాశరాజు కోరికపై బృహస్పతి ఆ శుభలేఖను శుక మహర్షికిచ్చి శ్రీనివాసునికి పంపుతూ వివాహానికి ఆహ్వానించవలసిందంటూ ఆదేశించినాడు. ఆయన ఆ కల్యాణ శుభ లేఖను స్వీకరించి సప్తగిరులను అధిరోహించి, శ్రీనివాసునికి అంద జేసినాడు. ఆ వివాహానికి తాము సర్వవిధాల అంగీకరిస్తున్నామనీ ఆ శుభలగ్నానికి తామూ అందరం బంధు మిత్రులతో తరలి రాగలమనీ తెలుపుతూ శ్రీనివాసుడు సగౌరవంగా సత్కరిస్తూ శ్రీ శుకమహర్షి ద్వారానే ఆకాశరాజుకు బదులు లేఖను పంపినాడు" అంటూ సూతుడు శౌనకాదులతో వివరించినాడు.

## ముక్కోటి దేవతల తరలిరాక!

శ్రీ శుకమహర్షి వివాహ లగ్నపత్రికను ఇచ్చి ఆహ్వానించి వెళ్ళిన తరువాత శ్రీనివాసుడు పద్మావతితో తన వివాహాన్ని గూర్చి ఆలోచిస్తూ, ఆ ఏర్పాట్లు చూడడాని! బ్రహ్మాది దేవతలను ఆహ్వానించాడు.

శ్రీనివాసుని వివాహ శుభపత్రిక నందుకొని సరస్వతిదేవితో కూడిన బ్రహ్మ దేవుడు, గణపతి, కుమారస్వామితో పార్వతీ సమేతంగా పరమేశ్వరుడు, ఇంద్రాగ్ని యమ, వరుణులు మున్నగు దేవతలు వరుసగా విచ్చేశారు. అలాగే--

"కశ్యపో౽ త్రిర్భరద్వాజో వామదేవశ్చ గౌతమః
విశ్వామిత్రో వసిష్ఠశ్చ వాల్మీకి ర్జమదగ్నిజః
పులస్త్యశ్చ దధీచితశ్చ శునశ్శేఫశ్చ గాలవః
గార్గ్యః కృష్ణో మహారాజ, నపుత్రాః నపరిగ్రహాః
ఏవం మహర్షయో దేవా రాజానశ్చ సమాగతాః
వివాహార్థం సమాజగ్ముః సర్వే సమ్భ్రమకాతరాః"

వీరు మాత్రమేగాక కశ్యప, భరద్వాజ, వామదేవ, గౌతమ, విశ్వామిత్ర, వసిష్ఠ వాల్మీకి పరశురామ, పులస్త్య, దధీచి శునఃశేపుడు, గాలవుడు, గార్గ్యాది మహర్షులందరు వేంకటేశుని కల్యాణాన్ని దర్శించుటకు వేంకటాచలానికి వచ్చి చేరుకున్నారు. ఇల వస్తున్న పరివారాన్నందరినీ శ్రీనివాసప్రభువు సాదరపూర్వకంగా ఆహ్వానించి గౌరవ సత్కారాలంద జేసినాడు.

పిదప శ్రీనివాసుడు ఇంద్రుని పిలిచి, విశ్వకర్మ మయునిచేత వేంకటాచల క్షేత్రంమీద తన వివాహార్థమై వచ్చిన దేవగణాలకు విడిది చేయుటకై వివాహ పురాన్ని

నిర్మించమని ఆదేశించినాడు. అలాగే ఆకాశరాజు పాలిస్తున్న నారాయణవనపురానికి వెళ్ళి శ్రీపద్మావతి శ్రీనివాసుల వివాహార్థమై ఘనంగా ఒక వివాహవేదికను కూడ ముత్యాల పేరులతో రత్న స్తంభాలతో విశ్వకర్మ నిర్మించినాడు.

అనంతరం శ్రీ వేంకటేశ్వరుడు వేంకటాద్రి చేరిన దేవతలనందరిని సమావేశపరిచి జగత్కల్యాణంకోసం ఆకాశరాజు కూతురు పద్మావతిని వివాహమాడతలంచినానని, అయితే ఈ శుభకార్యానికి అందరూ తోడ్పడితేకాని సవ్యంగా సాగదనీ, అందువల్ల తప్పక అందరూ తోడ్పడుతూ, ఈ పెళ్లి వేడుకల్లో పాల్గొనవలసిందని ఆనతిచ్చినాడు. దేవతలందరూ అందుకు ఎంతగానో పరమానందాన్ని పొందుతూ పద్మావతీ శ్రీనివాసుల వివాహంలో పాల్గొనడమేకాక తమవంతు సేవలను నిర్వహించడం ఎన్నో జన్మల మహద్భాగ్య విశేషమని భావించారు.

కుమారస్వామి, వివాహార్థం అరుగుదెంచిన దేవతలకు, ఋషులకు, యోగులకు స్వాగతం చెప్పుతూ, వారివారికి తగిన ఏర్పాట్లు చేసినాడు. వీరందరిని పరమశివుడు పరమప్రీతిగా సత్కరించినాడు. అగ్నిదేవుడు వంటబ్రాహ్మడిగా, వరుణుడు నీళ్ల బ్రాహ్మడిగా, సేవలందించారు. ఇలా వారివారి పనుల్లో ఉత్సాహంగా, ఆనందంతో దేవతలందరూ మునిగివున్న వేళల్లో పార్వతీదేవి, సరస్వతీదేవి శ్రీనివాసునికి మంగళకరంగా అభ్యంగస్నానాదులు చేయించి పెండ్లికుమారుని చేయవలె కదా" అని ఆలోచిస్తున్న సమయంలో శ్రీనివాసుడు ఈ కల్యాణ శుభవేళలో శ్రీమహాలక్ష్మి ఇక్కడ వుంటే ఎంత బాగుంటుంది కదా! ఆమె లేని ఈ పెండ్లి పెండ్లే కాదు అని విలపిస్తుండగా, బ్రహ్మదేవుడు అయనను ఓదారుస్తూ ఇప్పటికైనా మించి పోయినది ఏదీలేదు. ఆమెను ఆహ్వానించుటకు ఎవరైనా సరే వెళ్లగలం అని పలుకగా, శ్రీనివాసుడు తేరుకొని వెంటనే సూర్యభగవానుని పిలిచి, నీవు శ్రీమహాలక్ష్మి వేంచేసి వున్న కొల్హాపురానికి వెళ్ళు. శ్రీనివాసుడు నీ వియోగంవల్ల అస్వస్థతగా వున్నాడని అసత్యం చెప్పి ఆమెను పిలుచుక రావలసిందని ఆదేశించినాడు.

శ్రీనివాసుని ఆజ్ఞను శిరసావహించి సూర్యదేవుడు కొల్హాపురానికి వెళ్లి శ్రీనివాసుని కోరికను తెలియజేయగా, ఆమె వెంటనే వేంకటాచలానికి ఏతెంచి శ్రీనివాసుని దర్శించి సంతోష పరవశయైనది. అత్యంత కోలాహలంగా దేవత లందరూ వుండిన విశేషాన్ని గూర్చి లక్ష్మీదేవి ప్రశ్నించింది. అంత శ్రీనివాసుడు త్రేతాయుగంలో లక్ష్మీదేవితో నీ

ఆనతి ప్రకారం అప్పటి వేదవతిని ఈనాడు పద్మావతిగా వివాహ మాడదలచి నీ కోరిక నెరవేర్చువేళ ఆసన్నమైనది. అందు నిమిత్తం నిన్ను పిలిపించితిని, నీవు లేని పెళ్లి పెళ్లేకాదు కదా! అని తెలియపరచినాడు.

అందుకు అలుక తగ్గిన లక్ష్మీదేవి సంతోషిస్తూ శ్రీనివాసుని పెండ్లి కొమరునిగ తయారుచేయుటకు ఉద్యుక్తురాలైంది. పార్వతి, సరస్వతి, మున్నగు వారందరు మంగళద్రవ్యాదులతో శ్రీనివాసుని అభ్యంగ స్నానం చేయించారు.

కుబేరుడు ఇచ్చిన ఆభరణాలను నూతన వస్త్రాలను అలంకరించుకొని సర్వశోభాయమానంగా నూతనవరుడైన శ్రీనివాసుడు తమ కులదేవత అయిన శమీ వృక్షాన్ని కుమారధారా తీర్థంలో దర్శించుకొని పూజించి, దాని కొమ్మను వరాహస్వామి ఆలయ సమీపంలో ప్రతిష్ఠించి, అర్చించినాడు.

పిదప పద్మావతిని వివాహ మాడుటకై నారాయణపురానికి తరలి వెళ్లుటకు ముందుగా భోజనాదులు ముగించుకొని వెళ్లుట శుభప్రదమనీ, ఉపవాసంతో, ఖాళీ కడుపులతో శుభ కార్యాలకు వెళ్లుట మంచిదికాదనీ, అందువల్ల ఇక్కడ వేంచేసివున్న కోట్లాది మంది దేవగంధర్వ ఋష్యాదుల అన్న సంతర్పణకోసం భోజనం ఏర్పాట్లు చేయవలసిందని బ్రహ్మదేవుడు శ్రీనివాసుని కోరినాడు. అంత శ్రీనివాసుడు, తాను ధనం ఏమాత్రం లేని వాణ్ణి, ఇప్పుడు ఇంత ఖర్చు ఎలా భరించేది అని తలపోసినాడు వెంటనే నీలకంఠుడైన పరమశివుడు ఇలా పలికినాడు.

*"శ్రోతవ్యం వచనం తాత! మమ బాలస్య మాధవ!*
*వివాహ కరణే దేవ! తథా భవనకర్మణి*
*ప్రారంభస్యాన్తపర్యంతం యోహి యత్నం సమాచరేత్*
*స ఏవ పుణ్యవాన్ లోకే కీర్తిమేతి న సంశయః*
*సంపాద్యాః సర్వ సంభారాః శుభకార్యేషు పుష్కలాః*
*బహులార్థవ్యయేనాపి తదభావే త్వృణం చరేత్."*

నాయనా! మాధవా! వివాహం చేయుటకు, ఇల్లును కట్టుటకు పూనుకొన్న వాడు ప్రారంభించినది మొదలుగా పూర్తి అగువరకు ప్రయత్నంచెయ్యాలి. కాని విడవకూడదు. వాటిని పూర్తి చేయడం కీర్తివంతమైన పని. ఒకవేళ వాటికోసం డబ్బు లేనిచో, లేదా డబ్బు చాలకపోయినా అప్పుచేసి అయినా వాటిని పూర్తి చేయాలి. అదే శుభప్రదం అని శివుడు పలికినాడు. ఇప్పుడు నా వివాహానికి ఎవరు ఋణం

ఇవ్వవలసిందని ఆలోచిస్తూ శ్రీనివాసుడు కుబేరుని ఏకాంతంగా పిలిచి తన పెళ్లికి కావలసిన ధనాన్ని అప్పుగా ఇవ్వమని కోరినాడు. అలాగే స్వామీ! కాలానుగుణంగా ధనంలేనివాడు ధనవంతుని వద్ద అప్పు పత్రం రాసిచ్చి, ధనాన్ని తీసుకొన్నట్లుగానే నీవు నాకు పత్రాన్ని రాసి ఇవ్వు" అని కుబేరుడడిగినాడు. అట్లేనని శ్రీనివాసుడు స్వామి పుష్కరణి పశ్చిమ తీరంలోవున్న అశ్వత్థవృక్షం కింద కూర్చొని బ్రహ్మదేవునిచే అప్పు పత్రాన్ని ఇలా రాయించినాడు.

"ఋణగ్రాహీ శ్రీనివాసో ధనదాయీ ధనేశ్వరః
ఆత్మకార్య నిమిత్తస్తు కల్యాణార్థం కలౌ యుగే
వైశాఖ శుక్ల సప్తమ్యాం విలమ్బే చైవ వత్సరే
నిష్కాణాం రామముద్రాణాం లక్షాణి చ చతుర్దశ
ద్రవ్యం దత్తం ధనేశేన వృద్ధి గ్రహణ కారణాత్
సవృద్ధి దిత్సతా మూలం స్వీకృతం చక్రపాణినా
వివాహవర్ష మారభ్య సహస్రాన్తే ధనం పునః
దాతవ్యం యక్షరాజాయ శ్రీనివాసేన శార్ఙ్గిణా
ఏకః సాక్షీ చతుర్వక్త్రో ద్వితీయస్తు త్రిలోచనః
తృతీయోఽ శ్వత్థరాజస్తు వేత్తి సర్వమిదం దృఢమ్
ఇత్యేతదృణపత్రస్తు శ్రీనివాసోఽ లిఖత్స్వయమ్."

కలియుగంలో విలంబనామసంవత్సరం వైశాఖమాసం శుక్లపక్ష సప్తమి రోజున కుబేరునివద్ద నుండి నా వివాహార్థమై రామముద్రలు కలిగిన పద్నాలుగు లక్షల నిష్కాలను వడ్డీని చెల్లించేవిధంగా అప్పు స్వీకరించడమైనది. వివాహం జరిగిన ఈ సంవత్సరం మొదలుగా వెయ్యి సంవత్సరాలలోగా ఋణాన్ని వడ్డీతో సహా తీర్చగలనని నేను వ్రాసి ఇస్తున్న అప్పు పత్రం ఇది. దీనికి చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు మొదటి సాక్షి! త్రినేత్రుడైన శంకరుడు రెండవ సాక్షి! తాము కూర్చొన్న అశ్వత్థవృక్షం మూడవసాక్షి! అంటూ శ్రీనివాసుడు పత్రాన్ని బ్రహ్మదేవునిచే రాయించాడు. దానికి సాక్షీభూతులుగా పరమేశ్వరుడు, బ్రహ్మదేవుడు, అశ్వత్థ వృక్షం నిలిచారు.

వెంటనే అగ్నిదేవుని పిలిచి అందరికి భోజనాలు ఏర్పాటు చేయుమని ఆదేశించినాడు. శ్రీనివాసుని ఆనతిపై అగ్నిదేవుడు స్వామిపుష్కరిణిని అన్న పాత్రంగా,

పాపనాశనతీర్థాన్ని పప్పుపాత్రగా, ఆకాశగంగను పరమాన్న పాత్రంగా, దేవతీర్థాన్ని కూరపాత్రగా, తుంబురు తీర్థాన్ని చిత్రాన్నపాత్రగా, కుమారధారతీర్థాన్ని భక్ష్యాలపాత్రగా, పాండవతీర్థాన్ని చారుపాత్రగా, మిగిలిన తీర్థాలను పచ్చళ్లు మున్నగు నంజుడు పదార్థ పాత్రలుగా చేసి కమ్మనైన పదార్థాలను దివ్యరసోపేతంగా వండి తయారు చేశాడు. వీటి నన్నింటిని అహోబిల శ్రీలక్ష్మీనరసింహస్వామికి నివేదన చేసిన తర్వాత పాండవతీర్థం నుంచి వరుసగా శ్రీశైలంవరకు బారులుగా కూర్చున్న దేవతలందరికి వడ్డించారు.

ఇలాగ అప్పుగా తీసుకొన్న మొత్తంతో శ్రీనివాసుడు దేవతలందరికీ విందు భోజనం సమర్పించాడు. భోజనానంతరం దేవ, యక్ష, గంధర్వ ఋషిగణాలతో కలిసి పెండ్లి కుమారుడైన శ్రీనివాసుడు నారాయణ వనానికి తరలివెళ్లాడు. ఆకాశరాజు అందరినీ సగౌరవంగా, భక్తిపూర్వకంగా ఘనంగా ఎదుర్కోలు చెప్పి ఆహ్వానించాడు. అందరికీ వారి వారి హోదాకు తగినట్లుగా వేర్వేరుగా విడుదులను ఏర్పాటు చేశాడు. అత్యంత వైభవంగా కమ్మనైన విందు భోజనాలను ఏర్పాటు చేశాడు.

## శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయం

ఆ సాయంత్రం ఆకాశరాజు తన భార్య అయిన ధరణీదేవితో కలిసి అల్లుడు కాబోతున్న శ్రీహరిని భక్తిపూర్వకంగా పూజించాడు. శ్రీనివాసుని దివ్య పాదాలను కడిగి ఆ జలాన్ని తమ శిరస్సులపై చల్లు కొన్నాడు.

ఆకాశరాజు తన భార్య ధరణీదేవితో కలిసి అనేక విధాలుగా ప్రార్థిస్తూ పురాణ పురుషోత్తముడైన శ్రీనివాసునకు, వరపూజ చేసిన తరువాత అత్యంత భక్తి యుక్తులతో సుగంధ ద్రవ్యాలతో కూడిన తాంబూలాన్ని సమర్పించినారు. పిదప ఆకాశరాజు అల్లుడైన శ్రీనివాసుని పట్టపుటేనుగపై (భద్ర గజముపై) ఎక్కించి సకల దేవతలు ముందు నడుస్తుండగా, మంగళ వాయిద్యాలు మోగుతుండగా, వేద పారాయణలతో రాజభవనానికి సాదర పూర్వకంగా పిలుచుకొని వెళ్లినాడు. ఆ భవనంలో నాలుగు స్తంభాలతోకూడిన దివ్యమండపం మధ్యలో ఒక రత్న సింహాసనంలో శ్రీనివాసుని ఆశీనుని చేశారు.

అంతకుముందే పద్మావతిదేవిని పెండ్లి కూతురిని చేసి అనేక రత్నాభరణాలతో అలంకరించినారు. ఆ రమణీమణిని పాదాదిగా శిరస్సువరకు అనేకానేక నగలతో

హారాలతో తీర్చిదిద్ది బుగ్గన కాటుక బొట్టి పెట్టి పద్మావతిదేవిని పెండ్లికూతురిగా తీర్చిదిద్దినారు. ఇంతలో వివిధ మంగళ వాద్యాలు మోగుతుండగా పద్మావతీదేవి సుమంగళీ స్త్రీల పర్యవేక్షణలో గౌరీపూజ నిర్వర్తించింది.

ఈ శుభ సమయంలో నారదతుంబురాది దేవ ఋషులు గానం చేస్తుండగా యక్ష కిన్నర గరుడ గంధర్వాదులు శ్రుతి మధురమైన మంగళ గీతికలు పాడుతుండగా, వేదమంత్రాలు పఠింపబడుతుండగా మంగళ వాయిద్యాలు శ్రుతిపేయంగా సాగుతుండగా శ్రీనివాసుని పరిణయఘట్టం సమీపించింది. జగత్కల్యాణం కోసం జరుగుతున్న పద్మావతీ శ్రీనివాసులపరిణయ సుందర దృశ్యాల్ని తిలకించి ఆనందించడానికి సకల చరాచర జగత్తు తరలివచ్చి జయగీతికలు ఆలాపిస్తున్న శుభసందర్భంలో ఆకాశరాజు కన్యాదాన సమయంలో శ్రీనివాసునకు అనేక కానుకలను సమర్పించు కొన్నాడు.

*"కన్యాప్రదాన సమయే దక్షిణాం రాజ సత్తమః*
*కోటిసంఖ్యా న్నిష్క పుంజాన్ దత్తవా న్వేంకటేశితుః*
*కిరీటం శతభారం తు కంఠికామపి తావతీమ్*
*పునరేకాం తదర్థం చ తదర్థం చైవ కంఠికామ్*
*పదకాని దదౌ సప్తానర్ఘాణ్యథ నృపోత్తమః*
*మాలికాం మౌక్తి కానాం చ భుజ భూషణ యుగ్మకం*
*కర్ణ భూషౌ మౌక్తి కాఢ్యావంసపర్యంత లంబినౌ*
*కంకణే రత్న మాణిక్య వజ్ర వైడూర్య నిర్మితే*
*ద్వాత్రింశ ద్భారసంయుక్తే అనర్ఘే దత్తవాన్నృపః*
*నాగభూషణ యుగ్మం చ బాహుపూరాదికాం స్తథా*
*భూషణాన్యంగుళీయాంశ్చ దశానాం వీరముద్రికామ్*
*కటిసూత్రం స్వర్ణమయం వర వజ్రసమన్వితమ్*
*ఏకాదశ శతీభారం బహురత్న సమన్వితమ్*
*పాదుకేచ తతో రాజా దత్తవా న్మధుఘాతినే*
*దదౌ భోజనపాత్రం చ షష్టి భారయుతం ప్రభోః*
*లఘుపాత్ర సమోపేతం బృహత్పాత్ర మపాం తథా*
*కంబళానాం చతుష్షష్టిం దత్తవాన్రాజ సత్తమః"*

పద్మావతీ శ్రీనివాసుల పరిణయ శుభసమయంలో ఆకాశరాజు శ్రీనివాసునకు కోటిసంఖ్యగల నిష్కాల ధనరాశిని దక్షిణగా సమర్పించుకొన్నాడు. ఇంకా శతభారమగు బంగారు కిరీటాన్ని, అంతే తూకంవున్న కంఠమాలలను, దానిలో సగం బరువున్న మరొక కంఠమాలను, మళ్ళీ దానిలో సగమున్న మరొక కంఠహారాన్ని అల్లునికి కానుకగా సమర్పించుకొన్నాడు. ముత్యాలహారాన్ని భుజకీర్తులను, ముత్యాలు తాపిన కర్ణాభరణాలను, ద్వాత్రింశద్భారంతో మాణిక్యాలు పొదగబడిన కంకణాలను, రెండు నాగాభరణాలను, పది ఉంగరాలనూ, వజ్రాలు పొదిగిన బంగారు మొలత్రాడును, బంగారు పాదుకలను శ్రీనివాసునికి బహూకరించినాడు. ఇవికాక భోజనానికిగాను ఒక బంగారు పళ్లేన్ని, రెండునీళ్ల చెంబులను ఇవ్వడంతోపాటుగా 64 రత్న కంబళ్లను కూడ సమర్పించినాడు.

ఇంకా అనేకానేక దివ్య వస్త్రాలను, నవరత్న హారాలను వజ్రకవచాన్ని, మరకత మాణిక్యాదిగా అనేక వజ్రాభరణాలను శ్రీనివాసునకు సమర్పించిన తరువాత ఆకాశరాజు వైభవంగా ఘనంగా పద్మావతిదేవిని సాలంకృత కన్యాదానం చేశాడు.

"అత్రి గోత్ర సముద్భూతాం సువీరస్య ప్రపౌత్రికామ్
సుధర్మణస్తు పౌత్రీం చ పుత్రీ మాకాశభూపతేః
త్వమంగీకురు గోవింద! కన్యాం కమలలోచనామ్
ఏవముక్తే మహారాజో ముదా రత్నాంబరం దదౌ"

అత్రిమహర్షిగోత్రంలో జన్మించిన సువీరచక్రవర్తి మునిమనుమరాలును, సుధర్మ మహారాజుగారి మనుమరాలును, ఆకాశరాజకూతురు అయిన పద్మావతి అనే ఈ కన్యాకామణిని, ఓ గోవింద! నీకు సాలంకృతంగా సమర్పిస్తున్నాం. నీవు సంపూర్తిగా సంతోషంతో అంగీకరించి ధర్మపత్నిగా స్వీకరించవలసిందిగా ప్రార్థిస్తున్నాం -- అంటూ ఆకాశరాజు పక్షాన దేవగురువు బృహస్పతి, పద్మావతిఅమ్మవారి గోత్ర ప్రవరను వివరించి ఆకాశరాజుచే కన్యాదానం చేయించినాడు.

శ్రీనివాసుని పక్షాన పురోహితుడైన వసిష్ఠమహాముని స్వామివారి గోత్ర ప్రవరను ఇలా వివరించినాడు.

"ప్రపౌత్రస్య యయాతేస్తు పౌత్ర స్యామిత తేజసః
శూరసేనస్య రాజేంద్ర! వసుదేవస్య భూపతేః

పుత్రస్య వేంకటేశస్య గోత్రే వాశిష్ఠ సంజ్ఞకే
జాతస్యాత్రి కులోత్పన్నాం కన్యాం కనకభూషితామ్
గ్రహీష్యామో వయం రాజన్ తవ పుత్రీం నృపోత్తమ
కన్యావర ప్రవరయో రిత్యుచ్చారితయో రథ
ధరణ్యా సహ రాజేంద్రః కన్యాదాన పరాయణః
ప్రహృష్ట హృదయః ప్రాహ శ్రీనివాసం పరాత్పరమ్.

అమిత తేజోవంతుడైన యయాతిరాజు యొక్క మునిమనుమడును, శూర సేన చక్రవర్తి యొక్క మనుమడును, భూపతి అయిన వసుదేవుని పుత్రుడును వసిష్ఠ ముని గోత్రోద్భవుండును (తిరుమలలో జరిగే వైఖానసాగమం ప్రకారంగా శ్రీనివాసుడు భరద్వాజగోత్రుడుగా నిత్యమూ సంకల్పంలో చెప్పబడుతున్నది) అయిన శ్రీ వేంకటేశ్వరునకు, కనకాభరణ భూషితురాలైన నీ పుత్రికను స్వీకరించుటకు గాను సిద్ధంగా ఉన్నాం. ఓ రాజా! కన్యాదాన పరాయణుడవై నీవు అత్యంత సంతోషంతో శ్రీనివాస పరాత్పరునికి సమర్పిస్తున్న కన్యకామణిని మేము అత్యంత ఆనందంగా స్వీకరిస్తున్నాం" అంటూ వసిష్ఠ మహర్షి ఆనందంగా పలికినాడు.

వెంటనే ఆకాశరాజు సర్వాభరణ భూషిత అయిన పద్మావతిని వెంట నిడుకొని శ్రీనివాసుని దగ్గరికి వచ్చినాడు.

''కన్యామిమాం ప్రదాస్యామి గృహాణ పురుషోత్తమ!
ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా ధరణ్యా స్రావితాం తదా
మంత్రపూతాం స్వామితీర్థధారాం సకనకాం కరే
దక్షిణే శ్రీనివాసస్య దదౌ పద్మావతీం తతః
విధానం చ తతశ్చక్రే రాజేంద్ర స్సపురోహితః
పూజయిత్వా జగన్నాథం గంధ వస్త్రానులేపనైః
కంకణం బంధయామాస వాసుదేవకరాంబుజే
పద్మావత్యాః కరాంభోజే బంధయత్కంకణం గురుః
తథా మాంగల్య సూత్రస్య బంధం వైవాహికం తదా
శ్రీనివాసేన దేవే నాకారయత్స పురోహితః"

ఆకాశరాజు అల్లుడైన శ్రీనివాసుని కుడిచేతిలో పద్మావతి అమ్మవారి కుడి చేతిని పెడుతూ మంత్రపూతములైన స్వామిపుష్కరిణీతీర్థధార సహితంగా కనకాభరణాలతో శోభాయమానంగా అలంకరింపబడిన పద్మావతిని కన్యాదానం చేశాడు. ఆ శుభ సమయంలో జగన్నాథునికి శ్రీ చందన లేపనాన్ని, వస్త్రాలను బహూకరించినాడు.

పిదప బృహస్పతి ఇరువురు నూతన వధూవరులకు కంకణ దారాలను ధరింపజేసినాడు. తరువాత సుముహూర్తంలో--

*"సావిత్రీవ చ కల్యాణీ బహుపుత్రవతీ భవ*
*సర్వ లోకస్య జననీ భవ మంగళదాయినీ"*

అంటూ సుమంగళీ స్త్రీలు శుభాశీస్సులను మంగళ గీతికలుగా పాడుతూ వుండగా, మహనీయులైన బ్రాహ్మణుల దివ్య మంత్రాలతో పరమ పవిత్రమైన మంగళ సూత్రాన్ని శ్రీనివాసప్రభువు పద్మావతిదేవియొక్క కంఠంలో వైశాఖ శుక్లపక్షం దశమీ శుక్రవారం పూర్వఫల్గునీ నక్షత్ర శుభముహూర్తంలో కట్టినాడు. ఆ శుభ సమయంలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీనివాసుడు మంగళ సూత్రాన్ని పద్మావతి మెడలో కడుతుండగా ముక్కోటి దేవతలు, సనకసనందనాది మహర్షులు......... ఇలా ఎందరెందరో వారిపై పుష్పవర్షం కురిపించారు. పిదప ఆ నవ వధూవరులిద్దరూ ఒకరిపై ఒకరు ముత్యాలసేసలు చల్లుకున్నారు. ఇలా శ్రీ పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం కన్నుల పండువుగా మంగళప్రదంగా పరిసమాప్త మయ్యింది. పిదప వశిష్ఠులవారు నూతన వధూవరులయిన పద్మావతీ శ్రీనివాసులచేత నాకవల్లి, లాజహోమం ఇత్యాదిగా వైదిక ప్రక్రియలు యజుర్వేద మంత్ర పూర్వకంగా నశాస్త్రీయంగా నిర్వహింప జేశాడు. పెండ్లికి వచ్చిన వారలంతా కడుపార కోరిన వంటకాలన్నీ తృప్తిగా ఆరగించారు. కానుకలందు కొన్నారు.

ఈ కల్యాణసమయంలో ఆకాశరాజు బ్రాహ్మణులకు భూరిదక్షిణలతో చందన తాంబూలాలను సమర్పించాడు. గోదానాలను చేశాడు. ఎవరికి ఏది కావాలో ఆ వస్తువులను వారవారికి ధారాదత్తం చేశాడు. ఇలాగ పద్మావతీ శ్రీనివాసుల పరిణయ వేడుకలు ఐదు రోజులపాటు అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి" అంటూ సూతమహర్షి 'న భూతో న భవిష్యతి' గా జరిగిన పద్మావతీ శ్రీనివాసుల పరిణయ విశేషాలను శౌనకాది మహర్షులకు వివరిస్తూ ఒక అవ్యక్తానందానికి లోనయ్యాడు.

## తీర్థయాత్ర కూడదు!

జగత్కల్యాణం కొరకు అంగరంగ వైభవంగా జరిగిన పద్మావతీ శ్రీనివాసుల పరిణయానికి వచ్చిన సకల లోకవాసులైన యక్షగంధర్వ కిన్నరకింపురుషులు, బ్రహ్మాది దేవతలు, మహర్షులు, యోగులు....... మున్నగువారు అనేకులు కమ్మనైన విందు లారగించారు. అనేక విధాలైన కానుకలను పారితోషికంగా అందుకొని, అత్యంత ఆనంద సందోహాలతో వారి వారి లోకాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆకాశరాజు అల్లుడైన శ్రీనివాసునికి, సకల సార్వభౌమోచిత సత్కారాలతో సగౌరవంగా వీడుకోలు చెప్పాడు. అల్లుని వెంట కూతురు పద్మావతిని అనేకానేక బహుమానాలిచ్చి సాగనంపుతూ ఇటు పుట్టినింటికీ, అటు అత్తింటివారికీ మంచి పేరు వచ్చునట్లుగా నడచుకోవలసిందని ఆకాశరాజు అనేక విధాలుగా హిత బోధ చేశాడు.

నూతన దంపతులైన పద్మావతీ శ్రీనివాసులు నారాయణవరం నుంచి వేంకటాద్రికి తిరిగి వెళుతూ దారిలో అనేక సుందరవనాలను, మహర్షుల తపో భూములను దర్శించినారు. ఆ దారిలోనే సువర్ణ ముఖరీ నదీ తీరంలో వున్న కుంభ సంభవుడైన అగస్త్యమహాముని ఆశ్రమాన్ని చేరుకొన్నాడు. ఆ మహాముని వారలకు స్వాగత సత్కారాలందించి సేద తీర్చినాడు. ఆయన శ్రీనివాసునితో--

"నాయనా శ్రీనివాసా! నూతన వధూవరులు, నూతన దంపతులు కొంతకాలం పాటు తీర్థయాత్రనుగాని, క్షేత్ర సందర్శనంగాని చేయకూడదని సంప్రదాయం. ఆ నియమం ప్రకారం మీరు దివ్య క్షేత్రమైన ఆదివరాహ క్షేత్రానికి వెళ్లకూడదు. అందువల్ల మీరు ఇరువురు కొంతకాలం పాటు (ఆరునెలలపాటు) ఇక్కడే, ఈ ఆశ్రమంలోనే వుంటూ, కాలక్షేపం చేయవలసింది. తద్వారా నీ సాన్నిధ్యాన్ని ప్రసాదించి, మాకూ ఆనందాన్ని కలుగజేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను" అంటూ విన్నవించాడు.

అందుకు శ్రీనివాసుడు సమ్మతించి, అగస్త్యాశ్రమంలో కొంతకాలంపాటు వుండటానికి నిశ్చయించుకొన్నాడు. శ్రీనివాసునకుతోడుగా పద్మావతి భార్యగా దొరికి నందులకు లక్ష్మీదేవి తృప్తిపడింది. ఆనందంతో ఇక తను లేకపోయినా పరవాలేదు. శ్రీనివాసుడు పద్మావతితో వుండగలడని భావించి, శ్రీమహాలక్ష్మి మళ్లీ కొల్హాపురానికి వెళ్లిపోయింది. ఆ తర్వాత వకుళమాత కూడ పద్మావతీ శ్రీనివాసులతో "మీరు అగస్త్యమహర్షి ఆదేశానుసారం ఇక్కడ కొంతకాలంపాటు వుండిన తరువాత తిరిగి

తిరుమల కొండను చేరుకోవలసిందనీ, వారి రాకకోసం తాను ఎదురుచూస్తూ వుంటానని చెబుతూ వీడ్కోలును పొంది వేంకటాచలానికి వెళ్లింది.

## చెరి సగం

కొంతకాలానికి ఆకాశరాజు అస్వస్థుడై వృద్ధాప్యం చేత స్వర్గస్థుడు అయ్యాడు. అంతే! తదుపరి రాజ్యాధికారం కోసం ఆకాశరాజు తమ్ముడు తొండమానుడు, ఆకాశరాజు కుమారుడు వసుదానుడు ఇరువురూ కలహించారు. ఒకరికొకరు కాళ్లు దువ్వారు. చివరకు యుద్ధానికి తల పడ్డారు. ఆ యుద్ధంలో పద్మావతిదేవి సోదరుడు, శ్రీనివాసుని బావ మరది అయిన వసుదానుడు యుద్ధంలో తనవైపు వుంటూ, సాయమందించ వలసిందని శ్రీనివాసుని కోరినాడు. అందుకు పద్మావతిదేవి కూడ తన తమ్మునికే సహాయం మందించి రాజ్యాధికారాన్ని అందించవలసిందని ప్రాధేయపడింది. మరో వైపు శ్రీనివాసుని అంతరంగిక భక్తుడు, ఆకాశరాజు తమ్ముడు అయిన తొండమానుడు శ్రీ వేంకటేశ్వరుని అనేక విధాలుగా తనకే సాయం చేయ్యవలసిందని ప్రార్థించినాడు. ఇరువురి ప్రార్థనల్ని విన్న శ్రీనివాసుడు, తాను తన బావమరది అయిన వసుదానుని పక్షానవుండి యుద్ధం చెయ్యాలని, అలాగే తన భక్తుడైన తొండమానునికి తన శంఖ చక్రాలను ఇవ్వాలని నిశ్చయించుకొని యుద్ధంలో పాల్గొన్నాడు. ఆ పోరు తీవ్రంగా కొనసాగింది. ఆ యుద్ధంలో తొండమానుడు శ్రీనివాసునిపైన సుదర్శనచక్రాన్ని ప్రయోగించి తీవ్రంగా గాయపరచినాడు. దానితో శ్రీనివాసుడు మూర్ఛపోయినాడు. యుద్ధ భూమిలో శ్రీవేంకటేశుడు స్పృహ తప్పిపడిపోయాడన్న వార్త పద్మావతి విని తల్లడిల్లుతూ పరిగెత్తి వచ్చింది. శ్రీనివాసుణ్ణి సేదదీర్చి మేల్కొల్పింది. చిట్ట చివరకు శ్రీనివాసుడు రాజ్యాన్ని చెరి సగంగా వసుదానునికి, తొండమానుడికి పంచి ఇచ్చి సంధి కుదిర్చాడు. ఇలా ఇరువురికి సంధి కుదిర్చిన శ్రీనివాసుడు యధాప్రకారం పద్మావతితో కూడి అగస్త్యాశ్రమం చేరుకొన్నాడు.

## తొండమానుడు శ్రీనివాసుని దర్శించుట

యుద్ధం ముగిసి, ఎవరి రాజ్యము వారికి పంచి ఇచ్చిన తదుపరి సుఖముగా రాజ్యపాలనము జరుగుట శ్రీనివాసుని అపార కరుణవల్లనే సిద్ధించిందని భావించిన తొండమానుడు శ్రీనివాసుని భక్తి ప్రపత్తులతో దర్శించి అనేక విధాలుగా స్తుతించినాడు.

యుద్ధ భూమిలో తన కత్యంత ఇష్టుడై తనకు శంఖ చక్రాల నిచ్చిన స్వామిపైనే సుదర్శనాయుధాన్ని ప్రయోగించి, తాను చేయరాని ఘోర తప్పిదాన్ని చేశానని, ఆ పాపం ఎంతటి శిక్షను అనుభవించినా పోదని అనేక విధాలుగా బాధపడుతూ శ్రీనివాసుని వేడుకొన్నాడు. తనకు సాయంగా ఇచ్చిన ఆయుధాలను తిరిగి తీసుకోవలసిందనీ వాటిని తిరిగి ఇచ్చినాడు. కాని శ్రీనివాసుడు తొండమానుని మానసిక బాధను పోగొడుతూ "నీవు ఎలాంటి తప్పిదం చేయలేదనీ, యుద్ధ భూమిలో క్షత్రియ ధర్మం నెరవేర్చావనీ, అందువల్ల తనపై చక్రాన్ని ప్రయోగించటం ఏ మాత్రం నేరం కాదని చెప్పుతూ, నీకిచ్చిన ఆయుధాలను తిరిగి తీసుకోవడం జరగదని, కలియుగాంతంవరకు ఇలాగే శంఖ చక్రాలు లేకుండా వుంటాననీ, అందువల్ల వాటిని నీ దగ్గరే వుంచవలసిం దని" తొండమానుని ఆజ్ఞాపిస్తూ ఇంకా ఇలా పలికినాడు.

"ఓ తొండమాను చక్రవర్తీ! నీవేగాక, నీ సోదరుడు అందరూ నాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయ బంధువులు. బంధువులేకాదు, పరమభక్తులు కూడ. నీ సోదరుడైన ఆకాశరాజు నాకు పద్మావతిని ఇచ్చి వివాహం చేసి ఒక ఇంటి వానిని చేసినాడు. ఆకాశరాజు పుణ్యమా అని నాకు గృహిణి ఏర్పడినది.ఆ వివాహంతో ఆచంద్ర తారార్కముగా ఆకాశరాజు చిరకీర్తిని పొందినాడు. చిరకీర్తిని మాత్రమే కాదు చిరస్థాయిగా పరమపదాన్ని పొందినాడు. ప్రస్తుతం గృహస్థునైన నాకు గృహము లేదు. ఓ రాజా! తొండమాను ప్రభూ! నీవు నాకు చిన్న మామవుకదా! నీ అన్న గృహిణిని ఇచ్చినాడు. మరి నీవు గృహాన్ని నిర్మించి నాకు స్థిర నివాసాన్ని ఏర్పరచ వలసింది. ఈ నా కోరికను త్వరలో నెరవేర్చగలవను కొంటాను" అని శ్రీనివాసుడు తొండమానుని ఆదేశించినాడు. వెంటనే తొండమాను చక్రవర్తి--

"ఎంతమాట ప్రభూ! శ్రీనివాసా! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడవు. కోరినవరాల రాయడవు! ఆపద్బంధుడవు! జగత్కల్యాణ కారకుడవు! అయిన నీకు నేను వాసయోగ్యమగు నివాసాన్ని నిర్మించడం ఎంతటి మహాభాగ్యం. ఓ ప్రభూ! నీవు నాయందలి అపారకరుణ చేత ఈ పని నాకు అప్పగించుచుంటివి కాని. నీకు కొదువ ఏమి! స్వామీ! నా జీవితం పరిపూర్ణంగా ఫలప్రదమైనది. నా జీవితం ధన్యమైనది. నీ దయకు నేనెంతో కృతజ్ఞుణ్ణి స్వామీ! మరి కోరిన నివాసాన్ని నేనెక్కడ నిర్మించవలెను? ఎలా నిర్మించవలె? అందులో ఏఏ వసతులు వుండవలెను. ఎన్ని

ద్వారాలుండవలెను? ఇలాంటి వివరాలన్నీ తెలియజేయుము ప్రభూ! నేను తప్పక నీ దయవలన నీకు గృహమును నిర్మించి ఇవ్వగలనని" తొండమాను చక్రవర్తి భక్తి పూర్వకంగా నమస్కరించి శ్రీనివాసునితో పలికినాడు".

శ్రీనివాసప్రభువు తొండమానుడు పలికిన మాటలకు చాల ఆనందించి "ఓ రాజా! నీవు వరాహక్షేత్రంలో వరాహస్వామి అనుమతితో నాకు అనువైన వాసయోగ్య మగు దివ్య మందిరాన్ని నిర్మించవలసింది.

ఆ మందిరం తూర్పుముఖంగా రెండు గోపురాలు కలిగి వుండవలెను. మూడు ప్రాకారాలతో ఏడు ప్రవేశద్వారాలలోను, ధ్వజస్తంభం, అస్థాన, యాగమంటపాలతో విరాజిల్లుతూ వాస్తు శాస్త్ర ప్రకారం సర్వాంగ సుందరంగా శోభిల్లుతూ వాటి మధ్యలో ఆనందనిలయ మను బంగారువిమానాన్ని ఏర్పాటు చేసి నాకు సమర్పించుకొని నీ జన్మను ధన్యం చేసుకోవలసింది" అని ప్రీతితో పలికినాడు.

శ్రీనివాసప్రభువు ఆదేశించిన ప్రకారం తొండమానుడు దివ్య భవనాన్ని నిర్మించాడు. అంతేకాక శ్రీనివాసుని దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం వేంకటాద్రికి మెట్లదారి ఏర్పరచాడు. మధ్యలో అక్కడక్కడా విశ్రాంతి మండపాల్ని, వాటి పక్కన తటాకాల్ని నిర్మించాడు. అంతా సిద్ధమైన తర్వాత ఆనందనిలయ దివ్య భవనాన్ని తొండమానుడు భక్తి పూర్వకంగా శ్రీనివాసునకు సమర్పించాడు.

శ్రీ వేంకటేశ్వరుడు తొండమానుచక్రవర్తి నిర్మించి ఇచ్చిన అలయాన్ని చూచి సంతోషించాడు. వంట శాలతో, ధాన్య శాలతో, యాగ మంటపంతో, అభరణ ధనాగారా లతో విలసిల్లుతున్న ఆ మందిరాన్ని వీక్షించి ఇలా అన్నాడు. ఓ చక్రవర్తీ! నాకోసం నిర్మించిన ఈ భవనం చాలా దివ్యంగా వుంది. కాని ఇందులో నిక్షిప్తమై వున్న శ్రీతీర్థ భూతీర్థాలను పునరుద్ధరించి నిర్మించవలసింది. వాటిని నీవు గత జన్మలో ఏర్పాటు చేశావు. కాని అవి కాలాంతరంలో నిక్షిప్తంగా భూగర్భంలో వున్నాయి. అని పలుకగా తొండమానుడు ఆశ్చర్యంతోను, ఆనందంతోను ఉక్కిరి బిక్కిరి అయ్యి, వింతగా చూశాడు. తానెప్పుడు, ఎలాగ ఆ తీర్థాలను తవ్వించాడో తనకు తెలియజేయ వలసిందని భక్తి ప్రపత్తులతో విన్నవించుకొన్నాడు. వెంటనే శ్రీహరి ఇలా వివరించి నాడు.

## భక్తశిఖామణి రంగదాసు

శ్రీ వైకుంఠధాముడైన శ్రీ మహావిష్ణువు శ్రీదేవి భూదేవి సమేతంగా లీలామానుష రూపంతో భూలోకంలోని ఈ పర్వతరాజంపై విహరిస్తూ వుండినాడు. వారు ఈ క్షేత్రంలో సంచరిస్తున్న సమయంలో, శ్రీవారి భోజనం కోసం శ్రీ మహాలక్ష్మి ఒక తీర్థాన్నీ, భూదేవి ఒక తీర్థాన్ని ఏర్పాటు చేశారు. ఆ తీర్థాలు శ్రీతీర్థంగాను, భూతీర్థంగాను ప్రసిద్ధి కెక్కినాయి. ఇలా కొన్ని వేల ఏండ్లు గడచి కలియుగం ప్రవేశించిన తరుణంలో ఆ దివ్య తీర్థాలు రెండూ నిక్షిప్తమైనాయి.

ఆ తర్వాత చాలా కాలానికి శ్రీకృష్ణుని పరమభక్తుడైన గోపీనాథుడు అనే వైఖానస బ్రాహ్మణుడు శ్రీమహా విష్ణువును గూర్చి తపస్సు చేశాడు. శ్రీహరి అతని తపస్సునకు సంతోషించి వరం కోరుకొమ్మన్నాడు. అందుకు ఆ విప్రుడు ఆనందపడుతూ "స్వామీ! ఇప్పుడు నీవు నాకు దర్శన మిచ్చిన శ్రీకృష్ణ రూపంలోనే నిత్యమూ నాతో పూజలందు కోవలసిందని" ప్రార్థించాడు.

అందులకు శ్రీహరి అతని భక్తికి మెచ్చి-- "ఓ విప్రవర్యా! నీవు వేంకటా చలానికి వెళ్లు. అక్కడ నేను 'గోవిందుడు' అని పిలువబడుతున్న శ్రీకృష్ణరూపంలో దర్శన మిస్తున్నాను. నీవు అక్కడికి వెళ్లి నిత్యమూ అర్చించి భక్తితో నివేదనాదులు సమర్పించు. నీవు వెళుతున్న దారిలోనే నీకు తోడుగా 'రంగదాసు' అనే భక్తుడు తారసపడతాడు. అతడు నీవు చేసే కైంకర్యాదులకు, పూజా ద్రవ్యాదులను సమ కూరుస్తూ సేవకుడుగా మనగలడు. కనుక అతనిని కూడ నీతో వెంట పిలుచుకొని వేంకటాద్రిని చేరు. తద్వారా నీ కోరికా తీరుతుంది. నీ జన్మ చరితార్థం అవుతుంది" అని వరమిచ్చాడు.

అందుకు గోపీనాథుడు సంతసించి తనకు వేంకటాచలక్షేత్రయాత్రలో రంగదాసును వెంటపెట్టుకొని ఇక్కడికి వచ్చాడు. ఆ రంగదాసు శ్రీ స్వామివారి ఆరాధన కోసం అవసరమయ్యే పుష్పాలకోసం, తులసికోసం తోటను పెంచడానికి రెండు బావులను నిర్మించినాడు. అదే స్థలంలో ఎప్పుడో నిక్షిప్తములైన శ్రీ తీర్థ భూతీర్థాలు మళ్లీ దైవికంగా బహిర్గతములయ్యాయి.

గోపీనాథుడు శ్రీతీర్థంనుంచి సేకరించిన జలాన్ని శ్రీవారివంటలకు అభిషేకానికి, అర్చనాదులకు వినియోగించేవాడు. భూతీర్థం నుంచి రంగదాసు

సంపెంగ, గన్నేరు, మందార, జాజి, మల్లె, చేమంతులు మున్నగువాటిని భక్తితో పూజకు సమర్పించేవాడు. ఇలాగ కొంతకాలం శ్రీనివాసుని పూజలు నిరాఘాటంగా, నిర్విఘ్నంగా కొనసాగినాయి.

ఒకరోజు పుష్పాలను సేకరిస్తున్న రంగదాసు దృష్టి, పుష్కరిణిలో భార్యలతో జలకాలాడుతున్న ఒక గంధర్వునిపై పడింది. అతని స్ఫురద్రూపం, ఆయన ప్రక్కన వున్న లోకోత్తర సౌందర్యవతులైన అతని స్త్రీలను కన్నార్పక చూస్తూ వున్న రంగదాసు మనసు వికలమై కాస్త భ్రమకు లోనయ్యింది. "ఆహా! ఈ రాజు ఎంతటి పుణ్యం చేసు కున్నాడో కదా! ఎంతటి భోగ భాగ్యాలు అనుభవిస్తున్నాడు. ఎంత స్త్రీ సుఖాన్ని పొందుతున్నాడు" అని చింతిస్తూ కొంత చిత్త చాంచల్యానికి లోనయ్యాడు. ఇలా ఆ గంధర్వుల వైభవానికి ఆశ్చర్యపోతూ నిశ్చేష్టుడై పూలసేకరణలో కొంత జాప్యం చేశాడు. ఇంతలో తేరుకొని జరిగిన అలస్యానికి చింతిస్తూ రంగదాసు తొందర తొందరగా పుష్కరిణిలో స్నానం చేసి పూజకోసం పూలు సమర్పించాడు. జరిగిన ఆలస్యానికి గోపీనాధుడు కోపించి నీవు అధోలోకంలో జన్మింతువుగాక అని శపించాడు. అందుకు బాధపడుతున్న రంగదాసుకు శ్రీహరి ప్రత్యక్షమై అనునయించి-- "ఓ రంగదాసా! నీవు నా పరమ భక్తుడవు నీ పాపాల్ని పరిహారం చేశాను. నీవు పుష్కరిణిలో సంకల్ప పూర్వకంగా స్నానం చేస్తూ నీ పాపాలను నాకు సమర్పించు. తదనంతరం నీవు చూచిన గంధర్వునివలె సకల భోగ భాగ్యాలు అనుభవించి నన్ను చేరుకోగలవు. అప్పటి ఆ రంగదాసే ఇప్పటి ఈ తొండమానుడవు. అందువల్ల ఓ రాజా! అప్పట్లో ఆ జన్మలో తవ్వించిన ఆ బావులను కూడ ఉద్ధరించి పునర్నిర్మించ వలసిందని శ్రీనివాసుడు ఆజ్ఞాపించినాడు.

తన పూర్వ జన్మ వృత్తాంతానికి ఆశ్చర్యపడిన తొండమానుడు శ్రీ తీర్థాన్ని ఉద్ధరించి, దానికి చుట్టూ రాతి కట్టడం ఏర్పాటుచేసి, దానికి బంగారు రేకులు తాపించినాడు. అదే అప్పటినుంచి 'బంగారు బావి' అని పేరు పొందింది. అలాగే భూతీర్థాన్ని దిగుడుబావిగా మెట్లతో నిర్మించి దానితో పూలవనాన్ని ఏర్పాటు చేశాడు. ఇలా శ్రీ తీర్థ భూతీర్థాలు రెండు శ్రీవారి సేవలో ప్రముఖ స్థానాన్ని పొందినాయి".

## ఆనందనిలయ ప్రవేశం

**శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనతిపై తొండమానుడు సర్వాంగ సుందరంగా, అత్యంత శోభాయమానంగా ఆనంద నిలయం అనే దివ్య భవనాన్ని నిర్మించాడు.**

శ్రీనివాసుడు ఆ భవంతిలో భక్తులను సంరక్షించడానికై ప్రవేశిస్తున్న శుభ ముహూర్తం నిశ్చయ మైంది. ఆ సమయానికి బ్రహ్మాది దేవతలు, వశిష్ఠాది మహర్షులు, యోగులు, పరమ మునులు ఇలా ఎందరో...... ఎంద రెందరో వేంకటాద్రి క్షేత్రానికి చేరుకొన్నారు. ఆ దివ్య ముహూర్తంలో మంగళ వాయిద్యాలు మోగుతుండగా, వేద పండితులు శ్రుతి శుభగంగా వేద మంత్రాలను పఠిస్తుండగా, ఛత్ర చామర రాజోచిత గౌరవాలతో విరాజిల్లుతున్న శ్రీనివాసునిపై దేవతలు పుష్పవర్షం కురిపించారు. అలాంటి విశిష్టమైన, మంగళప్రదమైన శుభ సమయంలో పరమభక్తుడైన తొండమాను చక్రవర్తి పద్మావతీ శ్రీనివాసులను తాను నిర్మించిన ఆనందనిలయంలో ప్రవేశింప చేసినాడు. అంతేకాదు ఆనాటి నుండి సర్వ జనులకు దర్శనమాత్రంతోనే సకల కోరికలనూ తీర్చి ఆనందం కలిగిస్తూ అత్యంత మహిమను కలిగివుంటూ ఆనంద నిలయమని ప్రసిద్ధిని పొందింది. అప్పటి నుండి శ్రీనివాసునికి ఆనందనిలయుడు అనే దివ్యనామం ఏర్పడింది.

## బ్రహ్మ అఖండం

శ్రీనివాసుడు ఆనంద నిలయంలో ప్రవేశించిన శుభ వేళలో బ్రహ్మదేవుడు, ఆనందనిలయంలో శ్రీనివాసుని సన్నిధిలో రెండు అఖండ దీపాలను వెలిగించాడు. ఆ రెండు దీపాలు "బ్రహ్మ అఖండాలు" అని ప్రసిద్ధి పొందాయి. బ్రహ్మదేవుడు వాటిని వెలిగించిన తదుపరి శ్రీనివాసుని ఇలా ప్రార్థించాడు. "ఓ శ్రీనివాస ప్రభూ! నేను వెలిగించిన అఖండ దీపాలు కలియుగాంతంవరకు నిరాటకంగా వెలుగుతూ ప్రకాశించాలనీ, అంతవరకు "కలౌ వేంకట నాయకః" అన్న ప్రసిద్ధితో భక్తుల కోరికలన్నింటిని తీరుస్తూ కొంగుబంగారమై వరాలను గుప్పించాలని కోరాడు. వేంకటాచలపతి బ్రహ్మదేవుని ప్రార్థనను అంగీకరిస్తూ" అలాగేనని వరమిస్తూ, కలియుగాంతంవరకు బ్రహ్మ వెలిగించిన దీపాలు వెలుగుతూనే వుంటాయని, కలియుగం అంతమైన తర్వాత ఆ దీపాలు రెండూ శాంతిస్తాయని, అంతవరకు నేను భక్తుల కోరికలను తీరుస్తూ వుంటాననీ, ఆ తర్వాతనే వైకుంఠానికి వెళ్తాననీ, పిదప ఆనందనిలయం కూడా అదృశ్యమవు తుందని శ్రీనివాసుడు బ్రహ్మాది దేవతలకు తెలియజేశాడు. పిదప శ్రీనివాసుడు బ్రహ్మదేవుని పిలిచి, లోకకల్యాణం కోసం, ప్రజా సంక్షేమం కోసం ధ్వజారోహణంతో ప్రారంభించి ధ్వజావరోహణతో సమాప్త మయ్యేట్లుగా వివిధ వాహన సేవలతో ఉత్సవాలను నిర్వహించవలసిందని ఆజ్ఞాపించినాడు.

బ్రహ్మదేవుడు వెంటనే తొండమానుని పిలిపించి వివిధ వాహనాలను చెక్కరథాన్ని తయారు చేయించవలసిందని, వాటి నిర్మాణంలో విశ్వకర్మను అర్థించవలసిందని చెప్పాడు. వెంటనే తొండమానుచక్రవర్తి విశ్వకర్మ సహాయంతో చిత్ర విచిత్రమైన వాహనాలను, ఛత్రచామరాలను తయారు చేయించాడు. వాటితో బ్రహ్మదేవుడు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాడు.

## బ్రహ్మోత్సవాలు

బ్రహ్మదేవుడు శ్రీనివాసుని అజ్ఞ ప్రకారంగా చతుర్వేదాలకు ప్రతీకగా ఉత్సవ శ్రీనివాసమూర్తి, ఉగ్ర శ్రీనివాసమూర్తి, సర్వాధిప శ్రీనివాసమూర్తి, లేఖక శ్రీనివాస మూర్తి అను నాలుగు విధములైన శ్రీనివాసుని అర్చా విగ్రహ మూర్తులను ఆనంద నిలయంలో చల ప్రతిష్ఠతో ఏర్పాటు చేశాడు. ఈ నాలుగు మూర్తులకు మూల విరాట్టుగా ఆనంద నిలయంలో సాక్షాత్తు వేంకటాచలపతి అయిన శ్రీనివాసుడు వెలసివుంటూ ప్రత్యక్షంగా దర్శనమిస్తుంటాడు. ఆనందనిలయుడైన శ్రీనివాసుని ప్రధానంగా జేసుకొని, ఉత్సవ మూర్తులకు బ్రహ్మదేవుడు కన్యామాసంలో శ్రవణ నక్షత్రానికి పూర్తి అయ్యేట్లుగా తొమ్మిది రోజుల ముందు ప్రారంభించి నవాహ్నికంగా ఉత్సవాలను నిర్వహించినాడు.

ఈ ఉత్సవాలకు ధ్వజారోహణ చేయుటకు ముందటి దినం సాయంకాల వేళలో అనంత గరుడ విష్వక్సేనాదులతో, సమస్త ఋషి గణంతో, దేవతాసమూహంతో ఆనందనిలయాన్ని వీడి ఛత్ర చామర మంగళ వాద్య పురస్సరంగా పురవీథుల్లో ప్రదక్షిణంగా ఊరేగుతూ మృత్సంగ్రహణం చేసిన తదుపరి ఆలయంలో అంకురార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహింప జేసినారు.

ఇది మొదలుకొని మొదటి రోజున ధ్వజారోహణం, ఆ రాత్రి పల్లకి ఉత్సవం, తదుపరి పెద్దశేషవాహనం, రెండవనాడు ఉదయం శేషవాహనం, ఆ రాత్రి హంస వాహనం, మూడవనాడు ఉదయం సింహవాహనం , ఆ రాత్రి ముత్యపుపందిరి వాహనం, నాల్గవనాడు ఉదయం కల్ప వృక్ష వాహనం, ఆ రాత్రి సర్వభూపాల వాహనం, ఐదవనాటి ఉదయం మోహినీ అవతారం అనాటి రాత్రి బంగారు గరుడ వాహనం, ఆరవనాటి ఉదయం హనుమంతవాహనం, అనాటి సాయంత్రం మంగళగిరి వాహనం, రాత్రి గజవాహనం, ఏడవనాటి ఉదయం సూర్యప్రభవాహనం, అనాటి రాత్రి గజ వాహనం, ఏడవనాటి ఉదయం సూర్యప్రభ వాహనం, ఆ నాటి రాత్రి చంద్రప్రభ వాహనం, ఎనిమిదవనాటి ఉదయం రథోత్సవం, ఆ రాత్రి అశ్వవాహనం, తొమ్మిదవ

నాటి ఉదయం పల్లకి ఉత్సవం, తదుపరి మంగళగిరి ఉత్సవం స్వామి పుష్కరిణిలో శ్రవణ నక్షత్రంలో అవభృథ స్నానం, ఆ రాత్రి పల్లకి ఉత్సవంలో ధ్వజావ రోహణంతో ఈ ఉత్సవాలు పూర్తి అయ్యాయి. ఆ మరునాడు శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పుష్పయాగోత్సవం మంగళప్రదంగా లోక కల్యాణంకోసం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాలను బ్రహ్మదేవుడు నిర్వహించినందువల్ల 'బ్రహ్మోత్సవాలు" అని ఆనాటి నుండి జగత్ప్రసిద్ధిని పొందాయి. ఈ ఉత్సవాలకు వేంచేసిన అష్టదిక్పాలకులకు, దేవతలకు, యక్ష కిన్నర గంధర్వులకు సమస్త ఋషి గణములకు వేంకటేశుడు బహుమతు లిచ్చినాడు. శ్రీనివాసుడు సమస్త కోరికలను, వరాలను గుప్పించి 'వరాల రాయడ' ని ప్రసిద్ధి పొందినాడు. భక్తులందరు శ్రీనివాసునివల్ల అనేక వరాలను పొంది వారి వారి స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోయారు. తొండమానుచక్రవర్తి కూడ శ్రీ వేంకటేశ్వరునితో అనుజ్ఞ తీసుకొని వెళ్లి చక్కగా రాజ్యం చేస్తుండినాడు.

సర్వాంగ సుందరంగా, వాస్తు శాస్త్రోక్త నియమాను సారంగా నిర్మించబడిన ఆనందనిలయంలో ప్రవేశించిన శ్రీనివాసుడు పద్మావతిదేవితో సర్వ భోగాలను అనుభవిస్తూ తనను శరణువేడిన భక్తుల కోరికలను తీరుస్తూ వుండినాడు. కాని శ్రీమహాలక్ష్మి తనకు వివాహం చేసి తిరిగి వెళ్లినదాదిగా శ్రీనివాసునకు ఏదో తెలియని వెలితిగా వుండినది. ఆమె విరహంవల్ల కలిగిన వేదనను భరించలేక బాధ పడినాడు. అంతేగాక మహాలక్ష్మి లేకుండా నేనొక్కడినే భక్తుల కోరికలను, పరిపూర్ణంగా ఎలా తీర్చగలను, అని ఆలోచిస్తూ, చివరకు ఆమెను పిలుచుకొని వచ్చుటకు నిశ్చయించి నాడు. అందుకొరకై శ్రీనివాసుడు శ్రీమహాలక్ష్మి కొలువైవున్న కొల్హాపురానికి వెళ్లినాడు.

## సిరి కొలువున్న చోటు

కొల్హాపురానికి వెళ్లిన శ్రీనివాసుడు శ్రీమహాలక్ష్మి దర్శనానికి అర్రులు చాచినాడు. ఆమె ఉనికి కోసం తిరిగి తిరిగి వేసారినాడు. కాని లక్ష్మీదేవి దర్శనం కాలేదు. అమ్మవారి దర్శనం కోసం అనేక విధాలుగా పరితపించగా చివరకు ఒక అశరీరవాణి ఇలా పలికినది. "ఓ శ్రీనివాసా! ఇక్కడ నీకు శ్రీమహాలక్ష్మి దర్శనం కానే కాదు. నీవు ఇక్కడి నుంచి దక్షిణ దిక్కుగా ప్రయాణం చెయ్యి. నీవు కొలువైవున్న వేంకటాచల దివ్య క్షేత్రం వుంది కదా! ఆ పుణ్యస్థలానికి దగ్గరగా సువర్ణముఖరీనదీతీరంలో శ్రీ శుకమహర్షి ఆశ్రమం నెలవైవుంది. అక్కడికి వెళ్లు. శ్రీశుకుని ఆశ్రమ సమీపంలో ఒక పద్మ సరోవరం

ఏర్పాటు చేయి. అందులో పద్మాలతో శ్రీమహాలక్ష్మిని ఉపాసిస్తూ ఆరాధించు. అలా చేస్తే నీకు అక్కడ శ్రీ మహాలక్ష్మీదేవి దర్శనం తప్పక అవుతుంది. అక్కడే నీ ద్వారా అందరికి ఆ సిరులతల్లి కొలువు అందరికీ ప్రత్యక్షంగా లభ్యమవుతుంది"

ఆకాశవాణి వాక్కులకు ఆశ్చర్యపోయిన శ్రీనివాసుడు స్వర్ణముఖీ నదీ తీరానగల శ్రీశుకమహర్షి ఆశ్రమం చెంతకు చేరుకున్నాడు. అక్కడ పద్మసరోవరం నిర్మించి ఆ తటాన సూర్య భగవానుణ్ణి ప్రతిష్ఠించి ఆరాధిస్తూ శ్రీమహాలక్ష్మి దర్శనం కోసం తీవ్రమైన తపస్సు చేస్తుండినాడు.

శ్రీనివాసభగవానుడు చేస్తున్న ఘోర తపస్సును చూసిన కపిలాది మహా మునులందరూ పాతాళలోకంలో వున్న లక్ష్మీదేవికి తెలిపినారు. ఇప్పటికైనా శ్రీమహావిష్ణువుమీది అలుకను విడిచిపెట్టి ఆయనచెంతకు చేరవలసిందని అనేక విధాలుగా ప్రార్థించినారు. భృగుమహర్షి కూడా "అమ్మా! సిరులతల్లీ! నిన్నూ, నీ దివ్యస్థానమైన శ్రీనివాసుని హృదయాన్ని అగౌరవ పరచవలెననే ఉద్దేశంతో నేను పాదతాడనం చెయ్యలేదు తల్లీ! విష్ణుదేవుని గొప్పదనాన్ని, నీ యొక్క అపారకరుణను లోకానికి తెలియ జెయ్యాలన్న సత్సంకల్పంతోనే అలా చేశాను. అయినా నేను చేసిన తప్పిదాన్ని నిండు దయతో క్షమించి వెంటనే శ్రీనివాసుని చేరుకోవలసిందని విజ్ఞప్తిని చేస్తూ లక్ష్మీదేవిని స్తుతించినాడు.

అందరి ప్రార్థనల్ని విన్న మహాలక్ష్మి ఆనాడు తాను చేసిన తొందరపాటు చర్యకు చింతించింది. అయినా లోకకల్యాణం కోసం, భక్తుల రక్షణకోసం అలా జరుగవలసి వుంది అంటూ శ్రీనివాసుడు తపస్సుచేస్తున్న దివ్య స్థలంలో వున్న పద్మ సరోవరంలో ఆవిర్భవించింది. కార్తీకమాసంలో శుక్ల పంచమీ శుక్రవారం బ్రాహ్మీ ముహూర్తంలో ఉత్తరాషాఢా నక్షత్రయుక్త విజయలగ్నంలో దేదీప్యమానమైన వెలుగులు విరజిమ్ముతుండగా నలుదెసలా మంగళప్రదమైన శంఖనాదాలూ, భేరీలు, మృదంగ శబ్దాలూ వినవస్తుండగా ఆ సరోవరంలో సహస్రదళాలు కలిగిన బంగారు పద్మంలో శ్రీమహాలక్ష్మిదేవి అవతరించింది.

బంగారు పద్మంలో పద్మాసనియై పద్మ హస్త, పద్మమాలాలంకృత అయి నిత్య యౌవన శోభితురాలైన శ్రీమహాలక్ష్మి పదహారేళ్ల యువతిగా అవతరించింది. ఇలా అవతరించిన అమ్మవారిని "పద్మావతి" అని బ్రహ్మేంద్రాది దేవతలు, భృగు,

నారద తుంబురు మహర్షులు, మునులు, యోగులు అనేక విధాలుగా కీర్తించారు. వేయి వెలుంగులతో ప్రకాశిస్తూ బంగారు కమలంలో జగదేక సౌందర్యంతో ఆవిర్భవించిన శ్రీ మహాలక్ష్మిని కన్నులార్పక చూస్తూ శ్రీనివాసుడు ఆనందపడుతూ తన తపస్సును చాలించి, ఆమె ఇప్పటికైనా అలుకను మాని తన చెంత చేరినందుకు అభినందిస్తూ తన మెడలోని కల్హారమాలను లక్ష్మీదేవి మెడలో వేసి ఆమెను ఆలింగనం చేసికొన్నాడు. ఆ శుభ సందర్భంలో దేవ దుందుభులు మోగాయి. యక్ష గంధర్వ కిన్నర కింపురుషాది దేవగణాలు ఆ దివ్య దంపతులపై పుష్పవర్షం కురిపించారు. పద్మ సరోవరంలో శ్రీనివాసునితో కూడి వున్న శ్రీమహాలక్ష్మిని అక్కడ చేరివున్న బ్రహ్మేంద్రాది భక్త బృందాలు ఇలా స్తుతించాయి.

నమశ్శ్రియై లోకధాత్ర్యై బ్రహ్మమాత్రే నమో నమః
నమస్తే పద్మనేత్రాయై పద్మముఖ్యై నమో నమః
ప్రసన్న ముఖపద్మాయై పద్మకాంత్యై నమో నమః
నమో బిల్వ వనస్థాయై విష్ణుపత్న్యై నమో నమః
విచిత్ర క్షౌమధారిణ్యై పృథుశ్రోణ్యై నమో నమః
పక్వ బిల్వ ఫలాపీన తుంగస్తన్యై నమో నమః
సురక్త పద్మపత్రాభ కరపాదతలే శుభే
సురత్నాంగద కేయూర కాంచీనూపుర శోభితే
యక్ష కర్దమ సంలిప్త సర్వాంగే కటకోజ్జ్వలే
మాంగల్యాభరణై శ్చిత్రైః ముక్తా హారై ర్విభూషితే
తాటంకై రవతంసైశ్చశోభమాన ముఖాంబుజే
పద్మహస్తే నమస్తుభ్యం ప్రసీద హరివల్లభే
ఋగ్యజుస్సామ రూపాయై విద్యాయై తే నమో నమః
ప్రసీదాస్మాన్ కృపాదృష్టిపాతై రాలోకయాబ్ధిజే
యే దృష్టా స్తే త్వయా బ్రహ్మ రుద్రేంద్రత్వం సమాప్నుయుః."

అని ప్రార్థించిన దేవతలను ఉద్దేశించి శ్రీ మహాలక్ష్మి "దేవతలారా! మీ రొనరించిన ఈ స్తుతులవల్ల నాకు చాల సంతోషం అయ్యింది. ఇప్పుడు మీరు చేసిన ఈ స్తుతిని చేస్తూ, మారేడు దళాలచేత నన్ను ఏ మానవులయితే అర్చిస్తారో, పోగొట్టు

కున్న వారి వారి పూర్వ స్థానాలను పొందడమే గాక, పదోన్నతి కూడ చేకూరుతుంది. ఈ స్తోత్రం చేసిన వారి కందరికి ధర్మార్థ కామ మోక్షాలనెడు చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయి. అంతేకాదు, నేను ఆవిర్భవించిన ఈ పద్మ సరోవరంలో శుభప్రదమైన ఈ ముహూర్తంలో స్నానం చేసి నన్ను స్తుతించిన వారందరూ దీర్ఘాయువుతో పాటు ఐశ్వర్యాన్నీ, విద్యనూ పొందడమేగాక తేజోవంతులైన సంతానాన్ని పొందగలరని" వరాన్ని ప్రసాదించింది.

పిదప బ్రహ్మదేవుడు, శ్రీనివాసుని శ్రీమహాలక్ష్మితో కూడ అంశారూపంతో ఈ పద్మ సరోవరం చెంత కొలువై వుంటూ భక్తులను అనుగ్రహిస్తూ వుండవలసిందని ప్రార్థించినాడు. అంతేగాక ఈ శుభ ముహూర్తంలో ఉత్సవాలను చేయవలెనను కోరిక కలుగుతున్నదని తెలుపగా శ్రీనివాసుడు అట్లే నిర్వహించవలసిందంటూ వర మిచ్చినాడు.

బ్రహ్మదేవుడు పద్మ సరోవరానికి ఆగ్నేయమూలలో వున్న శుకమహర్షి ఆశ్రమంలో, శుకమహర్షి చేత అర్చింపబడుతున్న శ్రీబలరామకృష్ణుల సన్నిధి ప్రక్కన శ్రీనివాస సహితంబుగ స్వతంత్ర వీరలక్ష్మిని (విరహలక్ష్మి) ప్రతిష్ఠించినాడు. ఇచ్చట పాంచరాత్రాగమవిధిని పూజలు, ఉత్సవాలు జరుగునట్లు ఏర్పాట్లు చేసినాడు. ప్రతి కార్తీక శుద్ధ పంచమినాడు అనగా పద్మావతి అమ్మవారు పద్మ సరోవరంలో అవతరించిన నాటికి అవభృథం జరుగునట్లుగా బ్రహ్మదేవుడు ఉత్సవాలు నిర్వహించినాడు. అవభృథం రోజున అనగా పంచమి రోజు ఉత్సవాలు పరిసమాప్తమయ్యేనాటికి సరిగ్గా ముహూర్త సమయానికి వేంకటాచలం నుండి శ్రీనివాసుని కంఠమునందుండు పుష్పహారం, పసుపు కుంకుమలు, శ్రీ శుకపురంలోని అమ్మవారికి వచ్చునట్లు శాశ్వతంగా కట్టడి చేసి, ఉత్సవాలను ఘనంగా జరిపించి బ్రహ్మదేవుడు వెడలిపోయినాడు.

బ్రహ్మదేవుని కోరిక ప్రకారం శ్రీనివాసుడు, పద్మసరోవరం తీరాన వీరలక్ష్మిగా అర్చామూర్తిగా కొలువైవున్న శ్రీ మహాలక్ష్మి చెంత తాను ఒక అంశారూపంలో తాను వుంటూ, మిగిలిన ప్రధానాంశలతో లీలామానుష విగ్రహుడై వేంకటాచలం చేరు కొన్నాడు. అక్కడ పద్మావతితో కలిసి భక్తుల కోరికలను తీరుస్తూ ప్రత్యక్షంగా దర్శన సంభాషణాదులను భక్తులకు అనుగ్రహిస్తూ వుండినాడు" అంటూ సూత మహర్షి భువిలో ప్రత్యేకంగా శ్రీ వేంకటేశ్వరుని పట్టపు దేవేరిగా శ్రీ మహాలక్ష్మి శ్రీ శుకపురంలో వెలసిన వైనాన్ని తెలియ జేస్తూ ఇలా ప్రార్థించినాడు.

"గంగాదితీర్థ జనకపాదపద్మం సుతారకమ్
శంఖ చక్రాభయవరం శ్రీనివాసం భజేஉనిశమ్
సువర్ణముఖి తీరస్థం సువర్ణేడ్యం సువర్ణదమ్
సువర్ణాభం సువర్ణాంగం శ్రీనివాసం భజేஉనిశమ్."

"స్వామి! వేంకటాచలపతీ! గంగాది సమస్త పుణ్య తీర్థాలకు జన్మ స్థానమైన పాదపద్మాలు కలవాడివీ, భక్తులందరినీ సంసారం నుండి తరింపజేసే వాడివీ, శంఖ చక్రాలు, అభయముద్ర - వరముద్రలను నాలుగు చేతులలో ధరించినవాడివి అయిన నిన్ను నేను సదా స్మరిస్తాను. అంతమాత్రమే కాదు.

పరమ పవిత్రమైన సువర్ణముఖరీ నదీ తీరంలో వుండేవాడివీ, అత్యంత శోభనమైన వర్ణాలుగల వేదాలచేత స్తుతింపబడే వాడివీ, భక్తులకు ధన ధాన్యాది సమస్త సంపదలను అనుగ్రహించేవాడివీ, వేదాలచేత స్తుతింపబడుతూ బంగారు వంటి ప్రకాశంచేత వెలిగేటటువంటివాడివీ, లక్ష్మీకరములైన కిరీటకుండలాదిగా గల సుమస్త సువర్ణాభరణాలచేత అలంకరింపబడిన సుందరమైన శరీరాంగములు కలిగి భక్తులకు నయన మనోహరాన్ని కలిగిస్తూ ఆనందింప జేసేవాడివీ అయిన ఓ ఆనందనిలయవాసా! నిన్ను నేను సదా సేవింతును" అంటూ సూత మహర్షి ప్రార్థిస్తూ తర్వాతి గాథను ఇలా వివరించాడు.

ఇలాగ ప్రత్యక్షంగా సందర్శన, సంభాషణ పాదస్పర్శనాదిగా భక్తులకు అనుగ్రహిస్తూ శ్రీనివాసుడు వేంకటాచల క్షేత్రంలో విహరిస్తుండినాడు. తొండమాను చక్రవర్తి తన భవనంలో శ్రీ వేంకటేశ్వరుని చిన్న విగ్రహరూపంలో అర్చించి ఆరాధిస్తూ, తనకు ఇష్టమైన వేళల్లో రహస్య బిలమార్గం ద్వారా వేంకటాచలంపైన వున్న ఆనంద నిలయంలో ప్రవేశించి శ్రీనివాస ప్రభువును కళ్లారా దర్శించేవాడు. మనసారా ప్రార్థించేవాడు. తన భవనాన్ని చేరుకునేవాడు.

## తొండమానుడి శరణాగతి

ఒకానొక రోజు, ఆనందనిలయంలో శ్రీనివాసుడు శ్రీదేవి, భూదేవు లిద్దరితో కలిసి సరససల్లాపాలతో మునిగి వుండినాడు. ఆ సమయంలో ప్రభువైన తొండమానుడు రహస్య బిల మార్గం ద్వారా ఉన్నట్టుండి ఉద్వేగంతో వచ్చి శ్రీనివాసుని పాదాలమీద పడి అత్యంత ఆందోళనతో భయావేశంతో ఊగిపోతూ "స్వామీ! వేంకటేశా! భక్తవత్సలా!

భక్త ప్రియా! కోరిన వరాల రాయడా! పాహి పాహి! నన్ను రక్షించు. శ్రీనివాసా! నీపాదాలే నాకు గతి! నన్ను అక్కున చేర్చుకొని కాపాడు తండ్రీ! నీవే నాకు శరణు శరణు! నీవు నాకు అభయప్రదానం ఇచ్చేంతవరకు నీ పాదాలను విడవను గాక విడవను. నన్ను రక్షిస్తానంటేనే నీ పాదాలను వదలుతాను. అంతవరకు నిన్ను విడవను" అంటూ సాష్టాంగం వందనం చేస్తూ శ్రీనివాసుని పాదాలను గట్టిగా పట్టుకొని ప్రాధేయపడినాడు.

వేంకటేశుడు వెంటనే "తొండమాను చక్రవర్తీ! అసలు జరిగిందేమిటో చెప్పు. నీకు ఏమీ భయం లేదు. ఎందు కింత ఆందోళనగా వున్నావు. నీ శరీరం చూడు - ఎంత వణకుతుందో, ముచ్చెమటలతో నీ దేహమంతా తడిసి పోయింది. ఎంత మాత్రం ఆవేదనకు గురి కావద్దు. నీ భయాందోళనలకు కారణమేమిటో చెప్పు. నా పాదాల మీది నుంచి లేచి నిలబడు. విషయమేమిటో చెప్పు" అని పలికినాడు.

"నేను లేవను గాక లేవను. నీవు నాకు రక్షణ కల్పించి కాపాడుతాను. అభయమిస్తాను అని పలికితే అప్పుడు నీ పాదాలు వదలుతాను. అంతవరకు నీ పాదాలు విడవను గాక విడవను" అని తొండమానుడు పట్టుదలతో పరంధాముని ప్రార్థించినాడు.

## శిలగా మారిన శ్రీనివాసుడు

వెంటనే వేంకటేశ్వరుడు "ఓ తొండమానుడా! నా కాళ్లపై పడి శరణు వేడినవారిని రక్షించడమే ఇప్పటి నా యీ అవతార లక్ష్యం. కావలెనన్న వారికి కావలసినన్ని వరాలు ఇవ్వడం కోసమే నేను శ్రీ వైకుంఠం నుండి దిగి ఈ భూలోకానికి వచ్చాను. వేంకటేశా! గోవిందా! గోవిందా! అని నన్ను కీర్తిస్తే చాలు. భక్తులు చేసిన పాపాలు అవి ఎలాంటివైనా సరే! వాటి నుండి విముక్తుణ్ణి చేస్తాను. నన్ను స్మరిస్తే చాలు. ఆ భక్తులను పవిత్రులను చేస్తాను. అందువల్లే నన్ను 'వేంకటపతి' అని కీర్తిస్తారు. నాకు పరమభక్తుడవు, ఆంతరంగిక భక్తుడవు, నాకు ఆనంద నిలయాన్ని వాసగృహంగా నిర్మించి ఇచ్చిన గృహదాతవు అయిన నీకు అభయ ప్రదానం ఇస్తున్నాను. నిర్భయంగా వుండు. సందేహ సంశయాలను వీడి నీకు వచ్చిన ఆపదను గూర్చి వివరించు" అని ఆదేశించినాడు.

"పాపాలన్నింటిని కేవలం నామస్మరణంతో పోగొడుతూ సార్థక నామధేయుడవైన ఓ వేంకటపతీ! నేనొక ఘోరమైన పాపం చేశాను. ఆ మహా పాపాన్ని నేను తెలిసి

చేశానో తెలియక చేశానో నాకు అంతుబట్టడం లేదు. దానిని తలచుకుంటేనే వళ్లు జలదరిస్తున్నది. స్వామీ! శరణాగతవత్సలుడవైన నీవు నాకు అభయ ప్రదానం చేయటంవల్ల నాకు పూర్తిగా ధైర్యం కలుగుతున్నది. నేను చేసిన ఘోరమైన పాపకార్యం ఏమిటో మీకు వివరిస్తున్నాను. అన్యథా శరణం నాస్తి. త్వమేవ శరణం మమ.

స్వామీ! శ్రీనివాసా! సుమారు రెండేండ్లకు పూర్వం ఒక రోజున కూర్మడు అనే విప్రుడు తన తండ్రి అస్థికలను పవిత్ర గంగా నదిలో నిమజ్జనం చెయ్యడానికి కాశీ క్షేత్రానికి పోతూ తన భార్యా పిల్లలతో కలిసి నా దగ్గరికి వచ్చాడు. గర్భవతి అయిన తన భార్యను, ఐదేండ్ల ప్రాయంకల పుత్రుని నాకు అప్పజెప్పుతూ రాజా! నేను తిరిగి వచ్చేంతవరకు వీరిని కంటికి రెప్పవలె రక్షించవలసిందని కోరుతూ, వారిని నా సంరక్షణలో వుంచి కాశీకి వెళ్లిపోయినాడు.

నేను ఆ విప్రుని కుటుంబాన్ని ఒక పెద్ద రాజభవనంలో వుంచి సకల సౌకర్యాలు కలుగజేసినాను. అంతేకాదు. వారికి ఇతరులవల్ల ఏ మాత్రం హాని కలుగ కుండా వారి భద్రతకై భవనానికి తాళం వేసి కాపలా ఏర్పాట్లు చేసినాను. కాని విధి బలీయము. తదుపరి కొంత కాలానికి రాజకార్యాల్లో మునిగి వున్న నాకు, వారి సంగతి పూర్తిగా మరపునకు వచ్చినది.

ఇలా రెండేండ్ల కాలం గడిచిన తర్వాత కూర్మడు తన కాశీ యాత్రను పూర్తి చేసుకొని వచ్చాడు. తన భార్యా బిడ్డలను నిశ్చింతగా నా దగ్గర వదలి కాశీ యాత్రను ఆనందంగా నిర్వహించాననీ చెప్పుతూ, తన భార్యా బిడ్డల యోగ క్షేమా లడిగినాడు. రాజా! నేను వెళ్లు నాటికి నా భార్య గర్భవతి గదా! ఏ బిడ్డను ప్రసవించినది? నా ఐదేండ్ల పుత్రుడు క్షేమమే కదా! అని గుచ్చి గుచ్చి ఆ విప్రుడు అడిగినాడు. నా భార్యా పిల్లలు క్షేమంగా వుంటే నాకు ఎదురు రావడం లేదే. రాజా! నాకు ఆందోళనగా వుంది. తొందరగా చెప్పు! మా వాళ్లు అందరూ బాగున్నారు కదా!

ప్రభువైన నాకు ఇంతవరకు విప్రుని కుటుంబాన్ని గూర్చిన మరపునకు ఆశ్చర్యం పొందుతూ, వారికి ఏమైనా అయ్యుంటుందేమోనన్న ఆందోళన పడుతూ, వాటిని బయటపడకుండా నిగ్రహించుకొని విప్రునితో ఇలా అన్నాడు.

'ఓ బ్రాహ్మణోత్తమా! నీ కుటుంబ సభ్యులందరూ క్షేమంగా వున్నారు. ఆందోళన పడనద్దు. గర్భవతి అయిన నీ భార్య, పుత్రికను ప్రసవించినది. నీ భార్యా పుత్రులు

అందరూ మా వాళ్లతో కలిసి వేంకటాచల క్షేత్రానికి వెళ్లారు. అక్కడ వేంకటాచలపతికి జరుగుతున్న శుక్రవారాభిషేకమును చూసుకొని ఈ రోజుగాని రేపు గాని లేదా మరునాడుగాని తప్పక తిరిగి రాగలరు. అంతవరకు నీవు నిశ్చింతగా వుండుము' అని పలికి, అతనికి వలసిన ఏర్పాట్లు చేసిన తరువాత, ఆత్రుతగా విప్ర కుటుంబాన్ని వుంచిన భవనానికి వెళ్లి చూచినాను. నిర్జీవులై అస్థి పంజరాలుగా మిగిలి వున్న వారిని చూచి ఆందోళన పడుతూ వెంటనే రహస్యబిలంద్వారా ఆనందనిలయానికి చేరుకొన్నాను. ఓ శ్రీనివాసా! ఆపద్బాంధవా! ఇదీ జరిగిన సంగతి. ఈ ఘోర విపత్తు నుంచి నన్ను రక్షించి కాపాడు తండ్రీ! అని తొండమానుడు అనేక విధాలుగా ప్రార్థించినాడు.

ఈ గాథను అంతా వివరంగా వినిన తర్వాత శ్రీనివాసుడు ఇలా అన్నాడు. "మామా! తొండమాను చక్రవర్తీ! నీవు మహా పాపం చేశావు. దానికి నిష్కృతి లేదు. బ్రాహ్మణ కుటుంబ రక్షణ స్వీకరించిన నీవు ఆ బాధ్యతను మరచి బ్రహ్మ హత్యా దోషాన్ని మూట కట్టుకున్నావు. వైరం, హత్య ఇలాంటివి ఇవి సాధారణంగా తీరవు. వాటిని తప్పక అనుభవించియే తీరవలెను. నా భక్తుడివైన నీకు కలిగిన ఈ విపత్తును పోగొట్టి నిన్ను రక్షించడానికిగాను ఆ విప్ర కుటుంబాన్ని బ్రతికించాలి. అందుకు బదులుగా మరొకరు మరణించాలి లేదా ఆ పాపాన్ని అనుభవించాలి. అందువల్ల నీకు అభయప్రదానం ఇచ్చినందువల్ల, నాకు అత్యంత భక్తుడవయినందువల్ల నీ వంటి మహాపాపికి పాప నివృత్తి చేసి వేంకటనాథుడిని నేనే, 'కలౌ వేంకట నాయకః' అన్నట్లుగా సార్థక నామధేయంతో వరలుదును గాక! వారిని తప్పక బ్రతికిస్తాను. ఇక చింతించకు. వారి అస్థులను త్వరగా తెప్పించు" అని శ్రీనివాసుడనగా -- తొండమానుడు వాటిని తెప్పించి స్వామికి సమర్పించినాడు.

శ్రీనివాసుడు వాటిని దగ్గరలో వున్న పాండవ తీర్థానికి తీసుకెళ్లాడు. ఆ పక్కనే వున్న దేవఖాతంలో గొంతువరకు నీళ్లలో మునిగి అస్థుల్ని ఒడ్డుమీద వుంచి వాటి మీద నీళ్లు చల్లాడు. వెంటనే ఆ విప్రుని భార్యా పిల్లలు సజీవులయ్యారు. ఈ విచిత్ర సంఘటనకు దేవతలు పూల వాన కురిపించారు.

అప్పటి నుండి ఆ తీర్థానికి 'అస్థితీర్థం' అని ప్రసిద్ధి కలిగింది. నరకంలో వున్న వారి అస్థుల్ని కూడ ఈ తీర్థంలో ముంచినట్లయితే మోక్షం కలుగుతుందని

దేవతలు వర మిచ్చారు. శ్రీనివాసుడు సజీవులైన స్త్రీని, పిల్లలను తొండమానునికి సమర్పించి "రాజా! నేను ఇక మీదట ఎవరికీ ప్రత్యక్షంగా గోచరించను. ఎవరితోను ప్రత్యక్షంగా మాట్లాడను గాక మాట్లాడను. మౌనం పాటిస్తాను. ఒక వేళ పరమ భక్తులతో మాట్లాడ వలసి వచ్చినా ఇతరులద్వారా మాత్రమే సంభాషిస్తాను. నీవు చేసిన పాపం చాల గొప్పది. నీ అన్నమీది ప్రేమ చేతా, నీవు చేసిన సత్కార్యాల వల్లా నీకీ ఉపకారం చేస్తున్నాను. జాగ్రత్తగా రాజ్యం చేసికుంటూ ఉండు." అని పలుకుతూ శ్రీనివాసుడు అద్భుతమైన సాలగ్రామశిల ద్వారా, విగ్రహ మూర్తిగా స్వయం వ్యక్తమై పద్మ పీఠంపై అవిర్భవించినాడు అంటూ సూత మహర్షి శౌనకాదులతో శ్రీనివాసుని దివ్య గాథను వివరిస్తూ--

*"భక్తానుగ్రాహకం విష్ణుం సుశాంతం గరుడధ్వజమ్*
*ప్రసన్న వక్త్రనయనం శ్రీనివాసం భజేఽ నిశమ్*
*భక్త భక్తిసుపాశేన బద్ధ సత్పాద పంకజమ్*
*సనకాది ధ్యాన గమ్యం శ్రీనివాసం భజేఽ నిశమ్."*

ఓ ఘన వేంకటపతీ! నీవు ఎల్లప్పుడు నీ భక్తులను నిండుగా మెండుగా అనుగ్రహిస్తూ వుంటావు కదయ్యా! సర్వ కాలాల్లో, సర్వ ప్రదేశాల్లో, సర్వావస్థల్లో వ్యాపించి వుండడమేగాక, సజ్జనులైన సద్భక్తులకు సుఖాన్ని కలిగించునట్టి అంతః కరణాన్ని కలిగి వుంటావు. అలాగే దుష్టులైన వారియొక్క సుఖాన్ని హరించే వాడిగా వున్నావు కదయ్యా స్వామీ! భక్త రక్షణ కోసం గరుడవాహనుడవై సిద్ధమై సర్వసన్నద్ధమై తయారుగా వుంటావు కదా! ఓ శ్రీనివాసా! నీవు సజ్జనులను అత్యంత ప్రసన్నములైన ముఖనేత్రాలతో అనుగ్రహిస్తూ దర్శన భాగ్యాన్ని కలిగిస్తున్న నిన్ను సదా భజిస్తాను. అంతేకాదు. ఓ ఆనందనిలయవాసా! భక్తుల యొక్క భక్తి అనే సుఖకరమైన తాటిచే బంధింపబడిన అత్యంత శ్రేష్ఠములైన పాదపద్మాలు కలిగి వున్నావు కదా! సనక సనందనాది సర్వశ్రేష్ఠులైన పరమ యోగులకు ధ్యానంమాత్రం చేతనే దర్శనభాగ్యం అనుగ్రహిస్తున్న ఓ వేంకటాచలపతీ! నేను నిన్ను సదా సేవిస్తాను -- అంటూ సూతమహర్షి అర్ధనిమీలిత నేత్రాలతో శ్రీనివాసుని ప్రార్థిస్తూ, తర్వాతి దివ్య గాథను ఇలా కొనసాగించాడు.

అనంత కరుణాసాగరుడు భక్తవత్సలుడైన శ్రీనివాసుడు తొండమానుచక్రవర్తి మీది దయతో మరణించిన విప్ర కుటుంబాన్ని బ్రదికించినాడు. పునర్జీవితులైన విప్రుని భార్యాపిల్లలను సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ తొండమానుచక్రవర్తి ఆనంద పడినాడు. శ్రీనివాసుడు 'ఓ తొండమాను చక్రవర్తీ! ఈ విప్ర కుటుంబాన్ని కూర్మునికి సమర్పించు. ఇకమీదట ఇలాంటి దోషాలను ఎప్పుడు చెయ్యవద్దు' అని ఉపదేశించి నాడు.

తొండమాను చక్రవర్తి కూర్ముని వద్దకు వెళ్లి "ఓ విప్రవర్యా! ఇదిగో నీ భార్యా పిల్లలు. దయతో స్వీకరించి నన్ను కరుణించుము" అని వారిని సమర్పించినాడు. అంత కూర్ముడు తన భార్యా పిల్లలతో ఇంతకాలం ఎక్కడికి వెళ్లినారు? అని అడుగగా ఆ బ్రాహ్మణుని భార్య "నేను గాఢంగా నిద్ర పోతిని! ఆ నిద్రలో శ్రీనివాసుని ఉదరంలోకి వెళ్లాం. అక్కడ అనేకానేక తీర్థాలను, క్షేత్రాలను దర్శించాం, సేవించాం. దేవతలందరినీ దర్శించు కున్నాం కూడా!" అని తాము పొందిన అను భూతిని అనుభవించిన దైవ మాయను, దివ్యలీలలను గూర్చి వివరించారు. కూర్ముడు తన భార్యాపిల్లలు తనకంటే కూడా ధన్యులనీ, అందువల్లే మరణించీ, ఎన్నో దివ్యాను భూతులను పొందినారనీ, మళ్లీ సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామి దయవలన పునర్జీవితు లయినారని శ్రీనివాసునికి సాటి రాగల దేవుడు లేనే లేడనీ ఆనందపడుతూ ప్రభువైన తొండమానుడు ఇచ్చిన కానుకలను స్వీకరించి, రాజును అనేక విధాల ఆశీర్వదించి వెడలిపోయినాడు.

## సహస్రనామార్చన

బ్రాహ్మణుడైన కూర్ముని భార్యా పిల్లలు పొందిన అద్భుతమైన దివ్యలోక సంచారాన్ని, దేవతా దర్శనమును, వినిన తొండమాను చక్రవర్తి ఆ విప్ర కుటుంబం ఎంత పుణ్యం చేసికొందో గదా! ఇదంతా భక్తవరదుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంవల్లనే ఆ విప్రవనిత పొందింది గదా! మరి తాను ఇలాంటి దివ్యాను భూతులను, అపారమైన శ్రీనివాసుని కరుణను పొందలేక పోతినే అని చింతించినాడు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి దయ కలుగుటకు ఏమి చేస్తే బాగుంటుంది? అని ఆలోచించి చివరకు అంగిరసాది మహామునులను రావించి ఇలా అడిగినాడు.

*"భూదేవ! దేవతుష్ట్యర్థే క ఉపాయో హ్యానామయః*
*కథం తుష్యతి గోవిందో వద మే గురుసత్తమ!"*

అంత గురువైన ఆంగిరస మహర్షి తొండమానునితో ఇలా అన్నాడు :

"ఓ రాజా! తొండమాను చక్రవర్తీ! శ్రీనివాసస్వామి యొక్క దయను పొందుటకు ఆ స్వామిని పూజించుట తప్ప అన్య మార్గం లేనే లేదు. ఆ వేంకటేశ్వరస్వామివారికి తులసీదళాలు అత్యంత ప్రీతి. ఆ తులసీ దళాలతో సహస్ర నామాలను పఠిస్తూ ప్రతి నిత్యమూ శ్రీనివాస భగవానుని అర్చించు. అలా చేసినట్లయితే శ్రీ వేంకటాచలపతి అపార కరుణ నీకు కలుగుతుంది. చివరకు ఆ స్వామివారి అనుగ్రహం వల్ల నీకు మోక్షం కూడ సిద్ధిస్తుంది" అని ఆంగిరసముని ఉపదేశించినాడు. (సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరుడే బంగారుపద్మాలతో తనను అర్చించుమని తొండమానుని ఆదేశించి నట్లు వరాహపురాణం తెలుపుతోంది.) గురువుగారి అజ్ఞానుసారము తొండమానుడు శ్రీనివాసునికి అత్యంత ప్రీతికరమైన తులసీదళాలను బంగారుతో చేయించి ప్రతి నిత్యమూ సహస్ర నామాలతో అర్చించి ఆరాధించినాడు. ఇలా మూడు మాసాల పాటు భక్తి ప్రపత్తులతో బంగారుతులసీదళాలతో అర్చన కొనసాగింది. కాని శ్రీ వేంకటేశ్వరస్వామి, తొండమానుచక్రవర్తి యెడ ప్రసన్నుడు కాలేదు. ఏ మాత్రం ఆనందానుభూతి కూడ కలుగలేదు. అంత తొండమానుడు చింతతో ఆలోచిస్తూ స్వామివారిని ఇలా ప్రార్థించినాడు.

*భక్తానామపరాధాన్ నగణయంతి గుణాధికాః*
*క్షమస్వ మమ దౌరాత్మ్యం భక్తస్య పురుషోత్తమ!*
*వరదానే వాసుదేవ! భవాన్ శ్రేష్ఠతమో మతః*
*దయాం కురు దయాసిన్ధో! భక్తోపరి భయాపహ!*

స్వామీ! ఓ వేంకటేశ్వరా! భక్తుల అపరాధాల్ని లెక్క చెయ్యక అనుగ్రహించే నీవు నా పాపాల్ని పోగొట్టు స్వామీ! వరదానంలో నీకన్న శ్రేష్ఠుడు ఎవడున్నాడు? నా తప్పులను క్షమించి నా యందు దయ చూపించు స్వామీ! భక్తుల భయాలను పోగొట్టే ఓ శ్రీనివాసా! నన్ను నిండుగా, మెండుగా కరుణించి కాపాడుము -- అని అనేక విధాల స్తుతించి కీర్తించగా శ్రీనివాసుని వాక్కు ఇలా విన్పించింది.

**"భక్తాశ్చ బహవః సన్తి నాస్తి త్వత్సదృశో భువి**
**కర్మకృత్వా సుఘోరన్తు బ్రహ్మ స్త్రీ పుత్రఘాతుకమ్**
**ప్రపిత్ససి కథం పారం దుఃఖాద్రాజకుమారక**
**తవాగ్రజోపకారేణ జీవితన్తు మయా కృతమ్".**

ఓ రాజా! అనేక మంది భక్తులు నాకు వున్నారు. వారికి సమానమైన భక్తులు ఈ లోకంలో లేరనే చెప్పవచ్చు. అయినా! నీ వంటి ఘోరపాతకి లేనే లేడు. బ్రాహ్మణ స్త్రీని పుత్ర సహితంగా మరణింపజేసి, తీవ్రమైన ఘాతుకానికి ఒడిగట్టినావు. కాని, నీ సోదరుడు, నా భక్తుడు అయిన ఆకాశరాజు మీది ఉపకారంతో, వాత్సల్యంతో వారిని బ్రతికించి మహోపకారం చేశాను. ఇది మరొకరి యెడ అయితే ఇది సాధ్యం కానే కాదు-- అని అదృశ్యంగా శ్రీనివాసుడు పలుకు తున్నంతలో తొండమానుడు శ్రీనివాసుని వాక్కులకు అడ్డుపడి--

"అది కాదు స్వామీ! లోకంలో ఎంతటి వాడైనా తాను ఇతరులకు చేసిన ఉపకారం గొప్పగా వెల్లడించడు గాక వెల్లడించడు. అది అట్లా వుండనీ. నేను నీ భక్తులలో అగ్రగణ్యుడిని. ఈ ముల్లోకాల్లో నా అంతటి భక్తుడు లేడనే చెప్పవచ్చు. అలాగే దయాళువుల్లో నీవు అగ్ర గణ్యుడవు. ఇక నీ దయ నా ప్రాప్తము" అని అహంకార పూరితమైన భక్తితో మాటలాడి యథాప్రకారంగా ప్రతిరోజు బంగారు తులసీదళాలతో ఆనందనిలయుని పాద పద్మములను అర్చించి ఆరాధించు చుండినాడు. శ్రీనివాసుడు తొండమానుని అవివేకపూరితమైన దర్పాన్ని పోగొట్టాలని నిశ్చయించినాడు. ఇలా కొంతకాలం జరిగింది.

## మట్టిదళాలే నాకు మక్కువ!

ఒకానొక రోజు. ఆనందనిలయంలో తొండమానుచక్రవర్తి బంగారు తులసీ దళాలతో శ్రీస్వామివారి దివ్య పాద పద్మాలకు సహస్ర నామార్చన చేయుచుండినాడు. ఒక్కొక్క బంగారు తులసీదళం స్వామివారి పాదాలపై సమర్పింప బడుచుండినవి. ఇంతలో అదేమి విచిత్రమో! తొండమానుడు సమర్పించిన బంగారు తులసీ దళాలు వింతగా ప్రక్కకు తొలగుతూ, విచిత్రంగా ఎక్కడినుంచో అత్యంత సుకుమారములైన మనోహరము లైన నల్లని మట్టి తులసీదళాలు ఆ పాదాలపై అర్పించినట్లుగా వచ్చి చేరటం గోచరించింది. దీనిని గాంచిన తొండమానుడు సంభ్ర మాశ్చర్యాలకు లోనై, తాను చేసిన ఘోర పాపానికి శ్రీనివాసుడు ఇంకా శాంతించలేదని పరితపిస్తూ ఇలా ప్రార్థించినాడు.

"స్వామీ! శ్రీనివాస ప్రభూ! నేను ఘోర పాపాన్ని చేశాను. సరే! నీవు అనాథ రక్షకుడవే. పాపాలను నశింపజేసే వేంకటపతివే! మరి నీవు నేను సమర్పించిన బంగారు తులసీ దళాల్ని ప్రక్కకు త్రోసి, కేవలం మట్టిదళాలను స్వీకరిస్తున్నావా!

స్వామీ! ఇప్పటికైనా నన్ను కరుణించి కాపాడు తండ్రీ! అన్యథా శరణం నాస్తి! త్వమేవ శరణం మమ!" -- అంటూ సాష్టాంగ దండ ప్రణామా లాచరించినాడు. ఇంతలో శ్రీనివాసుడు "రాజా! నీవు నాకు సన్నిహితంగా మెలగుతూ, నన్ను గ్రహించలేదు. నాకు అహంకార పూర్వితమైన భక్తి కాదు కావలసినది. వినయపూర్వకమైన నిరాడంబరమైన భక్తి మాత్రమే. అదిగో అవి ఒక నిరాడంబర పేద భక్తుడు సమర్పించిన మట్టి తులసీ దళాలు. నీవు సమర్పించిన వానికంటే ఆ మట్టి తులసీ దళాలు నాకు అత్యంత మక్కువ కలిగించినాయి. ఆ భక్తుడు ఎవరో! అతని చేస్తున్న సేవ ఏమిటో! చేస్తున్న నిరాడంబర పూజ ఏమిటో నీకు వినిపిస్తాను. సావధానంగా విని వినయపూర్వకమైన భక్తిని అలవర్చుకొని, సాధన చేసికో! అప్పుడే నీవు తరించగలవు అని పలికినాడని చెబుతూ సూత మహర్షి శ్రీనివాసుని ఇలా ప్రార్థించినాడు.

*"వేంకటేశ చరణే తవ వన్దే సర్వతీర్థ శరణే శరణే మే*
*మావిధీర శివవీశ ఫణీశేన్ద్రార్క సోమహుతభుజ్ ముఖవన్ద్యే*
*శ్రీనివాస చరణే తవ వన్దే లోక పావన సుకుంకుమవర్ణే*
*శ్రీప్రదేకిల సురర్షి నరాణాం శ్రీఋుగాది నిగమాగమవేద్యే."*

ఓ వేంకటేశా! పరమపుణ్యప్రదమైన గంగానది, మరియు వేంకటాచల పర్వతంపైన విలసిల్లుతూవున్న శ్రీ స్వామిపుష్కరిణి మున్నగు సకల తీర్థాలకు నీ పాదపద్మాలే పుట్టినిల్లుకదా? భక్త రక్షణలో సిద్ధహస్తురాలైన శ్రీమహాలక్ష్మీదేవి! ఇంకా బ్రహ్మదేవుడు, వాయుదేవుడు, పరమేశ్వరుడు, గరుత్మంతుడు, ఆదిశేషుడు, ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, అగ్నిదేవుడు మొదలగు సమస్త దేవతలచేత స్తుతింపబడుతూ నమస్కరింపబడుతూవున్న దివ్యమైన నీ పాద పద్మాలకు నమస్కరించుచున్నాను. అంత మాత్రమేకాదు. ఓ శ్రీనివాసా! సకల సత్పురుషులకు జ్ఞానాన్ని అనుగ్రహించే నీ దివ్య మంగళ పాదద్వయం ఎల్లప్పుడు కుంకుమ వర్ణంతో విరాజిల్లుతూ వుంటాయి కదా. సమస్త దేవతలకు, ఋషులకు అంబరీషాది భక్త వరేణ్యులైన చక్రవర్తులకు, ఇంకా ఇతర మానవోత్తములకు తత్త్వజ్ఞానాన్ని కల్గించేవీ, శుభప్రదములైన ఋగ్వేదాదిగా నిగమాగమాలను, ధర్మాధర్మాలను, భగవతత్త్వాన్ని బాగా తెలియజేసే నీ దివ్య చరణాలకు నమస్కరిస్తున్నాను -- అంటూ సూతమహర్షి శ్రీ వేంకటేశ్వరుడు తన కుడిచేత్తో

చూపుతూ, వాటిని శరణువేడండని సందేశమిస్తున్న దివ్య పాద పద్మాలను అరమోడ్పు కన్నులతో ధ్యానిస్తూ , తర్వాతి దివ్య గాథను ఇలా కొనసాగించాడు.

## కూరిమిభక్తుడు కుమ్మరదాసు

"ఓ తొండమాను చక్రవర్తీ! నాకు అనేక యుగాల్లో అనేక మంది ఆంతరంగిక భక్తులు వున్నారు. ముఖ్యంగా ఈ కాలంలో, నేడు భీముడు అనే కుమ్మరివాడు నాకు అత్యంత ఆప్తుడై, నిరాడంబరుడై ఎలాంటి అరమరికలు లేని పరమభక్తునిగా ప్రసిద్ధి కెక్కినాడు. అతను ఈ శేషాచల క్షేత్రానికి ఉత్తరంగా ఒక యోజన దూరంలో వున్న కుగ్రామంలో వున్నాడు. ఆ కుమ్మరివాడు నా నివేదనకు అవసరమయ్యే మట్టి కుండలను తయారు చెయ్యడమే అతని పని. నిరంతరం బంక మట్టిని తీసుకురావడం, ఆ మట్టిని నీళ్లతో కలిపి బాగా పిసికి కుండల కనువుగా మట్టి ముద్దలను తయారు చేసుకోవడం, మట్టి ముద్దలను కుమ్మరి సారెపై పేర్చి, నివేదనకు వలసినన్ని కుండలను చెయ్యడమే అతని నిత్య కృత్యం. ఉదయం నిద్దుర లేచినది మొదలు రాత్రి వరకు ఏ పనిచేస్తున్నా శ్రీనివాసుని మీదే చింత! శ్రీనివాసునికి అవసరమయ్యే కుండలను తయారు చెయ్యడంలోనే అతని ధ్యాసంతా! ఉదయం లేచినదే తడవుగా కాల కృత్యాలు తీర్చికొని చద్దిని ఆరగించి తరువాత రెండు చేతులు జోడించి, "స్వామీ! ఏడుకొండలస్వామీ! నీ పనిలో నిమగ్నమవుతున్నాను. నీవే ఈపని చేయించుకో ప్రభూ!" అంటూ నమస్కరించి తన పనిలో నిమగ్నమయ్యేవాడు.

అతను చేసే ప్రతి కుండలో స్వామి ఆరగించినట్లుగా స్మరిస్తూ తన్మయుడయ్యే వాడు. ఆ అనుభూతిలో, ఆ తన్మయత్వంలో కాలాన్ని ఇట్టే మరచిపోయేవాడు. ఇలా చాలా ఏండ్లు గడచింది. కాని నిత్యమూ స్వామిని ఇలా ప్రార్థించేవాడు. స్వామీ! నీకు అవసరమైనన్ని కుండలను దండిగా తయారు చేసి వుంచి, రేపు నీ కొండకు వచ్చి స్వయంగా వచ్చి దర్శిస్తాను అని అనుకొని ప్రార్థించేవాడు. కాని ఎప్పటి కప్పుడు అతను తయారుచేసిన కుండలు ఏ నాటి కానాడు సరిపొయ్యేవి. మరునాటికి మళ్లీ కొత్తవి చెయ్యవలసి వచ్చేది. అందువల్ల కొండకు వెళ్లాలన్న అతని దిన దిన కోరిక ఎప్పటి కప్పుడు తీరని కోరికగానే మిగిలేది. అయినా అతను అసంతృప్తికి లోనుగాకుండా, నేను ఈ పనిని మానివేసి కొండకు పోతే ఎట్లా! కుండలు ఎవరు తయారుచేసేది? కుండలు తయారుగా లేకపోతే స్వామికి వంటలు ఎట్లా చేస్తారు?

స్వామి దేంట్లో ఆరగిస్తాడు? అని పరిపరి విధాల ఆలోచిస్తూ, మళ్లీ స్వామివారి దర్శనానికి పోవచ్చులే. ముందు కుండలు అవసరం కదా! అని నిరంతరం స్వామిని తలుస్తూ మట్టి కుండలు తయారుచెయ్యడంలో నిమగ్నమయ్యేవాడు. ఇలా అతను శ్రీవారి ఆలయానికి అవసరమయ్యే కుండలను తయారు చెయ్యడంలో ఏ మాత్రం విసుగు చెందక, ఏ మాత్రం విరామం లేకపోయినా మరింత భక్తి ప్రపత్తులతో మట్టి కుండలను తయారుచేసేవాడు.

తిరుమల స్వామివారి ప్రత్యక్షదర్శనం లేకపోయినా అతను ఏమాత్రం చింతించక, కొయ్యతో వేంకటేశ్వరస్వామివారి చిన్న ప్రతిమను తయారుచేసి తన కుమ్మరి సారె ప్రక్కన ఒక చిన్న దిమ్మెపై ప్రతిష్ఠించి, పూజించేవాడు. ఆ కుమ్మరివానికి ఆ చెక్క బొమ్మే ఆ తిరుమల శ్రీనివాసుడు. తిరుమల మీది స్వామి వారే సాక్షాత్తుగా ఇక్కడ ఈ చెక్క బొమ్మ రూపంలో వెలిసినాడని మనసా వాచా భావించడమేగాక, కర్మణా కూడా ఆ స్వామిని అర్చించి ఆరాధించేవాడు. ప్రతిరోజు పని ప్రారంభించుటకు ముందు కుమ్మరి భీమన్న ఆయనకు నమస్క రించేవాడు. చివరకు పనిని ముగిస్తూ వ్రేళ్లకు అంటిన బంక మట్టితో నాలుగు అయిదు మట్టిపూలను తయారుచేసేవాడు. ఈ మట్టి పూలను శ్రీనివాసుని చెక్క బొమ్మ పాదాలపై సమర్పిస్తూ స్వామీ! నాదగ్గర వుండేవి ఇవే. ఇంతకన్న నాదగ్గర ఏవీ లేవు. అందువల్ల నేను నీ పాదాలపై పెడుతున్న మట్టి పూలను మాణిక్యాల కంటె మిన్నగా ఆదరించి స్వీకరించి నన్ను ఆనందింప చేయి స్వామీ! అని ఆనంద బాష్పాలతో ప్రార్థించేవాడు. అతని నిత్య కృత్యం ఇలా కొనసాగేది. ఆ కుమ్మరి భీమన్న సమర్పిస్తున్న మట్టి కుండల్లో ప్రతి నిత్యం శ్రీనివాసుడు ఆరగించడమేగాక, అతను అర్పిస్తున్న మట్టి పువ్వులను అత్యంత ప్రీతిగా స్వీకరించేవాడు. అలా స్వామివారు స్వీకరించిన ఆ మట్టిపూలనే ఆనందనిలయంలో తొండమానునికి దర్శింపజేసినాడు.

కులాలుడైన కుమ్మరి భీమన్న గొప్పదనాన్ని సాక్షాత్తు శ్రీనివాసుని ద్వారా విన్న తొండమానుడు ఆ భక్తుని తప్పక దర్శించి తీరవలెనని కాలి నడకన బయలుదేరినాడు. రాజోచిత ఉపచారాలన్నింటిని విడిచిపెట్టి వెంట ఎవరు తోడు లేకుండా నడచివచ్చి అలసి పోయిన తొండమానుడు, భీముని ఇంటి వరకు వచ్చి 'పరమ భక్తుడైన భీమునకు నమస్కారం' అని పలుకుతూ స్పృహ తప్పి పడిపోయినాడు. అయ్యో! రాజుగారు పడిపోయినాడే! ఈ దీనుని ఇంటికి ఎందుకు వచ్చినాడో? అని సందేహిస్తూ చింతించి

నాడు. అంతలో స్పృహ వచ్చిన తొండమానుడు చూస్తుండగానే శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమయ్యాడు. తన కన్నుల ముందరే ప్రత్యక్షమై దర్శనమిస్తున్న స్వామిని చూస్తూ ఆనందంతో కుమ్మరివాడు అనేక విధాల పామర భాషలో కీర్తించినాడు.

స్వామీ! ఈ కుమ్మరి వాని ఇంటికి వచ్చినావా! అంటాడు. అయ్యో స్వామీ! నా కోసం, ఎంత శ్రమకోర్చి ఏడుకొండలను దిగి వచ్చినావో అంటాడు? మా ఇంటికి వచ్చిన నిన్ను పొగడడానికి నాకు మంత్రాలు రావు కదా! స్వామీ అని ఆపసోపాలు పడతాడు. మంత్రాలు రాకపోతే మానె. మాటలు కూడ సరిగా పలుకలేనే స్వామీ! అంటూ తడబడుతూ మాట్లాడతాడు. శబరి, విదురుడు, గజేంద్రుడు, విభీషణుల వంటివారికి వున్న భక్తి కూడ నాకు లేదే! పూజ చేయడం కూడా తెలియదే. మరి అలాంటి దీనుడైన ఈ కుమ్మరివాని ఇంటికి వచ్చినావా స్వామీ! అన్ని లోకాలను ఏలే స్వామివి నీవు. ఏమైన పెడదామంటే, మంచి కమ్మనైన పిండి వంటకాలు ఈ పేద వానింట్లో ఏమీ లేవు కదా! ఎంతటి హీనస్థితి నాది. జన్మకో శివరాత్రి అన్నట్లుగా రాక రాక స్వామి నా కోసం వచ్చాడే! అని కుమ్మరి భీమన్న పలు పలు విధాల చింతిస్తూ, భక్తి సంభ్రమాలతో ఉబ్బి తబ్బిబ్బు అవుతుండగా, వేంకటేశ్వరుడు ఆ కుమ్మరి వానిని ఓదారుస్తూ ఇలా అన్నాడు.

"ఓయీ! తమాలీ! కర్మ కఠోరములైన జప తపములకన్న ప్రీతితో కూడిన భక్తే నాకు మిన్న! నా మీది ప్రేమతో దర్శనానికి అర్రులు చాచే నీ అర్తే, నీ అర్ద్రతే నాకు సంతృప్తికరం! నాకు పెట్టడానికి షడ్రసోపేతమైన కమ్మనైన వంటలు అక్కరే లేదు. నీ ఇంటిలో వున్నదే, నీవు తింటున్నదే నాకు పెట్టు. అదే నాకు పదివేలు. ఏదీ అన్నం పెట్టు - నాకు ఆకలిగా వుంది కూడా" అంటూ వేంకటేశ్వరుడు ఆ కుమ్మర భక్తుని తొందర పెట్టాడు. వెంటనే కుమ్మరవాని భార్య తమాలిని మట్టి మూకుట్లో సంకటి ముద్దను తెచ్చి స్వామి ముందుంచి "స్వామీ! మేము అనాచారులమైన కుమ్మరోల్లం. అందరినీ రచ్చించే దేవుళ్ళు మీరు. ఇదే పంచ బచ్చ పరమాన్నాలు అనుకొని నేను వండిన అన్నాన్ని అరగించు స్వామీ!" అంటూ భయభక్తులతో ప్రాధేయపడింది. ఆ దంపతుల మీది ప్రేమతో మట్టి పాత్రలో ప్రీతిగా భుజించాడు స్వామి. తమ అలుమగల జన్మ ధన్య మయిందని భావిస్తూ పట్టరాని ఆనందంతో ఆ దంపతులు, స్వామివారి పాదాలపై పడి సాష్టాంగ దండాలర్పించారు. అంతే! స్వామివారి దివ్యపాదస్పర్శతో ఆ కుమ్మరి దంపతులు తమ పాంచ భౌతిక దేహాలను

వదలిపెట్టి, దివ్యశరీరాలను ధరించారు. ఈ సంఘటనకు, స్వామివారిలీలలకు ఆశ్చర్యపడుతూ దేవతలు పుష్పవర్షం కురిపించారు. దుందుభులు మోగించారు. ఇంతలో వైకుంఠం నుంచి ఒక దివ్య విమానం వచ్చి అక్కడ వ్రాలింది. శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆజ్ఞతో దివ్య శరీరాలతో విరాజిల్లుతూ వున్న ఆ కుమ్మర దంపతులు ఆ విమానంలో వైకుంఠానికి వెళ్లిపోయారు. స్వామివారు కూడ అదృశ్య మయ్యాడు.

ఇదంతా కన్నార్పక చూసిన తొండమానుడు తన కళ్ల ఎదుట జరిగిన ఈ అద్భుత సంఘటనకు ఆశ్చర్య పడుతూ, ఎంతటి భాగ్యవంతుడు ఈ భీముడు! పరమ భక్తులైన ఈ దంపతుల వైకుంఠ గమనాన్ని చూచిన తానూ భాగ్యవంతుడినే నని భావిస్తూ, తనకు కలిగిన అహంకార పూరితమైన భక్తిని వదలి పశ్చాత్తాపం పొందినాడు-- అని సూతుడు వివరించగా, శౌనకాదులు అద్భుతం! పరమాద్భుతం! శ్రీవేంకటేశుని దివ్య చరితం!! అంటూ ఆ తర్వాతి గాథను కూడా వివరించమని అడగగా -- సూతుడు తర్వాతి గాథను ఇలా కొనసాగించాడు.

మహాభక్తుడు, నిరంతరం శ్రీస్వామివారి సేవా కైంకర్యంలోనే జీవితాన్ని పండించుకొని చివరకు ప్రత్యక్షంగా శ్రీవారిని దర్శించడమేగాక, దివ్య శరీరాలతో వైకుంఠానికి వెళ్లిన కుమ్మరి భీమన్న వృత్తాంతాన్ని కళ్లారా చూచిన తొండమాను చక్రవర్తి పరమ సాత్త్వికునిగా మారిపోయినాడు.

తిరుమల క్షేత్రం చేరుకొనిన తరువాత తొండమానుడు స్వామివారితో నిశ్చలమైన మనస్సుతో ధ్యానం చేస్తూ ఇలా విన్నవించుకొన్నాడు.

"స్వామీ! ఏడుకొండలవాడా! అనాథరక్షకా! ఆశ్రిత వత్సలా! అజ్ఞానంతో నిండివున్న నాకు జ్ఞానోపదేశం చేసిన సద్గురువువు నీవు. భీముని వంటి పరమభక్తుణ్ణి నేను కాను. అయినా నేను నీ బంధుకోటిలో చేరిన వాణ్ణి కదా. అంతే కాదు నేను చేసిన అత్యల్పమైన సేవతో సంతృప్తిని పొంది నాకూ మోక్షాన్ని అనుగ్రహించు స్వామీ! ఇక ఈ జన్మ చాలు. ఈ భౌతిక శరీరాన్ని నేను మోయలేను. ఓ కరుణాకరా! నా మీద నిండుగా దయ ఉంచి నీ సాన్నిధ్యాన్ని ప్రసాదించు" అంటూ శ్రీనివాసుని పాదాలపై పడి సాష్టాంగ ప్రణామం చేస్తూ దీనంగా కన్నీరు కారుస్తూ అనేక విధాలుగా ప్రార్థించాడు.

శ్రీనివాసుడు వెంటనే తొండమానుని లేవనెత్తి "రాజా! నీవూ నాకు పరమ భక్తుడివే. కాకపోతే నేనొక్కడినే భక్తుడిని, అని అహంకరించావు. ఆ అహంకారం పూర్తిగా తొలగిపోయింది. ఇప్పుడు కడిగిన ముత్యంలా వున్నావు. ఇలాగే నిర్మలమైన బుద్ధితో నీవు నీ సాధన కొనసాగించు. తపస్సు చెయ్యి. పై జన్మలో నీకు తప్పక మోక్షం సిద్ధిస్తుంది. తప్పక అనుగ్రహిస్తున్నాను" అని వరమిచ్చాడు.

"స్వామీ! వేంకటేశా! మరుజన్మలోనా! నాకు మోక్షం వచ్చేది. అయినా పర్వాలేదు. అంటూ వెంటనే స్వామిపుష్కరిణిలో సంకల్పపూర్వకంగా స్నానం చేసిన తర్వాత వృద్ధుడైన తొండమానుడు స్వచ్ఛందంగా భౌతిక దేహాన్ని విడిచిపెట్టాడు. మరుజన్మలో శ్రీనివాసుని సన్నిధిలో స్వచ్ఛమైన, నిర్వికారమైన మనస్సుతో నిశ్చలంగా తపస్సునుచేసి మోక్షాన్ని పొందినాడు. తిరుమలలో గోవిందుని సన్నిధిలో నిత్యమూ స్మరింపబడుతూ వున్నాడు. ఈ భూలోకంలో ఆ గోవిందుడు వేంచేసి కొలువై వున్నంత వరకూ తొండ మానుడు స్మరింపబడుతూనే వుంటాడు. ఈ దివ్య వృత్తాంతం వినిన మనమందరం ఒక్కసారి గట్టిగా గోవింద నామాన్ని ఉచ్చరించుదాం.

**గోవిందా! గోవిందా!! గోవింద!!!**

అంటూ అందరిచే గోవిందనామాన్ని పలికిస్తూ సూతమహర్షి అర్ధనిమీలిత నేత్రాలతో శ్రీనివాస భగవానుని మనసారా ధ్యానించాడు.

పిదప మహర్షులందరూ, సూత మహామునితో ఇలా అన్నారు. "ఓ సూత మహాశయా! అద్భుతంగా, పరమానంద దాయకంగా తిరుమల పరంధాముని చరిత్రను, లీలలను, మహిమలను, వివరించారు. సంతోషంగా వుంది. ఆధ్యాత్మిక సాధనలో ఉన్నత స్థితిని పొందినట్లుగా మేమందరంకూడ ఒక అవ్యక్తమైన దివ్యానుభూతి పొందుతూ వున్నాం. బాగుంది. ఆ శ్రీనివాసభగవానుడు ఏ విధంగా ఆరాధిస్తే, అర్చిస్తే. ఆస్వామి మన అందరి కోరికలను తీర్చగలడు. ఆస్వామివారిని అర్చించే విధానం ఏదైన వుందా! వుంటే మాకు వివరించవలసిందంటూ అందరూ అడిగారు.

## ఆనందనిలయుని అర్చించే విధానం

వెంటనే సూతుడు పరమానందాన్ని పొందుతూ "ఔను. ఆనందనిలయుని అర్చించడానికి ప్రత్యేకంగా ఒక అర్చన పద్ధతి వుంద. అది పరమ రహస్యమైనది.

పూర్వం ఒకప్పుడు పదివేలపడగలు కలిగిన ఆదిశేషుడు, కపిలమహామునికి ఆ ఉపాసనా పద్ధతిని ఉపదేశించాడు. పరమ పవిత్రమైన పుణ్యప్రదమైన అష్టోత్తర శత నామాలను పఠిస్తూ శ్రీ వేంకటేశ్వరస్వామివారి పాదపద్మాలను బంగారు కమలాల చేత అర్చించాలి.

పూర్వం బ్రహ్మదేవుడు ఈ అష్టోత్తర శతనామాల చేత శ్రీ వేంకటేశ్వర భగవానుని ఆరాధించి తన కోరికలను నెరవేర్చుకొన్నాడు. కనుక మీరందరూ బంగారు పద్మాలతో అష్టోత్తర శతనామాలతో ఆనందనిలయుని అర్చించండి.

"తేషాం శేష నగాధీశ మానసోల్లాస కారిణామ్
నామ్నా మష్టశతం వక్ష్యే వేంకటాద్రి నివాసినః
ఆయురారోగ్య దం పుంసాం ధనధాన్య సుఖప్రదమ్
జ్ఞానప్రదం విశేషేణ మహదైశ్వర్య కారకమ్
అర్చయేత్ నామభి ర్దివ్యైః వేంకటేశ పదాంకితైః
నామ్నా మష్ట శతస్యాస్య ఋషిర్ బ్రహ్మ ప్రకీర్తితః
ఛందోఽనుష్టుప్ తథా దేవో వేంకటేశ ఉదాహృతః
నీలగోక్షీర సంభూతో బీజ మిత్యుచ్యతే బుధైః
శ్రీనివాసస్తథా శక్తిః హృదయం వేంకటాధిపః
వినియోగస్తథాభీష్ట సిద్ధ్యర్థ్యే చ నిగద్యతే.

శ్రీనివాస భగవానునికి అత్యంత ప్రియమైన ఇష్టమైన ఈ నామాలతో అర్చించినట్లయితే మానవులకు ఆయురారోగ్యాలు కలుగుతాయి. ధన ధాన్య సమృద్ధి కలుగుతుంది. జ్ఞానం సిద్ధించడమేగాక మహదైశ్వర్య సంపన్నులు కావడం తథ్యం. ప్రతి నామం చివర్లో "వేంకటేశ" అనే దివ్యమైన పదాన్ని కలుపుకొని అర్చించాలి.

ఈ అష్టోత్తరశతనామమంత్రానికి ఋషి బ్రహ్మదేవుడు. అనుష్టుప్ ఛందము. పరమాత్మ వేంకటేశ్వరుడు. బీజం నీలగోక్షీరంతో అభిషేకింపబడే శ్రీనివాసుడు. శక్తి శ్రీనివాసుడే! హృదయంకూడా వేంకటాచలపతే! దీనికి వినియోగం ఏమంటే అభీష్టాలు సిద్ధించటం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, అలక్ష్యం చేయకుండా, ఏ మాత్రం శంక లేకుండా. శ్రద్ధగా, దీక్షగా మనస్సును పెట్టి వినండి.

1. ఓం వేంకటేశాయ శ్రీ వేంకటేశాయ నమః

2. ఓం శేషాద్రి నిలయాయ శ్రీ వేంకటేశాయ నమః

3. ఓం వృష దృగ్గోచరాయ శ్రీ వేంకటేశాయ నమః

4. ఓం విష్ణవే శ్రీ వేంకటేశాయ నమః

5. ఓం మేరుపుత్ర గిరీశాయ శ్రీ వేంకటేశాయ నమః

6. ఓం సరః స్వామితటీజుషే శ్రీ వేంకటేశాయ నమః

7. ఓం కుమారాకల్ప సేవ్యాయ శ్రీ వేంకటేశాయ నమః

8. ఓం వజ్రి దృగ్విషయాయ శ్రీ వేంకటేశాయ నమః

9. ఓం సువర్చలాసుతన్యస్త సైనాపత్యభరాయ శ్రీ వేంకటేశాయ నమః

10.ఓం రామాయ శ్రీ వేంకటేశాయ నమః

.......................................................................

101. ఓం వైకుంఠాచలవాసినే శ్రీ వేంకటేశాయ నమః

102. ఓం ముకుందాయ శ్రీ వేంకటేశాయ నమః

103. ఓం అనంతాయ శ్రీ వేంకటేశాయ నమః

104. ఓం విరించాభ్యర్థితానీత సౌమ్యరూపాయ శ్రీవేంకటేశాయ నమః

105.ఓం సువర్ణముఖరీస్నాత మనుజాభీష్టదాయినే శ్రీవేంకటేశాయ నమః

106. ఓం హలాయుధ జగత్తీర్థ సమస్త ఫలదాయినే శ్రీవేంకటేశాయ నమః

107.ఓం గోవిందాయ శ్రీ వేంకటేశాయ నమః

108.ఓం శ్రీనివాసాయ శ్రీ వేంకటేశాయ నమః.

ఈ నూట ఎనిమిది నామాలు అత్యంత మహిమ కలవి. ఈ పేర్లను 'శ్రీ వేంకటేశ్వరస్వామి అష్టోత్తర శతనామావళి' అంటారు.

"తస్య శ్రీవేంకటేశస్తు ప్రసన్నో భవతి ధ్రువమ్
అర్చనాయాం విశేషేణ గ్రాహ్యమష్టోత్తరశతమ్
వేంకటేశాభిధేయైర్యో వేంకటాద్రి నివాసినమ్
అర్చయేన్నామభిస్తస్య ఫలం ముక్తిః న సంశయః
గోపనీయ మిదం స్తోత్రం సర్వేషాం న ప్రకాశయేత్

శ్రద్ధా భక్తియుజామేవ దాపయేత్ నామసంగ్రహమ్
ఇతి శేషేణ కథితం కపిలాయ మహాత్మనే
కపిలాఖ్య మహాయోగిసకాశాత్తు మయాశ్రుతమ్
తదుక్తం భవతామద్య సద్యః ప్రీతికరం హరేః."

అద్భుత మహిమాన్వితములైన ఈ అష్టోత్తర శతనామాలతో, నిత్యమూ భక్తితో శ్రీస్వామివారిని ఎవరైతే అర్చిస్తారో, లేదా పఠిస్తారో లేదా వింటారో అలాంటి వారికి శ్రీ శ్రీనివాస భగవానుడు తప్పక ప్రసన్నుడై కోరిన కోర్కెలను తీరుస్తాడు. అంతేకాదు మోక్షం కూడ కలగడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ స్తోత్రం పరమ రహస్యంగా ఉంచ తగినది. అందరికీ చెప్పతగినది కాదు. శ్రద్ధాభక్తులు, విశ్వాసం కలవారికి మాత్రమే ఈ అష్టోత్తర శతనామాలను ఉపదేశించవలయును. పూర్వం వీటిని ఆదిశేషుడు కపిల మహర్షికి వినిపించగా, ఆ కపిలమహర్షి నుండి నేను స్వయంగా విన్నాను. మీరందరూ శ్రీ శ్రీనివాసునకు ప్రీతి కరములైన ఈ నామావళి ద్వారా ఇహపర సుఖాలను పొందవలెనని భావించి మీకు ఉపదేశిస్తున్నాను" -- అంటూ సూత మహర్షి

వేదేషు చ పురాణేషు వేంకటేశ కథామృతం
వర్ణితం చేతిహాసేషు భారతాద్యాగమేషు చ
మనోహరం తు సంశ్రావ్య మిహాముత్రేష్ట దాయకమ్
జ్ఞానప్రదం విశేషేణ మహదైశ్వర్య కారణమ్
వైరాగ్య భక్తి సత్త్వాది ప్రదేంద్రియ వశప్రదమ్
వేంకటాగ్రే శుచిక్షేత్రే౽ శుచిదోషో న విద్యతే.

ప్రభూ! ఓ ఘన వేంకటేశా! అద్భుతమైన నీ దివ్యచరిత్ర అమృతం వంటిది. అది మానవుని జరా మరణాలను రెండింటిని పోగొట్టి మోక్షాన్ని ప్రసాదిస్తుంది. అట్టి పరమ పవిత్రమైన నీ దివ్య గాథ ఋగ్వేదాదిగా వున్న నాలుగు వేదాల్లోను, పద్దెనిమిది మహా పురాణాల్లోనూ, మహా భారతం, శ్రీమద్రామాయణం వంటి ఇతి హాసాల్లోనూ అనేక ఆగమ గ్రంథాల్లోనూ గొప్పగా వర్ణింపబడింది.

ఓ స్వామీ! నీ వృత్తాంతం ఎంతో హృద్యంగా వుంటుంది. వినడానికి చాల సొంపుగానుకూడా వుంటుంది. దానిని వింటే చాలు. ఇహపర శ్రేయోదాయక మైనవి సిద్ధిస్తాయి. అనగా మోక్షానికి అవసరమైన వేద వేదాంతాది శాస్త్ర

సంబంధమైన జ్ఞానంతోపాటుగా, ఇహలోకంలో మనుగడ సాగించడానికి అవసరమైన ఐశ్వర్యాన్ని సమృద్ధిగా, సంపూర్ణంగా ప్రసాదిస్తుంది. అంతమాత్రమే కాదు! ఓ కొండలరాయా! కమ్మనైన నీ కథ వినడంవల్ల మనస్సునకు సంతుష్టి కలుగుతుంది. ఆహ్లాదం కలిగి మనస్సు ఆనంద డోలికల్లో ఊయల లూగుతుంది. దానితోపాటు ఇంద్రియాలను అదుపులో వుంచుకొనేట్లుగా నిగ్రహశక్తిని కలిగిస్తుంది. సాత్త్వికమైన గుణగణాల్ని వృద్ధి చేస్తుంది. భక్తి ప్రపత్తులను కూడా పెంపొందిస్తుంది. ఇంతటితో ఆగక చివరకు వైరాగ్యాన్ని కూడ కలిగించి తద్వారా మోక్షం మీద ఆసక్తిని కలిగించి చివరకు ముక్తిని కూడా సిద్ధింప చేస్తుంది. మరి ఇంతటి పరమ పవిత్రమైన దివ్య వృత్తాంతానికి కేంద్ర స్థానమైన శ్రీ వేంకటాచల క్షేత్రానికి ఏలాంటి అశుచి దోషం లేదు, వుండదు, వుండబోదు కదా! అంటూ సూతుడు అనేక విధాలుగా ఘన వేంకటేశుని కీర్తించగా, మహర్షులు ఇలా అడిగారు.

## వేంకటాచలక్షేత్ర విధులు

ఓ మహనీయా! సూత మహర్షీ! మాకు ఇంతవరకు తెలియనటువంటి శ్రీవేంకటాచలక్షేత్ర మహిమనూ, అందు వెలసినట్టి శ్రీనివాస భగవానుని దివ్య చరిత్రను, అద్భుత మహిమలను, అసాధారణ లీలలను వీనుల విందుగా వినిపించారు. ఆనందంగా ఆనందనిలయుని గాథను విన్నాం. ఆ స్వామి వారిని సేవించే విధానాన్ని కూడా మీ ద్వారా తెలుసు కున్నాం. చాలా బాగుంది. మీ కథా కథన శైలి అద్భుతంగా వుంది. శ్రీ వేంకటేశ్వరుని దివ్య క్షేత్రమైన సప్తగిరులను మీరు వర్ణించిన తీరు కడు రమణీయం. కన్నులకు కట్టినట్లుగా వుంది. మీరు చెబుతూ వుంటే మేము ప్రత్యక్షంగా దర్శించినట్లుగా దివ్యానుభూతులను పొందాం. అందువల్ల మేమందరం కూడా వేంకటాచలయాత్రను ఎంతో ఆసక్తితో ఆశతో పాదయాత్రతో చేయాలనుకున్నాం. ఆ స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని కన్నులార దర్శించాలనుకున్నాం. చేతులారా ఆనందనిలయుణ్ణి అర్చించాలనుకున్నాం. నోరారా కొండలరాయణ్ణి కీర్తించాలను కున్నాం. అందువల్ల ఆ క్షేత్రానికి మేము వెళ్ళినప్పుడు ఆ క్షేత్రంమీద మేము ఆచరించవలసిన క్షేత్రవిధులు ఏమైనావున్నాయా? ఆ క్షేత్రంలో ఏవైనా దానాది కర్మలు చేయాలా? అలా చేస్తే వాటివల్ల ఫలితాలు ఏవైనా వున్నాయా? ఇలాంటి వివరాలు

కూడా మాకు వివరిస్తే, మేము వాటిని ఆచరించి మా వేంకటాచల యాత్రను సంపూర్ణంగా ఫలప్రదం చేసుకొంటాం! దయచేసి మా యందు నిండు దయతో ఆ విధానాన్ని కూడా మాకు ఉపదేశించవలసిందిగా భక్తి పూర్వకంగా ప్రణమిల్లుతున్నాం!"

"నాయనలారా! చాలా సంతోషం! మీరందరూ అనుభవించే అవ్యక్తమైన ఈ ఆనందం ఆనందనిలయుని దివ్యగాథను వినడం ద్వారా మాత్రమే కలుగుతున్నది. దీనిని మరింత పెంచుకొని శాశ్వతానందంగా పొందుటకు మీరందరూ పాదయాత్ర చేస్తూ ఆ ఏడుకొండలను ఎక్కవలసిందే. ఆ సప్తగిరుల ప్రకృతి రామణీయకతను కన్నులారా దర్శించవలసిందే! ఆ సప్తగిరీశుని మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా సాధన చేసుకోవలసిందే. మీకు స్వయంగా వేంకటాచల యాత్ర చెయ్యాలన్న సంకల్పం కలగడం మీ మహద్భాగ్య విశేషం! ఇది ఆ కొండలరాయని కొండంత అనుగ్రహానికి దర్పణం! కనుక మీరు కోరినట్లు ఆ క్షేత్రం మీద చేయవలసిన పనులను, చేయకూడని పనులను వివరిస్తాను. జాగ్రత్తగా ఏకాగ్రతతో వినండి మరి.

మహర్షి సత్తములారా! మీరందరూ తొందరపాటు లేక నెమ్మదిగా, నింపాదిగా వేంకటాచల క్షేత్రమునకు వెళ్లి రావలసింది. ముందుగా ఆ క్షేత్రం సమీపానికి వెళ్లి ప్రదక్షిణ పూర్వకంగా సాష్టాంగ దండ ప్రణామాలను భక్తియుతంగా సమర్పించండి. ఆ సప్తగిరులకు చుట్టుప్రక్కల, దిగువన నున్న కపిలతీర్థాది పుణ్య జలాలలో మునకలిడి పవిత్ర స్నానాలు చెయ్యండి. ఆ తీర్థ సన్నిధిల్లో వేంచేసి వున్న దేవతలకు పూజలు చేసి నమస్కారాదులు సమర్పించండి. పిదప, పచ్చని పూపొదరిళ్లతో, జలజలా పారే సెలయేళ్లతో, పక్షుల కుహూరాగాలతోను, మృగాల గర్జనలతోను, భక్తుల గోవింద ఘోషలతో ప్రతిధ్వనించే ఏడుకొండలను అత్యంత వినయ వినమ్రంగా అధిరోహిం చండి.

"ఆరుహ్యా రత్నసానుం తం శుక కోకిల మంజులమ్
స్వామిపుష్కరిణీం పద్మ వనవాతేన రంజితామ్
ప్రాప్య స్నాత్వా చ తత్తీర్థే ప్రదక్షిణ విధానతః
పరిస్సృత్య విమానం చ దర్శనాత్ పాపనాశనమ్
హృదయానంద జననం పులకోద్గమ కారకమ్
ప్రవిశ్య భూ వరాహం చ నత్వా శ్రీ వేంకటాధిపమ్

శ్రీ భూమిభ్యాం ముదా యుక్తం శంఖ చక్ర వరాయుధే
దధానం పుండరీకాక్షం స్మయమాన ముఖాంబుజమ్
దయామృత తరంగాబ్ధి మందస్మిత మనోహరమ్
సమ్యగ్దృష్ట్వా చ నత్వా చ స్తుత్వా నామభి రేవ చ
అర్చయిత్వా చ కమలైః లబ్ధ్వాఽ భీష్టం చ దుర్లభమ్
కృత కృత్యా వివర్తధ్వం ఇత్యుక్త్వా మునయ స్తథా."

ఆ శేషాద్రి పర్వతంపైనపద్మముల మీది చల్లని పిల్లవాయువులు వీచుటచేత హృద్యమగు అలలచేత సొంపుగా కదలుతున్న నీటిచే నిండి వున్న శ్రీస్వామి పుష్కరిణిని కన్నులారా దర్శించండి. ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించండి. సంకల్ప పూర్వకంగా పవిత్రమైన శ్రీ స్వామిపుష్కరిణిలో స్నానం చెయ్యండి. ఆ పుష్కరిణీ తీరంలో వేయి వెలుంగులతో ప్రకాశిస్తూ వున్నట్టి ఆనందనిలయ బంగారు విమానాన్ని దర్శించండి. ఆ బంగారు విమానాన్ని చూచిన వెంటనే హృదయం ఆనందంతో ఊయల లూగుతుంది. శరీరాన్ని పులకింప జేస్తుంది. అంత మాత్రమే కాదు. పాపాలన్నింటిని పటా పంచలు చేసి దర్శించిన వారిని, దర్శించిన వెంటనే పరమ పవిత్రుల్ని చేస్తుంది. అలాంటి ఆనందనిలయ విమానానికి ప్రదక్షిణం చేస్తూ, ఆ పుష్కరిణీ తీరంలో వేంచేసి వున్న శ్వేత వరాహస్వామి వారిని దర్శించి సేవించండి. ఈ స్వామివారు హిరణ్యాక్షుని బారినుండి భూదేవిని రక్షించి, తన ఒడిలో ఆమెతో పాటు దర్శనమిస్తూ వున్నందువల్ల 'భూవరాహస్వామి' అని కూడా పిలువబడు తున్నాడు. ఈయన జ్ఞాన మూర్తి. ఈ భూ వరాహ స్వామివారిని ముందుగా దర్శించిన తర్వాతే శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించవలెను. అది ఈ క్షేత్ర సంప్రదాయం. శ్రీవరాహస్వామి భక్తులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. జ్ఞానం సిద్ధించిన భక్తునికి ఆనందం కరతలామలకం! అందువల్ల తదుపరి ఆనందనిలయుని దర్శనం చేయవలెను.

శ్రీదేవి భూదేవి ఉభయ దేవేరులతో ఆనందంగా, సంతృప్తికరంగా వుండడమే గాక, శంఖ చక్రాలను ధరించి, విశాల నేత్రాలతోను, మందస్మితవదనారవిందంతోను ప్రకాశిస్తున్న ఘనవేంకటప్రభువును దర్శించండి. ఆ శ్రీనివాసుడు దయ అనే అలలచేత కూడి వున్న మహా సముద్రుడు. ఎల్లప్పుడు ఏ మాత్రం తరగని, చిరుమంద హాసంతో భక్తులకు మనోహరంగా కొలువై వుంటూవున్న కొండలరాయణ్ణి చక్కగా దర్శించండి.

నమస్కరించండి. భక్తిగా స్తుతించండి. అష్టోత్తర శతనామాలతోను పఠిస్తూ తామర పుష్పాలతో తిరుమలేశుని అర్చించండి, ఆరాధించండి! మీ మీ కోరికలను సంపూర్తిగా పొందండి. తద్వారా మీ వేంకటాచలయాత్రను, మీ జీవితాలను ధన్యం చేసుకోండి.

పిదప ఆ దివ్య క్షేత్రంపైన వున్న దివ్య తీర్థాలను కూడ సేవించండి. ఆ పుణ్య తీర్థ జలాలలో స్నానాలు చెయ్యండి. దానాలు చెయ్యండి అని సూతమహర్షి పలుకగా శౌనకాదులు మళ్లీ ఇలా ప్రశ్నించారు.

ఓ మహర్షి వరేణ్యా! వేంకటాచల క్షేత్రంలో ఏ ఏ దానాలు చెయ్యాలి. ఏ దానాలు శ్రీ వేంకటేశ్వరునికి ప్రీతి కారకములు. ఏ దానాలు చేస్తే శ్రీనివాసుడు ప్రసన్నుడై మనలను అనుగ్రహించునో సవిస్తరంగా తెలియజేస్తే బాగుంటుంది. మీరు చెప్పినట్లుగా వాటిని ఆచరించి సఫలీకృతులమై మరలి వస్తాము మహాశయా! అవశ్యం తెలియ జెయ్యండి! అని అడుగగా సూతుడు--

*"శ్రీ వేంకటేశ యాత్రార్థం గచ్ఛధ్వం సుదృఢ వ్రతాః*
*విష్ణు సందర్శనం కృత్వాభక్తి మంతో జితేంద్రియాః"*

ఓ మహా తపోధనులారా! మీరందరూ కూడా దృఢమైన వ్రతనియమాలు కలిగినవారై వేంకటాచల యాత్రకు బయలుదేరండి. ఎల్లప్పుడు మీ మనస్సులను శ్రీనివాసభగవానునియందు మాత్రమే లగ్నం చేసి పాదచారులై యాత్ర చెయ్యండి. సత్కథాశ్రవణం, భగవన్నామ మననం, ధ్యానానుష్ఠానాది నియమాలతో మీ ఇంద్రియాలను నిగ్రహించుకొని, పరమ భక్తిని పెంపొందించు కోండి. ఇంతింత అని వర్ణించగరాని, వర్ణించగలేని మహిమాన్వితమైన శ్రీ వేంకటాచల పర్వతాన్ని అధిరోహించి, ఆ పర్వత రాజంపై నిండుగా కొలువై దండిగా దర్శనమిస్తూ, దర్శించినవారికి శుభ పరంపరలు ప్రసాదిస్తున్న నిత్య కల్యాణ చక్రవర్తిని కన్నులారా దర్శించండి! మనసారా స్మరించండి!! నోరారా "గోవిందా! గోవిందా!! గోవింద!!!" అని అడుగడుగునా కీర్తించండి!!! -- అంటూ సూత మహర్షి శౌనకాదులను వేంకటాచలయాత్రకు ప్రేరేపిస్తూ వారితో ఇంకా ఇలా అన్నాడు.

పుణ్యాత్ములైన ఓ తపోధనులారా! జాగ్రత్తగా ఏకాగ్రతతో వినండి మరి! వేంకటాచల క్షేత్రం మీద ఆచరించ వలసిన దాన విధులను వినిపిస్తున్నాను.

## చేయవలసిన దానాలు - వాటి ఫలితాలు

సాటిలేని మేటియైన ఈ వేంకటాచల పర్వతంమీద శ్రీనివాసప్రభువు సాన్నిధ్యంలో అత్యంత ప్రధానంగా చేయవలసిన దానం అన్నదానం - దానితో పాటు పితృ దేవతలను సంతృప్తి పరచే శ్రాద్ధవిధి. ఈ రెండు అత్యంత ఫలితాన్ని కలిగిస్తాయి. ఇక బంగారాన్ని దానం చేసినట్లయితే శాశ్వతమైన ఆనందప్రదమైన మోక్షం సిద్ధిస్తుంది. వస్త్రదానం చేసినట్లయితే ఆయుస్సు పెరుగుతుంది. శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రీతికై గోదానం, ముఖ్యంగా కపిల గోవులను దానంగా ఇచ్చినట్లయితే శాశ్వత విష్ణు లోకంలో ఆ గోవుకున్న రోమముల సంఖ్య కనుగుణంగా పూజింపబడతారు.

శ్రీనివాసుని పూజకోసం కర్పూరం, చందనం, శంఖం ఆభరణాలను సమర్పించినట్లయితే మహాపాతకాలు నశిస్తాయి. శ్రీ స్వామివారికి భూములను విరాళముగా ఇచ్చినట్లయితే సంసార బంధాలు తెగి గొప్ప గతిని పొందుతారు. శ్రీ వేంకటేశ్వరస్వామివారికి రథాన్ని నిర్మించడానికి దోహద పడినట్లయితే, కోటి కన్యాదానాలు, పదివేల గోవులను దాన మొనరించిన సత్ఫలితం కలుగుతుంది. తిరు వేంకటప్రభువునకు మహారాజోపచార వస్తువులను--గొడుగు, విసన కర్రలు, చామరాలు, బంగారు, పుష్పమాలికలను ఏనుగులు, గుర్రాలను సమర్పించుకుంటే చక్రవర్తి అగుటయేగాక పరమపదాన్ని పొంది నిరతిశయమయమైన ఆనందాన్ని అనుభవిస్తారు.

అష్టమి, చతుర్దశి, పున్నమి, సంక్రాంతి, అమావాస్య మున్నగు రోజుల్లో తిరుమలేశునకు ఉత్సవాలు చేయించినవానికి, తానుచేసిన వేలాది అపరాధాలను శ్రీనివాస భగవానుడు క్షమించడమేగాక భోగ, మోక్షాలను ప్రసాదిస్తాడు.

వేంకటాచలక్షేత్రంలో శ్రీస్వామివారిసన్నిధిలో ఆవునేతితో జ్యోతులను వెలిగిస్తూ తమను, తమ పూర్వులను స్మరించినట్లయితే, తాము తమ పూర్వులు చేసిన పరమ పాతకాలన్నీ నశిస్తాయి.

ఏడుకొండలలో నెలవైవున్న పవిత్ర తీర్థాల్లో స్నానం చేసిన తర్వాత బంగారం, గోవులు, వెండి, భూమిని, నువ్వులను దక్షిణలతో తాంబూలాన్ని, సుగంధ ద్రవ్యాలను పెరుగు, మజ్జిగ, బెల్లపు పానకం, మృష్టాన్న భోజనం దానం చేస్తే, సమస్త పాపాలు నశించి ఐశ్వర్యవంతులవుతారు.

తిరుమల క్షేత్రంలో దాహం గొన్నవారికి నీటిని ఇవ్వనట్లయితే పశు పక్ష్యాదులుగా జన్మిస్తారు. కనుక తప్పక జలదానం చెయ్యాలి. నీటిని దానం చేసినట్లయితే ఎన్నో ఎన్నెన్నో విధాలైన సత్ఫలితాలు కలుగుతాయి. వాటిని పేర్కొనడం సాధ్యం కాదు. జలదాన మహిమలు అనంతం, అంటూ సూతుడు మళ్ళీ ఇలా అన్నాడు. మా గురువరేణ్యులైన వేదవ్యాసమహర్షి ఒకానొకప్పుడు పైన పేర్కొన్న దానాలతో పాటు విశేషమైన వాటిని గూర్చి అంజనా దేవికి ఇలా వివరించినాడు.

"అన్నదానం వస్త్రదానం ద్వయమేతత్ప్రశంస్యతే
పితుః శ్రాద్ధం విశేషేణ వేంకటాద్రౌ నగోత్తమే.

సాలగ్రామశిలాదానం యః కరోతి నగోత్తమే
అంగ భంగ మవాప్నోతి స్వానుభూతించ విందతి.

కన్యాం దదాతి యో దేవి శ్రోత్రియాయ ద్విజాతయే
విష్ణులోకం సమాసాద్య మోదతే పితృభిస్సహ."

వేంకటాచల క్షేత్రంలో ముఖ్యంగా అన్నదానం, వస్త్రదానం, పితృ శ్రాద్ధం, అత్యంత ప్రధానమైనవి. అలాగే ఈ పర్వతంలో పవిత్రమైన సాలగ్రామాలను దానం చేసినట్లయితే సర్వ భోగాలను అనుభవించి చివరకు కైవల్యాన్ని పొందుతారు. ఈ క్షేత్రంలో కన్యాదానం చేస్తే విష్ణులోకంలో సుఖాలను పొందుతారు అని సూతుడు వివరిస్తూ శౌనకాదులలో ఇంకా ఇలా అన్నాడు.

కనుక ఓ మహనీయులారా! వేంకటాచల క్షేత్రంలో నేను వినిన, మీకు తెలియ జేసిన దానాలను నిర్వహించండి. మీరు తెలిసి కొన్ని, తెలియక కొన్ని చేసిన పాపాలను, దోషాలను పోగొట్టుకోండి. బయలుదేరండి. వేంకటాచల పర్వతం సమీపానికి వెళ్ళి ఆ దివ్య పర్వతాన్ని అధిరోహించండి. దాన్ని ఎక్కే సమయంలో పలు విధాలుగా ప్రార్థించండి.

వేంకటాద్రిం గిరి తన్తు ప్రార్థయే త్పుణ్య వర్ధనమ్
స్వర్ణాచల మహాపుణ్యా సర్వదేవ నిషేవిత
బ్రహ్మాదయోఽపి యం దేవాః సేవన్తే శ్రద్ధయా సహ
తం భవన్త మహం పద్భ్యాం ఆక్రమేయం నగోత్తమ
క్షమస్వ తదఘం మేఽద్య దయయా పాపచేతసః

త్వన్మూర్ధని కృతాఽఽవాసం మాధవం దర్శయ స్వమే.
ప్రార్థయిత్వా నరస్త్వేవం వేంకటాద్రిం నగోత్తమమ్
తతోమృదు పదం గచ్ఛేత్ పావనం వేంకటాచలమ్.
వేంకటాద్రౌ మహాపుణ్యే సర్వపాతకనాశనే
స్వామిపుష్కరిణీ తీర్థే స్నాత్వా నియమ పూర్వకమ్
పిండదానం తతః కుర్యాత్ అపి సర్షప మాత్రకమ్
శమీదల సమానా న్వా దద్యా త్పిండాన్ పితౄ న్ప్రతి
స్వర్గస్థా మోక్షమాయాన్తి స్వర్గం నరకవాసినః.

ఓ బంగారు పర్వతరాజమా! సర్వ దేవతలచేత సేవింపబడుతున్న మహా పవిత్రమైన ఓ శేషాచలమా! బ్రహ్మాది దేవతలు అత్యంత నియమ నిష్ఠలతో భక్తి శ్రద్ధలతో నిన్ను పూజిస్తూ వుంటారు. అలాంటి నీపై నేను నా పాదాలను మోపుతూ వున్నాను. నిండుదయతో నా యీ పాపాలను, దోషాలను క్షమించి, నీ పర్వత శిఖరంపై వేయి వెలుగులతో కొలువై వున్న శ్రీనివాస ప్రభువులను నాచేత దర్శింపజేయి-- అంటూ ప్రదక్షిణ పూర్వకంగా సాష్టాంగ దండ ప్రణామాలను చేస్తూ మృదువుగా పాదాలను మోపుతూ తిరుపతి కొండను ఎక్క వలయును. పిదప మహాపవిత్రం, దర్శన మాత్రం చేతనే సర్వ పాపాలను పోగొట్టే స్వామిపుష్కరిణిని దర్శించి నమస్కరించి ఆ పవిత్ర జలాల్లో సంకల్ప పూర్వకంగా స్నానం చెయ్యాలి. తదుపరి ఆ పుష్కరిణీ తీర్థ జలాలతో పితృ తర్పణం చెయ్యాలి. ఆవగింజంతైనా, లేక జమ్మియాకంతైనా పిండాలను చేసి పితృదేవతలకు సమర్పించి శ్రాద్ధంలో తర్పణాలు చెయ్యాలి. అలా చేసినట్లయితే స్వర్గంలో వుండే పితృ దేవతలు మోక్షాన్ని, నరకంలో వుండే పితృ దేవతలు స్వర్గాన్ని పొందడమేగాక, తమకు తర్పణమిడిచిన వారికి సర్వ శ్రేయస్సులు కలుగునట్లు అనుగ్రహిస్తారు. అయితే శ్రీ వేంకటేశునిసన్నిధిలో ఏ దానం చేసినా ఏ వితరణ చేసినా ముఖ్యంగా గమనించవలసింది సత్పాత్రత. సత్పాత్రులకు దానంచేస్తే సంపూర్తిగా ఫలవంతమౌతుంది. ఒక్కటి దానం చేస్తే వేయిరెట్లు అధికంగా సత్ఫలితం కలుగుతుంది. అలాగే శ్రీ వేంకటాచల దివ్యక్షేత్రంలో ఏ చిన్న తప్పుచేసినా, ఏ అల్ప దోషం చేసినా అధికంగా పాప ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది. తిరుమల క్షేత్రంలో ఎల్లప్పుడూ సద్భావనలతో మంచి మంచి ఆలోచనలతో మంచి నడవడికతో సంచరించాలి. ఆ క్షేత్రం కేవలం విహారక్షేత్రం కాదు. వినోద క్షేత్రం అసలే కాదు. అది

సిద్ధి క్షేత్రం - సప్తగిరి సాధనా క్షేత్రం. ఆ క్షేత్రంలో ఎంత సాధన చేస్తే అంత ఫలితం సిద్ధిస్తుంది. ఆ సాధన ఎలాగుండాలి? సాధనలుగా తపస్సు చేయవచ్చు. ధ్యానం చేయవచ్చు. జపాలు చేయవచ్చు. సద్గ్రంథ పారాయణలు చేయవచ్చు. సంకీర్తన జపం చేయవచ్చు. భజనలు చేయవచ్చు. పురాణ ప్రవచనం చేయవచ్చు. లేదా క్షేత్ర శుద్ధికి అవసరమయ్యే శ్రమదానం చెయ్యవచ్చు. క్షేత్ర సౌందర్యాన్ని పెంపొందించే పూల వనాలను పెంచవచ్చు. శ్రీనివాసుని భక్తులకు సేవ చేయవచ్చు. అన్నదానాలు, వస్త్రదానాలు, ఔషధదానాలు........ ఇలా దానాలను ఎన్నైనా చేయవచ్చు.

కనుక మీమీ యాత్రలో ఆ క్షేత్రంపైన ఏ ఒక్క క్షణం కూడా అనవసర సంభాషణలతో వృథా చెయ్యక సద్వినియోగం చేసుకోండి. శ్రీ వేంకటేశ్వర భగవానుని అపార కరుణవల్లే వేంకటాచల యాత్రా సంకల్పం కలుగుతుంది. ఆ స్వామివారి దయవల్లే ఆ క్షేత్రంలో సంచరించే యోగం సిద్ధిస్తుంది. కనుక మీ తిరుమల యాత్రలో ఏ మాత్రం అలసత్వాన్ని ప్రదర్శించకండి - నిర్లక్ష్యంగా ఉండకండి.

అంతమాత్రమే కాదు. ఇక మీ యాత్రకు ప్రధాన ధ్యేయమగు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని గూర్చి కూడా మరి కొన్ని విశేషాలను చెప్తాను జాగరూకులై సావధానంగా వినండి.

"శ్రీ వేంకటేశ్వరం దేవం యః పశ్యతి సకృన్నరః
స నరో ముక్తి మాప్నోతి విష్ణు సాయుజ్య మాప్నుయాత్."

శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఒకే ఒక్కమారు మనసా స్మరిస్తూ వాచా కీర్తిస్తూ కర్మణా దర్శించిన మాత్రాన్నే చాలు. మోక్షం సిద్ధిస్తుంది. ఏ మాత్రం ఎలాంటి సాధనే అవసరం లేదు. కృతయుగంలో పదిఏండ్లు, త్రేతాయుగంలో ఒక ఏడాది, ద్వాపర యుగంలో ఐదునెలలు, ఈ కలియుగంలో ఒక రోజున సంపాదించిన పుణ్యానికి కోటి రెట్లు అధికంగా ఒక్క క్షణంపాటు శ్రీస్వామివారిని దర్శించిన వెంటనే లభిస్తుందనడంలో ఎంత మాత్రం సందేహపడవలసిన అవసరం లేదు.

*కిం దానైః కిం వ్రతై స్తేషాం కిం తపోభిః కి మధ్వరైః
వేంకటేశం పరం దేవం యో న చిన్తయతి క్షణమ్.
అజ్ఞానీ స చ పాపీ స్యాత్ స మూకో బధిర స్తథా
సజడోఽన్ధ శ్చ విజ్ఞేయః ఛిద్రం తస్య సదా భవేత్.*

ఎలాంటి దానాలు చేయనివారైనా, ఏలాంటి వ్రతాలు ఆచరించనివారైనా, తపస్సులు కాని, యజ్ఞాలు కాని చేయనివారైనా సరే, దేవాధిదేవుడు శ్రీనివాస ప్రభువును ఒక్కసారి ఒక్క క్షణం కాలంపాటు స్మరిస్తే చాలు. వాని జన్మం ధన్యం అవుతుంది. అలా చెయ్యని వాడే అజ్ఞాని, పాపి, మూగవాడు, చెవిటివాడు, మంద బుద్ధివాడు, గ్రుడ్డివాడుగా పిలువ బడుతున్నాడు.

ఇతరుల స్నేహంవల్లగానీ, శత్రుత్వం వల్లగానీ, లోభం వల్లగానీ, భయంవల్లగానీ కలిగిన దుఃఖాలు వేంకటేశ్వరుని స్మరించినవారికి తప్పక తీరుతాయి. అంతేకాదు - చిన్న చిన్న కీటకములు మొదలు బ్రహ్మేంద్రాది దేవతల వరకు అందరూ శ్రీనివాసుని సన్నిధిలో సమత్వాన్ని పొందుతారు. అనగా తన సన్నిధిలో నిలబడి దర్శించినవారిని అందరినీ సమానముగా శ్రీనివాసుడు ఆదరిస్తాడు. అక్కడ నీచులు, మహనీయులు అనే తారతమ్యం లేదు. ఎవరైనా స్మరించవచ్చు. ఎవరైనా దర్శించవచ్చు.

*"శ్రీనివాసా చ్చ న సమం నాధికం పుణ్య మస్తి వై*
*వేంకటాద్రి నివాసం తం ద్వేష్టి యో మోహమాస్థితః."*

శ్రీనివాసుని సేవించుటకంటే మహిమాన్వితమైన పుణ్య కార్యం ఈ లోకంలో లేనే లేదు. అలాగే అజ్ఞానంతో ఆ దేవదేవుని ద్వేషించుటకంటె మహాపాపం లేదు. అట్టి మానవుడు ఏ అధోస్థితిని పొందుతాడో ఊహించడం కూడా కష్టం. ఇలా శ్రీనివాస భగవానుని గొప్పదనాన్ని గూర్చి ఎంతైనా చెప్పుకోవచ్చు. ఎంత చెప్పుకొన్నా అది అత్యంత అల్పమే! అందువల్ల ఓ మహర్షులారా! మీరందరూ అత్యంత భక్తి ప్రపత్తులతో వేంకటాచల యాత్రకు ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా బయలుదేరండి!

*భవాబ్ధితారం కటివర్తి హస్తం*
*స్వర్ణాంబరం రత్న కిరీట కుండలమ్*
*ఆలంబి సూత్రోత్తమ మాల్య భూషితం*
*నమామ్యహం వేంకట శైలనాయకమ్.*

ఓ వేంకటశైల నాయకా! నీ పాద పద్మాలను శరణు వేడినవారికి అగాధమైన సంసార సముద్రాన్ని మోకాళ్ల బంటిగా మార్చి సునాయాసంగా దాటిస్తానని చూపుతూ వున్నావు. అనేక బంగారు అభరణాలతో వజ్ర కిరీటాది కర్ణ కుండలాలతోను, యజ్ఞోపవీతంతోను, పూలమాలికలతోను విరాజిల్లుతూ అత్యంత సౌందర్యంతో

దర్శనమిస్తూ అందరినీ సమ్మోహన పరుస్తున్న స్వామీ! నీకు మనసా వాచా కర్మణా నమస్కరించుచున్నాను అంటూ సూత మహర్షి ఆనందోద్రేక పూరిత మనస్కుడై గోవిందా! గోవిందా! గోవింద!! అని వేంకటాచలపతిని ప్రార్థిస్తూ శౌనకాది మహర్షులకు వీడ్కోలు పలికినాడు.

శ్రవణా త్సర్వపాపఘ్నం మననా త్పుణ్య వర్ధనమ్
స్వధ్యానా త్సిద్ధిదం విష్ణుం ప్రేక్షణా న్మోక్ష దం భజే.

స్వామీ! ఓ వేంకటేశా! నీ దివ్య గాధలనువింటే చాలు! పాపాలన్నీ నశిస్తాయి. నీ పుణ్యచరిత్రను మననం చేస్తే చాలు! పుణ్యాలు కొల్లలుగా వృద్ధి చెందుతాయి. తిరుమలేశా! నిన్ను ధ్యానిస్తే చాలు! అణిమాది అష్టసిద్ధులు ఇట్టే వశమవుతాయి. ఇక ఓ వేంకటేశ్వరస్వామీ! ఆపాదమస్తకం నీ దివ్య మంగళ విగ్రహ స్వరూపాన్ని దర్శిస్తే చాలు. అత్యంత సులువుగా మోక్షం సిద్ధిస్తుంది. అందువల్ల భక్తవత్సలుడైన శ్రీనివాసా! నిన్ను నేను భజిస్తాను -- అంటూ సూతమహర్షి స్వామివారిని ప్రార్థిస్తూ ఈ గాథను మరచిపోకుండ వినీ, స్మరించీ, ధ్యానించీ తమ తమ జన్మలను సార్థకం చేసుకోవాలని శౌనకాది మహర్షులకు సందేశమిస్తూ, వీడ్కోలు పలికినాడు.

అనంతకోటి బ్రహ్మాండనాయకుడు, అడుగడుగు దండాలవాడు, ఆపద్బాంధవుడు, పిలిచిన వెంటనే పలికే దేవదేవుడు, ముఖ్యంగా కలౌ వేంకటనాయకః అన్న పెద్ద బిరుదును పొందినవాడు, భక్త పక్షపాతి, భక్తవత్సలుడు అయిన వేంకటా చలపతిని గూర్చి అనేకానేక విధాలుగా అనేక విశేషాలను విషయాలను సూతమహర్షిచే చెవులారా విన్న శౌనకాది మహర్షులు వేంకటాచల యాత్రకు బయలు దేరినారు.

భరద్వాజుడు, కౌశికుడు, జాబాలిమహర్షి, కాశ్యపుడు, క్రతువు, దక్షుడు, పులస్త్యుడు, గౌతముడు, పులహుడు, ఆంగిరసుడు, దేవలుడు, దేవదర్శనుడు, కౌత్సుడు, కణ్వుడు, మృకండుడు, శతానందమహర్షి, మైత్రేయుడు......ఇలా ఎందరో..... ఎంద రెందరో మహర్షులు, మహాయోగులు, పరమ మునులు, ఘన వేంకటేశుని సందర్శన కుతూహలంతో శేషాచలయాత్రా బృందంలో కలిసినారు.

అడుగడుగునా, వాళ్లందరూ "గోవిందా! గోవిందా!! ఏడుకొండలవాడా! గోవిందా!! వేంకటరమణా గోవిందా!!!" అంటూ బిగ్గరగా గోవిందనామాన్ని ఉచ్చరిస్తూ తమ ప్రయాణాన్ని కొనసాగించారు. ముందుగా పవిత్రమైన గంగానదిలో స్నానాలు

చేశారు. పిదప అనదిని దాటి దక్షిణదిశగా ప్రయాణిస్తూ అనేకానేక తీర్థాల్లో స్నానాలుచేస్తూ క్షేత్రాలను సందర్శిస్తూ గంగానదికి సాటియైన పవిత్ర గోదావరినదిని చేరుకున్నారు. అక్కడ తీర్థ విధులాచరించిన తరువాత కృష్ణవేణినదిలో స్నానం చేసుకొని ముందుకు సాగినారు.

*"తత్రతత్ర మహానద్యాం స్నాత్వాస్నాత్వా తపోధనాః*
*వేంకటాద్రిం సమాగత్య తప్త జాంబూనదాత్మకమ్*
*సర్వతీర్థమయం పుణ్యం సర్వ సిద్ధ నిషేవితమ్*
*మదమంజుల మాయూర కేకాస్వన మనోహరమ్*
*దివ్య నిర్ఝర సంపూర్ణం ఫలపుష్ప ద్రుమైర్యుతమ్*
*అనతిక్రమ్య సూతోక్త సేవాక్రమ మిమే బుధాః*
*చక్రుః శ్రీవేంకటేశస్య సేవాం పరమ పావనీమ్*
*స్నానం మంత్రైశ్చ కుర్వన్తో నిర్ఝరేషు సరస్సు చ*
*పశ్యంత స్తాని రమ్యాణి సానూని మణిమంతి చ*
*శృణ్వన్తః శ్రోత్రరమ్యాణి పక్షిణాం వచనాన్యపి*
*గాయంతః సామగానాని పఠన్తః స్తుతిసంచయమ్*
*నృత్యంతః సంభ్రమాత్ సర్వే క్ష్వేలన్తశ్చ తపోధనాః*
*ఉత్పతన్తః పతన్తశ్చ హర్షావేశవశంగతాః*
*గిరి ప్రదక్షిణం సమ్యక్ కుర్వన్తస్తే శనైః శనైః*
*స్నాత్వా కపిలతీర్థే చ దృష్ట్వా నత్వా శివంగిరమ్*
*ఆరుహ్యా మేరు శృంగాభం సిద్ధ గంధర్వ సేవితమ్."*

ఇలాగ అక్కడక్కడ మార్గ మధ్యంలో తమకు కనిపించిన మహానదుల్లో, పుణ్యతీర్థాల్లో స్నానాలు చేస్తూ చివరకు వేంకటాచల క్షేత్ర సమీపానికి చేరుకొన్నారు. ఆ పర్వతరాజానికి తలలువంచి నమస్కరించారు.

ఆ క్షేత్రం సర్వతీర్థాలతో నిండి ఉన్నందువల్ల పుణ్యవంతమై ప్రకాశిస్తున్నది. అనేకమంది సిద్ధులచేత, సాధకులచేత నిరంతరం సేవింపబడుతూ ఉంది. అక్కడ మనోహరంగా ఆడుతూ పాడుతూ ఉన్న నెమళ్ళు గుంపులు గుంపులుగా ఉన్నాయి.

జలాలతో సర్వ సమృద్ధిగా నిండి జల జలా పారుతున్న సెలయేరులను, ఫలపుష్పాలతో బరువెక్కిన వృక్షాలను కలిగివున్న వేంకటాద్రిని సమీపించారు. తమకు సూత మహర్షి చెప్పిన వేంకటాచల సేవాక్రమం ప్రకారం ముందుగా దూరంనుంచే దర్శిస్తూ వేంకటాచల క్షేత్రానికి ప్రదక్షిణ నమస్కారాలు సమర్పించారు. అత్యంత ఉల్లాసంగా మహర్షులందరూ కలిసి సామగానాన్ని పఠిస్తూ, ఇంకా ఇతర వేదమంత్రాలతో శ్రీనివాస ప్రభువును స్తుతిస్తూ వేంకటాచలగిరి ప్రదక్షిణం ప్రారంభించారు. ఆ ప్రదక్షిణంలో ఆనందోద్రేకాలతో కేకలు వేస్తూ, పడుతూ, లేస్తూ, దొర్లుతూ చిందులువేస్తూ ఒళ్ళు తెలియని భక్తి ఆవేశంతో ఆ మహనీయులందరూ మైమరచారు.

పిదప శ్రీవేంకటాచల పర్వతమూలంలో ఉన్న శ్రీకపిలతీర్థరాజాన్ని సందర్శించారు. అక్కడి కపిలతీర్థ జలాల్లో పవిత్రస్నానాలు చేసి, పితృశ్రాద్ధ కర్మ లాచరించారు. పిదప ఆ తీర్థంలో వేంచేసివున్న శ్రీకామాక్షీ సమేత శ్రీ కపిలేశ్వర స్వామివారిని, అక్కడి పరివారదేవతలను దర్శించుకొని సిద్ధులచేత గంధర్వాది దేవతలచేత సేవింపబడుతున్న సప్తగిరులను అధిరోహించారు.

అత్యంత అద్భుతమైన చరియలతోను, బంగారు మేరు పర్వతంకంటే కూడ అనేక వేలరెట్ల ప్రకాశంతో వెలుగొందుతున్న వేంకటాచల క్షేత్రాన్ని చూచి పరమాశ్చర్యాన్ని పొందారు. ఇదివరలో ఇలాంటి దివ్యమైన భవ్యమైన పర్వతం ఎక్కడ చూడనే లేదు కదా! అని సంభ్రమపడుతూ అత్యంత శ్రేష్ఠమైన ఆనందనిలయ విమానాన్ని తిలకించి ప్రదక్షిణ నమస్కారా లర్పించారు. పవిత్రమైన శ్రీస్వామి పుష్కరిణీ పవిత్ర జలాలలో సంకల్ప పూర్వకంగా స్నానాలు చేసి శ్రీవరాహస్వామివారిని సేవించిన పిదప ఆనంద నిలయుని కన్నులారా దర్శించుకొన్నారు.

"కోటికందర్ప లావణ్యం కిరీట మకుటోజ్జ్వలమ్
ఉరఃస్థిత శ్రియాఽక్రాంత ముక్తాదామోప శోభితమ్
చతుర్భుజ ముదారాంగం శంఖ చక్ర ధరం పరమ్
నీలమేఘనిభం శ్యామం పీతవాస సమచ్యుతమ్
శ్రీ భూమి సహితం విష్ణుం పద్మార్చిత పదాంబుజమ్
ప్రణేముః సహసా హృష్టా హర్షోత్ఫుల్ల విలోచనాః
తుష్టువుర్వేద మంత్రైశ్చ స్తోత్రై శ్చ శ్రుతి సమ్మతైః."

కోటి మన్మథుల సౌందర్యంతో ప్రకాశిస్తున్నవాడు, వజ్ర వైడూర్యాలు తాపిన మణిమయ కిరీటంతో ఉజ్జ్వలంగా దర్శనమిస్తున్నవాడూ, వక్షఃస్థల మహాలక్ష్మీదేవితోను, ముత్యాల హారాలతోను ఒక వినూత్నంగా శోభిల్లుతూ ఉన్నవాడు, శంఖ చక్ర హస్తాలు, కటి వరద హస్తాలు కలిగిన చతుర్భుజాలతోను, నీలమేఘశ్యాముడును, పీతాంబర ధారియును, అచ్యుతుడును, అనంతుడును, శ్రీభూదేవేరులతో కూడివున్నవాడును, పద్మాలతో అర్చింపబడిన పాదపద్మాలతో విరాజిల్లుతూ ఉన్నవాడును అయిన ఆనంద నిలయుని ఆనందంగా వేద మంత్రాలతో నోరారా స్తుతించారు. కన్నులారా కన్నులార్పక దర్శించినారు. సాష్టాంగ దండ ప్రణామాలర్పించారు. భూరేణువులనైన ఓపికగా లెక్కింపవచ్చు. కాని శ్రియఃపతి అయిన శ్రీనివాస భగవానుని పరిపూర్ణ గుణాలను ఏ మాత్రం వర్ణింపజాలము కదా! అనుకుంటూ అనేక విధాల వేంకటాచలపతిని కొనియాడినారు. పిదప శ్రీ వేంకటేశ్వరుని అష్టోత్తర శతనామాలను శ్రావ్యంగా, భక్తియుతంగా పఠిస్తూ తామరపుష్పాలతో శ్రీనివాసుని పాదపద్మాలను అర్చించారు. పిదప ఆ వేంకట భగవానుని పాదాలమీది తులసీదళాలను స్వీకరించి, శ్రీస్వామివారి వక్షఃస్థలమీద కొలువై ఉన్న శ్రీమహాలక్ష్మిని "ఓం శ్రియైః నమః, ఓం లోక ధాత్ర్యై నమః, ఓం బ్రహ్మ మాత్రే నమః..." అంటూ చతుర్వింశతి (24) నామాలతో అర్చించారు. వెంటనే సాక్షాత్తు శ్రీనివాసుడు ప్రత్యక్షమై తనను దర్శించి అర్చించిన పరమ యోగులతో ఇలా అన్నాడు.

"ఓ మునీశ్వరులారా! నేను మిమ్ములను అందరినీ నైమిశారణ్యంలోనే సంపూర్ణంగా అనుగ్రహించాను. సూత మహర్షివల్ల మీరందరూ వేంకటాచల మాహాత్మ్య గాథను భక్తియుతంగా శ్రవణం చేశారు. ఈ పుణ్యగాథను వేంకటాచల క్షేత్రానికి ఎంతదూరంలో విన్నా, వినిపించినా, శ్రద్ధా భక్తులతో చదివినా వారందరి అభీష్టాలు అన్నీ నెరవేరుతాయి. ముఖ్యంగా నేను ఈ భువియందు మానవుల నుద్ధరించడానికి, అవతరించిన కన్యామాసంలో ఈ వేంకటాచలమాహాత్మ్యగాథను పఠించినా, విన్పించినా, విన్నా నేను అత్యంత సులభంగా ఆనందించి, వరాలనిస్తాను. ఈ కలియుగంలో నన్ను సులభంగా వశం చేసుకొనే ప్రధాన మార్గం ఇది. అందువల్ల "కలౌ వేంకట నాయకః" అనే బిరుదును ధరించి, కలియుగ మానవులకోసమే ఈ పర్వతంపై నిలిచివున్నాను. నన్ను వేడినవారికి ధనం, ధాన్యం, భూములు, సంతానం....... ఇలా సమస్త సంపదలను వరంగా ఇస్తాను. అందువల్లే నన్ను 'వరాల రాయడని' అంటారు. అంతేగాదు జీవితాంతంలో వైకుంఠాన్ని కూడ సులువుగా అనుగ్రహిస్తాను.

ఇలా సాక్షాత్తుగా ప్రత్యక్ష దర్శనం ఇస్తూ వరాలు ప్రసాదించిన స్వామివారిని మహర్షులందరూ ఆనందంగా దర్శించారు. వారందరూ ఐదు సంవత్సరాలపాటు ఆ వేంకటాచల క్షేత్రంలో వుంటూ అందులోని తీర్థాల్ని సేవించు కొన్నారు. దివ్య స్థలాల్ని దర్శించారు. తమ తమ సాధనల్ని, తపస్సులను కొనసాగించారు. మళ్లీ తిరుగు ప్రయాణం చేస్తూ వారివారి దివ్యానుభూతులను అనేక విధాలుగా నెమరువేసి కొంటూ నైమిశారణ్యం చేరుకొని తమకు కలిగిన మహద్భాగ్యానికి కారకులైన సూత మహర్షితో ఇలా అన్నారు.

"ఓ మహనీయా! సూతమహర్షీ! మీ అనుగ్రహంవల్ల మాకందరికీ శ్రీవేంకటప్రభువుల దివ్యదర్శనంతోపాటుగా కొల్లలుగా కొండలరాయని వరాలు సిద్ధించాయి. ఆశ్చర్యం! అద్భుతం!! ఏమీ మీ చాతుర్యం స్వామీ! మీరు వర్ణించి చెప్పినట్లుగానే ఆ పర్వతం, ఆ క్షేత్రంమీద శ్రీనివాసుడు దర్శనమిస్తున్నాడు. ఆ పుణ్యస్థల వైభవం అనంతం! మీరు వర్ణించిన తీరు రీతి కడు రమణీయమేగాక యథార్థంగా ఉంది. ఓ పరమయోగీ! మీరు ఇంతకుముందే వేంకటాచల క్షేత్రాన్ని, అందున్న ఏడుకొండలవాణ్ణి దర్శించినారా! మాకు తెలియ చేయవలసిందని ప్రార్థించినారు. అంత సూతమహర్షి--


"ఓ పుణ్యాత్ములారా! మీరు ధన్యులు. వేంకటాచల యాత్రను సంపూర్ణంగా ఫలప్రదం చేసుకొని వచ్చిన పవిత్రులు మీరు. నేను మా గురుమూర్తులైన వేదవ్యాస మునీంద్రుల సంపూర్ణ అనుగ్రహంవల్ల శ్రీవేంకటాచల మాహాత్మ్య గాథను విన్నాను. దాన్ని మీకు వివరించే భాగ్యం నాకు కలిగింది. అయినప్పటికీ కోటాను కోట్ల సంవత్సరాలపాటు, వేయి పడగలు కలిగిన వేలాదిమంది ఆదిశేషులచేత వర్ణింప బడినా తరగనిది వేంకటాచలక్షేత్ర మహత్వం! అందున్న శ్రీనివాసుని మహిమను గూర్చి ఎంతచెప్పినా తక్కువే అవుతుంది. అది అనంతం! ఆ స్వామి మహిమ ఆ స్వామికే తెలియాల!. ఆ స్వామి మహత్వం ఆ స్వామికి ఒక్కనికే తెలియాల! ఆ స్వామి లీలలు ఆ స్వామికి ఒక్కనికి మాత్రమే తెలియాల!! అంతే! అంతే!!

శ్రీవేంకటేశస్య కథామృతం త్విదం
మాహాత్మ్యసారం సుతపస్వి గమ్యమ్
శ్రీ వేంకటేశస్య మహాప్రియ ప్రియం
లోకోత్తరం దేవ ఋషి ప్రియంచ.

ఇలా మనం తెలుసుకున్న శ్రీ వేంకటేశ్వరుని కథామృతం జన్మ మృత్యువులను నివారిస్తుంది. శ్రీస్వామివారి అద్భుతమైన లీలలన్నీ అత్యంత శ్రేష్ఠములైనవి. వీనిని తెలుసుకునే భాగ్యం అదృష్ట విశేషం చేసికొన్నవారికి మాత్రమే లభిస్తుంది. శ్రీనివాసుని గాథలను వింటే చాలు! కీర్తిస్తే చాలు! మనసారా స్మరిస్తే చాలు! శ్రీనివాసుడు అత్యంత ప్రియంగా భావిస్తాడు. లోకోత్తరమైన దేవతలకు, ఋషులకు కూడా ప్రియమైన వాటిని ప్రసాదిస్తాడట!

*సమస్త పాపౌఘ వినాశ కారణం*
*సమస్త పుణ్యౌఘ సమృద్ధి కారణమ్*
*శ్రీవేంకటేశస్య పదారవిందయోః*
*సద్భక్తి వృద్ధే రసమాన కారణమ్.*

శ్రీనివాసుని దివ్యగాథ పాపాలన్నిటిని నశింప జేస్తుంది. పుణ్యరాశిని ఇంకా ఇంకా పెంపొందిస్తుంది. శ్రీ వేంకటేశ్వరుని దివ్యపాదపద్మములందు భక్తి ప్రపత్తులను పెంపొందిస్తుంది. అందువల్ల మళ్లీ చదవండి. మళ్లీ మళ్లీ శ్రీనివాసుని వృత్తాంతాన్ని చదవండి. ఇతరులతో చదివించండి. వేంకటేశుని మాహాత్మ్యాన్ని వీనులవిందుగా వినిపించండి! చదివినవారు, విన్నవారు, విన్పించినవారు శ్రీ వేంకటేశ్వరునిచేత వలసిన వరాలనన్నిటిని ఇబ్బడి ముబ్బడిగా అందుకోండి!



T.T.D. Religious Publications Series No.749 -- Price Rs.

# ఆనందమయం

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పేర్లు అనేకం! అందులో 'ఆనంద నిలయుడు' ప్రసిద్ధమైంది. సార్థకమైంది కూడా!

తిరుమల యాత్రను సంకల్పిస్తే చాలు. ఒక ఆనందం! కుటుంబ సభ్యులతో తిరుమల కొండకు బయలుదేరితే చాలు. అది చెప్పలేని పరమానందం! ఏడుకొండలలో విహరిస్తేనో! వింత అనుభూతులతో కూడిన విచిత్రమైన ఆనందం! అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని 'బంగారు మేడ' ఆనంద నిలయ విమానాన్ని తలను పైకెత్తి చూస్తేనో! తన్మయంతో కూడిన దివ్యానందం! ఆ బంగారు విమానంలోపల భక్తుల కోసమే ఎదురుచూస్తూ ఉన్న ఏడుకొండలవాణ్ణి ఒకే ఒక్క క్షణం పాటు కన్నులార్పక, కన్నులనిండా దర్శిస్తే చాలు! చాలు!! ఆ అనుభూతి ఇదీ, ఆ ఆనందం ఇదీ అని వర్ణించడానికి సాధ్యం కానే కాదు. అవ్యక్తమైన ఈ ఆనంద పరంపరలు ప్రతిభక్తునికీ కలుగుతాయి. శ్రీవారిని దర్శించిన ప్రతి మారూ కలుగుతాయి.

కేవలం ఒకే ఒక్క క్షణకాలం దర్శనంతో దివ్యానుభూతులను ప్రసాదించడంతోపాటు కోరికలన్నింటిని తీరుస్తూ "కోరిన వరాలరాయుడు" అను బిరుదును వహించి నిరంతరం కోట్లాది మంది భక్తులను ఆకర్షించి ఆకట్టుకొంటున్న ఆనందనిలయుడు ఎవరు? ఎక్కడినుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? ఏడుకొండలు ఏవి? వాటి గాథలు ఏవి! ఆనంద నిలయుడు ఇక్కడే ఎందుకు ఉన్నాడు? ఆ స్వామివారికంటే ముందుగా ఇక్కడ ఎవరైనా ఉన్నారా? మున్నగు అనేక ప్రశ్నలకు సమాధానమే ఈ 'ఆనందనిలయం'. ఇంకా అనేకమంది స్వామివారి భక్తుల దివ్య గాథలు, తిరుమల తీర్థాల మహిమలు, వేంకటాచల క్షేత్ర విధులు, నిర్వహించ వలసిన దానాల వివరాలన్నింటిని తెలియపరుస్తున్న గ్రంథం 'ఆనంద నిలయం'.

**మీరూ చదవండి! ఇతరులతో తప్పక చదివించండి!!**

Printed and Published by Sri **K.V. Ramanachary,** I.A.S., Executive Officer, T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.